
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 328
మంగళవారం 18-2-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'




నూతన సీఈసీగా జ్ఞానేశ్ కుమార్

26వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియామకం

రాష్ట్రపతికి సిఫార్సు చేసిన సెలక్షన్ కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము

వివరాలు 6లో▶



ఢిల్లీని కుదిపేసిన భూకంపం

దేశ రాజధాని ఢిల్లీ, చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బిహార్‌లోని సివాన్‌లో సోమవారం ఉదయం భూమి తీవ్రంగా కంపించింది.

- వివరాలు 6లో



చైనాను శత్రుదేశంగా చూడొద్దు

చైనాను శత్రు దేశంగా చూడటాన్ని మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శామ్ పిట్రోడా ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



టోటలైజర్ విధానం తేవాలి

ఓటర్ల గోప్యతను కాపాడేందుకు టోటలైజర్ విధానాన్ని తేవాల్సిన అవసరం ఉందని నేడు రిటైరవనున్న సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు.

- వివరాలు 6లో



జర్మనీ విజేత ఎవరు?

జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ ప్రభుత్వం మైనారిటీలో పడటంతో అనివార్యమైన ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి.

- వివరాలు 6లో

పట్టణాల్లో ప్రాపర్టీ కార్డ్!

నేటి నుంచే దేశవ్యాప్తంగా 'నక్ష' పైలట్ ప్రాజెక్టు ప్రారంభం

ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాల పూర్తి వివరాలన్నీ జియో స్పేషియల్ సాంకేతికతతో సేకరణ

పట్టణాలు, నగరాల్లో అణువణువూ డిజిటల్ రూపంలో నిక్షిప్తం

పైలట్ ప్రాజెక్టులో రాష్ట్రంలో 10 మున్సిపాలిటీలు

పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయంతో కార్యక్రమం

- ఇళ్లు, భవనాల విస్తీర్ణం, ఎత్తు, సర్వే నంబర్, యజమాని పేరు, ఇతర పూర్తి వివరాలతో ప్రాపర్టీ కార్డు
- పట్టణాల్లో పక్కాగా రెవెన్యూ రికార్డులు.. ఆస్తిపన్ను నిర్ణయం, వసూళ్లలో పారదర్శకత
- ఇళ్లు, స్థలాల వివాదాలకు ఇక చెక్.. భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలకు ఊతం

సాక్షి, హైదరాబాద్: పట్టణాల్లో రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు.. ఇళ్లు, స్థలాల వివాదాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నక్ష' కార్యక్రమం ప్రారంభం కాబోతోంది. మున్సిపాలిటీల్లో విస్తృత స్థాయిలో సర్వే చేసి.. ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాల వివరాలన్నీ తేల్చేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇంటి యజమాని పేరు, ఆస్తి పన్ను వివరాలు, ఆస్తి విస్తీర్ణం, సర్వే నంబర్, అనుమతి తీసుకున్న నంబర్, ప్లాన్, నల్లా కనెక్షన్.. ఇలా సమస్త వివరాలతో ప్రాపర్టీ కార్డుల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణాలు, నగరాల్లోని అణువణువు ఇకపై డిజిటల్ రూపంలో నిక్షిప్తం కానుంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మాడర్నైజేషన్ ప్రోగ్రాం (డీఐఎల్ఆర్ఎంపీ)లో భాగంగా 'నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్ష)' కార్యక్రమాన్ని చేపట్టింది. మంగళవారం దేశవ్యాప్తంగా రెండు లక్షల వరకు జనాభా ఉన్న 152 మున్సిపాలిటీల్లో పైలట్ ప్రాజెక్టు ప్రారంభం కానుంది. ఈ పట్టణాల్లో ఏడాదిపాటు పైలట్ ప్రాజెక్టును అమలు చేసిన తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా మార్పు, చేర్పులు చేస్తారు. అనంతరం మొదటి మిగతా 3వ పేజీలో ▶



దేశవ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో మూడు పద్ధతుల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. ఆయా నగరాలను బట్టి ఏ విధానమనేది ఎంపిక చేస్తారు. డ్రోన్లు, చిన్నపాటి విమానాలు, హెలికాప్టర్లను వినియోగించి వాటికి ప్రత్యేకమైన కెమెరాలను బిగించి సర్వే చేయాలని నిర్ణయించారు.



2డీ- నాడిర్ కెమెరా ఓఆర్ఐ: దీనితో ప్రణాళికాబద్ధంగా ఉన్న పట్టణాలు, పైభాగం ఫ్లాట్‌గా ఉన్న ఒకటి లేదా రెండంతస్తుల భవనాలు, రహదారులు స్పష్టంగా కనిపించే వాటిలో వినియోగిస్తారు.

ఓబ్లిక్యూ యాంగిల్ కెమెరా: బహుళ అంతస్తుల భవనాలు అధికంగా ఉండే నగరాలు, పట్టణాలు, ఇరుకుగా ఉండే చోట్ల ఈ కెమెరాల ద్వారా సర్వే చేస్తారు.

ఓబ్లిక్యూ యాంగిల్ కెమెరా అండ్ లైడర్ సెన్సార్: పర్వత ప్రాంతాలు, ఇరుకుగా ఉండే పాత పట్టణాలు, వృక్ష సంపద ఎక్కువగా ఉండే పట్టణాల్లో దీని ద్వారా సర్వే చేస్తారు.

వెంటనే కొత్త రేషన్‌కార్డులు

అర్హులందరికీ కార్డులు ఇవ్వాల్సిందే

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగంగా పూర్తి చేయండి

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేనిచోట వెంటనే మొదలుపెట్టండి

మిగతా చోట్ల కోడ్ ముగియగానే కొత్త కార్డులు ఇవ్వాలని సూచన

కొత్త రేషన్‌కార్డుల కోసం రూపొందించిన డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి


పౌరసరఫరాల, నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాల్సిందేనని, ఈ మేరకు కొత్త రేషన్‌కార్డుల జారీకి వెంటనే ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలసి రేషన్‌కార్డుల జారీ అంశంపై సీఎం సమీక్ష నిర్వహించారు. కొత్త రేషన్‌కార్డుల కోసం ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు, రేషన్‌కార్డుల్లో కొత్తగా పేర్ల చేర్పు, తొలగింపు కోసం వచ్చిన విజ్ఞప్తులపై ఆరా తీశారు. ప్రజాపాలన అర్జీలు, కులగణనతోపాటు గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులు, మీసేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మళ్లీ దరఖాస్తులు అవసరం లేదు..: ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులకు అవకాశం ఇచ్చినా.. మీసేవ కేంద్రాల వద్ద రేషన్ దరఖాస్తుల కోసం రద్దీ ఎందుకు ఉంటోందని సీఎం ఆరా తీశారు. అయితే దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ చేస్తున్నాయని, అందుకే రద్దీ ఉంటోందని అధికారులు వివరణ ఇచ్చారు. వెంటనే కార్డులు జారీ చేస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ఆలస్యం చేయకుండా కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు మిగతా 12వ పేజీలో ▶

ఏపీపై ఫిర్యాదు చేయండి

ఆ రాష్ట్రం ఏకపక్షంగా నీటిని తరలించడాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి

నీటి పారుదల శాఖ సమీక్షలో సీఎం ఆదేశం

12లో


నివేదికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు

రాష్ట్ర జీఎస్డీపీ 14.5% వృద్ధి

2023-24లో జీఎస్డీపీ విలువ రూ.15,01,981 కోట్లు

దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్డీపీ వాటా 5.1%

2014–15 నుంచి 2023–24 మధ్యకాలంలో 196 % శాతం వృద్ధి

3.5 కోట్ల రాష్ట్ర జనాభాలో 1.5 కోట్ల మందికి ఉద్యోగం, ఉపాధి

రాష్ట్ర అర్థగణాంక నివేదికలో వెల్లడించిన సర్కారు 2లో▶

టొరంటో విమానాశ్రయంలో అదుపుతప్పిన విమానం

8 మంది ప్రయాణికులకు గాయాలు



టొరంటో: కెనడాలో సోమవారం ఓ విమానం అదుపుతప్పింది. టొరంటోలోని పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ల్యాండ్ అవుతుండగా రన్‌వే పైనుంచి జారిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది ప్రయాణికులు గాయపడ్డట్లు స్థానిక అధికారులను ఉటంకిస్తూ మీడియా తెలిపింది. ప్రమాద సమయంలో విమానంలో 80 మంది ఉన్నట్లు సమాచారం. ఈ విమానం మిన్నెపోలిస్ నుంచి టొరంటోకు వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం నేపథ్యంలో ఎయిర్‌పోర్టును మూసివేశారు.

తెలంగాణ జాతికి కేసీఆర్ హీరో

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆయన కొడుకుగా పుట్టడం నా పూర్వజన్మ సుకృతం

గుండెబలం, జనబలంతో తెలంగాణను సాకారం చేశారు

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటున్నారు

హ్యాపీ బర్త్‌డే డాడీ: ఎమ్మెల్సీ కవిత

నాకు ఎనలేని మమకారం పంచిన మేనమామ: హరీశ్

తెలంగాణ భవన్‌లో ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు 12లో


కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ ఘనతలను వివరిస్తూ రూపొందించిన 71 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న కేటీఆర్, హరీశ్, మధుసూదనాచారి. చిత్రంలో సత్యవతి రాథోడ్, తలసాని, శ్రీనివాస్‌గౌడ్, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

భళా బెంగళూరు



డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై 8 వికెట్లతో గెలిచింది. రేణుక, స్మృతి మంధాన రాణించారు.

వివరాలు 14లో▶

యాపిల్‌ను మించిన రిలయన్స్



దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అంతర్జాతీయంగా అత్యుత్తమ బ్రాండ్స్ జాబితాలో రెండో స్థానం దక్కించుకుంది. యాపిల్, మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజాలను కూడా వెనక్కి నెట్టింది.

వివరాలు 15లో▶

రూ.50 వేలకో గురుకుల సీటు

రూ.150 కోట్ల వరకు వసూలు చేసిన మధ్యవర్తులు

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కూడా వసూళ్లు

ధ్రువీకరణ పత్రాలు సమర్పించని విద్యార్థులు 40 శాతం

ఎస్సీ గురుకుల సొసైటీ పరిశీలనలో వెల్లడి

వివరాలు 5లో▶

క్షణాల్లో దరఖాస్తుల అప్‌లోడ్.. నిమిషాల్లోనే పరిశీలన
ఏఐ.. బిల్డ్ నౌ!



కృత్రిమ మేధ సహకారంతో అమలుకు హెచ్ఎండీఏ ప్రణాళిక

వేగంగా భవన నిర్మాణ అనుమతుల జారీకి కొత్త విధానం.. మార్చిలో అందుబాటులోకి కొత్త వెబ్‌సైట్


16లో

'జన'గట్టు

లింగమంతులస్వామి జాతరకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

దర్శించుకున్న మంత్రి ఉత్తమ్, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి

12లో


కొండ కింద, కొండ పైనా భక్తుల కోలాహలం







ఇప్పటివరకూ అక్రమ వలసదారులే టార్గెట్ అనుకున్నాం.. మనల్ని చేస్తారనుకోలేదు!!





పరిశ్రమల్లో ఆ మూడు జిల్లాలదే అగ్రస్థానం

సాక్షి, హైదరాబాద్: 'తనిఖీలు తక్కువ.. వసతులు ఎక్కువ' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం ఈ రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలుపుతున్నట్లు 'తెలంగాణ అర్థగణాంక నివేదిక 2024' వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం అర్బన్ జిల్లాలుగా పేరొందిన రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలు అగ్రస్థానంలో ఉంటూ.. పారిశ్రామిక ఉత్పత్తులకు కేంద్రాలుగా ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం పరిశ్రమల్లో 43.4 శాతం కర్మాగారాలు, 39.5 శాతం కార్మికులు, 43.2 శాతం ఉద్యోగులు ఈ మూడు జిల్లాల పరిధిలోనే ఉన్నారు. 58.7 శాతం పారిశ్రామిక ఉత్పత్తి, రాష్ట్ర ఆర్థిక రంగానికి 56 శాతం విలువను పారిశ్రామిక రంగమే జోడిస్తోంది.

- 2022-23 లెక్కల ప్రకారం దేశంలోని 5.16 శాతం పరిశ్రమలు తెలంగాణలోనే ఉండగా, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది. కార్మికుల సంఖ్యా పరంగా చూస్తే 5.24 శాతంతో దేశంలో ఏడో స్థానంలో ఉంది. అలాగే పెట్టుబడి వ్యయాన్ని లెక్కిస్తే 2021-22 లెక్కల ప్రకారం రూ.1.07 లక్షల కోట్లుగా తేలింది. పెట్టుబడి, నిర్వహణ వ్యయాన్ని లెక్కిస్తే దేశంలో తెలంగాణ 9వ స్థానంలో ఉంది.
- రాష్ట్రంలోని పరిశ్రమల్లో 23.5 శాతం కంపెనీలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఉన్నాయి. పరిశ్రమలు, కార్మికులు, ఉద్యోగుల సంఖ్యా పరంగా చూస్తే జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నారాయణపేట అట్టడుగు స్థానాల్లో ఉన్నాయి.

తెలంగాణలో పరిశ్రమలు :	10,328
కార్మికులు :	7,08,219
ఉద్యోగులు :	8,37,235



ఉపాధి హామీ రిజిస్టర్ కూలీలు 1.05 కోట్లు

సాక్షి, హైదరాబాద్ : 2024-25 ఆర్థిక సంవత్సరంలో (2024అక్టోబర్ 31 నాటికి) రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఉపాధి కూలీలు (పురుషులు, మహిళలు కలిపి) దాదాపు 1.05 కోట్ల మంది రిజిస్టర్ అయ్యారు. వారిలో మహిళలు 53,19,817 మంది ఉండగా, పురుషులు 51,56,235 మంది ఉన్నారు.

టాప్-3 జిల్లాలు : నల్లగొండ జిల్లా నుంచి అత్యధికంగా 7,66,704 మంది, ఖమ్మంలో 6,42,495 మంది, సూర్యాపేటలో 5,71,564 మంది పేర్లు నమోదు చేసుకున్నారు.

అత్యల్పంగా...: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 19,402 మంది రిజిస్టర్ చేసుకోగా కింది నుంచి రెండోస్థానంలో హనుమకొండ జిల్లా 1,71,279 మంది, కింది నుంచి మూడోస్థానంలో ములుగు జిల్లా 1,83,732 మందితో నిలిచింది.

పనిచేస్తున్నవారు 40 లక్షల మందే...

ఉపాధి కూలీలుగా నమోదు చేసుకున్న వారి సంఖ్య కోటి దాటినా, అందులో పనిచేస్తున్న వారు 40 లక్షల మంది మాత్రమే. వీరిలో స్త్రీలు 23,62,790 మంది ఉండగా, పురుషులు 16,44,325 మంది ఉన్నారు. సంఖ్యాపరంగా చూస్తే...38 శాతం వరకు మాత్రమే పనులకు వెళుతున్నట్టుగా స్పష్టమవుతోంది.

- 40 లక్షల మందిలోనూ మొదటి మూడు స్థానాల్లో నల్లగొండ జిల్లా (2,75,96 6), ఖమ్మం జిల్లా (2,30,576), సూర్యాపేట జిల్లా (2,54, 497) నిలవడం విశేషం.
- అత్యల్పంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉండగా, కింది నుంచి రెండోస్థానంలో హనుమకొండ, మూడోస్థానంలో ములుగు జిల్లా నిలిచాయి.

ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.15,453 కోట్ల బ్యాంక్ రుణాలు

- 2023-24లో గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్)లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీలు) గణాంకాలు ఇలా ఉన్నాయి.
- రాష్ట్రవ్యాప్తంగా 542 మండలాలను 4,31,742 ఎస్‌హెచ్‌జీలు కవర్ చేస్తున్నాయి. ఈ సంఘాల్లో 46,28,158 మంది సభ్యులున్నారు. 2,69,607 ఎస్‌హెచ్‌జీలకు రూ.15,453 కోట్ల బ్యాంకు రుణాలు అందజేశారు.
- అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలోని 27 మండలాల్లో 23,785 గ్రూపుల్లో 2,52,505 మంది సభ్యులుండగా, 19,340 ఎస్‌హెచ్‌జీలకు రూ.1,144 కోట్ల రుణ సదుపాయాన్ని అందించారు.
- రెండో స్థానంలో నల్లగొండజిల్లా ఉండగా, 31 మండలాల్లోని 28,187 గ్రూపుల్లో 2,96,754 మంది సభ్యులుండగా, 14,828 గ్రూపులకు బ్యాంకుల ద్వారా రూ.878 కోట్ల రుణాలు ఇచ్చారు.
- మూడోస్థానంలో రంగారెడ్డి జిల్లాలోని 21 మండలాల్లోని 19,204 గ్రూప్‌ల్లో 2,06,296 మంది సభ్యులుండగా, 13,047 గ్రూపులకు రూ.841 కోట్ల మేర రుణాలు అందజేశారు.
- అత్యల్పంగా చూస్తే...కొమురంభీం జిల్లాలో 15 మండలాల్లోని 7,973 గ్రూపుల్లోని 89,104 మంది సభ్యులకుగాను 3,608 గ్రూపులకు రూ.160 కోట్ల బ్యాంక్ రుణాలు ఇచ్చారు.

బడి బయటే బాల్యం



- రాష్ట్రంలో 11.95 శాతం పిల్లలు స్కూల్ డ్రాపౌట్
- ఉన్నత పాఠశాల స్థాయిలోనే అధికంగా బడికి దూరం
- భూపాలపల్లి జిల్లాలో అత్యధికంగా 29.82 %
- పల్లె ప్రాంతాల్లోనే అధికంగా బడి మానేస్తున్న విద్యార్థులు
- తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్-2024లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు గురుకులాలు, ఇతర హాస్టల్ వసతి ఉన్న స్కూళ్లు కావాల్సినన్ని ఉన్నా.. బడి మధ్యలోనే మానేస్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రాథమిక స్థాయిలో కొంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఉన్నత పాఠశాల స్థాయికి వచ్చేసరికి చాలామంది విద్యార్థులు బడి మానేస్తున్నారు. ప్రాథమికోన్నత స్థాయిలో 0.34 శాతం, ఉన్నత పాఠశాలల్లో 11.92 శాతం డ్రాపౌట్స్ నమోదయ్యాయి. ప్రాథమిక స్థాయిలో ఇది మైనస్ 2.23 శాతంగా ఉంది. ప్రధానంగా పల్లెల్లోనే డ్రాపౌట్లు ఎక్కువగా ఉన్నాయి. సోమవారం రాష్ట్ర ప్రణాళికా విభాగం విడుదల చేసిన 'తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్-2024'లో ఈ వివరాలను పొందుపర్చింది. హనుమకొండ, కరీంనగర్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లో డ్రాపౌట్లు తక్కువగా ఉన్నాయి.

నివేదికలోని ప్రధానాంశాలు

- రాష్ట్రంలో 40,975 స్కూళ్లున్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 20,539, ప్రాథమికోన్నత పాఠశాలలు 7,482, ఉన్నత పాఠశాలలు 11,561, హయ్యర్ సెకండరీ 1,393 స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 65,41,085 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కో పాఠశాలకు సగటున 160 మంది విద్యార్థులు ఉన్నారు. అతి తక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 533 స్కూళ్లు ఉండగా.. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 2,907 ఉన్నాయి.
- హైస్కూల్ పరిధిలో 39,92,429 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 8,98,588, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 9,16,869, హయ్యర్ సెకండరీలో 7,33,199 మంది పిల్లలున్నారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 9,02,674 మంది విద్యార్థులుండగా.. అతి తక్కువగా ములుగు జిల్లాలో 41,061 మంది మాత్రమే ఉన్నారు.
- 6 నుంచి 10 ఏళ్లలోపు చిన్నారులు రాష్ట్రంలో 26,62,200 మంది ఉండగా, పాఠశాలల్లో నమోదైనవారు 29,28,678 ఉన్నా రు. ప్రాథమిక పాఠశాలల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో(స్థూల నమోదు నిష్పత్తి) 110 శాతంగా ఉంది. ఇది అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 175 శాతం ఉండగా, అతి తక్కువగా జయశంకర్ భూపాల పల్లి జిల్లాలో 70 శాతం ఉంది.
- ప్రాథమికోన్నత పాఠశాలల్లో జీఈఆర్ 107 శాతం ఉంది. రాష్ట్రంలో 11 నుంచి 13 సంవత్సరాల వయసున్న పిల్లలు 16,53,800 మంది ఉండగా, ఆరోతరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు స్కూళ్లలో నమోదైన పిల్లలు 17,73,298 (కుటుంబాల వలస ఇతరత్రా కారణాల వల్ల) ఉన్నారు. అతి తక్కువగా జయశంకర్ భూపా లపల్లి జిల్లాలో 59 శాతం ఉండగా, ఎక్కువగా రంగారెడ్డి జిల్లాలో 173 శాతంగా ఉంది.
- ఉన్నత పాఠశాలల్లో జీఈఆర్ 95 శాతంగా ఉంది. రాష్ట్రంలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలు 11,44,600 మంది ఉండగా, ఉన్నత పాఠశాలల్లో నమోదైన పిల్లలు 10,82,551 మంది మాత్రమే. అతి తక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 55 శాతం, అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 149 శాతం నమోదైంది.
- రాష్ట్రంలో సగటున 19 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు. ప్రాథమిక స్థాయిలో 18 మందికి, ప్రాథమికోన్నత స్థాయిలో 14 మందికి, ఉన్నత పాఠశాల స్థాయిలో 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు. హయ్యర్ సెకండరీ స్థాయిలో 17 మందికి ఒక టీచర్ ఉన్నారు. టీచర్-స్టూడెంట్ నిష్పత్తి 22 జిల్లాల్లో రాష్ట్ర సగటు కంటే తక్కువగా ఉంది. ప్రాథమికోన్నత స్థాయిలో 21 జిల్లాల్లో, ఉన్నత స్థాయిలో 23 జిల్లాలు, హయ్యర్ సెకండరీ స్థాయిలో 13 జిల్లాల్లో ఇది రాష్ట్ర సగటు కంటే తక్కువగా ఉంది. మెదక్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి, హైదరాబాద్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో టీచర్-స్టూడెంట్ నిష్పత్తి రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది.
- రాష్ట్రంలో లింగనిష్పత్తి 988గా ఉంది. ప్రతి వెయ్యి మంది పురుషులకు 988 మహిళలు ఉన్నారు. అత్యంత తక్కువ లింగనిష్పత్తి ఉన్న జిల్లా రంగారెడ్డి. ఆ తర్వాత స్థానాల్లో హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి, వనపర్తి జిల్లాలున్నాయి. పురుషుల కంటే మహిళలు ఎక్కువ ఉన్న జిల్లాలు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి.

అత్యధిక డ్రాపౌట్లు ఉన్న జిల్లాలు

జిల్లా	జయశంకర్ భూపాలపల్లి	జోగుళాంబ గద్వాల	మహబూబాబాద్	వికారాబాద్	నారాయణపేట
డ్రాపౌట్ల శాతం	29.82	28.83	28.35	24.57	23.22

20 శాతంకంటే ఎక్కువ డ్రాపౌట్లు ఉన్న జిల్లాలు: నల్లగొండ, మంచిర్యాల, జగిత్యాల, నాగర్‌కర్నూల్, మెదక్, ములుగు, జనగామ, సూర్యాపేట, వరంగల్

వృద్ధులు పెరుగుతున్నారు!

- రాష్ట్రంలో తగ్గుతున్న యువతరం, చిన్నారులు
- 2036 నాటికి సగటున 60 శాతం పెరగనున్న మధ్య వయస్కులు, వృద్ధులు
- భారీగా తగ్గనున్న 0-29 ఏళ్ల మధ్య వయసు జనాభా
- సగటున మైనస్ 20 శాతం వృద్ధిరేటుగా చూపించిన తెలంగాణ అర్థ గణాంక నివేదిక




సాక్షి, హైదరాబాద్: చైనాను వెనక్కు నెట్టి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా రికార్డు సాధించాం. ఏ దేశంతో పోల్చి చూసినా... యువశక్తి అధికంగా ఉన్నది భారత్‌లోనే అని గొప్పగా చెప్పుకుంటున్నాం. అయితే మరో పదేళ్లలో ఈ లెక్క కూడా తప్పే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణకు పెరిగిన ప్రాధాన్యత దృష్ట్యా తెలంగాణలో యువతరం తగ్గుముఖం పడుతుండగా... వృద్ధుల సంఖ్య భారీగా పెరుగుతోంది. యువత తగ్గి మధ్యవయస్కులు, వృద్ధుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగించే అంశంగా భావిస్తున్నారు. జాతీయ జనాభా కమిషన్ ఇచ్చిన లెక్కలతో సోమవారం తెలంగాణ ప్రణాళిక శాఖ విడుదల చేసిన రాష్ట్ర జనాభా గణాంకాల్లో వయసుల వారీగా జనాభా వృద్ధి, క్షీణత వివరాలు వెల్లడయ్యాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 3.50 కోట్ల జనాభా ఉండగా, 2026 నాటికి 3.86 కోట్లకు చేరుకుంటుందని కమిషన్ అంచనా వేసింది. 2036 నాటికి 4.6 శాతం వృద్ధితో 3.94 కోట్లకు చేరనుంది. ఇందులో పురుషులు 1.97 కోట్లు కాగా, మహిళలు 1.96 కోట్లు. అయితే ఈ పెరిగే జనాభాలో 2021 నుంచి 2036 మధ్య 35 ఏళ్ల నుంచి 80 ఏళ్ల మధ్య వయస్కుల జనాభా గణనీయంగా పెరగబోతోంది. అదే కాలంలో 0 నుంచి 34 ఏళ్ల వయసు గల వారి వృద్ధి రేటు మైనస్ (-)లో ఉండటం గమనార్హం. 20 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్కులు 20 శాతానికి పైగా తగ్గుతున్నారు.

2021 నుంచి 2036 నాటికి జాతీయ జనాభా కమిషన్ అంచనా ఇలా

యువతరం క్షీణత తీరు ఇలా... (జనాభా లక్షల్లో)

ఏజ్ గ్రూప్	2021జనాభా	2036 నాటికి	క్షీణత/ వృద్ధి శాతం
15-19	31.24	25.66	-17.9
20-24	33.94	26.26	- 22.6
25-29	34.16	27.57	- 19.3
30-34	33.50	30.33	- 9.5
35-39	31.48	32.92	+ 4.6

2021నుంచి 2036 నాటికి మధ్య వయస్కులు, వృద్ధుల జనాభా పెరుగుదల ఇలా...



చిన్నారులు, యువత తగ్గుముఖం

ఓవైపు మధ్య వయస్కులు, వృద్ధుల సంఖ్య రాబోయే పదేళ్లలో గణనీయంగా పెరుగుతుంటే... అదే స్థాయిలో యువశక్తి తగ్గుతుండడం ఆందోళన కలిగించే అంశం. 2021 నుంచి 2036 మధ్య కాలంలో 20-24 ఏళ్ల వయసు గల వారు 33.94 లక్షల నుంచి 26.26 లక్షలకు తగ్గనుంది. అంటే 22.6 శాతం తగ్గుదలగా నమోదవుతోంది. 25-29 మధ్య వయస్సు గల యువతరం 2021లో 34.16 లక్షలు ఉంటే, 2036 నాటికి 19.3 శాతం తగ్గి 27.57 లక్షలకు చేరుకుంటుంది. ఇదే క్రమంలో 30 నుంచి 34 సంవత్సరాల వయస్సు గల వారు 33.50 లక్షల నుంచి 30.33 లక్షలకు(-9.5 శాతం) చేరుకోనున్నారు. యువతతోపాటు 0 నుంచి 4 ఏళ్ల వయస్సు గల చిన్నారుల సంఖ్య 2036 నాటికి ఏకంగా 25 శాతం తగ్గుతుండగా, 5నుంచి 9 వయస్సు గల వారు 20 శాతం తగ్గనున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 10-14 మధ్య కౌమార వయసు జనాభాతోపాటు 15-19 మధ్య టీనేజ్ వయసు గల యువతీయువకులు కూడా 17 శాతానికి పైగా తగ్గుతారని జాతీయ జనాభా కమిషన్ పేర్కొంది.

గోదాట్లో కలిసిన 'హైవే'

- తెలంగాణలో పర్యాటకానికి ఊతమిచ్చే కీలక జాతీయ రహదారి ప్రాజెక్టు ఇది
- భద్రాచలం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ కౌటాల వరకు 2016లో ప్రతిపాదన
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంత ప్రాజెక్టుగా అప్పట్లో ప్రకటించిన కేంద్రం
- ప్రత్యామ్నాయ ప్రతిపాదన అందక.. ఇటీవల దానిని రద్దు చేసుకున్న కేంద్రం



సాక్షి, హైదరాబాద్: వివిధ జిల్లాలను అనుసంధానం చేస్తూ తెలంగాణ పర్యాటకానికి ఊతమిచ్చే కీలక జాతీయరహదారి ప్రాజెక్టు రద్దయ్యింది. ప్రాజెక్టు మంజూరై, కన్సల్టెంట్ సర్వే పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్టు పెండింగులో పడింది. రాష్ట్ర ప్రభుత్వ పక్షాన సరైన పర్యవేక్షణ లేకపోవటంతో దాన్ని రద్దు చేసుకుంటున్నట్టు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో ఓ కీలక రహదారిని రాష్ట్రం కోల్పోవాల్సి వచ్చింది. దీంతో దాదాపు రూ.8 వేల కోట్ల కీలక ప్రాజెక్టు గోదాట్లో కలిసిపోయినట్టయ్యింది.

వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంత నిధులతో..

తెలంగాణలో వామపక్ష తీవ్రవాద ప్రభావం తీవ్రంగా ఉండటంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సరైన రోడ్డు రవాణా వ్యవస్థ ఏర్పడలేదు. చిన్నచిన్న రోడ్లు మినహా పెద్ద రోడ్లు ఏర్పడలేదు. ఈ నేపథ్యంలో 2016లో నాటి రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలం నుంచి గోదావరి పరీవాహక ప్రాంతాన్ని అనుసంధానిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కౌటాల వరకు నాలుగు వరుసల రోడ్డును ప్రతిపాదించారు. గోదావరి మీదుగా వంతెన నిర్మాణంతో ఈ రోడ్డును ఛత్తీస్‌గఢ్‌కు కూడా అనుసంధానించే అవకాశం ఉండటంతో కేంద్రం వెంటనే దీనికి సమ్మతించింది. దాదాపు 396 కి.మీ. నిడివితో దీనిని జాతీయ రహదారిగా చేపట్టేందుకు అంగీకరించి మంజూరు చేసింది. ఈ మేరకు కన్సల్టెన్సీ సంస్థను కూడా నియమించి సర్వే చేయించింది. అయితే, చాలా ప్రాంతాల్లో అటవీ ప్రాంతం మీదుగా రోడ్డును నిర్మించాల్సి రావటంతో, అటవీ భూముల సేకరణ ఇబ్బందిగా మారుతుందని, వన్యప్రాణులకు సమస్యలేర్పడతాయన్న భావన వ్యక్తమైంది. దీంతో దాన్ని పేవ్డ్ షోల్డర్స్‌తో కూడిన రెండు వరుసల రోడ్డుగా మార్చాలని తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఢిల్లీ పర్యటన సందర్భంగా నితిన్‌గడ్కరీతో భేటీ అయిన సందర్భంలో ఇదే విషయాన్ని ప్రతిపాదించారు. దీనికి ఆయన సానుకూలత వ్యక్తం చేశారు.


కేంద్ర, రాష్ట్రాల మధ్య సఖ్యత లేక..

అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాల్లో సఖ్యత సన్నగిల్లింది. దీంతో కొన్ని జాతీయ రహదారి ప్రాజెక్టుల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ పక్షాన క్రమం తప్పకుండా పర్యవేక్షించే చొరవ కూడా మందగించింది. అటవీ భూముల సమస్యకు సరైన ప్రత్యామ్నాయం చూపుతూ, ఢిల్లీ స్థాయిలో క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయకపోవటంతో కొంతకాలం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టింది. క్రమంగా ఢిల్లీతో సత్సంబంధాలు మరింత క్షీణించాయి. ఎన్నికలకు ముందు కొన్ని పెండింగ్ ప్రాజెక్టులను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం వాటిల్లో కొన్నింటిని రద్దు చేసుకోవాలని నిర్ణయించింది. గోదావరి పరీవాహక జాతీయ రహదారి ప్రాజెక్టును కూడా అందులో చేర్చింది. ఆ సమాచారం ఇటీవల తెలంగాణ అధికారులకు అందింది. భద్రాచలం-సారపాక-ఏటూరునాగారం-కాళేశ్వరం-చెన్నూరు-కౌటాల మీదుగా ఈ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలను అది అనుసంధానిస్తూ సాగాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో పలు విద్యుదుత్పత్తి, సాగునీటి ప్రాజెక్టులను కూడా ఇది జోడిస్తుంది. గోదావరి తీరంలో ఎన్నో ప్రముఖ పుణ్యక్షేత్రాలతోపాటు, పర్యాటకులను బాగా ఆకట్టుకునే ప్రాంతాలున్నాయి. వాటన్నింటిని కలుపుతూ ఈ రోడ్డు కొనసాగటం వల్ల ఆయా ప్రాంతాల్లో పర్యాటకరంగం ఎంతో అభివృద్ధి చెందేది. ఇప్పుడు అలాంటి కీలక ప్రాజెక్టు చేజారినట్టయింది.

రాష్ట్ర జీఎస్డీపీ 14.5% వృద్ధి

- 2023-24లో జీఎస్డీపీ విలువ రూ.15,01,981 కోట్లు
- దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్డీపీ వాటా 5.1%
- 2014-15 నుంచి 2023-24 మధ్యకాలంలో 196% వృద్ధి
- 3.5 కోట్ల రాష్ట్ర జనాభాలో 1.5 కోట్ల మందికి ఉద్యోగం, ఉపాధి
- రాష్ట్ర అర్థగణాంక నివేదికలో వెల్లడించిన సర్కారు

ఉద్యోగాలు, ఉపాధి కల్పనలో ఏ రంగం వాటా ఎంత?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) 2023-24లో 14.5 శాతం వృద్ధి నమోదు చేసింది. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్ర జీఎస్డీపీ విలువ రూ.15,01,981 కోట్లు. మొత్తం దేశ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో రాష్ట్ర జీఎస్డీపీ వాటా 5.1 శాతం. దేశ జనాభాలో రాష్ట్రం వాటా కేవలం 2.8 శాతమే అయినా జీడీపీలో మాత్రం 5.1 శాతం వాటాను కలిగి ఉండడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన తెలంగాణ అర్థగణాంక నివేదిక-2024లో ఈ విషయాన్ని వెల్లడించింది. ఒక ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం ఉత్పత్తి చేసిన వస్తు, సేవల మొత్తం విలువే జీఎస్డీపీ. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ముఖ్య కొలమానంగా జీఎస్డీపీని పరిగణిస్తారు. 2022-23తో పోల్చితే 2023-24లో రాష్ట్రం 14.5 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

దశాబ్ద కాలంలో 196% వృద్ధి

రాష్ట్ర జీఎస్డీపీ 2014-15లో రూ.5,05,849 కోట్లు ఉండగా, 2023-24 నాటికి రూ.15,01,981 కోట్లకు వృద్ధి చెందింది. ఈ మధ్యకాలంలో రాష్ట్ర జీఎస్డీపీ 196.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదే కాలంలో దేశ జీడీపీ మాత్రం 136.89 శాతం మాత్రమే వృద్ధి చెందింది. తెలంగాణ ఆవిర్భావానికి రెండేళ్ల ముందు ఈ ప్రాంతం 12.1శాతం జీఎస్డీపీ వృద్ధి రేటును కలిగి ఉండగా, నాటి దేశ జీడీపీతో పోలిస్తే 1.3 శాతం తక్కువే. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014-15 నుంచి 2023-24 మధ్యకాలంలో రాష్ట్రం సగటున ఏటా 12.9 శాతం వృద్ధి రేటును సాధిస్తోంది. జాతీయ సగటు కంటే ఇది 2.6 శాతం అధికం. దేశ జీడీపీలో రాష్ట్రం వాటా సైతం 4.1 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది.


వృద్ధిలో సేవల రంగం టాప్

రాష్ట్ర జనాభాలో 45.8 శాతం జనాభాకు ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయం, అనుబంధ రంగాలు 2023-24లో 5.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. అయితే రాష్ట్ర జీఎస్డీపీ విలువలో ఈ రంగాలు 15.4 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇదే కాలంలో పరిశ్రమల రంగం 9.2 శాతం, సేవల రంగం 19.4 శాతం వృద్ధిని నమోదు చేశాయి. జాతీయస్థాయిలో పరిశ్రమల రంగం 8.7 శాతం, సేవల రంగం 9.6శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేశాయి.

తలసరి ఆదాయంలో టాప్

2023-24లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,56,564 కాగా, దేశ తలసరి ఆదాయం రూ.1,84,205 మాత్రమే. రాష్ట్ర తలసరి ఆదాయంతో పోల్చితే జాతీయ తలసరి ఆదాయం రూ.1,72,359 తక్కువ కావడం గమనార్హం. 2023-24లో రాష్ట్ర తలసరి ఆదాయం 14.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2014-15లో రూ.1,24,104 ఉండగా, 2023-24 నాటికి 187.3 శాతం వృద్ధితో రూ.3,56,564కు పెరిగింది. ఇదే కాలంలో దేశ తలసరి ఆదాయం కేవలం 112.59 శాతం వృద్ధినే సాధించింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర తలసరి ఆదాయం రెట్టింపు కావడానికి ఆరేళ్లు పడుతుండగా, దేశ తలసరి ఆదాయానికి ఎనిమిదేళ్లు పడుతోంది. రాష్ట్ర జనాభా 3.5 కోట్లు ఉండగా, రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 1.5 కోట్ల మంది పనిచేస్తున్నారు.

రాష్ట్ర జీఎస్‌డీపీలో ఏ రంగం వాటా ఎంత?



చేయూత @ 43,00,403



సాక్షి, హైదరాబాద్ : ప్రభుత్వపరంగా వివిధ వర్గాల ప్రజలకు సామాజిక భద్రత కల్పించే కార్యక్రమాలు, సంక్షేమ పథకాల్లో చేయూత పింఛన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో (సెప్టెంబర్‌నాటికి) మొత్తం 11 కేటగిరీలు కలిపి రాష్ట్రంలో 43,00,403 మంది పింఛన్‌దారులున్నారు. అదే 2023-24లో వీరి సంఖ్య 44,10,320గా ఉంది. దీనిని బట్టి గతంతో పోల్చితే వీరి సంఖ్య లక్షా పదివేల తగ్గుదల నమోదైనట్టుగా స్పష్టమవుతోంది.

క్లుప్తంగా...

సీఈజీఎస్‌తో ఒప్పందం పొడిగింపు

- భట్టి సమక్షంలో ఎంఓయూ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డేటా ఆధారిత పాలనను బలోపేతం చేయడం, పాలన వ్యయాల సమర్థ నిర్వహణ కోసం సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ (సీఈజీఎస్) ఫౌండేషన్ తో చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఐదేళ్లు పొడిగించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఈ మేరకు సోమవారం సచివాలయంలో జరిగిన ఒప్పందంపై రాష్ట్రం తరఫున ఆర్థిక శాఖ ప్రత్యేక కార్య దర్శి రామకృష్ణారావు, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలు, సీఈజీఎస్ తరఫున సంస్థ సహవ్యవస్థాపకుడు ప్రొఫెసర్ కార్తీక్ మురళీధరన్, ప్రాజెక్టు డైరెక్టర్ హరినారాయణ్, ప్లానింగ్ డైరెక్టర్ ఓం ప్రకాశ్ సంతకాలు చేశారు.

అలసత్వం ప్రదర్శిస్తే స్థానం ఉండదు

- ఉద్యోగులకు సింగరేణి సీఎండీ బలరామ్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ సుస్థిర భవిష్యత్తే ప్రతీ ఒక్క అధికారి, ఉద్యోగి ప్రథమ కర్తవ్యం కావాలని, ఇందుకోసం అందరూ తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాల్సిందేనని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ స్పష్టం చేశారు. అలసత్వం ప్రదర్శించే వాళ్లకు కంపెనీలో స్థానం ఉండదని హెచ్చరించారు. 11 ఏరియాల జీఎంలతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఉద్యోగులు, అధికారు లు రోజుకు 8 గంటల పాటు కచ్చితంగా పనిచేస్తూ బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనని స్పష్టం చేశారు. మస్టర్ పడి బయటకు వెళ్లే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ ఉద్యోగి విధులకు సకాలంలో వచ్చేలా చూడాలని ఆదేశించారు.

ఏఐ స్కిల్ ఉంటే వేతన ధమాకా!



40 శాతం వరకూ జీతం పెరిగే చాన్స్

- మిగిలిన వారికి 15 శాతంలోపు
- భారత్- 2025 జాబ్ మార్కెట్‌పై ఆశావహ దృక్పథం

సాక్షి, అమరావతి: భారత్ –2025 జాబ్ మార్కెట్‌పై ఆశావహ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ప్రాముఖ్యత, నైపుణ్యాల ఆధారిత ఉద్యోగుల వేతనాలు భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగిలిన ఉద్యోగుల వేతనాలు సైతం 6 నుంచి 15 శాతం పెరుగుతాయన్న విశ్లేషణలు ఉన్నాయి. దిగ్గజ రిక్రూట్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ మైఖేల్ పేజ్ ఇటీవల ఒక నివేదికను విడుదల చేస్తూ.. ఏఐ వంటి ప్రత్యేక నైపుణ్యతల రంగంలో ఏకంగా 40 శాతం వేతన పెరుగుదల ఉండవచ్చని అంచనా వేసింది. నివేదికలోని అంశాలను పరిశీలిస్తే..

- ఈ ఏడాది కార్పొరేట్ సంస్థల జీతాలు సగటున 6 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి.
- ఇదే సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి స్కిల్స్ ఆధారిత ఉద్యోగుల జీతాలు 40 శాతం వరకు పెరగనున్నాయి.
- కార్పొరేట్ ఇండియాలో అన్ని రంగాల్లో జీతాల పెరుగుదల భారీగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, నాయకత్వ స్థానాల్లో ఉన్న వారికి భారీగా వేతన పెరుగుదల ప్రయోజనం కలగనుంది. వీరి వేతనాలు 20 నుంచి 30 శాతం పెరిగితే నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారికి ఏకంగా 40 శాతం వరకు పెరుగుతాయి.
- ఏఐ, ఎంఎల్ అల్గారిథమ్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, రెన్యువబుల్ ఎనర్జీ వంటి రంగాలకు అత్యధిక డిమాండ్ ఉంది. ఈ రంగాల్లో విదేశీ సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతుండటంతో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.
- టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, తయారీ, రియల్టీ, హెల్త్‌కేర్ లైఫ్ సైన్సెస్ రంగాల్లో అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంది.
- ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక పరిస్థితి అనిశ్చితిలో ఉండటంతో తాత్కాలిక ఉద్యోగ నియామకాలు భారీగా పెరిగే అవకాశం ఉంది.

ఉద్యోగులను కాపాడుకోవడానికి పాట్లు

ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలు నైపుణ్యం కలిగిన ఉద్యోగులను కాపాడుకోవడానికి, కొత్త వారిని ఆకర్షించడానికి భారీ ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. ఎంప్లాయిస్ స్టాక్ ఓనర్‌షిప్ (ఈసాప్స్) పేరిట ఉద్యోగులకు కంపెనీ షేర్లను కేటాయించడంతో పాటు దీర్ఘకాలిక ప్రోత్సాహకాలను ప్రకటిస్తున్నాయి. ప్రత్యేకించి సీనియర్ స్థాయిలో ఉన్న ఉద్యోగుల విషయంలోనే కంపెనీలు ఈ తరహా ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. 50 శాతం మహిళా ప్రాతినిధ్యం లక్ష్యంగా, స్పష్టమైన వేతన విధానాలు, సౌకర్యవంతమైన పని విధానాలను కంపెనీలు అమలు చేస్తున్నాయి.

స్పెషలిస్టులను కోరుతున్న మార్కెట్



ఉద్యోగంలో మంచి వేతన పెరుగుదలకు ప్రత్యేక నైపుణ్యాలు కలిగి ఉండాలి. జాబ్ మార్కెట్ సాదాసీదా మామూలు ఉద్యోగులను కాకుండా, స్పెషలిస్టులను కోరుతోంది.

– అంకిత్ అగర్వాల్, మైఖేల్ పేజ్ మేనేజింగ్ డైరెక్టర్

డిమాండ్ ఉన్న టాప్ 5 జాబ్ ప్రొఫైల్స్

మెషిన్ లర్నింగ్ ఇంజనీర్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్, ఆర్కిటెక్టర్ (ఎంటర్‌ప్రైజ్, డేటా క్లౌడ్), వెబ్3 డెవలపర్స్, ఉమెన్ ఇంజనీరింగ్ లీడర్స్

డిమాండ్ ఉన్న స్కిల్ కోర్సులు

ఏఐ, ఎంఎల్ అల్గారిథమ్స్, క్లౌడ్ కంప్యూటింగ్ ఎక్స్‌పర్టైజ్, డిజైన్ అండ్ ఆర్కిటెక్టర్, సైబర్ సెక్యూరిటీ

పట్టణాల్లో ప్రాపర్టీ కార్డ్!

▶ మొదటి పేజీ తరువాయి

దశ కింద దేశవ్యాప్తంగా 1,000 మున్సిపాలిటీల్లో, ఆ తర్వాత దేశంలోని 4,912 పట్టణాలు, నగరాల్లో 'నక్ష'ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.



ఆధార్ మాదిరిగా ప్రాపర్టీ కార్డ్..

పట్టణాలు, నగరాల్లోని భూముల సర్వే నంబర్లు, ఇళ్లను 'నక్ష' కార్యక్రమం ద్వారా అనుసంధానం చేస్తారు. ప్రస్తుతం పౌరులందరికీ ఆధార్ ఇస్తున్నట్టుగానే.. ప్రతీ గృహ యజమానికి ప్రాపర్టీ కార్డును విశిష్ట గుర్తింపు సంఖ్యతో ఇవ్వనున్నట్టు పురపాలక శాఖ ఉన్నతాధికారి ఒకరు వివరించారు. ఈ కార్డుపై 'క్యూఆర్' కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేస్తే పూర్తి వివరాలు లభిస్తాయని తెలిపారు. ఇంటి యజమాని పేరు, ఆస్తి పన్ను వివరాలు, ఆస్తి విస్తీర్ణం, సర్వే నంబర్, అనుమతి తీసుకున్న నంబర్, ప్లాన్, నల్లా కనెక్షన్ ఇలా సమస్త సమాచారం అందులో ఉంటుందని వెల్లడించారు. లైడార్ సర్వే మాదిరిగా ఇది ఉంటుందని, పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో ఏడాదిపాటు పూర్తి స్థాయిలో ఈ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ మున్సిపాలిటీల్లోని ప్రతి ఇంటిని త్రీడీ కెమెరాలతో మ్యాపింగ్ చేస్తారని, ఇందుకోసం మూడు రకాల కెమెరాలను ఉపయోగిస్తారని వెల్లడించారు.

ఈ సర్వే పూర్తయితే.. ఆస్తిపన్ను మదింపు పారదర్శకంగా జరుగుతుందని, స్థానిక సంస్థల ఆదాయాన్ని పెంచుకోవడానికి వీలవుతుందని వివరించారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితిని బట్టి అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, భవిష్యత్తులో జీఐఎస్ మాస్టర్ ప్లాన్‌ల రూపకల్పన సులభతరం అవుతుందని స్పష్టం చేస్తున్నారు. పట్టణాల్లోని రెవెన్యూ సర్వే నంబర్లు ఎన్ని సబ్ డివిజన్లుగా మారాయన్న వివరాలను కూడా నమోదు చేయనున్నట్టు తెలిపారు.

అర్బన్ ల్యాండ్ రికార్డులు నాలుగు రాష్ట్రాల్లోనే..

దేశంలో తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, గోవా రాష్ట్రాల్లో మాత్రమే పట్టణ భూముల రికార్డులను పక్కాగా నిర్వహిస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో వాటి నిర్వహణ సరిగా లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలోనే 'నక్ష' ప్రాజెక్టును చేపట్టినట్టు చెబుతోంది. రెవెన్యూ, మున్సిపాలిటీలు, సర్వే ఆఫ్ ఇండియా, ఎంపీ స్టేట్ ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ), సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు సంయుక్తంగా ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేయనున్నాయి. పట్టణాలు, నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ సర్వే కీలకమని కేంద్రం తెలిపింది. భూముల విలువలు వేగంగా పెరుగుతున్నందున వివాదాలకు చెక్ పెట్టేలా ఇది ఉంటుందని, న్యాయపరమైన అంశాల్లోనూ ఉపయోగపడుతుందని వెల్లడించింది. అదే సమయంలో ఈ సర్వే డిజిటైజేషన్‌తో ప్రణాళికాబద్ధంగా పట్టణాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు వీలుంటుందని పేర్కొంది. ఆయా ఆస్తుల యజమానులు రుణాలు తీసుకోవడానికి ఈ సర్వే అనంతరం జారీ చేసే ప్రాపర్టీ కార్డు ఉపయోగపడుతుందని స్పష్టం చేసింది.

రాష్ట్రంలో ఎంపిక చేసిన మున్సిపాలిటీలివే..

జడ్చర్ల, హుస్నాబాద్, కొడంగల్, వర్ధన్నపేట, యాదగిరిగుట్ట, మహబూబాబాద్, వేములవాడ, మిర్యాలగూడ, జగిత్యాల, మణుగూరు మున్సిపాలిటీలను 'నక్ష' పైలట్ ప్రాజెక్టు కోసం రాష్ట్రం నుంచి ఎంపిక చేశారు. రాష్ట్రంలోని మొత్తం 155 పట్టణాలు, 29 పట్టణాభివృద్ధి సంస్థల్లో కూడా భవిష్యత్తులో ఈ సర్వే నిర్వహించేందుకు అవసరమైన నిధులు దాదాపు రూ.700 కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరనుందని తెలిసింది.

చట్టవిరుద్ధంగా కూల్చివేతలా?

హైడ్రా అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

- ఎన్నిసార్లు చెప్పినా నిబంధనలు ఎందుకు పాటించరు?
- హైడ్రా ఇన్‌స్పెక్టర్ హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో సెలవు రోజైన ఆదివారం (9వ తేదీన) మూడు గుంటల భూమిలోని భవనాన్ని కూల్చివేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పినా నిబంధనలు పాటించకపోవడంపై మండిపడింది. అక్కడి హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ ఈ నెల 20న న్యాయస్థానం ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. హైడ్రా చేపట్టిన కూల్చివేత చట్ట వ్యతిరేకంగా, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. సెలవు రోజున కూల్చివేతలు చేపట్టడం పరిపాటిగా మారిందని ఆక్షేపించింది. అప్పటివరకు సదరు ఆస్తిపై యథాతథస్థితి పాటించాలని పేర్కొంది. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ముత్తంగి గ్రామంలో సర్వే నంబర్ 296/ఇ/2లోని తన స్థలానికి సంబంధించిన వివరాలను పరిశీలించకుండా షెడ్ కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ ప్రవీణ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పార్క్ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని గాయత్రి మెంబర్స్ అసోసియేషన్ ఇచ్చిన వినతి పత్రాలపై హైడ్రా నోటీసులు జారీ చేసిందన్నారు. దీనిపై భూమార్పిడి ఉత్తర్వులు, సేల్ డీడ్‌తోపాటు పంచాయతీ అనుమతులతో అన్ని వివరాలను సమర్పించినట్లు చెప్పారు. అయినా హైడ్రా అధికారులు పిటిషనర్‌ను సంప్రదించకుండా ఏకపక్షంగా షెడ్‌ను కూల్చివేశారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సెలవు రోజు కూల్చివేతలు వద్దని గతంలో తాము ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని హైడ్రాను నిలదీశారు. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

తెలంగాణ, ఏపీ స్కౌట్స్ అండ్ గైడ్స్ చైర్మన్‌గా నాగిరెడ్డి నియామకం



మూసాపేట: తెలంగాణ, ఏపీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ చైర్మన్‌గా పి.నాగిరెడ్డిని.. ఆ సంస్థ జాతీయ చైర్మన్ యతేంద్ర కుమార్ నియమించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని, రెండు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సంస్థను నడిపిస్తానని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల అమలు అభివృద్ధి పరిరక్షణతో పాటు స్కౌట్ లీడర్లు, ట్రైనర్లు, వాలంటరీ శిక్షణ, వారి పరిరక్షణ బాధ్యతలు చేపట్టనున్నట్టు నాగిరెడ్డి వెల్లడించారు.

ఈ-కారు రేసు ప్రతిపాదనలు ఎవరు తెచ్చారు?

ఫార్ములా-ఈ ఆపరేషన్ ప్రతినిధులను ప్రశ్నించిన ఏసీబీ అధికారులు

- ఒప్పంద వివరాలు, నగదు చెల్లింపులపై ఆరా
- లండన్ నుంచి వర్చువల్‌గా విచారణకు హాజరు



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా-ఈ కారు రేసు కేసు దర్యాప్తులో కీలక మలుపు. కారు రేసు నిర్వహణలో కీలకమైన లండన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈఓ) సంస్థ ప్రతినిధులను ఏసీబీ అధికారులు సోమవారం ప్రశ్నించారు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఈ-కారు రేసు నిర్వహణ ప్రతిపాదనలు ఎవరు తెచ్చారు? రేసు నిర్వహణ ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఎవరు మిమ్మల్ని సంప్రదించారు? అప్పటి ప్రభుత్వంలోని ఎవరెవరు మీతో టచ్‌లో ఉన్నారు? ఒక సీజన్ నిర్వహణ తర్వాత స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ జెన్ సంస్థ ఎందుకు తప్పుకుంది? హెచ్ఎండీఏ నుంచి మీకు నగదు చెల్లింపులు జరిగాయా? అవి ఎఫ్ఈఓ ఖాతాల్లోకి ఏయే తేదీల్లో మళ్లించారు? రేసు నిర్వహణ నిలిచిపోయినప్పుడు మీకు.. తెలంగాణ ప్రభుత్వానికి మధ్య ఏవైనా సంప్రదింపులు జరిగాయా? ఇలా పలు కోణాల్లో ప్రశ్నలు అడిగి అధికారులు వివరాలు సేకరించినట్లు తెలిసింది. ప్రధానంగా హెచ్ఎండీఏ బోర్డ్ నిధుల నుంచి రూ.45.71 కోట్ల డిపాజిట్ గురించి వివరాలను ఏసీబీ సేకరించారు.

లండన్ నుంచి వర్చువల్‌గా...

ఏసీబీ అధికారులు ఇచ్చిన నోటీసులకు స్పందించిన ఎఫ్ఈఓ ప్రతినిధులు విచారణకు మొదట కొంత సమయం కోరారు. అయితే, ఎట్టకేలకు సోమవారం లండన్ నుంచి విచారణకు వర్చువల్‌గా హాజరయ్యారు. ముందస్తు అనుమతి మేరకు ఉదయం 11 గంటలకు జూమ్ మీటింగ్‌లో వర్చువల్‌గా హాజరయ్యారు. ఫార్ములా-ఈ కారు రేసు కేసు దర్యాప్తు అధికారి, డీఎస్పీ మాజీద్ అలీ ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల అధికారుల బృందం గంటన్నరకు పైగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ-కారు రేసు సీజన్ 9, 10, 11, 12 నిర్వహణకు హెచ్ఎండీఏ, స్పాన్సర్ ఏస్ నెక్స్‌జెన్ లిమిటెడ్‌కు మధ్య కుదిరిన ఒప్పందాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర కీలక పత్రాల ఆధారంగా అధికారులు ప్రశ్నలు సంధించారు. ఇప్పటికే ఈ కేసులో ఏ-1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్, ఏ-2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ-3గా ఉన్న హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్‌రెడ్డి, ఏస్ నెక్స్ జెన్ ప్రతినిధుల విచారణ సందర్భంగా సేకరించిన వివరాల ఆధారంగా కూడా ప్రశ్నలు అడిగారు. ఈ మొత్తం విచారణను అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. అవసరం మేరకు మరిన్ని వివరాలు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు వారికి చెప్పినట్లు తెలిసింది.

అసంక్రమిక వ్యాధులపై 20 నుంచి ఉచిత పరీక్షలు

- 30 ఏళ్లు పైబడిన వారికి మార్చి 31వ తేదీ వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు
- కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం.. రాష్ట్రాలకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: దేశంలో పెరుగుతున్న అసంక్రమిక వ్యాధులను (ఎన్‌సీడీ) అరికట్టేందుకు అవసరమైన వారందరికీ ఉచితంగా వ్యాధి నిర్ధారిత పరీక్షలు నిర్వహించాలని కేంద్ర వైద్య,ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసింది. 30 ఏళ్ల పైబడిన వారందరికీ ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ (బస్తీ, పల్లె దవాఖానాలు, సబ్ సెంటర్లు)తోపాటు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈనెల 20 నుంచి మార్చి 31వ తేదీవరకు అసంక్రమిత వ్యాధుల పరీక్షలు నిర్వహించాలని సూచించింది. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ఇప్పటి దాకా ఆశ ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి ఆ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఇక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లతో పాటు అన్ని సర్కారీ దవాఖానాల్లో ఈ డ్రైవ్ చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. రక్తపోటు, మధుమేహంతోపాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షలు చేయాలని చెప్పింది. జాతీయ అసంక్రమిక వ్యాధుల నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా దీన్ని చేపట్టినట్టు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్‌సీడీ పరీక్షలకు అవసరమైన బీపీ మానిటర్స్, గ్లూకో మీటర్స్, స్ట్రిప్స్ లాంటివి అందుబాటులో ఉంచాలని, పరీక్షల వివరాలను ఎన్‌సీడీ పోర్టల్‌లో రోజువారీగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. రాష్ట్రస్థాయి ఎన్‌సీడీ నోడల్ అధికారులతో పాటు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎన్‌సీడీ కన్సల్టెంట్స్‌ను ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా జిల్లా నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు పరీక్షల పురోగతిపై సమీక్షించాలని చెప్పింది. ఏప్రిల్ నెల నుంచి వారంలో రెండురోజుల పాటు (ఫిక్స్‌డ్ డేస్) క్షేత్రస్థాయికి వెళ్లి ఎన్‌సీడీ పరీక్షలు చేయాలని సూచించింది. వారంలో రెండురోజులపాటు ఎన్‌సీడీ పరీక్షల కార్యక్రమం ఆయా ఆస్పత్రుల్లో పరిధిలోని ప్రాంతాల్లో కచ్చితంగా చేపట్టాలని ఆదేశించింది. తెలంగాణలో 30 ఏళ్లకు పైబడినవారు 1,40,93,300 మంది ఉండగా, అందులో 96,11,587 మందికి (48 శాతం) బీపీ పరీక్షలు, 100,63,007 మందికి (50 శాతం) షుగర్ పరీక్షలు ఇప్పటివరకు నిర్వహించినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ ఆ లేఖలో పేర్కొంది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు



సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ & క్యాషియర్స్

వయస్సు: 19 నుండి 35 సంవత్సరాలు.

ఇంటర్వ్యూ తేదీ - వేదిక

20-02-2025 & 21-02-2025 (10 am - 5 pm)

6-1-79 & 80, టెలిఫోన్ భవన్ రోడ్, లక్డీకాపూల్,
హైదరాబాద్, తెలంగాణ 500004.
మొబైల్: 7358105850, 9014708867.

KHAZANA JEWELLERY

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ / కాంట్రాక్టు ప్రాతిపదికన క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

క్రమ సంఖ్య	పదవి పేరు	ఖాళీ	టైప్
ప్రకటన నం. CRPD/SCO/2024-25/30			
1	డిప్యూటీ సిటిఓ (ఐటి ఇన్ఫ్రాస్ట్రక్చర్)	01	కాంట్రాక్టు
ప్రకటన నం. CRPD/SCO/2024-25/31			
1	సర్కిల్ డిఫెన్స్ బ్యాంకింగ్ అడ్వైజర్ - (సిడిబిఏ) బెంగళూరు	01	కాంట్రాక్టు
ప్రకటన నం. CRPD/SCO/2024-25/32			
1	ఇంటర్నల్ అంబుడ్స్‌మన్ (ఐ.ఓ.)	02	కాంట్రాక్టు

https://bank.sbi/web/careers/current-openings
"CONTACT US" —> "Post Your Query"
(https://bank.sbi/web/careers/post-your-query)

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేది : 08.02.2025 నుండి 02.03.2025 వరకు.

స్థలం: ముంబై
తేది: 08.02.2025
మహానిర్వహణాధికారి (ఆర్పీ & పీఎం)







ప్రతిభావంతుడు ఎవరూ చేరుకోలేని లక్ష్యాన్ని సాధిస్తాడు.
మేధావి ఎవరూ చూడలేని లక్ష్యాన్ని ఛేదిస్తాడు.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి

మంగళవారం, 18 ఫిబ్రవరి 2025

జనం ప్రాణాలంటే విలువేది?

వెల్లువలా వచ్చిపడుతున్న ప్రయాణికులు, రివాజు తప్పకుండా ఆలస్యంగా వచ్చిపోయే రైళ్లు, ఉన్న గందరగోళాన్ని ఒకింత పెంచే అనౌన్స్‌మెంట్లు, ఏమూలకూ సరిపోని మౌలిక సదుపాయాలు... ఇవన్నీ ఏకమై 45 నిమిషాలపాటు ఏకధాటిగా సృష్టించిన తీవ్ర గందరగోళ స్థితి శనివారం రాత్రి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాటకు దారితీసి 18 మంది ప్రాణాలను బలి తీసుకుంది. ఈ మరణాలకు సంతాపం ప్రకటించటం, బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేయటం సరే... జరిగిన ఘోర ఉదంతానికి నైతిక బాధ్యత వహించాల్సిందెవరు? ఇలాంటివి పునరావృత్తం కానీయబోమని చెప్పేదెవరు? మన దేశంలో ఎప్పుడు జనసమ్మర్దం అధికంగా ఉంటుందో, ఏ చర్యలు అవసరమో అధికార యంత్రాంగానికి తెలియక కాదు. అందుకు సంబంధించి ఇప్పటికే బోలెడు చేదు అనుభవాలున్నాయి. కానీ ఎన్ని జరుగుతున్నా గుణపాఠం నేర్వని మనస్తత్వమే ఈ విషాద ఘటనకు దారితీసింది. కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాట చోటు చేసుకుని 30 మంది ప్రాణాలు బలై పక్షం రోజులు కాలేదు. అదే ప్రయాగ్‌రాజ్‌కు బయల్దేరిన భక్తులకు ఢిల్లీ రైల్వే స్టేషనే ఈసారి మృత్యుఘంటిక మోగించిందంటే నేరం ఎవరిదనుకోవాలి?

తొక్కిసలాట జరిగిన అజ్మీరీ గేట్ టెర్మినల్ గురించి ఉత్తరాదిలో పనిచేసే రైల్వే ఉన్నతాధికారులకూ, ప్రత్యేకించి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ అధికారులకూ తెలియంది కాదు. సాధారణ దినాల్లో సైతం ఆ టెర్మినల్ కిక్కిరిసివుంటుంది. ఢిల్లీ మెట్రో రైల్‌ను నేరుగా అనుసంధానం చేసే ప్రాంతమది. పైపెచ్చు వాహనాల పార్కింగ్‌కు అనువైనది. యూపీ మీదుగా వెళ్లాల్సిన రైళ్లు ఆగే అయిదు ప్లాట్‌ఫాంలు అజ్మీరీ గేట్ టెర్మినల్ ప్రాంతంలోనే ఉన్నాయి. దానికితోడు ఇప్పుడు కుంభమేళా సంరంభం కొనసాగుతోంది. తగిన ప్రణాళిక రూపొందించుకుని, అదనపు జాగ్రత్తలు తీసుకోవడానికి ఈ కారణాలు చాలవా? సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటలలోపు బయల్దేరే రైళ్లను అందుకోవటానికి వచ్చే జనరల్ కంపార్ట్‌మెంట్ ప్రయాణికులకు అక్కడ రోజూ 7,000 టిక్కెట్లు విక్రయిస్తారు. కానీ శనివారం రోజు కేవలం రెండు గంటల వ్యవధిలో అదనంగా మరో 2,600 మందికి టిక్కెట్లు విక్రయించారు. అంటే రిజర్వేషన్‌లేని ప్రయాణికుల సంఖ్య దాదాపు పదివేలు! ఇంత మంది టికెట్ల తనిఖీ అసాధ్యం. కనుక టికెట్ లేకుండా ప్రయాణించేవారు ఇంతకు మూడు నాలుగు రెట్లు అధికంగా ఉంటారని ఒక అంచనా. అందుబాటులో ఉన్న బోగీలెన్నో, జారీ చేయాల్సిన టికెట్లెన్నో కనీస అంచనాకు రాకపోవటం... అవసరమైన పోలీసు బలగాలను సమకూర్చుకోవాలన్న స్పృహ లోపించటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఘటన జరిగినప్పుడు ఆ ప్రాంతంలో 20 మంది పోలీసులు మాత్రమే ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వారు సైతం ఈ తొక్కిసలాట సమయంలో 'బతుకుజీవుడా' అనుకుంటూ పక్కకుపోయారు. పర్యవసానంగా 'రక్షించండి...' అంటూ ఆర్తనాదాలు చేస్తున్నవారి కోసం పోర్టర్లే రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. వారే గనుక ఆపద్బాంధవుల్లా రాకపోతే మరింతమంది మృత్యువాత పడేవారు. కుంభమేళా సందర్భంగా డిమాండ్ ఎక్కువుంది గనుక ఉన్న రైళ్లను సమయానికి నడిపుంటే ఇంత జనసమ్మర్దం ఉండేది కాదు. ఎంతో జాప్యం జరిగి ఒకదాని వెనక మరొకటిగా వరసపెట్టి మూడు రైళ్లుండటం వల్ల 14, 15 నంబర్ ప్లాట్‌ఫాంలపై వేలాదిమంది పడిగాపులు పడుతున్నప్పుడే ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్రత్యేక రైలుపై వెలువడిన అనౌన్స్‌మెంట్ తీవ్ర గందరగోళానికి దారితీసి తొక్కిసలాట జరిగిందంటున్నారు.

మన దేశం వరకూ చూస్తే తొక్కిసలాటల్లో దాదాపు 80 శాతం మతపరమైన పవిత్ర దినాల్లో, తీర్థయాత్రల్లో ఎక్కువగా జరుగుతున్నట్టు 2013లో ఒక అధ్యయనం తేల్చిచెప్పింది. భారీగా వచ్చిపడే ప్రజానీకాన్ని నియంత్రించటానికి జాతీయ విపత్తు నివారణ ప్రాధికార సంస్థ ఆ ఏడాదే సవివరమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పుడు సాంకేతికత మరింత విస్తరించి సీసీ కెమెరాలు, డ్రోన్‌ల వంటివి అందుబాటులోకొచ్చాయి. వీటి సాయంతో ఎప్పటికప్పుడు కంప్యూటర్ మానిటర్‌లలో పర్యవేక్షిస్తూ అవసరమైన చోటకు బలగాలను తరలించటానికి, చర్యలు తీసుకోవటానికి పుష్కలంగా అవకాశాలున్నాయి. ఎక్కడో మారుమూల అడవుల్లో నక్సలైట్లను అణచడానికి వినియోగిస్తున్నామంటున్న సాంకేతికత దేశ రాజధాని నగరంలో కొలువుదీరిన రైల్వే స్టేషన్‌లో ఎందుకు ఆచూకీ లేకపోయిందో పాలకులు చెప్పగలరా?

విషాదం చోటుచేసుకున్నప్పుడల్లా దాన్ని తక్కువ చేసి చూపటానికి, అంతా నియంత్రణలో ఉందని చెప్పటానికి పాలకులు తెగ తాపత్రయపడుతుంటారు. 2015లో రాజమండ్రిలో తన కళ్ల ముందే పుష్కరాల్లో 29మంది భక్తులు ప్రాణాలు కోల్పోతే చంద్రబాబు ఎంతటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారో ఎవరూ మరిచిపోరు. మొన్నటికి మొన్న తిరుపతి తొక్కిసలాట జరిగినప్పుడూ ఆయనది అదే వైఖరి. ఇప్పుడు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ఉదంతంలోనూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ట్వీట్‌ల ప్రహసనం సైతం అలాగే వుంది. శ్రావణబెళగొళ, స్వర్ణాలయం వంటి చోట్ల ఇంతకు మించి ఎన్నో రెట్లు అధికంగా భక్తులు తరలివస్తారు. కానీ ఎప్పుడూ ఎలాంటి అపశ్రుతులూ చోటు చేసుకో లేదు. ఇందుకు వారు అనుసరిస్తున్న నియంత్రణ చర్యలేమిటో అధ్యయనం చేయాలన్న స్పృహ కూడా ఎవరికీ ఉన్నట్టు లేదు. ఈ విషాదం చెప్పే గుణపాఠాన్ని గ్రహించకపోతే, తప్పు తమది కానట్టు ప్రవర్తిస్తే మళ్లీ మళ్లీ ఇలాంటివే చోటు చేసుకుంటాయి. కమిటీలు, విచారణల తంతు సరే... నిర్దిష్టంగా తాము గ్రహించిందేమిటో, ఇకపై తీసుకోబోయే చర్యలేమిటో ప్రకటిస్తే జనం సంతోషిస్తారు.

గరుడుడి రెక్కలు తొడిగిన ఇస్రో!

విశ్లేషణ



టీవీ వెంకటేశ్వరన్

అంతరిక్ష రంగంలో స్వావలంబన సాధించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేస్తున్న ప్రయత్నాల్లో కీలక ఘట్టం చోటు చేసుకుంది. భారత్ సొంతంగా తయారు చేసుకున్న క్రయోజెనిక్ ఇంజిన్ సీఈ–20ని తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న పరిశోధన శాలలో విజయవంతంగా పరీక్షించారు. అంతరిక్షంలోని శూన్య పరిస్థితులను కృత్రిమంగా సృష్టించి జరిపిన ఈ ప్రయోగం క్రయోజెనిక్ టెక్నాలజీ ప్రస్థానంలో ముఖ్యమైంది. దాని ప్రాముఖ్యం తెలుసుకునేందుకు చిన్న పోలికను చూద్దాం. వాహనం నడిపేటప్పుడు... వాలుగా ఉన్న రహదారి కనిపించిన వెంటనే చాలామంది మోటర్‌ను ఆఫ్ చేస్తూంటారు. గురుత్వాకర్షణ శక్తి ఆధారంగానే వాహనం వేగం పుంజుకుంటుంది. వాలు మొత్తం పూర్తయిన తరువాతే మళ్లీ మోటర్‌ను ఆన్ చేయడం కద్దు. అచ్చం ఇలాగే ఉపగ్రహాలను అంతరిక్షంలో వేర్వేరు కక్ష్యల్లో ప్రవేశపెట్టేందుకు ఇంజిన్‌ను ఆన్/ఆఫ్ చేయాల్సి వస్తూంటుంది. అంగారక గ్రహం పైకి ఇస్రో ప్రయోగించిన 'మంగళయాన్'నే ఉదాహరణగా తీసుకుంటే... ప్రయోగం తరువాత దీని ఇంజిన్‌ను సుమారు పది నెలల విరామం తరువాత ఆన్ చేశారు. ఇలా ఎప్పుడు కావాలిస్తే అప్పుడు ఆన్/ఆఫ్ చేసుకోగల ఇంజిన్ ఇస్రో వద్ద ప్రస్తుతానికి ఒక్కటే ఉంది.

ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి ఏడున జరిగిన ప్రయోగానికి ప్రాధాన్యం ఏర్పడుతుంది. సీఈ–20యూ ఇంజిన్ ప్రయోగంలో... అనుకున్నట్టుగానే పనిచేసింది. రీ స్టార్ట్ చేయాల్సినప్పుడు ఇంధన ట్యాంకుపై ఉండే పీడన పరిస్థితులను అనుకరించి మరీ ప్రయోగం నిర్వహించారు. మరిన్ని ప్రయోగాలు చేపట్టిన తరువాత మాత్రమే దీన్ని ఉపగ్రహ ప్రయోగ రాకెట్లలో ఉపయోగిస్తారు.

బాగా పీడనానికి గురిచేసిన గాలిని ఒక్కసారిగా వదిలామనుకోండి... న్యూటన్ మూడో సూత్రం ప్రకారం గాలి ఉన్న ట్యాంకు వ్యతిరేక దిశగా వేగమందుకుంటుంది. ఇదే పద్ధతిలో వేడి వాయువును ఉత్పత్తి చేసి ఒక చిన్న నాజిల్ గుండా విడుదల చేయడం ద్వారా వాహనాన్ని నడిపించవచ్చు. మండించేందుకు ఇంధనంతో పాటు ఆక్సిజన్ అవసరం ఉంటుంది. వీటినే మనం ఇంగ్లీషులో 'ప్రొపెల్లంట్స్' అని పిలుస్తూంటాం. రాకెట్ ప్రొపెల్లంట్స్ ప్రధానంగా ఘన, ద్రవ, వాయు అని మూడు రకాలు. ఘన ఇంధనం స్థానంలో కిరోసిన్‌ను, దీనికి సరిపోయే ఆక్సిడైజర్ ఒకదాన్నీ వాడుకోవచ్చు. సీఈ–20 ద్రవ ఇంధనంతో నడిచే రాకెట్. వాయువులతో పోలిస్తే ఘన, ద్రవ ఇంధనాలు రెండూ తక్కువ స్థలాన్ని ఆక్రమిస్తాయి. ద్రవంగా ఉన్నప్పటి కంటే నీరు వాయువుగా ఉన్నప్పుడు పదహారు రెట్లు ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంది. ఈ కారణంగానే క్రయోజెనిక్ ఇంజిన్లలో వాడే ఇంధనాన్ని బాగా చల్లబరుస్తారు. సైన్స్ పరిభాషలో మైనస్ 153 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రత (మీథేన్ వాయువు మరిగే ఉష్ణోగ్రత)ను 'క్రయో' అని పిలుస్తారు. 'క్రయోజెనిక్' ఇంధనంగా వాడే ద్రవ హైడ్రోజన్ '–253 డిగ్రీల' ఉష్ణోగ్రతల్లో ఉంటుంది. ద్రవ ఆక్సిజన్ '–183 డిగ్రీల'. ఈ రెండూ కలిసినప్పుడు రసాయనిక చర్య జరిగి ఆవిరి ఉత్పత్తి అవుతుంది.

ఈ వాయువు ఎంత తేలికగా ఉంటే... వేగం పెరగడం అంత ఎక్కువగా ఉంటుంది. హైడ్రోజన్ అత్యంత తేలికైన మూలకం కాబట్టి ఇది సమర్థమైన క్రయోజెనిక్ ఇంధనం. కాబట్టే దీన్ని అంతరిక్ష ప్రయోగాల్లో ఎక్కువగా ఉపయోగిస్తూంటారు. జాబిల్లి లేదా సుదూర గ్రహాలను అందుకునేందుకు ఈ క్రయోజెనిక్ ఇంజిన్లు, ఇంధనాలు బాగా ఉపయోగపడతాయి. భూ వాతావరణానికి అవతల మాత్రమే ఉపయోగించే ఈ క్రయోజెనిక్ ఇంజిన్లతో పనిచేసిన అనుభవం ప్రస్తుతానికి అమెరికా, రష్యా, జపాన్, భారత్, ఫ్రాన్స్, చైనాలకు మాత్రమే ఉంది. భూమి నుంచి వంద కిలోమీటర్లకు అవతల ఉన్న ప్రాంతాన్ని అంతరిక్షం అంటాం. క్రయోజెనిక్ ఇంజిన్లు బాగా సమర్థమంతమైనవే అయినప్పటికీ వీటిని భూమ్మీది నుంచే వాడుకోవడం కష్టతరమవుతుంది. ఎందుకంటే ఇక్కడ గురుత్వాకర్షణ శక్తిని అధిగమించేందుకు చాలా ఎక్కువ బలం కావాలి.

ట్రాఫిక్‌సిగ్నల్‌లో పచ్చలైట్ పడిన వెంటనే మనం ఏం చేస్తాం? వీలైనంత వేగంగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తాం. ఇందుకు మంచి పికప్ ఉన్న ఇంధనం అవసరం. అదే మీరు హైవేపై దూరం వెళుతున్నారనుకోండి... బాగా మైలేజీ ఇచ్చే ఇంజిన్ కావాలి. పెట్రోలు వాహనాలకు పికప్ బాగుంటే... డీజిల్ ఇంజిన్‌కు మైలేజీ ఎక్కువన్నది మనకు తెలుసు. ఇదే మాదిరిగా అంతరిక్ష ప్రయోగాల మొదట్లో జడత్వాన్ని అధిగమించి ఆకాశంలోకి ఎగబాకగలిగే, గురుత్వాకర్షణతో పోటీపడి ముందుకు దూసుకెళ్లే... వాతావరణం తాలూకూ ప్రభావాన్ని అధిగమించగలిగే ఇంజిన్ అవసరం. వీటన్నింటికీ ఘన లేదా ద్రవ ఇంధనాలు బాగుంటాయి. అయితే అంతరిక్షంలోకి చేరిన తరువాత మాత్రం మైలేజీ బాగా ఉండే ఇంజిన్ కావాలి.

గతంలో సోవియట్ యూనియన్, అమెరికాలు రెండూ అత్యంత శక్తిమంతమైన లాంచ్ వెహికల్స్ తయారీలో పోటీపడ్డాయి. ఆ క్రమంలోనే జాబిల్లిని కూడా అందుకున్నాయి. గ్రహాలను దాటగల అంతరిక్ష వాహనాలను సిద్ధం చేయగలిగాయి. 1963లో తొలి క్రయోజెనిక్ రాకెట్ ఇంజిన్ 'ఆర్‌ఎల్–10' ప్రయోగం జరిగింది. ఈ క్రయోజెనిక్‌ను అమెరికా ఇప్పటికీ ఉపయోగిస్తోంది.

సోవియట్ విషయానికి వస్తే... ఇది 'ఆర్‌డీ–56' లేదా '11డీ–56' అనే క్రయోజెనిక్ ఇంజిన్‌ను 1964లో తయారు చేసింది. తరువాతి కాలంలో సెమీ క్రయోజెనిక్ ఇంజిన్ తయారీపై రష్యా దృష్టి పెట్టింది. ఫలితంగా అత్యంత శక్తిమంతమైన, కిరోసిన్, ఆక్సిజన్‌లను ఇంధనంగా వాడుకోగల ఆర్‌డీ–18 ఇంజిన్ తయారైంది. దీంతోపాటే తయారైన మరో మెరుగైన డిజైన్ కలిగిన క్రయోజెనిక్ ఇంజిన్ 'కేవీడీ–1' రష్యా మనకు అమ్మింది. 1990ల నాటికి ఇస్రో కూడా క్రయోజెనిక్ టెక్నాలజీకై ప్రయత్నాలు మొదలుపెట్టింది. జపాన్, అమెరికాలను ఇవ్వమని కోరింది కూడా. అయితే ఇంజిన్లు అమ్మడంతోపాటు తయారీ టెక్నాలజీని కూడా అందించేందుకు సోవియట్ ముందుకు రావడంతో ఇస్రో దానిని అందిపుచ్చుకుంది.

కొంత కాలానికే సోవియట్ కాస్తా ముక్కలయింది. రష్యాపై అమెరికా ఒత్తిడి తీసుకొచ్చి భారత్‌కు క్రయోజెనిక్ టెక్నాలజీ ఇవ్వరాదని కట్టడి చేసింది. ఈ టెక్నాలజీతో భారత్ అణ్వాస్త్రాలు తయారు చేస్తుందన్నది అమెరికా భయం. అయితే ఈ వాదన చాలా అసంబద్ధమైంది. ఎందుకంటే క్షిపణులను అవసరమైనప్పుడు క్షణాల్లో ప్రయోగించేలా ఉండాలి. కానీ ఒక క్రయోజెనిక్ ఇంజిన్‌ను ఆన్ చేయాలంటే కనీసం 24 గంటల ముందు నుంచి దాంట్లో ఇంధనం నింపాల్సి ఉంటుంది. అంతేకాదు... కొన్ని నెలల క్రితమే అధిక ధరలకు ఈ ఇంజిన్లను అమ్మేందుకు అమెరికానే ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో రష్యా తనపై అమెరికా ఒత్తిడిని కాదని ఆరు ఇంజిన్లను మనకు అప్పగించింది. కానీ.. టెక్నాలజీని ఇవ్వలేకపోయింది.

ఈ సమయంలోనే ఇస్రోపై కూడా అమెరికా నిషేధం విధించింది. ఆ పరిస్థితుల్లో ఇస్రో తన వద్ద ఉన్న ఆరు ఇంజిన్లను క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ద్వారా సీఈ–20ని తయారు చేసింది. ఈ డిజైన్ రష్యా ఇంజిన్‌కు నకలు కాకపోవడం విశేషం. ఎందుకంటే రష్యా ఇచ్చిన ఇంజిన్‌లో ఇంధనం మండటం అన్నది దశలవారీగా జరుగుతుంది. సీఈ–20 మాత్రం దీనికి భిన్నం. ఇది గ్యాస్ జనరేటర్ తరహాలో పనిచేస్తుంది. ఏళ్లపాటు కష్టపడి తయారు చేసిన ఈ సీఈ–20ని మొదటిసారి 2017 జూన్ 5న జీశాట్–19 ప్రయోగంలో ఉపయోగించారు. అలాగే చంద్రయాన్–2, 3 లాంచ్ వెహికల్స్‌లోనూ అమర్చారు. తాజా ప్రయోగాల ద్వారా దీన్ని అవసరమైనప్పుడు ఆన్/ఆఫ్ చేసే సామర్థ్యం అందడంతో భవిష్యత్తులో ఈ ఇంజిన్‌ను గ్రహాంతర ప్రయాణాలకూ వాడుకునే వీలు ఏర్పడింది.

వ్యాసకర్త విజిటింగ్ ప్రొఫెసర్, ఐసర్ – మొహాలీ

భారత్ సొంతంగా తయారుచేసుకున్న సీఈ–20 క్రయోజెనిక్ ఇంజిన్ ప్రయోగం



◆ భూవాతావరణానికి అవతలే ఉపయోగించే ఈ క్రయోజెనిక్ ఇంజిన్లతో పనిచేసిన అనుభవం ప్రస్తుతానికి అమెరికా, రష్యా, జపాన్, భారత్, ఫ్రాన్స్, చైనాలకు మాత్రమే ఉంది.

◆ ఇస్రో తన వద్ద ఉన్న 6 ఇంజిన్లను అధ్యయనం చేసి, ఈ సీఈ–20ని తయారు చేసింది. మానవ సహిత అంతరిక్ష ప్రయోగాల్లోనూ ఈ ఇంజిన్ భారతీయ వ్యోమగాములు కక్ష్యలోకి చేరేందుకు ఉపయోగపడనుంది. భవిష్యత్తులో ఈ ఇంజిన్‌ను గ్రహాంతర ప్రయాణాలకూ వాడుకొనే వీలు ఏర్పడింది.

సోషల్ మీడియా

'రూట్' కెనాల్ చికిత్స



రణ్‌వీర్‌ను అరెస్ట్ చేసి, ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయటానికి బదులుగా... ఓటీటీ, యూ ట్యూబ్‌లలో అసభ్యకరమైన కంటెంట్‌ను నియంత్రించటానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోండి. దీనిపై ప్రజలలో విస్తృతమైన వ్యతిరేకత ఉంది కనుక వారు అలాంటి చట్టాలకు సంతోషంగా మద్దతు ఇస్తారు. (యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా 'ఇండియాస్ గాట్ ట్యాలెంట్ షో'లో చేసిన అనుచిత వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకడం పైన).

– రిషీ బగ్రీ, ట్విట్టర్ ఇన్‌ఫ్లుయెన్సర్

రెండు సమస్యలు



బెంగళూరు ప్రజలు అద్భుతమైనవారు. వారు ఎల్లప్పుడూ ఆప్యాయంగా ఆతిథ్యం ఇచ్చేవారు. అక్కడి ట్రాఫిక్ అయితే నరకంలో ప్రయాణించడం లాంటిది. మంచి పౌరులు కచ్చితంగా మెరుగ్గా ఉండాలి. ట్రాఫిక్ సమస్యనూ, ఆర్సీబీ-ఐపీఎల్ చిక్కుముడినీ (ఆర్సీబీ ఇంతవరకు ఒక్క ఐపీఎల్ కూడా గెలవలేదు) పరిష్కరించేవారు ప్రతి బెంగళూరు వాసిలోనూ ప్రత్యేక స్థానం పొందాలి.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ జర్నలిస్ట్

ఇలా ఉంటుందా!!!



వావ్... భూకంపాన్ని ఎప్పుడూ నేను అనుభూతి చెందలేదు. ఇది నన్ను మేల్కొలిపింది. దీని వల్ల ఎక్కువ హాని జరగలేదని ఆశిస్తున్నాను. (సోమవారం తెల్లవారుజామున ఢిల్లీ, పరిసర ప్రాంతాలలో భూమి కాస్త తీవ్రంగా కంపించడంపై).

– అద్వైత కళ, ఫీచర్ కాలమిస్ట్

మొదట ఇంట్లో గెలవండి



సో... ఈ బుద్ధిహీనుడు కీర్ స్టార్మర్ ఉక్రెయిన్‌కు బ్రిటిష్ దళాలను పంపాలనుకుంటున్నాడా!! ఇతడు, ఇంకొక 'తెలివితెల్లారినాయన' (లండన్ మేయర్) సెంట్రల్ లండన్‌ను సురక్షితంగా ఉంచలేకపోతున్నారు కానీ, ఉక్రెయిన్‌ను రక్షించాలని ఉబలాట పడుతున్నారు.

– సుహేల్ సేథ్, రచయిత-నటుడు

ఇన్ బాక్స్

పునః సమీక్షించుకోవాలి!

గత శనివారం రాత్రి ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో మోగిన మరణ మృదంగం రైల్వే మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ! ఒక ప్లాట్‌ఫారం మీదకు రైలు వస్తుందని ఎదురు చూస్తున్న ప్రయాణికులు వేరే ప్లాట్ ఫారం మీదకు ఆ రైలు వస్తుందని ఎనౌన్స్‌మెంట్ రావడంతో పరుగులు తీశారు. తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రయాణికుల నియంత్రణ వ్యవస్థ, భద్రతా వైఫల్యాల కారణంగా ఈ ఘోరం చోటుచేసుకుంది. అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇక ప్రభుత్వం సంగతి చెప్పాల్సిన పనే లేదు. ఒడిశాలో జరిగిన ఘోర రైల్వే ప్రమాదం కారణంగా భారీగా మరణాలు సంభవించినపుడు కాని, అంతకు ముందు ప్రమాదాల్లో మృతి చెందినప్పుడు కాని, మొన్నటి కుంభమేళాలో 30 మంది మరణించిన తర్వాత కానీ చూసినప్పుడు... ప్రభుత్వం ముందు సమాచారాన్ని దాటేయడం (దాచిపెట్టడం), ఆ తర్వాత అంగీకరించడం కనిపిస్తోంది. గతంలో మన లాల్ బహదూర్ శాస్త్రి లాంటి వారు, చివరికి నితీశ్ కుమార్ సైతం రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసిన దాఖలాలు ఉన్నాయి. కానీ ఇప్పటి రైలు మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఇటువంటి నైతిక బాధ్యత గుర్తుకు రావడం లేదు.

ఇంత ఘోరం జరిగినా ఢిల్లీలో కనీసం కంట్రోల్ రూం ఏర్పాటు చేయలేదు. ముందస్తు జాగ్రత్త చర్యలు లేవు. ఇటీవల ఒక స్టేషన్‌లో రైలుబోగీ అద్దాలను పగుల గొడుతూ, బోగీలో ఉన్నవాళ్ళ మీద బయట నుంచి కిటికీల ద్వారా దాడులు చేసిన సంఘటనలు చూశాము. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, రైల్వే మంత్రి, ఆ శాఖ పీఆర్‌ఓ వంటివారు సంఘటన మీద ఒక్కో టైంలో ఒక్కో రకంగా స్పందించారు. నిజానికి ఢిల్లీలోని లోక్ నాయక్ ఆసుపత్రిలోనికి ప్రెస్‌ను కాదు కదా, బాధితుల కుటుంబ సభ్యులను కూడా అనుమతించలేదు. మృతుల సంఖ్య ఎక్కువగా ఉండవచ్చు, అంటున్నారు. గాయపడ్డ వారి సంఖ్య 50 దాటింది అంటున్నారు. కేంద్రం ఎందుకు నిజాన్ని దాచడానికి ప్రయత్నిస్తున్నదో అర్థం కాదు.

పేదవాడి ప్రయాణ సాధనంగా రైలుకు పేరు. అటువంటి రైలు ప్రమాదాలు, తత్సంబంధ దుర్ఘటనల్లో అత్యధికంగా ప్రాణాలు కోల్పోయేదీ, నష్టపోయేది కూడా పేదలే. ఒక ప్రమాదం జరగగానే హడావిడిగా నష్ట పరిహారం ప్రకటించి చేతులు దులుపుకొంటున్నది ప్రభుత్వం. ఇటీవల రైలులో సాధారణ బోగీలు తగ్గించి రిజర్వేషన్ బోగీలు పెంచడం; అలాగే పేదవారికి అందుబాటులో లేని సూపర్ ఫాస్ట్ రైళ్ల సంఖ్యను పెంచి ప్యాసింజర్ రైళ్లను తగ్గించడం ప్రభుత్వ విధానంగా మారిపోయింది. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీటవేస్తూ ప్రభుత్వం తన విధానాన్ని పునఃసమీక్షించుకోవాలి.

– ఎండి. మునీర్, సామాజిక-రాజకీయ విశ్లేషకుడు

ఆదివాసీ చట్టం రద్దుకు కుట్రలు!

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

కేంద్ర ప్రభుత్వ మద్దతుతో ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం 1/70 చట్టాన్ని రద్దు చేసి, గిరిజనుల హక్కులను హరించేందుకు సన్నద్ధమైంది. 'ఈ చట్టం ఉంటే మన్యం ప్రాంత అభివృద్ధి చెందద'ని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు అందులో భాగమే!

అడవి, అటవీ భూములు, అందులోని వనరులపై తరతరాలుగా వస్తున్న ఆదివాసీ గిరిజనుల హక్కులను హరించటానికి వలస పాలకుల నుంచి దేశీయ పాలకుల వరకు అనేక గిరిజన వ్యతిరేక చట్టాలు చేశారు. 1855లో భారత గవర్నర్ జనరల్ డల్హౌసీ తొలి గిరిజన వ్యతిరేక అటవీ విధానాన్ని ప్రకటించి, అటవీ సంపదలన్నీ ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించాడు. 1864లో అటవీ ఇన్‌స్పెక్టర్ జనరల్ నియామకంతో అడవిపై బ్రిటిష్ ప్రభుత్వ పెత్తనం ప్రారంభమైంది. 1865లో ఓ చట్టం ద్వారా పూర్తిగా అడవులను తన అధీనంలోకి తెచ్చుకుంది. అధికార మార్పిడి తర్వాత దేశీయ పాలకులు, వలస పాలకుల విధానాలనే కొనసాగించారు. 1952లో ప్రకటించిన అటవీ విధానం దాని కొనసాగింపే! 1973లో 'టైగర్ ప్రాజెక్టు' పేరుతో గిరిజనులను అడవి నుండి వెళ్ళగొట్టేందుకు పూనుకుంది. 1980లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన గిరిజన వ్యతిరేక చట్టం అడవి నుండి గిరిజనులను ఖాళీ చేయించే చర్యలు తీసుకుంది. 2023లో మోదీ ప్రభుత్వం 'అటవీ హక్కుల సవరణ చట్టం' ద్వారా అటవీ భూములను బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టే విధానాలు చేపట్టింది. షెడ్యూల్డ్ ఏరియా భూ బదలాయింపు నిబంధనల చట్టం –1959 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆ ఏడాది మార్చి 4న అమల్లోకి వచ్చింది. ఈ చట్టం గిరిజనుల భూములను, 1963 కంటే ముందు నుంచి స్థానికంగా ఉండి, భూమి హక్కులు కలిగిన గిరిజనేతరుల భూములను కూడా కాపాడుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 (1) ప్రకారం 5వ షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించిన వాటిల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతంలో ఉమ్మడి అదిలాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాలు కూడా ఉన్నాయి. తెలంగాణ ప్రాంతంలో ఈ చట్టం 1963లో అమల్లోకి వచ్చింది. దీనికి కీలక సవరణలు 1970లో జరిగాయి కనుక ఈ చట్టం '1/70'గా ప్రాచుర్యంలో ఉంది.

శ్రీకాకుళం గిరిజన ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల భూమి సమస్యను ముందుకు తెచ్చింది. గిరిజన పోరాటాలు ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా చూసేందుకు ప్రభుత్వమే గిరిజనులకు



భూములు ఇచ్చి వారి హక్కులకు రక్షణ కల్పిస్తుందనే భ్రమలు కల్పించటానికి ఆనాటి బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం 1970లో 1/70 చట్టాన్ని చేసింది. ఈ చట్ట ప్రకారం గిరిజన ప్రాంతాల్లో భూమిపై పూర్తి హక్కు గ్రామ సభలకు, పంచాయితీలకు, గిరిజన సలహా మండలికి ఉంటుంది. గిరిజన ప్రాంతాల్లో సెంటు భూమి సేకరించాలన్నా గ్రామ సభ, పంచాయితీ తీర్మానం అవసరం. ఈ తీర్మానం గిరిజన సలహా మండలికి పంపుతారు.

1/70 సెక్షన్ –3 ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని అన్ని అటవీ సంపదలు, భూములు కేవలం గిరిజనులకు గాని లేక గిరిజనులు సభ్యులుగా ఉన్న సొసైటీకి మాత్రమే చెందుతాయి. అందుకు విరుద్ధంగా గిరిజనేతరులు భూములు పొందితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయి. 5వ షెడ్యూల్‌లో ఉన్న అటవీ భూములను ప్రైవేట్ మైనింగ్ కంపెనీలకు లీజుకు ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వం. దీనిపై 1997 జూలైలో సుప్రీమ్ కోర్టు త్రిసభ్య ధర్మాసనం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రైవేట్ మైనింగ్ కంపెనీలకు ప్రభుత్వ లేదా దాని సంస్థలు లీజుకి ఇచ్చిన భూములు చెల్లవని తీర్పు ఇచ్చింది. 'పీసా' చట్టం కూడా ప్రతి ఆదివాసీ సమూహానికి, తమ గ్రామ పరిధిలోని సహజ వనరులపై హక్కు గ్రామ సభలకు మాత్రమే ఉందని స్పష్టం చేసింది.


చట్ట సవరణ ప్రయత్నాలు

గిరిజనులకు చెందాల్సిన అటవీ భూములను, బహుళజాతి సంస్థలకు, గిరిజనేతరులకు కట్ట పెట్టేందుకు 1996-2001 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో 1/70 చట్ట సవరణకు నాటి సీఎం చంద్రబాబు దగ్గర నుండి శాసనసభ కమిటీల నివేదికల దాకా అనేక ప్రయత్నాలు జరిగాయి. 2000లో చింతపల్లి బాక్సైట్ తవ్వకాల కోసం 'రస్ అల్ ఖైమా' బహుళజాతి సంస్థకు బాబు ప్రభుత్వం అనుమతించింది. వేలాది ఎకరాలు అప్ప గించేందుకు సిద్ధమయింది. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు రావడంతో బాబు ఆ ప్రయత్నాలను విరమించుకున్నారు. గత చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగానే 1/70 చట్టం గురించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. గిరిజన ప్రజలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమించడంతో ప్రభుత్వం '1/70 చట్టాన్ని రద్దు చేయబోమ'ని చంద్రబాబే స్వయంగా ప్రకటన చేయాల్సి వచ్చింది. ఇది మోసపూరిత ప్రకటనే. రద్దు అనే కత్తి చట్టంపై వేలాడుతూనే ఉంది. కూటమి ప్రభుత్వ మోసాలను గమనించి 1/70 చట్టాన్ని సవరించే చర్యలను వ్యతిరేకిస్తూ, చట్టంలో ఉన్న లొసుగులను తొలగించాలనీ, అటవీ హక్కుల సవరణ చట్టాన్ని మోదీ ప్రభుత్వం రద్దు చేయాలనీ అన్ని వర్గాల గిరిజనులు ఉద్యమించాలి.

వ్యాసకర్త రైతు కూలీ సంఘం ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు । 98859 83526

భోజనంలో జీవన తత్త్వం

భోజనం చేసేటప్పుడు ఎప్పుడూ పదార్థాలను ఒకే వరుస క్రమంలో తినడంలో ఉన్న తాత్త్వికతను వివరించారు కంచి పరమాచార్య ఓమారు భక్తులతో: "విస్తరాకు వేయడంతోనే అది చూడ్డానికి పచ్చగా ఉందని మైమరచిపోకూడదని విస్తరాకులో నీరు చల్లుతారు. అనంతరం పాయసం, దానికి ఎదురుగా పచ్చడి ఎందుకు వేస్తారో తెలుసా? పాయసంతో పుట్టిన శ్రీరాముడిని, పెరుగు – వెన్న ప్రియుడైన శ్రీకృష్ణుడిని అవి తింటున్నప్పుడు తలవడం కోసం!



అన్నంలో తరువాత పులుసు కలుపుకుంటాం కదా... దానిలోని బెండకాయ, గుమ్మడికాయ, వంకాయ ముక్కలో; మునక్కాడలో మన మనసులోని 'నేను' అనే భావానికి ప్రతీకలు. మనమందరం పుట్టి పెరిగే క్రమంలో మనలో 'నేను' అనేది ఓ విస్తరేసి కూర్చుంటుంది. అది మనసులోని 'అహంకారం. దాని వల్ల మనం స్థిరంగా ఉండలేం. అంతా గందరగోళం. దానిని ఒకింత ప్రదర్శించాక తదుపరి దశకు పోతాం. అక్కడప్పుడు 'నేను' అనేది పోయి స్పష్టత ఏర్పడుతుంది కదా! అది చారు లాంటి మానసిక స్థితి. నేను అనేది అంతరించిపోయి స్పష్టమైన చారు లాంటిది మనసులో పుడుతుంది. అది వచ్చాక అన్నీనూ పాయసంగానూ (తీపి పదార్థంగా) అవుతాయి. చివరగా మజ్జిగన్నమో, పెరుగన్నమో తింటారు. ఇంతకూ మజ్జిగ ఎలా లభిస్తోంది? పాలు నుంచి పెరుగు వస్తుంది. అందులోంచి వెన్న, దానిని కాచడంతో నెయ్యి లభిస్తుంది. ఇదంతా అయిన తర్వాత మిగిలేది మజ్జిగ. ఇక మజ్జిగ నుంచి మరేదీ తీయలేం. అంటే మజ్జిగ తర్వాత మరొకటి లేదు.

ఈ భోజన సంప్రదాయం నుంచి ఏమర్థమవుతోంది? మనం అహంకారాన్ని విడిచిపెట్టి, (తేట) చారు లాంటి జీవితాన్ని అనుభవించి, ఎవరికీ ఏ ఉపద్రవమూ కలిగించకుండా అందరి పట్ల మధురంగా ఉంటూ... అంతిమంగా పరమాత్మను చేరితే ఆ తర్వాత మరో జన్మంటూ ఉండదు. ఇది చివరి అధ్యాయం. ఇది అందరికీ తెలియాలి. ప్రతి రోజూ భోజనం చేసేటప్పుడు ఇది గుర్తుకు రావాలి. పరమాత్మ పాదపద్మాలను పట్టుకోవాలి. అటువంటి ఉన్నతమైన ఆలోచనతోనే మనం రోజూ తినే భోజనపద్ధతినే మన జీవన తత్త్వంగా చేసుకోవాలి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.షష్ఠి తె.4.44 వరకు (తెల్లవారితే బుధవారం) తదుపరి సప్తమి, **నక్షత్రం:** స్వాతి పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ఉ.11.53 నుండి 1.37 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.48 నుండి 9.36 వరకు, తదుపరి రా.11.02 నుండి 11.50 వరకు, **అమృత ఘడియలు:** రా.10.27 నుండి 12.12 వరకు, **అమృత ఘడియలు:** ప.12.28 నుండి 2.03 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.30, **సూర్యాస్తమయం:** 5.55.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఆలివ్ బిస్ట్రోపబ్‌లో రేవ్ పార్టీ

మాదాపూర్: మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం 20 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని ఆలివ్ బిస్ట్రోపబ్‌లో డ్రగ్స్ తీసుకుంటున్నట్టు పక్కా సమాచారం రావడంతో పబ్‌పై దాడి చేసినట్టు వెల్లడించారు. 20 మందికి మూత్ర పరీక్షలు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్టు చెప్పారు. 22 ఏళ్ల యువకుడికి పాజిటివ్ రావడంతో విచారించగా గత నెలలో తాను థాయ్‌లాండ్‌కు వెళ్లినట్లు తెలిపాడన్నారు. అక్కడ బిస్కెట్స్ తిన్నానని అందులో డ్రగ్స్ ఉన్నట్టు తెలియదని చెప్పడంతో పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ సెంటర్‌కి తరలించారు.

అన్నల ఇలాకాలో కంపెనీల పాగా..

కార్మికులకు రూ.కోట్ల విలువ చేసే షేర్లు.. వారికి యాజమాన్యంలో చోటుకల్పించేలా కార్యకలాపాలు

గడ్చిరోలిలో లాయిడ్ మెటల్స్ అండ్ ఎనర్జీ కొత్త ప్రయోగం.. కార్మికుల్లో మాజీ మావోయిస్టులు కూడా..

సాక్షి, బిజినెస్ బ్యూరో: మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనూ పారిశ్రామిక, వ్యాపార కార్యకలాపాలను నిర్వహించేందుకు కంపెనీలు వినూత్న వ్యూహాలు పాటిస్తున్నాయి. తుపాకులను పక్కన పెట్టి జన జీవన స్రవంతిలో కలిసే విధంగా మావోయిస్టులను కూడా ప్రోత్సహించేలా కృషి చేస్తున్నాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ అనే కంపెనీ కొత్త ప్రయోగాలు చేస్తోంది. ఇందులో భాగంగా కార్మికులకు యాజమాన్యంలో చోటుకల్పించేలా ఏకంగా రూ.కోట్ల విలువ చేసే స్టాక్ ఆప్షన్లను అందిస్తోంది.

తొలినాళ్లలో బోలెడు అవరోధాలు..

లాయిడ్ మెటల్స్ అండ్ ఎనర్జీ సంస్థ 2021లో గడ్చిరోలిలో ముడి ఇనుము మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించింది. తొలినాళ్లలో బోలెడన్ని అవరోధాలు. మావోయిస్టుల దుశ్చర్యలు, ఎగ్జిక్యూటివ్‌ల కిడ్నాప్‌లు ఇలా రకరకాల సవాళ్లను ఎదుర్కొనాల్సి వచ్చింది. అయినప్పటికీ పట్టువదలకుండా కంపెనీ ముందుకు సాగడంతో 2021–24 మధ్య కాలంలో ఆదాయం 24%ఎగిసి రూ.6,575 కోట్లకు చేరింది. కార్యకలాపాలను కంపెనీ మరింతగా విస్తరించేందుకు ప్రణాళికలు రచించింది. ఇందు కోసం గతంలోనే తమ ఉద్యోగుల కోసం 1.1 కోట్ల షేర్లతో ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ (ఎసాప్స్) పూల్ ఏర్పాటు చేసింది. వీటి విలువ దాదాపు రూ.1,000 కోట్లు. ఇందులో నుంచి ఇప్పటివరకు అధికారులు, ఉన్నత స్థాయి ఉద్యోగులకే కేటా యిస్తూ వస్తుండగా.. గత నెలలో కార్మికులకు కూడా 'ఎసాప్స్' అందించింది. 6,000 మంది కార్మికులకు 42,800 షేర్లను నామ మాత్రపు ధర రూ.4కి అందించింది. షేరు ధర ప్రకారం వీటి విలువ రూ.5.8 కోట్లుగా ఉంటుంది. దాని అనుబంధ సంస్థ లాయిడ్ ఇంజినీరింగ్ వర్క్స్ కూడా సుమారు రూ.5.6 కోట్ల విలువ చేసే స్టాక్ ఆప్షన్స్ కేటాయించింది. పని చేసిన వ్యవధిని బట్టి కార్మికులకు షేర్లు లభించాయి. ఒక వృద్ధ కార్మికుడికి ఏకంగా రూ.1.25 కోట్ల విలువ చేసే 10,000 షేర్లు దక్కాయి. ఐటీ కంపెనీలు, కొత్త తరం స్టార్టప్‌లలో తప్ప మెటల్స్, మైనింగ్ పరిశ్రమల్లో ఇలాంటి ఎసాప్స్ ధోరణి ఎక్కువగా కనిపించదని కంపెనీ నిపుణులు చెప్పారు. ఇక కార్మికులకు కేటాయించడమనేది మరింత అరుదన్నారు.



47 మంది మాజీ మావోయిస్టులు

'ఎసాప్స్' అందుకున్న వారిలో 47 మంది మాజీ మావో యిస్టులు కూడా ఉన్నారు. ఉద్యోగులను కంపెనీ యాజ మాన్యంలోనూ భాగం చేయాలనే తలంపు నుంచే స్టాక్ ఆప్షన్స్ ఆలోచన పుట్టింది. ఇలా ఏడేళ్లుగా ఉద్యోగులకు ఎసాప్స్ ఇస్తున్నాం. 10–12 మంది ఉద్యోగులతో మొదలుపెట్టి రెండేళ్ల క్రితం వైట్‌–కాలర్ ఉద్యోగు లందరికీ దీన్ని విస్తరించాం. ఈ ఏడాది మొత్తం కార్మికులందరికీ ఇచ్చాం. ఏడేళ్ల క్రితం 1.1 కోట్ల షేర్లతో ఏర్పాటు చేసిన ఎసాప్స్ పూల్‌లో చాలా మటుకు కేటాయించగా ప్రస్తుతం 1,70,000 షేర్లు ఇంకా మిగిలి ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ. 23 కోట్లు. –రాజేశ్ గుప్తా, లాయిడ్ మెటల్స్ అండ్ ఎనర్జీ ఎండీ

ఆత్మహత్యకు అనుమతించండి

- ఓ ఎస్సై, అతని కుటుంబసభ్యులు 'దారి'వ్వట్లేదు..
- కలెక్టరేట్ ఎదుట వృద్ధ దంపతుల ఆందోళన



ఫ్లెక్సీతో కలెక్టరేట్ ఎదుట సులోచన, ప్రతాప్‌రెడ్డి దంపతులు

భూపాలపల్లి: 'ఓ ఎస్సై, అతడి కుటుంబసభ్యులు మా పొలంలోని వెళ్లనివ్వకుండా దారిని తొలగించారు. పైగా కేసులు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి అనుమతించా'లంటూ వృద్ధ దంపతులు సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ భవనం ఎదుట ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ అధికారులను వేడుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన నంది సులోచన, ప్రతాప్‌రెడ్డి దంపతులకు 12 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి వెళ్లడానికి దారి ఉండగా, రెండున్నరేళ్లుగా కన్నాయిగూడెం ఎస్సై (ములుగు జిల్లా)గా పనిచేస్తున్న ఇనిగాల వెంకటేష్, అతడి సోదరుడు, తండ్రి కలిసి సదరు మార్గాన్ని మూసివేశారని దంపతులు ఆరోపించారు. 'దీనిపై హైదరాబాద్ వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, భూపాలపల్లి ఆర్డీవో రమాదేవి విచారణ చేపట్టి దారి మూసివేసిన విషయాన్ని నిర్ధారించారు. అయినా, ఎస్సై వెంకటేష్, అతని బంధువులు దారివ్వకపోగా, మాపై అక్రమ కేసులు బనాయించారు. మూడేళ్లుగా పొలానికి వెళ్లలేక వ్యవసాయం చేయట్లేదు' అని ఆ దంపతులు వాపోయారు. ఎస్సై బాధలు తట్టుకోలేకపోతున్నామని, ఆత్మహత్యకు అనుమతి ఇవ్వాలని సులోచన, ప్రతాప్‌రెడ్డి కోరారు. కలెక్టర్ రాహుల్‌శర్మ అందుబాటులో లేకపోవడంతో ఆర్డీవో రవి వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

రూ.50 వేలకో గురుకుల సీటు

- రూ.150 కోట్ల వరకు వసూలు చేసిన మధ్యవర్తులు
- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం కూడా వసూళ్లు
- ధ్రువీకరణ పత్రాలు సమర్పించని విద్యార్థులు 40 శాతం
- ఎస్సీ గురుకుల సొసైటీ పరిశీలనలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి కొందరు మధ్యవర్తులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఎస్సీ గురుకుల సొసైటీ పరిశీలనలో తేలింది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీకి వచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదులపై చేపట్టిన విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగు చూశాయి. గురుకుల విద్యా సంస్థల్లో సీట్లు ఇప్పిస్తామంటూ చాలా ప్రాంతాల్లో మధ్యవర్తులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు అధికారులు మీడియాకు తెలిపారు. ఒక్కో సీటు కోసం గరిష్టంగా రూ.50 వేలవరకు వసూలు చేసినట్లు గుర్తించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రూ.150 కోట్ల మేర వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. కొందరైతే గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘాల పేరుతో ఈ దందా కొనసాగిస్తున్నారు.



ధ్రువీకరణ పత్రాలే లేవు

ఎస్సీ గురుకుల సొసైటీలో చదువుతున్న విద్యార్థుల్లో 40 శాతం మంది ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదని తేలింది. 30 శాతం మంది కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించలేదు. కొందరు విద్యార్థులు వీటికోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోగా, వాటిని ఇప్పించేందుకు కూడా మధ్యవర్తులు పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు గుర్తించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 75 శాతం సీట్లు ఆయా వర్గాలకే కేటాయిస్తారు. ఈ కేటగిరీల్లో మిగిలిపోయిన సీట్లను పైరవీకారులు ప్రజాప్రతినిధుల లేఖలతో చేజిక్కించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు తప్పనిసరిగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ఎస్సీ గురుకుల సొసైటీ స్పష్టం చేసింది. ఆదాయ ధ్రువీకరణ పత్రాల్లో గ్రామీణ విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షలకు మించొద్దు. 2025–26 విద్యా సంవత్సరంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించినవారికే అడ్మిషన్లు ఇస్తామని అధికారులు స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

- రూ.కోటి వరకు అప్పులు.. తీర్చలేక ఆత్మహత్య



సంజయ్

కామారెడ్డి క్రైం: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన ఓ యువకుడు.. అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లికి చెందిన దేవుల సంజయ్ (28) ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొద్ది రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం అప్పులు చేశాడు. ఆరు నెలల కిందట అప్పుల విషయంలో భార్యా భర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపో యింది. అప్పులు సుమారు రూ. కోటి వరకు చేరుకోవడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియక, జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని దేవుని పల్లి ఎస్సై రాజు తెలిపారు.

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ

టెండరు ప్రకటన నం.09/COMM/HYDRAA/2025, తేది: 17.02.2025

శాఖ: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ – తెలంగాణ, కమిషనర్ హైడ్రా. విషయం: DRF ఎక్విప్‌మెంట్ సేకరణ – హైడ్రా. బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ, సమయం: 18.02.2025న ఉ.11.00 గం.కు. బిడ్ దాఖలుకు ముగింపు తేదీ, సమయం: 25.02.2025న మ.3.00 గం.వరకు. సాంకేతిక మూల్యాంకనం ప్రారంభ తేది: 25.02.2025న మ.3.30 గం.కు. ధర/ఆర్థిక బిడ్ తెరుచు తేది: 25.02.2025న సా.6.00 గం.కు. వివరాలు www.eprocurement.telangana.gov.inలో లభిస్తాయి. సంప్రదించాల్సిన అధికారి: MTO, హైడ్రా, తెలంగాణ, సికింద్రాబాద్. మొబైల్ నం.: +91 8712596725

సం/– కమిషనర్, హైడ్రా, సికింద్రాబాద్, తెలంగాణ

DIPR RO No.10367-PP/CL/Advt/1/2024-25, Dt. 17.02.2025

TELANGANA CO-OPERATIVE MARKETING FEDERATION LTD.,
5-2-68, 3rd Floor, Mahatma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderabad -500095
E.mail: proc.tsmarkfed2018@gmail.com, Ph: 040-24607108

TGMF-PROC/GUNY/6/2024-PROC.Section Date: 17-02-2025

TENDER NOTIFICATION

Invited Online sealed e-tenders in two bid systems (i.e Technical and Financial Bid) for the Suppliers to supply Once used sound empty gunnies bags for packing of 50kg pulses (B twill & A-twill) procured under MSP during Yasangi for the year 2024-25 seasons in all the Erst. While Districts of Telangana State. **A)** Once used sound 50kg Gunny bag should not weigh less than 580 gms and should have a dimensions of 94 X 57 cms(L X W) for packing of 50 Kg of agriculture produces like(Green gram, Black Gram, Soyabean, Bengal gram, Maize and Jowar). **B)** Once used sound A-twill 50 kg Gunny bag should not weigh less than 900gms, dimensions of 111*67 cms (L X W) for packing of 50 Kg of sunflower/ 35 kg Groundnut seeds. **Tender document can be downloaded from 18-02-2025 from 3.00 PM through the web-site. https://tender.telangana.gov.in,** a. Bid submission start date: 18-02-2025 from 3.00 PM, b. Bid submission end date: 27-02-2025 upto 5.00PM., c. Opening of Technical bid date: 28-02-2025 from 11.00AM., d. Opening of Financial Bid date: 28-02-2025 from 3.00 PM., For further details please contact. Ph: 7288879806, and 7288879824, E Mail: proc.tsmarkfed2018@gmail.com.

DIPR RO No.10343-PP/CL/Advt/1/2024-25, Dt. 17.02.2025 Sd/- Managing Director

ఇంటి ముంగిటకే ఇసుక

- గనులు, భూ గర్భవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్
- ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ కోసం 24 గంటల పాటు స్లాట్లు
- ఫిర్యాదులకోసం టోల్ ఫ్రీ నంబర్లు



సాక్షి, హైదరాబాద్: ఇంటి ముంగిటకే ఇసుకను సరఫరా చేసే వ్యవస్థకు రూప కల్పన చేస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. శ్రీధర్ వెల్లడించారు. అవసరాలకు సరిపడా ఇసుకను అందుబాటులోకి తేవడం ద్వారా ఇసుక వెలికితీత, రవాణాలోఅక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని ప్రకటించారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాలని సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సమీక్ష అనంతరం గనుల శాఖ డైరెక్టర్ శశాంక్, టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్‌తో కలసి శ్రీధర్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. 'ఇసుక అక్రమ రవాణా, ఓవర్ లోడింగ్, అనుమతులు లేకుండా తవ్వకాలను అరికట్టి, అందరికీ అందుబాటు ధరల్లో ఇసుక లభ్యత కోసం చర్యలు చేపట్టాం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇసుకకు ఎక్కువగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఔటర్ రింగు రోడ్డు నుంచి వచ్చే పది మార్గాల్లో పటిష్ట నిఘా పెట్టి ఇప్పటి వరకు 162 కేసులు నమోదు చేసి, 131 వాహనాలను సీజ్ చేశాం. రీచ్‌ల వద్ద అధికారులు తనిఖీలు చేయడంతో పాటు, ఇసుక రవాణా చేస్తున్న 40 వేల లారీల యజమానులకు అక్రమ రవాణా చేయకుండా అవగాహన కల్పిస్తున్నాం'అని శ్రీధర్ ప్రకటించారు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్లు

'ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేస్తున్నాం. 9848094373, 7093914343 నంబర్లకు ఫిర్యాదులు చేయొచ్చు. రవాణా చార్జీలు కలుపుకుని టన్ను ఇసుకను రూ.1,600 మించకుండా విక్రయించేలా చర్యలు చేపడుతున్నాం. త్వరలో లారీలను ఎంప్యానెల్ చేసి, వినియోగదారుల ఇంటి ముంగిటకు ఇసుకను చేరవేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం'అని శ్రీధర్ వివరించారు. హైదరాబాద్ నగర శివార్లలో నాలుగైదు స్టాక్‌యార్డులు ఏర్పాటు చేసి, రిటైల్ విక్రయదారులు కూడా వే బిల్లుల ద్వారా సరఫరా చేసేలా వ్యవస్థను రూపొందిస్తామని చెప్పారు. నీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న ఐదు ఇసుక రీచ్‌లను కూడా టీజీఎండీసీ అధీనంలోకి తీసుకుని వెలికితీత, రవాణా జరిగేలా చూస్తామని ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ కోసం 24 గంటల పాటు స్లాట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఇసుక రవాణా కోసం స్టాక్‌యార్డుల వద్ద మూడు షిఫ్టుల్లో సిబ్బంది పనిచేస్తారని చెప్పారు.

తుది ఆదేశాలిచ్చేవరకు నిర్మాణాలొద్దు

- విశ్వ, బలిజ, కాపు, తెలగ, వొంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తాము తుది ఉత్తర్వులు జారీ చేసే వరకు ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని విశ్వ, బలిజ, కాపు, తెలగ, వొంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 7కు వాయిదా వేసింది. కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య, ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్‌కు భవనాల నిర్మాణం కోసం 5 ఎకరాల చొప్పున హైటెక్ సిటీ సమీపంలో విలువైన భూములు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎ.వినాయక్ రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. అలాగే ఇదే ప్రాంతంలో విశ్వ, బలిజ, కాపు, తెలగ, వొంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు 6.35 ఎకరాలను కేటాయించడాన్ని సవాల్ చేస్తూ మరో పిల్ దాఖలైంది. ఈ పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. గతంలో కమ్మ, వెలమ సంఘాలకు ఇచ్చిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఇదే హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, ఆ ఉత్తర్వులను విశ్వ, బలిజ, కాపు, తెలగ, వొంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్యకు కేటాయించిన భూమిపై కూడా వర్తింపజేయాలని పిటిషనర్ న్యాయవాది కోరారు.

చెన్నూరు గురుకులంలో ర్యాగింగ్

- ఒక విద్యార్థిపై ఏడుగురు దాడి.. వీడియో తీసి బెదిరింపు




దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న బాధిత విద్యార్థి తండ్రి, బంధువులు

చెన్నూర్: యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలకే పరిమితమైన ర్యాగింగ్ భూతం ఇప్పుడు గురుకుల పాఠశాలలకు పాకింది. మంచిర్యాల జిల్లా చెన్నూర్ జ్యోతిబా పూలే గురుకులంలో ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులే దాడి చేశారు. ఈ స్కూళ్లో చదువుతున్న నస్పూర్‌కు చెందిన రాజేందర్‌గౌడ్ కుమారుడు మనోజ్‌గౌడ్‌పై ఈ నెల 6న రాత్రి అదే పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు దాడిచేసి, ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. మనోజ్‌గౌడ్ ఆదివారం తన తండ్రికి ఫోన్‌చేసి విషయం చెప్పటంతో రాజేందర్‌గౌడ్ సోమవారం పాఠశాలకు వెళ్లి ఆందోళనకు దిగాడు. ఘటనపై ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావును వివరణ కోరగా, దాడి విషయం తమ దృష్టికి రాగానే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఏడుగురు విద్యార్థులను సస్పెండ్ చేస్తామని చెప్పారు. కాగా, ఈ ఘటన నేపథ్యంలో ప్రిన్సిపాల్ ప్రకాశ్‌ను విధుల నుంచి తొలగిస్తూ గురుకుల కార్యదర్శి సైదులు సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయనకు మద్దతుగా కొందరు విద్యార్థులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఘటనపై పూర్తి విచారణ చేయాలని జైపూర్ ఏసీపీని ఆదేశించారు.

మమ్మల్ని కాపాడండి

- మయన్మార్ నుంచి 150 మంది భారతీయుల విజ్ఞప్తి
- కేంద్ర సహాయ మంత్రి సంజయ్‌ని కలిసిన మధుకర్‌రెడ్డి తల్లిదండ్రులు



తమ కుమారుడిని స్వదేశానికి తీసుకురావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వేడుకుంటున్న మధుకర్‌రెడ్డి తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'మేం థాయ్‌లాండ్‌–మయన్మార్ సరిహద్దులో చిక్కుకుపోయాం. తెలంగాణ, ఏపీతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన దాదాపు 150 మంది యువతీ యువకులం ఇక్కడున్నాం. మమ్మల్ని 19వ తేదీ లోపు కాపాడకపోతే చంపేస్తారు' అంటూ బాధితులు భారత ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అక్కడున్న భారత దౌత్య కార్యాలయాన్ని రెండురోజులుగా సంప్రదిస్తూ.. తమ దయనీయ పరిస్థితి గురించి చెబుతున్నా.. ఎంబసీ నుంచి ఎలాంటి సాయమూ అందలేదని వాపోయారు సోమవారం ఉదయం మధుకర్‌రెడ్డి తల్లిదండ్రులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి తమ కుమారుడిని కాపాడాలని వేడుకున్నారు.

బందీలు ఉన్నది మైవాడీ జిల్లాలో

మధుకర్‌రెడ్డి (కరీంనగర్), కైకలూరు సంతోష్ (హైదరాబాద్), కర్రి ప్రవీణ్ (విశాఖపట్నం), మణికంఠ (విశాఖ)లు మయన్మార్‌–థాయ్‌లాండ్ సరిహద్దులో చిక్కుకుపోయారు. వారు పంపిన లొకేషన్ ఆధారంగా గూగుల్‌లో వెతికితే.. మయన్మార్‌లోని మైవాడీ జిల్లాగా చూపించింది. ఇది థాయ్‌లాండ్ సరిహద్దును ఆనుకుని ఉండే చిన్న పట్టణం. ఇక్కడ మోయీ పేరుతో ప్రవహించే నది మయన్మార్‌–థాయ్‌లాండ్ దేశాలకు సరిహద్దుగా ఉంది. హాంగ్‌ష్వాంగ్ అనే కంపెనీ భారతీయులకు రూ.లక్ష వేతనమని ఎరవేసి, తొలుత బ్యాంకాక్ రప్పించి తర్వాత వారిని మయన్మార్‌లో అక్రమంగా నడుస్తోన్న సైబర్ కేఫ్‌లకు 4,000 యూఎస్ డాలర్ల చొప్పున విక్రయించిందని బందీలు ఆరోపిస్తున్నారు. మయన్మార్‌లో సైబర్ కేఫ్‌లను అధికంగా చైనా వారే నడుపుతున్నారు. ఎదురుతిరిగితే కొట్టి చంపుతారు లేదా జైల్లో పెడతారు. అందుకే పారిపోయేందుకు ఎవరూ సాహసించడం లేదు.

సమావేశమయ్యారని.. వైఫై కట్

భారతీయ యువకులు తమను బంధించిన మైవాడీలోని సైబర్ కేఫ్ భవనంలో సోమవారం సమావేశమయ్యారు. ఇది తెలుసుకున్న యాజమాన్యం తొలుత అక్కడ వైఫై నిలిపివేసింది. భారతీయుల్లో కొందరి ఫోన్లు లాగేసుకుంది. కొందరిని అందరిముందే చితకబాదారని బాధితులు తెలిపారు. ఇక్కడివారు చెప్పే సైబర్ నేరాలు తాము చేయలేకపోతున్నామని, త్వరగా తమను ఇక్కడ నుంచి కాపాడాలంటూ వేడుకుంటున్నారు. ఒకవేళ తాము ఇక్కడ నుంచి వెళ్లాలనుకుంటే రూ.4 లక్షల చొప్పున చెల్లించాలని చెబుతున్నారని వాపోయారు.


గాడి తప్పుతున్న ప్రజాస్వామ్యం

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- దేశంలో న్యాయవ్యవస్థ సంక్షోభంలో పడుతోంది: ప్రొ.జి. హరగోపాల్
- అంబేడ్కర్ వర్సిటీలో ప్రొ.జి.రాంరెడ్డి స్మారకోపన్యాసం

ఫిలింనగర్ (హైదరాబాద్): దేశంలో ప్రజాస్వామ్యం గాడి తప్పుతోందని, ఇది దేశ ప్రజలకు చాలా ప్రమాదకరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సంస్థలే నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాయంటూ ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు, పార్టీలు వ్యవహ రిస్తున్న దుందుడుకు చర్యలపై దేశంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. దేశంలో నేరాలు పెరిగి పోయాయని, మహిళలపై జరిగే అఘాయిత్యాల పట్ల న్యాయస్థానాలు వ్యవ హరిస్తున్న తీరు బాధాకరమని చెప్పారు. దేశంలో మత ఘర్షణలు, కుల ఘర్షణలు పెరుగుతున్నా యని ఇవి ప్రజాస్వామ్యానికి మంచివి కావని ఆవేదన వ్యక్తం చేశారు. దూరవిద్యా పితామహుడు ప్రొ.జి.రాంరెడ్డి 95వ జయంతిని పురస్కరించుకుని సోమవారం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ప్రొ.జి. రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా 'గాడి తప్పుతున్న లౌకికవాదం' అనే అంశంపై స్మారకో పన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలకులు పేదలకు సేవకులుగా ఉండాల్సి న అవసరం ఉందని, రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటే లౌకికవాదాన్ని కాపాడుకోవడం పెద్ద కష్టం కాదని చెప్పారు.

ఎదిరిస్తే దాడులు జరుగుతున్నాయ్..

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు స్వతహాగా వ్యవహరించే అవకాశం లేదని, ఎదిరిస్తే దాడులు చేసే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పౌరుల హక్కులు కాపాడటానికి నల్సాజుడుం కేసులో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఇచ్చిన తీర్పు ఇప్పటికీ మార్గదర్శకంగా ఉందని వివరించారు. జి.రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి ప్రొ.జి.హరగోపాల్ మాట్లాడుతూ దూరవిద్యా వ్యాప్తికి రాంరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఉన్నత విద్యావ్యాప్తిలో ఆయన ఆలోచనా విధానం భవిష్యత్ తరాలకు అందించేలా తమ ట్రస్ట్ స్మారకోపన్యాసాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రొ.జి.రాంరెడ్డి సతీమణి ప్రమీలా రాంరెడ్డి, ఆయన కుమార్తె జ్యోతి, వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎల్‌వీకే రెడ్డి, విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతులు ఆచార్య వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జి. రాంరెడ్డి జయంతి వేడుకల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, వీసీ ఘంటా చక్రపాణి, ఎల్‌వీకే రెడ్డి, రాంరెడ్డి కుటుంబ సభ్యులు

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

మార్చి & ఏప్రిల్- 2025 నెల కోసం ఇ-వేలం ప్రొగ్రామ్

మార్చి ఇ-వేలం-2025

తేది	డివిజన్లు /డిపోలు
03.03.25	విజయవాడ, నాందేడ్
04.03.25	గుంతకల్, హైదరాబాద్
05.03.25	తిరుపతి, సికింద్రాబాద్
06.03.25	లాలాగూడ, గుంటూరు
07.03.25	రాయనపాడు
10.03.25	విజయవాడ, నాందేడ్
11.03.25	గుంతకల్, హైదరాబాద్
12.03.25	తిరుపతి, సికింద్రాబాద్
13.03.25	లాలాగూడ, గుంటూరు
17.03.25	విజయవాడ, గుంతకల్, గుంటూరు, హైదరాబాద్, నాందేడ్, సికింద్రాబాద్, లాలాగూడ, రాయనపాడు, తిరుపతి
18.03.25	గుంతకల్, హైదరాబాద్
19.03.25	విజయవాడ, నాందేడ్
20.03.25	తిరుపతి, సికింద్రాబాద్
21.03.25	లాలాగూడ, గుంటూరు
24.03.25	రాయనపాడు
25.03.25	గుంతకల్, హైదరాబాద్
26.03.25	విజయవాడ, నాందేడ్
27.03.25	విజయవాడ, గుంతకల్, గుంటూరు, హైదరాబాద్, నాందేడ్, సికింద్రాబాద్, లాలాగూడ, రాయనపాడు, తిరుపతి
28.03.25	గుంటూరు, నాందేడ్

ఏప్రిల్ ఇ-వేలం-2025

తేది	డివిజన్లు /డిపోలు
01.04.25	నాందేడ్
02.04.25	గుంతకల్
03.04.25	గుంటూరు
04.04.25	సికింద్రాబాద్
07.04.25	విజయవాడ
08.04.25	హైదరాబాద్
09.04.25	లాలాగూడ
10.04.25	రాయనపాడు
11.04.25	తిరుపతి
14.04.25	నాందేడ్
15.04.25	గుంతకల్
16.04.25	గుంటూరు
17.04.25	సికింద్రాబాద్
21.04.25	విజయవాడ
22.04.25	హైదరాబాద్
23.04.25	లాలాగూడ
24.04.25	రాయనపాడు
25.04.25	తిరుపతి
28.04.25	నాందేడ్
29.04.25	గుంతకల్
30.04.25	గుంటూరు

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్, సికింద్రాబాద్
A0230

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్
(రక్షణ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
సర్దార్ పటేల్ రోడ్, కోర్ట్ కాంపౌండ్, సికింద్రాబాద్ -500 003
టెలి నం. 040-27808600/040-27808604.
ఇమెయిల్ ID: ceo.scb2009@gmail.com

ఆసక్తి వ్యక్తీకరణ

కార్పొరేట్స్ నుండి CSR ఫండ్స్ క్రింద మౌలికసదుపాయాల అభివృద్ధి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్‌ను సాంఘిక సంక్షేమం, ప్రజారోగ్యం, పరిశుభ్రత, భద్రత, నీటిసరఫరా, పారిశుద్ధ్యం, అర్బన్ రెన్యువల్ మరియు విద్యా వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుచేయుట మరియు ఇది ప్రత్యేక అవసరాలుగల చిన్నారుల పాఠశాల కూడా నిర్వహిస్తున్నందుకు గాను భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243Pలో క్లాజ్ (e) క్రింద మున్సిపాలిటీగా భావించడమైనది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కంటోన్మెంట్‌లో దిగువ సదుపాయాలు కల్పించుటకుగాను సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ మేనేజ్‌మెంట్ క్రింద ప్రస్తుతమున్న మౌలికసదుపాయాల స్థాయి పెంపుదల కొరకు వారి CSR ఫండ్స్ ద్వారా తోడ్పాటునందించ మరియు సహాయం అందించదలచిన ప్రముఖ కార్పొరేట్స్ నుండి దరఖాస్తులు/ ప్రతిపాదనలు కోరుతోంది.

1) పేద మరియు అణగారిన వర్గాల విద్యార్థులకు సైన్స్‌లో విద్యనందించుటకుగాను సైన్స్ సెంటర్ కొరకు మౌలికసదుపాయాల అభివృద్ధి.
2) దారితప్పిన పశువులకు పశువుల షెడ్ల కొరకు మౌలికసదుపాయాల అభివృద్ధి.
3) కంటోన్మెంట్ జనరల్ హాస్పిటల్ సదుపాయాలకు మద్దతు కల్పించుట.
4) ట్రాఫిక్ కూడళ్ళలో అభివృద్ధితోపాటు ల్యాండ్‌స్కేపింగ్.
5) పార్కులు మరియు గార్డెన్ల అభివృద్ధి.
6) హౌసింగ్ మరియు అర్బన్ అగ్లోమరేషన్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం యొక్క మార్గదర్శకాల ప్రకారం స్వచ్ఛతను ప్రోత్సహించుటకుగాను మౌలికసదుపాయాల వినియోగాలు.
7) నీటి సరఫరా మౌలికసదుపాయాల స్థాయి పెంపుదల.
8) స్మశాన ఘాట్/స్మశానము/స్మశానవాటికల అభివృద్ధి.

వారి CSR ఫండ్స్ ద్వారా పైన తెలిపిన మౌలికసదుపాయాల అభివృద్ధి పనుల కొరకు తోడ్పాటునందించే లక్ష్యం కలిగిన ఆసక్తిగల కార్పొరేట్స్ ప్రతి పనికి విడివిడిగా వారి యొక్క దరఖాస్తులను/ప్రతిపాదనలను ceo.scb2009@gmail.comకు ఇమెయిల్ ద్వారా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్, ఎస్.పి.రోడ్, సివిల్ కోర్ట్ కాంపౌండ్, సికింద్రాబాద్ -500003 వారికి దాఖలు చేయవచ్చును.

సం/-
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్
తేది: 17-02-2025

OFFICE OF THE DIRECTOR GENERAL ASSAM RIFLES, SHILLONG - 793 010

ASSAM RIFLES TECHNICAL AND TRADESMAN RECRUITMENT RALLY 2025

1. Assam Rifles Technical and Tradesman Recruitment Rally 2025 is tentatively scheduled from **3rd/4th week of April 2025 onwards** for enrolment into Group B and C posts against **215** vacancies. Applications are invited from eligible candidates male / female for the trades/ posts as mentioned below:-

(a)	Religious Teacher (RT)	-	03
(b)	Radio Mechanic (RM)	-	17
(c)	Lineman (Lmn) Field	-	08
(d)	Engineer Equipment Mechanic (EE Mech)	-	04
(e)	Electrician Mechanic Vehicle	-	17
(f)	Recovery Vehicle Mechanic	-	02
(g)	Upholster	-	08
(h)	Vehicle Mechanic fitter	-	20
(j)	Draughtsman	-	10
(k)	Electrical and Mechanical	-	17
(l)	Plumber	-	13
(m)	Operation Theatre Technician (OTT)	-	01
(n)	Pharmacist	-	08
(o)	X-Ray Assistant	-	10
(p)	Veterinary Field Assistant (VFA)	-	07
(q)	Safai	-	70
	Total	-	215

2. The aspirants are hereby advised to regularly visit the Assam Rifles Official website (www.assamrifles.gov.in) for further details and submission of online application.
3. Vacancies are tentative & is subject to variations. The Assam Rifles has the right to make any change in the advertisement or cancel it without assigning any reasons.
4. In case of any query, the following numbers may be contacted on any working day from 0900 hrs to 1700 hrs:-
(a) 0364-2585118 (b) 0364-2585119 (c) 8794101693

Sd/- x-x-x
(Keshav Sharma)
Dy Comdt, SO-2 (Rect)

ప్రార్థనా స్థలాల చట్టంపై కొత్త పిటిషన్లు ఎందుకు?

సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం

న్యూఢిల్లీ: ప్రార్థనా స్థలాల చట్టం–1991పై వరుసగా పలు పిటిషన్లు దాఖలవుతుండడం పట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తంచేశారు. ఇలాంటి పిటిషన్లను ఇకపై తాము స్వీకరించలేమని తేల్చిచెప్పారు. దేశంలో 1947 ఆగస్టు 15న నాటికి ఉన్న ప్రార్థనా స్థలాలను యథాతథంగా కొనసాగించాలని, వాటిలో మార్పులు చేర్పులు చేయడానికి వీల్లేదంటూ 1991లో అప్పటి ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇక్రా చౌదరి తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ కొందరు హిందూ సంఘాల ప్రతినిధులు సైతం పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటికీ పిటిషన్లు దాఖలవుతూనే ఉన్నాయి. ఈ వ్యవహారంపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం విచారణ జరిపారు. ఇప్పటికే చాలా పిటిషన్లు వచ్చాయని, ఇంకా మరికొన్ని సమర్పించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇలాంటి వాటికి ఒక పరిమితి ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇకపై వీటిని విచారణకు స్వీకరించే పరిస్థితి ఉండబోదని స్పష్టంచేశారు. చట్టానికి సంబంధించి కొత్త అంశమేదీ ప్రస్తావించకుండా వ్యాజ్యం దాఖలు చేస్తే కచ్చితంగా తిరస్కరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాలపై ఏప్రిల్ మొదటి వారంలో త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపడుతుందని తెలిపారు.

లెబనాన్ హమాస్ మిలటరీ చీఫ్‌ను చంపేశాం

ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటన

జెరూసలేం: లెబనాన్‌లోని దక్షిణ ప్రాంతంపై తాము జరిపిన డ్రోన్ దాడిలో హమాస్ మిలటరీ విభాగం చీఫ్ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. లెబనాన్‌లో హమాస్ మిలటరీ ఆపరేషన్స్ చీఫ్ మహ్మద్ షహీన్ చనిపోయాడని వివరించింది. ఇరాన్ నిధులు, ఆదేశాలతో లెబనాన్ భూభాగం నుంచి ఇజ్రాయెల్ పౌరులపై దాడులు చేసేందుకు ఇతడు పథక రచన చేశాడని ఆరోపించింది. తమ మిలటరీ కమాండర్ ఇజ్రాయెల్ దాడిలో మృతి చెందారంటూ హమాస్ కూడా ధ్రువీకరించింది. లెబనాన్‌లోని సిడోన్‌లో ఆర్మీ చెక్ పాయింట్ వద్ద డ్రోన్ దాడిలో మంటల్లో తగులబడిపోతున్న కారు దృశ్యాలు విడుదలయ్యాయి. దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ బలగాల ఉపసంహరణకు 18వ తేదీతో గడువు ముగియనుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. అయితే, తాము దక్షిణ లెబనాన్‌లోని ఐదు ప్రాంతాల నుంచి ఉపసంహరించుకోబోమని ఇజ్రాయెల్ సోమవారం ప్రకటించింది. తమ పౌరుల భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామంది. దీనిపై లెబనాన్ ఇంకా స్పందించలేదు.

జర్మనీ విజేత ఎవరు?

మరో 5 రోజుల్లో ఎన్నికలు



ఎలీస్ వీడెల్ | ఫ్రెడిష్ మెర్జ్ | ఒలాఫ్ షోల్జ్ | రాబర్ట్ హబెక్ | సారా వాగెన్ కనెక్ట్

జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ ప్రభుత్వం మైనారిటీలో పడిపోవడంతో అనివార్యమైన ఎన్నికలు ఇప్పుడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఫ్రెడరిక్ మెర్జ్ సారథ్యంలోని క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్(సీడీయూ), మార్కస్ సోడర్ సారథ్యంలోని క్రిస్టియన్ సోషల్ యూనియన్(సీఎస్‌యూ) కూటమి ఈసారి హాట్ ఫేవరెట్‌గా బరిలో దిగుతోంది. ఈసారి ఈ కూటమికే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని వార్తలొచ్చాయి. మరోవైపు 2010 దశకంలో జర్మనీలోకి వలసలు పోటెత్తడంతో ఉద్యమంగా మొదలై ఇప్పుడు అతివాద పార్టీగా ఎదిగిన ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీ సైతం మళ్లీ ఎన్నికల బరిలో నిలిచింది. జర్మనీలోకి పోటెత్తుతున్న అక్రమ వలసలకు అడ్డుకట్టవేయడం, ఆర్థికవ్యవస్థను పరుగులెత్తించే సత్తా ఉన్న పార్టీకే ఈసారి ఓటర్లు పట్టంకట్టనున్నారు. ఫిబ్రవరి 23వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వలసలు, ఆర్థిక వ్యవస్థ మాత్రమే ప్రధాన అంశాలుగా ఉన్నాయి. బండేస్టాగ్(జర్మనీ పార్లమెంట్)లో అధికార పీఠంపై కూర్చునేది ఎవరనే అంశం ఇప్పుడు జర్మనీ అంతటా తీవ్ర చర్చనీయాంశమైంది.

ఈసారి ఎన్నికలు ఎందుకంత ప్రత్యేకం?

ఎన్నడూలేనంతగా జర్మనీలో జనసమ్మర్ద ప్రదేశాల్లో దాడి ఘటనలు ఎక్కువయ్యాయి. అక్రమ వలసదారులే ఈ దాడులకు పాల్పడుతున్నారన్న ఆగ్రహావేశాలు స్థానికుల్లో పెరిగాయి. దీంతో అక్రమ వలసదారుల కట్టడి, శరణార్థులుగా గుర్తింపునకు సంబంధించిన నిబంధనలు కఠినతరం చేయడం వంటి డిమాండ్లు ఓటర్లలో ఎక్కువయ్యాయి. మాన్‌హైమ్, జోలింగన్, మాగ్‌డీబర్గ్, అషాఫన్‌బర్గ్ నగరాల్లో దాడి ఘటనలతో అక్రమవలస ఇప్పుడు కీలకాంశమైంది. ఇటీవల మ్యూనిక్‌లో అఫ్గాన్ పౌరుడు వేగంగా కారు పోనివ్వడంతో జర్మనీ జాతీయురాలు, ఆమె రెండేళ్ల కూతురు తీవ్రంగా గాయపడిన ఘటనతో అక్రమ వలసదారుల కట్టడి అంశాన్ని ప్రధాన పార్టీలన్నీ ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నాయి. ఈసారి ఐదుగురు ఛాన్స్‌లర్ పదవి కోసం పోటీపడుతున్నారు.

ఫ్రెడిష్ మెర్జ్..

క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్(సీడీయూ) అధినేత ఫ్రెడిష్ మెర్జ్ వైపు ఎక్కువ మంది ఓటర్లు మొగ్గుచూపే వీలుంది. ఆరున్నర అడుగుల ఎత్తు 69 ఏళ్ల వయస్సున్న మెర్జ్ 2002 ఏడాదిలో ఏంజెలా మెర్కెల్ ప్రభుత్వంలో పనిచేశారు. తర్వాత రాజకీయాలు వదిలేసి పలు పెట్టుబడుల బ్యాంకుల బోర్డుల్లో సేవలందించారు. తర్వాత మళ్లీ సీడీయూ పార్టీలో చేరి పార్టీ నాయకత్వ పోరులో 2018లో మెర్కెల్, 2021లో ఆర్మిన్ లాషెట్ చేతిలో ఓటమిని చవిచూశారు. ఈసారి '' జర్మనీలో ఉన్నందుకు మరోసారి గర్వపడదాం'' నినాదంతో సీడీయూ చీఫ్‌గా ఎన్నికల బరిలో దిగుతున్నారు. ''దేశ సరిహద్దులను పటిష్టంచేస్తా. వలసలను కట్టడిచేసేలా శరణార్థి నిబంధనలను కఠినతరం చేస్తా. పన్నులు తగ్గిస్తా. సంక్షేమ పథకాల కోసం 50 బిలియన్ యూరోలను ఖర్చుచేస్తా'' అని హామీలు గుప్పించారు.

ఒలాఫ్ షోల్జ్..

సోషల్ డెమొక్రటిక్ పార్టీ నేత అయిన ఒలాఫ్ షోల్జ్ ఇప్పటికే మూడేళ్లకు పైగా దేశ చాన్స్‌లర్‌గా సేవలందించారు. అయితే కూటమి సర్కార్‌ను నిలబెట్టుకోలేకపోయారు. రెండు నెలల క్రితం బలపరీక్షలో ఓడిపోయారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రత్యక్షంగా జర్మనీ ఆర్థికవ్యవస్థపై విపరిణామాలు చూపడంతో ఒలాఫ్ షోల్జ్ ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింది. అది చివరకు ప్రభుత్వం కూలడానికి కారణమైంది. గత ఏడాది జరిగిన విశ్వాస పరీక్షలో 733 మంది సభ్యులున్న సభలో కేవలం 207 ఓట్లు సాధించడం తెల్సిందే. దీంతో అధ్యక్షుడు ఫ్రాంక్ వాల్టర్ పార్లమెంట్‌ను రద్దుచేసి ఎన్నికలకు పిలుపునిచ్చారు.

ఎలీస్ వీడెల్..

2013లో ఏఎఫ్‌డీ పార్టీని ఏర్పాటు చేసినప్పటి నుంచి పార్టీ తరఫున చాన్స్‌లర్ పదవి కోసం 46 ఏళ్ల నాయకురాలు ఎలీస్ వీడెల్ పోటీపడుతున్నారు. ఈమెకు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతు ఉంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల మ్యూనిక్‌కు వచ్చినప్పుడు ఈమెతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈమెకు యువతలో పెద్ద క్రేజ్ ఉంది. ''వలసలు.. ఇమ్మిగ్రేషన్‌కు విరుగుడుగా రిమిగ్రేషన్(తిరిగి పంపేయడం) తీసుకొస్తా. జర్మనీపై రష్యా ఆంక్షలను ఎత్తేసేలా కృషిచేస్తా. ధ్వంసమైన నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్‌ను పునరుద్ధరిస్తా'' అని ఎలీస్ పలు ఎన్నికల హామీ గుప్పించారు.

రాబర్ట్ హబెక్..

మూడు దశాబ్దాల క్రితం పర్యావరణ ఉద్యమంగా మొదలైన రాజకీయ పార్టీగా అవతరించిన 'ది గ్రీన్స్/అలయన్స్ 90' పార్టీకి సారథ్యం వహిస్తున్న 55 ఏళ్ల రాబర్ట్ హబెక్ సైతం చాన్స్‌లర్ రేసులో నిలిచారు. షోల్జ్ ప్రభుత్వంలో ఈయన వైస్ ఛాన్స్‌లర్‌గా, ఆర్థికశాఖ మంత్రిగా సేవలందించారు. ''పునరుత్పాదక ఇంధన విధానాలకు పట్టం కడతా. అధికారంలోకి వస్తే ఉక్రెయిన్‌కు సాయం కొనసాగిస్తా. అణువిద్యుత్ శక్తి ఉత్పత్తిని తగ్గిస్తా. పవన విద్యుత్‌కు పాతరేస్తా'' అని ఎన్నికల హామీ ఇచ్చారు.

సారా వాగెన్ కనెక్ట్

రష్యాకు మద్దతు పలుకుతూ తూర్పు జర్మనీలో బలమైన ఓటు బ్యాంక్‌ను సాధించిన 'ది సారా వాగెన్ కనెక్ట్ –రీజన్ అండ్ జస్టిస్ పార్టీ(బీఎస్‌డబ్ల్యూ)' సైతం చాన్స్‌లర్ పదవిపై కన్నేసింది. బీఎస్‌డబ్ల్యూ సహ వ్యవస్థాపకురాలు సారా వాగెన్ కనెక్ట్ తమ పార్టీ.. ఏఎఫ్‌డీకి అసలైన ప్రత్యామ్నాయ పార్టీ అని చెబుతున్నారు. ఏఎఫ్‌డీ తరహాలోనే అక్రమ వలసలపై బీఎస్‌డబ్ల్యూ పార్టీ ఉద్యమిస్తోంది. అయితే ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు అనుకూలంగా మాట్లాడుతుండటంతో ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కష్టమని అంచనాలు వెలువడ్డాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓటింగ్ ఎలా చేపడతారు?


18 ఏళ్లు దాటిన వారంతా ఓటేయొచ్చు. అయితే ప్రతి ఒక్కరు రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న 299 పార్లమెంట్ నియోజకవర్గాల కోసం ఒక ఓటు వేయాలి. దేశంలో 16 రాష్ట్రాలు ఉండగా ఓటరు తన సొంత రాష్ట్రం కోసం మరో ఓటు వేయాల్సి ఉంటుంది. రెండో ఓటులో కనీసం 5 శాతం ఓట్లను సాధించిన పార్టీ సభ్యులకు నేరుగా పార్లమెంట్‌లో సభ్యత్వం కోరే అర్హత ఉంటుంది. సంస్కరించిన పోలింగ్ విధానాన్ని తొలిసారిగా ఈ ఏడాది నుంచే అమలుచేయనున్నారు. దీంతో పార్లమెంట్‌లో ఇన్నాళ్లూ ఉన్న 733 సీట్లు తగ్గిపోయి 630కి చేరుకోనున్నాయి. అత్యధిక సీట్లను సాధించిన పార్టీ లేదా కూటమి నుంచి చాన్స్‌లర్‌ను ఎన్నుకుంటారు. ప్రస్తుతం మైనారిటీ సంకీర్ణ ప్రభుత్వం తాత్కాలికంగా అధికారంలో ఉంది. ఈసారి సీడీయూ, సీఎస్‌యూ కూటమి విజయం సాధించవచ్చని ఎన్నికల పండితులు విశ్లేషిస్తున్నారు.

నూతన సీఈసీగా జ్ఞానేశ్ కుమార్

26వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియామకం

- రాష్ట్రపతికి సిఫార్సు చేసిన సెలక్షన్ కమిటీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము
- ఎన్నికల సంఘం కమిషనర్‌గా డాక్టర్ వివేక్ జోషి

సాక్షి, న్యూఢిల్లీ: నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్(61) పేరును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఖరారు చేసింది. కమిటీ సోమవారం సాయంత్రం ఢిల్లీలోని సౌత్‌బ్లాక్‌లో సమావేశమైంది. మోదీతోపాటు కమిటీలో సభ్యులైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ నేతృత్వంలోని సెర్చ్ కమిటీ ప్రతిపాదించిన ఐదుగురు అభ్యర్థుల జాబితా నుంచి జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఎంపిక చేశారు. కొత్త సీఈసీ పేరును సెలక్షన్ కమిటీ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సిఫార్సు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. నూతన సీఈసీ నియామకంపై రాష్ట్రపతి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 26వ సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఎంపికైనట్లు కేంద్ర న్యాయ శాఖ ప్రకటించింది. ఆయన ఈ నెల 19న బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించింది. సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ పదవీ కాలం 2029 జనవరి 26 దాకా ఉంది. అలాగే ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్ స్థానంలో హరియాణా కేడర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ వివేక్ జోషి నియమితులయ్యారు.



కొత్తం చట్టం కింద తొలి సీఈసీ

1988 బ్యాచ్ కేరళక్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన జ్ఞానేశ్ కుమార్ ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఐఐటీ–కాన్పూర్‌లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తిచేశారు. ఇక్ఫాయ్ యూనివర్సిటీలో బిజినెస్ ఫైనాన్స్ చదివారు. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో ఎన్విరాన్‌మెంటల్ ఎకనామిక్స్ అభ్యసించారు. కేరళలో ఐఏఎస్ అధికారిగా వివిధ హోదాల్లో సేవలందించారు. కేంద్ర సర్వీసుల్లో చేరి, రక్షణ శాఖలో జాయింట్ సెక్రెటరీగా సేవలందించారు. హోంశాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం సభ్యుల నియామకంపై కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నియమితులైన తొలి సీఈసీ జ్ఞానేశ్ కుమార్. ఆయన ఆధ్వర్యంలోనే బిహార్, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఆయన 2024 మార్చి 15న ఎన్నికల సంఘం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. కేంద్ర హోంశాఖలో పని చేస్తున్నప్పుడు ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన బిల్లు రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. అయోధ్య రామమందిరానికి సంబంధించి సుప్రీంకోర్టు కేసులో కేంద్రానికి సహకరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు జ్ఞానేశ్ కుమార్ సన్నిహితుడిగా పేరుంది.

సమావేశం వాయిదా వేయాలన్న కాంగ్రెస్

సెలక్షన్ కమిటీ సమావేశాన్ని వాయిదా వేయాలని కాంగ్రెస్ పార్టీ తొలుత డిమాండ్ చేసింది. సెలక్షన్ కమిటీ ఏర్పాటుపై ఈ నెల 19వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉందని వెల్లడించింది. కోర్టులో విచారణ పూర్తయ్యే దాకా కమిటీ సమావేశం నిర్వహించవద్దని కోరింది. సెలక్షన్ కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, కేంద్ర మంత్రిని నియమించడం పట్ల కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మనూ సింఘ్వీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని చెప్పుచేతల్లో ఉంచుకోవడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీయడం తగదని సూచించారు.

ఢిల్లీని కుదిపేసిన భూకంపం

- తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.0గా నమోదు
- నష్ట సమాచారం లేదన్న అధికారులు
- ప్రజలు ఆందోళన చెందవద్దన్న మోదీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ, చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు బిహార్‌లోని సివాన్‌లో సోమవారం ఉదయం భూమి తీవ్రంగా కంపించింది. రిక్టర్ స్కేలుపై ప్రకంపనల తీవ్రత 4.0గా నమోదైంది. ప్రకంపనల కేంద్రం ఎర్రకోటకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధౌలా కువాన్‌లోని ఝీల్ పార్క్ ఏరియాలో ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. భూమికి ఐదు కిలోమీటర్ల లోతులో ఉదయం 5.36 గంటల సమయంలో కంపనలు సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ(ఎన్‌సీఎస్) తెలిపింది. ఈ ప్రాంతంలో భూమి కంపించిన సమయంలో పెద్దపెద్ద శబ్దాలు వినిపించినట్లు స్థానికులు తెలిపారు. భూమికి 5 నుంచి 10 కిలోమీటర్ల లోతులో సంభవించే భూకంపాలను సాధారణ భూకంపాలుగా పరిగణిస్తారు. వీటి తీవ్రత ఎక్కువగా ఉన్న సందర్భాల్లో ఎక్కువ నష్టం సంభవించేందుకు అవకాశముంటుంది. ఝీల్ పార్క్ ప్రాంతంలో ఏటా కనీసం రెండుమూడుసార్లు భూమి కంపిస్తుంటుందని స్థానికులు తెలిపారు. 2015లో ఇక్కడ సంభవించిన భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.3గా నమోదైంది. ప్రకంపనలతో భయపడిన ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్ ప్రాంతాల్లోని బహుళ అంతస్తుల భవనాల్లోని జనం భూకంపం వచ్చిందంటూ రోడ్లపైకి చేరుకున్నారు. ఇంత తీవ్రమైన భూకంపం ఇంతకు ముందెన్నడూ తాము చూడలేదని పలువురు తెలిపారు. భారీగా శబ్దాలు రావడంతో ఎంతో భయపడిపోయామని చెప్పారు. భూకంపంతో ఎవరూ గాయపడలేదని, ఆస్తినష్టం సంభవించినట్లు సమాచారం లేదని అధికారులు తెలిపారు. ఢిల్లీ, సమీప ప్రాంతాల్లో సంభవించిన భూ ప్రకంపనలతో ఆందోళన చెందవద్దని ప్రధాని మోదీ ప్రజలను కోరారు. తదుపరి ప్రకంపనలు సంభవించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవాలని 'ఎక్స్'లో సూచించారు. అధికారులు పరిస్థితులను గమనిస్తున్నారన్నారు.

బిహార్‌లోనూ ప్రకంపనలు

బిహార్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం భూమి కంపించింది. ముఖ్యంగా శివాన్ చుట్టుపక్కల జిల్లాల్లో భూప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 4గా నమోదైంది. శివాన్‌లో ఉదయం 8 గంటల సమయంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలను గుర్తించామని ఎన్‌సీఎస్ తెలిపింది. భూకంపం కారణంగా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం సంభవించినట్లు ఎటువంటి సమాచారం లేదని అధికారులు తెలిపారు. సివాన్‌లో ప్రకంపనలతో భయకంపితులైన జనం ముందు జాగ్రత్తగా ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

తరచూ ఎందుకు?

ఢిల్లీలో భూకంపాలు అసాధారణమేం కాదు. ఢిల్లీ ప్రాంతం క్రియాశీల భూకంప జోన్ పరిధిలోకి వస్తుంది. హిమాలయాలకు దగ్గరగా ఉండటంతోపాటు ప్రపంచంలో అత్యంత భూకంప చురుకైన ప్రాంతాలలో ఒకటిగా ఉంది. కశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు విస్తరించి ఉన్న ఆవలి హిమాలయ పర్వతాలకు ఇవతలి వైపు హిమాలయాలకు మధ్య నెలకొన్న ఒత్తిడి(మెయిర్ బౌండరీ థ్రస్ట్–ఎంబీటీ) అత్యంత క్రియాశీలకంగా పనిచేస్తోంది. ఢిల్లీ–హరిద్వార్ రిడ్జ్, మహేంద్రగఢ్–డెహ్రాడూన్ ఫాల్ట్, మొరాదాబాద్ ఫాల్ట్, సోహ్నా ఫాల్ట్, యమునా నదీ రేఖతో సహా అనేక భూకంప అనుకూల ప్రాంతాలు దేశరాజధాని భూభాగానికి సమీపంలో ఉన్నాయి. దీంతో భూకంపాల తీవ్రత అధికం. ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం ఢిల్లీ భూకంప జోన్–4లో ఉంది. జోన్–4 అంటే భూకంపాల ప్రమాదం ఎక్కువ ఉంటుందని అర్థం. ఇలాంటి జోన్‌లో భూకంపాలు సాధారణంగా రిక్టర్ స్కేల్‌పై ఐదు లేదా ఆరు తీవ్రతతో వస్తాయి. అప్పుడప్పుడు ఏడు లేదా 8 తీవ్రతతో సంభవిస్తాయి. అయితే ఈ జోన్ పరిధి నిరంతరం మారుతూ ఉంటుంది.

రిక్టర్ స్కేల్‌పై నాలుగుగా నమోదైనా

సోమవారం రిక్టర్ స్కేల్‌పై కేవలం 4 తీవ్రతతో సంభవించినప్పటికీ దాని ప్రభావం మాత్రం తీవ్రంగా కనిపించింది. అందుకు కారణం ఉంది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాంతాల్లో బలమైన ప్రకంపనలు వస్తాయి. భూకంపం పుట్టిన ప్రదేశంలో దాని శక్తి తీవ్రంగా ఉంటుంది. దూరం ఎక్కువయ్యే కొద్దీ ప్రకంపనలు బలహీనమవుతాయి. నేల రకం వంటి స్థానిక భౌగోళిక పరిస్థితులు కూడా కదలికల్లో హెచ్చు తగ్గులకు కారణమవుతాయి. ఢిల్లీ–ఎన్సీఆర్ విషయానికొస్తే భూఉపరి తలానికి ఐదు కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉంది. ఇది నగరం అంతటా బలమైన ప్రకంపనలను సృష్టించింది. సాధారణంగా హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వంటి ఉత్తర ప్రాంతాల్లో సంభవించే భూకంపాల వల్ల ఢిల్లీలో స్వల్ప కదలికలు నమోదవుతాయి. అయితే, సోమవారం భూకంప కేంద్రం ఢిల్లీ సమీపంలో ఉండటంతో ఢిల్లీ–ఎన్సీఆర్‌లో మరింత తీవ్రమైన ప్రకంపనలు వచ్చాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

టోటలైజర్ విధానం తేవాలి

బూత్‌ల వారీ ఓటింగ్ సరళిని బయటపెట్టరాదు

- ఎన్నారైలకు స్థానికంగానే ఓటేసే విధానం రావాలి
- ఎన్నికల ఫలితాలను జీర్ణించుకోలేక ఈసీపై ఆరోపణలు అన్యాయం
- నేడు పదవీ విరమణ చేస్తున్న సీఈసీ రాజీవ్‌కుమార్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ఓటరు గోప్యతను కాపాడేందుకు టోటలైజర్ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని పదవీ విరమణ చేస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ చెప్పారు. దీనివల్ల, బూత్‌ల వారీ ఓటింగ్ సరళిని బయటకు తెలియదని చెప్పారు. ప్రవాస భారతీయులు స్థానికంగానే ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో కమిషన్‌పై తప్పుదోవ పట్టించే ఆరోపణల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ నెల 18వ తేదీన పదవీ విరమణ చేయనున్న సీఈసీ రాజీవ్ కుమార్ సోమవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడారు. 'ప్రస్తుతం ప్రతి ఈవీఎం నుంచి పోలైన ఓట్లను సేకరిస్తున్నాం. ఇందులో ఒక్కో అభ్యర్థికీ పడిన ఓట్లను కలిపి ఫలితాలను ప్రకటిస్తున్నాం. ఇందులో లోపమేమంటే..ఏ ప్రాంతం నుంచి తమకు ఎన్ని ఓట్లు పడ్డాయనే వివరాలు అభ్యర్థులకు తెలిసిపోతాయి. ఎన్నికల అనంతర హింసకు ఇదే కారణంగా మారుతోంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లను వేధించడం, అభివృద్ధి కార్యక్రమాల నుంచి వారిని దూరంగా పెట్టడం వంటి చర్యలకు దిగుతున్నారు' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'దీనిని నివారించడానికి టోటలైజర్ విధానాన్ని తేవాలి. దీనిని ఇప్పటికే ఎన్నికల సంఘం అభివృద్ధి పరిచింది. ఇందులో భాగంగా అభ్యర్థులకు పోలింగ్ బూత్‌ల వారీగా పడిన ఓట్లను వెల్లడించబోరు. రాజకీయ ఏకాభిప్రాయంతో ఈ విధానాన్ని అమల్లోకి తేవాలి. ఓటరు గోప్యతను కాపాడేందుకు, ఓటింగ్ ప్రక్రియ సమగ్రతను పెంచేందుకు ఇది ఎంతో అవసరమని నమ్ముతున్నా' అని ఆయన అన్నారు.

రిమోట్ ఓటింగ్ విధానం రావాలి

కోట్లాది మంది వలస కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు రిమోట్ ఓటింగ్ విధానాన్ని తప్పనిసరిగా అందుబాటులోకి తేవాలన్నారు. దొంగ ఓట్లు, ఒకే వ్యక్తి పలుమార్లు ఓటేసే వ్యవహారాలను సమర్థంగా అడ్డుకునేందుకు పోలింగ్ బూత్‌లలో బయోమెట్రిక్ ధ్రువీకరణను ప్రవేశపెట్టాలని సూచించారు. రాజకీయ పార్టీలు నిధులు, ఖర్చు వివరాలను ఆన్‌లైన్‌లో వెల్లడించే ప్రక్రియ మొదలైందన్నారు. ఆర్థిక పారదర్శకత, విశ్లేషణల కోసం ఈ ప్రక్రియను తప్పనిసరి చేయాలని సూచించారు.

ఆరోపణలు ఆందోళనకరం

ఓటర్లు ఉత్సాహంగా, పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న చోట కూడా ఫలితాల అనంతరం రాజకీయ పార్టీలు ఈసీ, అధికారులపై సందేహాలను వ్యక్తం చేయడం ఖండించాల్సిన అంశమని రాజీవ్ కుమార్ చెప్పారు. 'పోలింగ్ లేదా కౌంటింగ్ ముమ్మరంగా జరుగుతున్న వేళ తప్పుడు ఆరోపణలు, వదంతులు మీడియాతోపాటు సామాజిక మాధ్యమ వేదికలపై ఒక్కసారిగా వ్యాప్తి చెందుతున్నాయి. ప్రజలను తప్పుదోవ పట్టించడం, వారిని అయోమయానికి గురి చేయడమే వీటి లక్ష్యం. అయితే, ఎన్నికల సమగ్రతను కాపాడటం, ప్రశాంతంగా ఎన్నికలు జరపడాన్నే లక్ష్యంగా పెట్టుకున్న ఈసీ ఇటువంటి వాటిని పట్టించుకోలేదు' అని అన్నారు. ఎన్నికల ఫలితాలను జీర్ణించుకోలేని వారు ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేసే ధోరణులు పెరుగుతుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవస్థలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేసే వారిని ప్రజలు నమ్మబోరని ఆయన వ్యాఖ్యానించారు. ఇటువంటి అంశాలపై ఎన్నికల కమిషన్ సంయమనం పాటిస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ అధికార బీజేపీకి కొమ్ముకాస్తోందని, ఓటింగ్‌లో అవకతవకలపై తాము చేసే ఫిర్యాదులను పట్టించుకోవడం లేదంటూ ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేస్తున్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నియంత్రణలు లేని సోషల్ మీడియా విశ్లేషణలు, అంచనాలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియకు తీవ్ర ప్రమాదకరంగా మారాయంటూ రాజీవ్‌కుమార్.. ఇవి చేసే నిరాధార, ఉద్దేశపూర్వక విమర్శలను ఎదుర్కోవడానికి ఎన్నికల సంఘం సామర్థ్యాలను పెంపొందించుకోవాలని నొక్కి చెప్పారు.


పరీక్షలపై తప్పుడు ప్రచారం నమ్మొద్దు: సీబీఎస్‌ఈ

న్యూఢిల్లీ: 10, 12వ తరగతి పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు లీకయ్యాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) ఖండించింది. పేపర్ లీక్ కాలేదని, అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సోమవారం సూచించింది. పరీక్షలపై వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు సీబీఎస్‌ఈ అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇందుకోసం దర్యాప్తు సంస్థల సాయం తీసుకుంటున్నామని తెలియజేశారు. సీబీఎస్‌ఈ 10, 12వ తరగతుల బోర్డు పరీక్షలు ఈ నెల 15న ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ నాలుగో తేదీన ముగియనున్నాయి.

చైనాను శత్రుదేశంగా చూడొద్దు

కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ అంతర్జాతీయ విభాగం అధ్యక్షుడు శామ్ పిట్రోడా మరోసారి వార్తల్లోకెక్కారు. పొరుగు దేశం చైనాతో భారతదేశ సంబంధాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కలిసి చైనా నుంచి ఎదురయ్యే ముప్పును అడ్డుకోగలరా? అని ప్రశ్నించగా, ఆయన బదులిచ్చారు. చైనాను శత్రుదేశంగా చూడొద్దని చెప్పారు. ఏదైనా జరిగితే చైనా నుంచి ఎదురయ్యే ముప్పు ఊహించని విధంగా ఉంటుందని, అందుకే ఆ దేశాన్ని శత్రువుగా చూడటం మానుకోవాలని అన్నారు. డ్రాగన్ దేశం పట్ల ఘర్షణాత్మక వైఖరి అవసరం లేదని తేల్చిచెప్పారు. భారత్ ఇకనైనా తన వైఖరి మార్చుకోవాలని సూచించారు. చైనా వల్ల భారత్‌కు ఉన్న ప్రమాదం ఏమిటో తనకు అర్థం కావడం లేదన్నారు. అమెరికా ప్రభుత్వం చైనాను పదేపదే శత్రువుగా పేర్కొంటూ ఇండియాకు సైతం అదే నూరిపోస్తోందని తప్పుపట్టారు. ప్రజా ప్రయోజనార్థం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలూ ఏకతాటిపైకి రావాల్సి సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు. ఎవరితోనూ ఘర్షణాత్మక వైఖరి అవసరం లేదన్నారు. చైనా విషయంలో మొదటి నుంచీ ఇండియా అవలంబిస్తున్న ఘర్షణాత్మక వైఖరి మనకు కొత్త శత్రువులను సృష్టిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయంగా భారత్‌కు సరైన మద్దతు దక్కడం లేదని చెప్పారు. మనం ఈ వైఖరిని కచ్చితంగా మార్చుకోవాలని, చైనాను శత్రువుగా భావించడం మానుకోవాలని శామ్ పిట్రోడా వ్యాఖ్యానించారు. కేవలం చైనా విషయంలోనే కాదు, ఇతర దేశాల విషయంలోనూ ఇది వర్తిస్తుందని తెలిపారు. ప్రపంచ దేశాలన్నీ పరస్పరం కమ్యూనికేషన్ పెంచుకోవాలని అవసరమైన సమయంలో సహకరించుకోవాలని అన్నారు. పేద దేశాలు చాలా వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని చెప్పారు.



చైనా–కాంగ్రెస్ మధ్య ఒప్పందం: బీజేపీ

పిట్రోడా వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు చైనాకు అనుకూలంగా మాట్లాడుతున్నారని, వారి అసలు రంగు బయటపడుతోందని అన్నారు. భారత్‌కు నష్టం చేకూర్చాలన్నదే కాంగ్రెస్ అజెండా అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ 'ప్రేమ దుకాణాలు' మొత్తం జాతి వ్యతిరేక శక్తులతో నిండిపోయాయని ఆరోపించారు. కులం, మతం, ప్రాంతం, భాష పేరిట ప్రజలను విడగొట్టడం, రాజకీయంగా పబ్బం గడుపుకోవడం కాంగ్రెస్ అలవాటేనని ధ్వజమెత్తారు. ఆ పార్టీ విద్వేషపూరిత అజెండా గురించి అందరికీ తెలుసని అన్నారు. చైనా, కాంగ్రెస్ మధ్య ఒప్పందం ఉన్న సంగతిని పిట్రోడా బయటపెట్టారని త్రివేది అన్నారు. చైనా పట్ల కాంగ్రెస్ అంతులేని అభిమానం ప్రదర్శిస్తోందని బీజేపీ జాతీయ ప్రతినిధి తుహిన్ సిన్హా ఆక్షేపించారు. 2008లో చైనా కమ్యూనిస్టు పార్టీతో కాంగ్రెస్ కుదుర్చుకుందని ఆరోపించారు. 40 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనాకు దారాదత్తం చేసిందని బీజేపీ సీనియర్ నేత అజయ్ అలోక్ విమర్శించారు. చైనా నుంచి పొంచి ఉన్న ముప్పును కాంగ్రెస్ గుర్తించకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదన్నారు.

కాంగ్రెస్‌కు సంబంధం లేదు: జైరామ్ రమేశ్

శామ్ పిట్రోడా వ్యాఖ్యలతో తమ పార్టీకి సంబంధం లేదని, అవి ఆయన వ్యక్తిగతమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పష్టంచేశారు.

ఉక్రెయిన్ యుద్ధంపై నేడు అమెరికా, రష్యా చర్చలు

రియాధ్: ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలకడం, తమ రెండు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపర్చుకునే లక్ష్యంతో అమెరికా, రష్యా ఉన్నతాధికారులు మంగళవారం సౌదీ అరేబియా రాజధాని రియాధ్‌లో సమావేశం కానున్నారు. దీని కోసం రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్, పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారు యూరీ ఉషకోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో, జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్, ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌లు సోమవారం రియాధ్‌కు చేరుకున్నారు. ఈ చర్చల్లో ఉక్రెయిన్ పాల్గొనడం లేదని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ ప్రకటించారు. దాదాపు మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా పూర్తి స్థాయి యుద్ధం మొదలయ్యాక అమెరికా–రష్యాల మధ్య జరుగుతున్న ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



ప్రయాణికుల భద్రతే లక్ష్యం...
ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో సికింద్రాబాద్ స్టేషన్‌లో రైల్వే ఉన్నతాధికారులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. -8లో



డిజైర్.. డిజైన్స్..
సిటీలో కృత్రిమ వజ్రాలు (ల్యాబ్‌గ్రోన్ డైమండ్స్) కొనేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. నిజమైన వజ్రాలను పోలి ఉండడం..ధర కూడా తక్కువగా ఉండడమే కారణం. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.0/19.0
నగర పరిధిలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ పెరుగుతుంది. రాత్రివేళ చల్లని వాతావరణం ఉంటుంది.

గ్రేటర్ ఇమేజ్‌ను పెంచుదాం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి





షేక్‌పేట నాలా వద్ద గుర్రం ప్రతిమల కూడలిని ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: దేశవ్యాప్తంగా హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేందుకు నగరంలో సుందరీకరణ పనులను చేపట్టినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం సాయంత్రం రోడ్డునెంబర్.45, షేక్‌పేట నాలా జంక్షన్ వద్ద మొత్తం రూ.49 లక్షల వ్యయంతో సుందరీకరించిన జంక్షన్లను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి పర్యాటక రంగంలో అంతర్జాతీయ నగరంగా గుర్తింపు ఉన్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రభుత్వం హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నగర వ్యాప్తంగా రూ.150 కోట్ల అంచనా వ్యయంతో 106 ప్రదేశాల్లో పనులను చేపట్టే లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 78 పనులను పూర్తి చేసినట్లు మేయర్ పేర్కొన్నారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. షేక్‌పేట నాలా వద్ద రూ.24 లక్షల వ్యయంతో చేపట్టగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.45 వద్ద చేపట్టిన సుందరీకరణ పనులకు రూ.25 లక్షల వ్యయంతో చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీసీ ప్రశాంతి, ఎస్ఈ రత్నాకర్, ఈఈ విజయ్‌కుమార్, షేక్‌పేట కార్పొరేటర్ పారస్, యూబీడీ జోనల్ హార్టికల్చర్ అధికారి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బేరసారాలు షురూ!

పరీక్షల కంటే ముందే అడ్మిషన్ల జోరు



- హలో సార్ ...మీ పాప మౌనిక పదవ తరగతి చదవుతున్నది కదా..!. ఇంటర్‌కు ఏం ప్లాన్ చేస్తున్నారు సార్? మాది ఫలానా కార్పొరేట్ కాలేజీ. ఐఐటీ, ఈఏపీసెట్ కోచింగ్, ఏసీ, నాన్ ఏసీ స్పెషల్ బ్యాచ్‌లు ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం కూడా ఉంది. ఇప్పుడు జాయిన్ అయితే ఫీజులో కొంత డిస్కౌంట్ ఉంటుంది. పరీక్షల తర్వాత సీట్లు కష్టం. అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఫీజులు పెరుగుతాయి. ముందుగా సీటు రిజర్వ్ చేసుకుంటే బాగుంటుంది. ఒకసారి కాలేజీ క్యాంపస్‌కు విజిట్ చేసి చూడండి.

- సార్ గుడ్ ఈవెనింగ్, కార్తీక్ ఫాదరేనా? మీ అబ్బాయి ఇంటర్మీడియట్ చదువుతున్నాడు కదా. బీటెక్ కోసం ఏం ప్లాన్ చేశారు. తమిళనాడు, కేరళలోని ఫలానా యూనివర్సిటీల్లో బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఏఐఎంఎల్, డేటాసైన్స్, మెకానికల్ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఆసక్తి ఉంటే చెప్పండి..రాయితీలు ఇప్పిస్తాం...

... టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పుడు ఇలాంటి ఫోన్ల బెడద పెరిగింది. కనీసం బోర్డు పరీక్షలు కూడా కంప్లీట్ కాకముందే కార్పొరేట్ కాలేజీలు బేరసారాలు ప్రారంభించాయి. అడ్డగోలు ఫోన్లు, ఆఫర్లతో తల్లిదండ్రులను అయోమయానికి గురిచేస్తున్నాయి. పరీక్షలు కూడా రాయకుండా అడ్మిషన్లు ఎలా తీసుకోవాలి..తీసుకోకుంటే ఫీజులు ఇంకా పెరుగుతాయేమో అని వారు ఆందోళనకు గురవుతున్నారు.

సాక్షి, సిటీబ్యూరో: పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాకుండానే..ముందస్తు అడ్మిషన్లతో కార్పొరేట్ కళాశాలలు హడావుడి చేస్తున్నాయి. అనుమతి లేకుండా విద్యార్థుల డేటాను సంపాదించి వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ వల విసురుతున్నారు. ఫోన్లే కాకుండా వాట్సాప్‌లకు అడ్మిషన్ల మెసేజ్‌లు పంపుతున్నారు. వీటికి ఎక్కువగా తల్లిదండ్రులు ప్రభావితమవుతున్నారు. ముందుగా మేల్కోకుంటే ఫీజులు ఎక్కడ పెంచుతారోనని వారు ఆందోళన చెందుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని అందిన కాడికి దోచుకునేందుకు కార్పొరేట్ ఇంటర్, ఇంజనీరింగ్ కళాశాలలు గాలం వేస్తున్నాయి. ఆకట్టుకునేలా బ్యాచ్‌కో పేరు పెట్టి రంగు రంగుల బ్రోచర్లు చూపి మంచి భవిష్యత్తు అంటూ ఆశల పల్లకిలో విహరింపజేస్తూ రూ.లక్షల్లో ఫీజులు బాదేస్తున్నారు.

ఇంటర్, ఇంజనీరింగ్ కోర్సుల పేరిట 'ముందస్తు' దోపిడీ

- సీటు రిజర్వ్ చేసుకుంటే డిస్కౌంట్ అంటూ ఆఫర్లు
- తల్లిదండ్రులకు పెరిగిన ఫోన్ల తాకిడి
- ఆసక్తి కనబరిస్తే ఇంటివరకు..

మరోవైపు పీఆర్‌ఓలు...

వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం పలు విద్యాసంస్థల పీఆర్‌ఓలు కూడా రంగంలోకి దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులు కొద్దిగా ఆసక్తి కనబర్చినా చాలు విద్యార్థుల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. నామినల్ రోల్ ద్వారా విద్యార్థుల వివరాలు ఫోన్ నెంబర్లు, చిరునామా సేకరిస్తున్నారు. వాటి కోసం సంబంధిత విభాగాల ఇన్‌చార్జిలకు విందులు, నజరానాలు సమకూర్చుతున్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థుల వివరాలు ఎవరికి ఇవ్వరాదు. కానీ కాసులకు కక్కుర్తి పడి కింది స్థాయి సిబ్బంది కొందరు విద్యార్థుల సమాచారం అందిస్తున్నారు. దీంతో పీఆర్‌ఓ ఉదయం నుంచి రాత్రి వరకు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి బ్రోచర్లు ఇవ్వడం..కళాశాలల గురించి వివరిస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అడ్మిషన్లు ఎక్కువగా చేసిన వారికి ఇన్సెంటివ్ అవకాశం ఉండటంతో పోటీపడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా

సాధారణంగా పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాతనే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాల ప్రక్రియ నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక ఈసారి గతేడాది కంటే ఫీజులు అధికంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. కనీసం 20 శాతం అధికంగా ఫీజుల దోపిడీకి కళాశాలలు సిద్ధమయ్యాయి. ఇంటర్‌కు సంబంధించి 'సూపర్, స్టార్, సీఓ' బ్రాంచ్‌ల పేరిట కొన్ని కళాశాలలు ఏడాదికి రెండున్నర నుంచి మూడు లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. ఇక ఇంజనీరింగ్ కోర్సులకు రూ.ఐదు నుంచి రూ.10 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యమేల?

'టౌన్‌ప్లానింగ్' తీరుపై కమిషనర్ ఆగ్రహం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో ప్రతివారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తుండటం, తమ సమస్య పరిష్కారం కాలేదంటూ ప్రజలు మళ్లీ మళ్లీ వస్తుండటంతో కమిషనర్ ఇలంబర్తి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా, అక్రమ నిర్మాణాలపై సర్కిళ్లలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మలక్‌పేటలో జరుగుతున్న అక్రమ నిర్మాణానికి సంబంధించి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కొందరు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆయన సంబంధిత ఏసీపీకి ఫోన్‌చేయాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఫోన్‌లో లైన్‌లోకి వచ్చిన సదరు ఏసీపీపై ఫిర్యాదు పరిష్కారం కాకపోవడంపై మండిపడ్డారు. అక్రమనిర్మాణాన్ని కూల్చివేయడంతో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ..మీ బదులు నేనే అక్కడకు వచ్చి నిల్చుని పని చేయించాలా? అని ప్రశ్నించారు. ఎన్నిసార్లు చెప్పినా టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో మార్పు రావడం లేదని, కనీసం ఒకరిద్దర్ని సస్పెండ్ చేస్తే కానీ మిగతా వారైనా దారిలోకొస్తారంటూ సదరు ఏసీపీకి మెమో జారీ చేయాల్సిందిగా సంబంధిత ఉన్నతాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు నిబంధనల మేరకు పనిచేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 57 ఫిర్యాదులు రాగా, అందులో 25 టౌన్‌ప్లానింగ్‌వే ఉండటం కూడా కమిషనర్ ఆగ్రహానికి కారణంగా సిబ్బంది భావిస్తున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్, గీతా రాధిక, పంకజ, సుభద్ర దేవి, వేణు గోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్ పాల్గొన్నారు.

బరిలో బీఆర్ఎస్

రసవత్తరంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక వ్యవహారం

- 15 సీట్లకు 17 మంది నామినేషన్లు
- బీఆర్ఎస్ సభ్యులు వైదొలగకుంటే పోలింగ్ తప్పదు



సాక్షి, సిటీబ్యూరో:

రాష్ట్రంలో జరిగిన అధికార మార్పిడితో జీహెచ్ఎంసీ పాలక మండలిలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలకమండలి ఏర్పడినప్పటి నుంచి బీఆర్ఎస్-ఎంఐఎం పార్టీలు స్టాండింగ్ కమిటీకి పరస్పర అవగాహనతో పోటీ చేయడంతో ఎన్నిక జరగకుండానే కమిటీ ఏకగ్రీవమవుతూ వచ్చింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో సఖ్యతగా ఉండే ఎంఐఎం..తన స్టాండ్ కనుగుణంగా ప్రస్తుతం కాంగ్రెస్‌తో జత కట్టింది. దీంతో కాంగ్రెస్, ఎంఐఎం తమ కార్పొరేటర్లను స్టాండింగ్ కమిటీ ఎన్నిక కోసం బరిలో దింపాయి. ఇక అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నుంచి సైతం ఇద్దరు స్టాండింగ్ కమిటీకి నామినేషన్లు వేయడంతో ఉపసంహరణ గడువు దాకా కొంత డ్రామా జరిగే అవకాశం ఉంది. స్టాండింగ్ కమిటీలో 15 స్థానాలున్నాయి. కార్పొరేటర్లు 15 మందిని ఎన్నుకోవాల్సి ఉంది. ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడం..ఇద్దరి మృతితో నాలుగు స్థానాలు ఖాళీ కాగా 146 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరే స్టాండింగ్ కమిటీని ఎన్నుకునేందుకు ఓటర్లు. ఎక్కువ ఓట్లు పొందిన వారు స్టాండింగ్ కమిటీ సభ్యులయ్యే అవకాశం ఉంది. పొత్తు లేకుండా పార్టీలు వేటికవి విడివిడిగా పోటీ చేస్తే పరిస్థితి వేరుగా ఉండేది. ఎక్కువ మంది కార్పొరేటర్లున్న బీఆర్ఎస్ గెలిచేది. కానీ ఎంఐఎం, కాంగ్రెస్ పొత్తుతో ఆ రెండు పార్టీల వారే ఎన్నికయ్యే అవకాశాలున్నాయి. కార్పొరేటర్ల బలానికనుగుణంగా స్టాండింగ్ కమిటీకి పార్టీలు సభ్యులను నిలబెడుతున్నాయి. బీఆర్ఎస్-ఎంఐఎం పొత్తు ఉన్నప్పుడు బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆపార్టీ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఏడుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నిలబడి, గెలిచేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ కంటే ఎంఐఎం బలం ఎక్కువగా ఉండటంతో ఎంఐఎం ఎనిమిదిమందిని బరిలో దింపింది. కాంగ్రెస్ నుంచి ఏడుగురు పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ తమ కార్పొరేటర్లను పోటీకి దింపాలో, వద్దో నిర్ణయించకముందే ఆ పార్టీకి చెందిన ఇద్దరు నామినేషన్లు వేశారు. పార్టీల బలాల దృష్ట్యా, అధిష్ఠానం ఆదేశిస్తే వారిద్దరూ ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి. లేని పక్షంలో క్రాస్ ఓటింగ్‌పై ఆశతో బరిలో ఉండవచ్చు. అదే జరిగితే ఉత్కంఠ భరితమైన పోలింగ్ జరగనుంది. బీజేపీ సైతం స్టాండింగ్ కమిటీకి పోటీ చేయాలని భావించినప్పటికీ, పార్టీ పెద్దల సూచనతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఒకవేళ పోలింగ్ జరిగితే, పోటీలో లేని బీజేపీ సభ్యుల ఓట్లు ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి.

నామినేషన్లు వేసింది వీరే..

గడువు ముగిసేలోగా నామినేషన్లు వేసిన వారిలో ఎంఐఎం నుంచి బాతా జబీన్, సయ్యద్ మిన్హాజుద్దీన్, అబ్దుల్ వాహబ్, మహ్మద్ సలీమ్, పర్వీన్ సుల్తానా, సమీనాబేగం, డా. అయేషాహుమేరా, గౌసుద్దీన్ మహ్మద్‌లున్నారు. కాంగ్రెస్ నుంచి మహాలక్ష్మి రామన్ గౌడ్, బూరుగడ్డ పుష్ప, సీఎన్ రెడ్డి, వి.జగదీశ్వర్‌గౌడ్, బానోతు సుజాత, బొంతు శ్రీదేవి, ఎండీ బాబా ఫసియుద్దీన్‌లున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన జూపల్లి సత్యనారాయణరావు, ప్రసన్నలక్ష్మి కూడా నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు పార్టీల గుర్తింపు అంటూ లేదు.

నేడు నామినేషన్ల పరిశీలన

నామినేషన్ పత్రాలను కమిషనర్ కార్యాలయంలో మంగళవారం స్క్రూటినీ చేస్తారు. పోటీకి అర్హులుగా నిలిచేవారు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ఈనెల 21వ తేదీ వరకు గడువుంది. అన్ని నామినేషన్లు అర్హత పొంది, ఎవరూ ఉపసంహరించుకోని పక్షంలో 25వ తేదీన పోలింగ్‌జరగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్టాండింగ్ కమిటీలో స్థానం ఉన్న కాంగ్రెస్ పార్టీ..బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు స్టాండింగ్ కమిటీలో స్థానం లేకుండానే ఉంది. తిరిగి స్టాండింగ్ కమిటీలోకి వచ్చే అవకాశం ఏర్పడినట్లు పరిశీలకులు చెబుతున్నారు.

ఫాం ల్యాండ్ ప్లాట్ల పేరుతో అక్రమ లేఔట్లు

కొని మోసపోవద్దని సూచించిన హైడ్రా



సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలో ఫాం ల్యాండ్ ప్లాట్ల పేరిట అక్రమ లేఔట్ల అమ్మకాలు జరుగుతున్నాయని, అనుమతి లేని వాటిలో ప్లాట్లు ఖరీదు చేసి ఇబ్బందులు పడొద్దని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సోమవారం హెచ్చరించింది. ఫార్మ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అమ్మకాలు జరుగుతున్నాయని తమకు ఫిర్యాదులు వచ్చాయని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం లక్ష్మీగూడ గ్రామంలోని సర్వే నం.50లోని 1.02 ఎకరాల్లో ఫాం ప్లాట్ల పేరిట లే ఔట్ వేసి అమ్మేస్తున్నారని సోమవారం నాటి ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మున్సిపల్ యాక్ట్-2019, తెలంగాణ పంచాయత్ రాజ్ యాక్ట్-2018 ప్రకారం ఎక్కడా ఫాం ల్యాండ్ ప్లాట్లుగా అమ్మడానికి వీలులేదని ఆయన పేర్కొన్నారు. ఫాం ల్యాండ్ అంటే కనీసం 2 వేల చదరపు మీటర్లు, లేదా 20 గుంటల స్థలం ఉండాలని ప్రభుత్వం గతంలోనే నిర్దేశించిందని వివరించారు. ఈ మేరకు ఫాం ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేయరాదని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు కూడా ఇచ్చిందని రంగనాథ్ తెలిపారు. జీవో నం.131 ప్రకారం 2020 ఆగస్టు 31 తర్వాత వెలసిన అక్రమ లేఔట్లలోని ప్లాట్లలో ఇల్లు నిర్మించడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం గుర్తించాలని కోరారు.

ప్రజావాణిలో 64 ఫిర్యాదులు...

సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 64 ఫిర్యాదులు అందాయి. తమ కాలనీలకు వెళ్లేందుకు వీలు లేకుండా కొందరు చుట్టూ ప్రహరీలు నిర్మించుకుంటున్నారని, నాలాలు కబ్జా చేసి వరదనీరు వెళ్లడానికి వీలు లేకుండా చేస్తున్నారనే అంశాల పైనే ఎక్కువ ఫిర్యాదులు ఉన్నాయి. రహదారులకు అడ్డంగా నిర్మాణాలు, ప్రహరీలు నిర్మించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన వాటిని తొలగించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. మేడ్చల్ జిల్లా కాచవాని సింగారం గ్రామంలోని సర్వే నం.54లో ఉన్న లేఔట్‌లోని భాగ్యనగర్ నందనవనం పార్కును కబ్జా చేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. దేవరయాంజల్‌లో సర్వే నం.452, 453లో 3.39 ఎకరాలలో లే ఔట్ వేసి ప్రహరీ నిర్మించడంతో తమకు దారి లేకుండా పోయిందని ఆ ప్రాంత నివాసితులు ఫిర్యాదు చేశారు. జూబ్లీ హిల్స్ ఫిల్మ్‌నగర్‌లోని రాక్‌గార్డెన్స్ అంటూ లే ఔట్‌లో పేర్కొన్న ప్రాంతంలో ప్రస్తుతం ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ పేరిట వ్యాపారం చేస్తున్నారని స్థానికుడు హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. కాప్రా మున్సిపాలిటీలోని కుషాయిగూడ విలేజ్‌లో సర్వే నం. 177లో ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మేశారని, ఆ పార్కు స్థలాన్ని పక్కనే ఉన్న తమ లేఔట్‌లో చూపిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. కబ్జా చేయడమే కాకుండా అక్కడ కల్లు కాంపౌండ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

సీవరేజి పనులు చకచకా!

- 135 కిలో మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు
- రూ.297 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు

నాలుగు నియోజకవర్గాల్లో మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణ



పనులు పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నదికి ఉత్తరం వైపున..కోర్ సిటీలో సీవరేజి వ్యవస్థ ఆధునికీకరణ కోసం జోన్-3 సీవర్ నెట్‌వర్క్ ప్రాజెక్టు పనులు చకచకగా సాగుతున్నాయి. నాలుగు నియోజకవర్గాల పరిధిలో 33.50 చదరపు కిలో మీటర్ల వరకు సీవరేజీ పనులు విస్తరించనున్నారు. నగరంలోని ఓల్డ్ సిటీ పరిధిలోని గోషామహల్, నాంపల్లి, కార్వాన్‌లతో పాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీవరేజి వ్యవస్థను ఆధునికీకరించడానికి ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఇప్పటి వరకు జోన్-3 సీవర్ నెట్‌వర్క్ పైపులైన్ పొడవు 135 కిలో మీటర్లు కాగా..ఇప్పటి వరకు 120 కిలో మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. ఇందులో 9.5 కిలో మీటర్ల మేర 200-300 డయా పైపులైన్ పనులు, 6.5 ట్రంక్ మెయిన్లు నిర్మాణం కొనసాగుతోంది. మరోవైపు 10 ప్రాంతాల్లో 1.2 కిలో మీటర్లు టన్నెలింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి.

ప్రాజెక్టు పరిధిలోకి..

టోలిచౌకి, గోల్కొండ, లంగర్‌హౌస్, సెవెన్ టూంబ్స్, జూబ్లీ హిల్స్(కొంత భాగం), మెహదీపట్నం, నానల్‌నగర్, ఆసిఫ్ నగర్, విజయ్‌నగర్ కాలనీ, ఎన్ఎండీసీ కాలనీ, మాసబ్ ట్యాంక్, రెడ్ హిల్స్, లక్డీకాపూల్, బజార్‌ఘాట్, నాంపల్లి, మల్లేపల్లి, బేగం బజార్, తదితర ప్రాంతాలు వస్తాయి.

పనుల పరిశీలన

సీవర్ నెట్‌వర్క్ పరిధిలో సమస్యాత్మకమైన ప్రాంతాల్లో నిర్మాణ దశలోగల పనులను సోమవారం ఎండీ అశోక్‌రెడ్డి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహిద్దీన్‌తో కలిసి పరిశీలించారు. మొదటగా టోలిచౌకి ఫ్లైఓవర్ ప్రధాన రహదారిలో చేపట్టే జంక్షన్ పనులను ఆటంకాలు రాకుండా ఎలా చేపట్టాలో చర్చించారు. ఇక్కడ ప్రధాన రహదారికి ఇరువైపులా వివిధ ప్రార్థనాలయాలు, లేబర్ అడ్డాలు ఉండడంతో పనులు చేపట్టడం అంత సులువు కాదని అంచనా వేశారు. దాదాపు 8 నుంచి 11 మీటర్ల లోతులో జరిగే టన్నెలింగ్ పనులను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రద్దీ లేని సమయాల్లో, సెలవు రోజుల్లో నిర్వహించాలని నిర్ణయించారు.

సమన్వయంతో పనులు

టన్నెలింగ్ పనులు చేపట్టే సమయంలో జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, ట్రాన్స్‌మిషన్, ఓ అండ్ ఎం అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సక్రమంగా నిర్వహించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. అక్కడక్కడ ట్రయల్ పిట్ ఏర్పాటు చేసుకుని భూగర్భంలో ఉన్న పైపులైన్లు, కేబుళ్ల తదితరాలను అంచనా వేసుకుని వాటికి ఆటంకం కలుగకుండా పనులు నిర్వహించాలని సూచించారు. పనులు చేపట్టే సమయంలో సరైన బారికేడ్లు, రక్షణ పరికరాలను ధరించి భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. అక్కడి నుంచి సెవెన్ టూంబ్స్ వెళ్లే రహదారిలో అండర్ గ్రౌండ్ టన్నెలింగ్ పనులను ఎండీ పరిశీలించారు. మార్చి మొదటి వారం వరకు ఈ స్ట్రెచ్ పూర్తయ్యేలా రెండు షిఫ్టుల్లో పనులు చేపట్టి వేగంగా చేయాలని ఆదేశించారు. అనంతరం గుడిమల్కాపూర్, గిరకపల్లి తదితర ప్రాంతాల్లో పురోగతిలో ఉన్న పైపులైన్ విస్తరణ పనుల్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సీజీఎం రాజేందర్, జీఎం కుమార్, ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



20 రోజులు.. 5 హత్యలు

- వరుస ఘటనలతో మేడ్చల్‌లో టెన్షన్
- భయాందోళనలో ప్రజలు


(ఫైల్)

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంటున్న వరుస హత్యలు, అనుమానాస్పద మృతి ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలోనే ఐదుగురు వ్యక్తులు హత్యకు గురికావడం, పలువురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది.

- గత నెల 24న స్థానిక ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో మహిళను హత్య చేసి పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు మూడు రోజుల్లోనే మృతురాలిని బోధన్‌కు చెందిన శివానంద(45)గా గుర్తించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన షేక్ ఇమామ్ అనే వ్యక్తితో డబ్బుల విషయమై తలెత్తిన వివాదం కారణంగానే హత్య జరిగినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
- ఈ నెల 8న కిష్టాపూర్ రోడ్డులోని సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో పని చేసే కార్మికుడు కన్నా(40)ను తనపై పెత్తనం చెలాయిస్తున్నాడనినే కోపంతో తోటి కార్మికుడు మద్దూరి రాజు హత్య చేశాడు.
- ఈ నెల 10న పట్టణంలోని కింది బస్తీకి సునావత్ రమేశ్(30)ను అతడి భార్య లలిత ప్రియుడు నర్సింహతో కలిసి కడతేర్చింది.
- ఈ నెల 16న ఆర్టీసీ ఉద్యోగి వేధింపులు తాళలేక అతడి బంధువులే దారుణంగా కత్తులతో పొడిచి హతమార్చారు.
- అత్వెల్లిలోని ఓ భవనంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, యాడారం గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడింది.
- ఆయా కేసులను ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేరాల నియంత్రణకు చర్యలు:

మేడ్చల్ పట్టణంలో 20 రోజుల వ్యవధిలో ఐదు హత్యలు చోటు చేసుకోవడం విచారకరం. ఒక్కో హత్యకు ఒక్కో నేపథ్యం ఉంది. వ్యక్తిగత కారణాలతోనే ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆయా కేసుల్లో నిందితులను గంటల వ్యవధిలో పట్టుకున్నాం. లా అండ్ ఆర్డర్ అదుపులోనే ఉంది. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు.

–శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ మేడ్చల్

ఉద్యోగంతో పాటు శిక్షణా ఇచ్చారు!

ఓ యువకుడికి సైబర్ నేరగాళ్ల టోకరా

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ యువకుడిని ఆన్‌లైన్ ద్వారా టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు అతడికి ఉద్యోగంతో పాటు శిక్షణ కూడా ఇచ్చారు. ఆపై రిఫండబుల్ డిపాజిట్ పేరుతో రూ.1.39 లక్షలు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి (28) ఓ ఆన్‌లైన్ సంస్థలో ఇన్వెస్టిమెంట్ బ్యాంకింగ్ కోర్సు పూర్తి చేయడానికి ఎన్‌రోల్ చేసుకున్నారు. ఇది పూర్తి చేసిన కొన్ని రోజులకు సదరు యువకుడికి 8778514787 నెంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తులు జాబ్ సెర్చింగ్ పోర్టల్‌లో ఈ యువకుడి ప్రొఫైల్ చూసినట్లు చెప్పారు. ఫోన్ ద్వారా ఇంటర్వ్యూ తంతు కూడా పూర్తి చేసి బెంగళూరులోని ఏటీఓఎస్ కంపెనీలో సీనియర్ అసోసియేట్ పోస్టుకు ఎంపికైనట్లు పత్రాలు పంపారు. ఆ ఉద్యోగంలో చేరడానికంటూ ఆన్‌లైన్‌లో కొన్ని రోజుల శిక్షణ కూడా ఇచ్చారు. ఆపై భారీ జీతంతో ఆఫర్ లెటర్ మెయిల్ చేసిన కేటుగాళ్లు ఉద్యోగంలో చేరే ముందు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.2 లక్షలు కట్టాలని చెప్పారు. అది రిఫండబుల్ డిపాజిట్ కావడంతో ఆ సంస్థలో చేరిన నాటి నుంచి పది రోజుల తరవాత ఈ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తారని నమ్మించారు. నిజమేనని నమ్మిన బాధితుడు నేరగాళ్లు చెప్పిన ఖాతాల్లోకి రూ.1,39,584 బదిలీ చేశాడు. ఆ తర్వాత కూడా ఉద్యోగంలో చేరే తేదీని త్వరలో చెప్తామంటూ నేరగాళ్లు వాయిదా వేసుకుంటూ వచ్చారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.



చదివింది ఎంటెక్... చేసేది చీటింగ్సే!

- మోసాల కోసం ఐటీ కంపెనీనే స్థాపించిన వైనం
- ఉద్యోగాల పేరుతో పలువురికి ఎర
- అడ్వాన్సులు, డిపాజిట్లంటూ భారీగా వసూళ్లు
- నిందితుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: ఎంటెక్ చదివిన ఓ వ్యక్తి కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని చేసి వాటిలో జరిగే ఎంపిక ప్రక్రియ తెలుసుకున్నాడు. ఆపై తానే సొంతంగా ఓ డమ్మీ కంపెనీ ఏర్పాటు చేసి ఉద్యోగాల పేరుతో ఎర వేశాడు. నిరుద్యోగుల నుంచి అందినకాడికి దండుకుని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లతో మోసం చేశాడు. ఇతడిపై ఇప్పటివరకు నాలుగు కేసులు నమోదు కావడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం టాస్క్‌ఫోర్స్ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు. చింతల్ వెంకటేశ్వర నగర్‌కు చెందిన కె.భార్గవ్ ఎంటెక్ పూర్తి చేసి కొన్ని ఐటీ కంపెనీల్లో హెచ్‌ఆర్ మేనేజర్‌గా పని చేశాడు. ఇలా ఇతడికి ఆయా కంపెనీల్లో ఉద్యోగుల ఎంపిక ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పడింది. దీనిని క్యాష్ చేసుకోవాలని భావించిన అతను ఐటీ ఉద్యోగాల పేరుతో మోసాలకు తెరలేపాడు. ఇందులో భాగంగా హైటెక్ సిటీ వద్ద ఓ కార్యాలయాన్నీ అద్దెకు తీసుకుని అందులో నియోజీన్ సాఫ్టటెక్ పేరుతో కార్పొరేట్ లుక్‌తో ఆఫీస్ ఏర్పాటు చేశాడు. అందులో కొందరిని ఉద్యోగులుగా నియమించడంతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్ డిజైన్ చేశాడు. తన కార్యాలయం ఫొటోలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచాడు. క్లౌడ్ సర్వీసెస్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, వెబ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ రంగాల్లో వివిధ ఉద్యోగాలు ఉన్నట్లు ఆన్‌లైన్‌లోనే ప్రకటన ఇచ్చాడు. జూనియర్ డెవలపర్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్ తదతర ఉద్యోగాలకు ఆకర్షణీయమైన వేతనాలు ఇస్తామని పేర్కొన్నాడు. కొందరు ఉద్యోగార్థులు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేసి ఈ కంపెనీ వెబ్‌సైట్, అందులో ఉన్న ఫొటోలు చూసి పెద్ద కంపెనీగా భావించారు. దరఖాస్తు చేసిన వారికి కన్సల్టెంట్స్ ద్వారా శిక్షణ కూడా ఇప్పించాడు. ఆపై ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి కొందరు ఎంపికైనట్లు ప్రకటించాడు. వీరికి ఈ–మెయిల్ ద్వారా జాబ్ ఆఫరింగ్ లెటర్లు పంపి... వారి నుంచి అడ్వాన్సులు, డిపాజిట్ల పేరుతో రూ.లక్ష, రూ.2 లక్షలు చొప్పున వసూలు చేశాడు. భారీ మొత్తం దండుకున్న తర్వాత తన కార్యాలయం మూసేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇతడి చేతిలో మోసపోయిన వారి ఫిర్యాదుతో లాలాగూడ, జీడిమెట్ల, మాదాపూర్, కల్వకుర్తి ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. భార్గవ్ ఆచూకీ కనిపెట్టడానికి మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రూ.లక్ష నగదు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, గుర్తింపుకార్డులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితుడిని లాలాగూడ పోలీసులకు అప్పగించారు. ఈ మోసాలు చేయడంలో ఇతడికి సహకరించిన వారు మరికొందరు ఉన్నారని గుర్తించిన టాస్క్‌ఫోర్స్ వారి కోసం గాలిస్తోంది.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

ఆరుగురు యువకుల అరెస్ట్

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఆరుగురు యువకులు ఓ కానిస్టేబుల్‌పై దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... బోరబండ అన్నానగర్ సైట్–3లో నివసించే ప్రసాద్ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఓ వీవీఐపీకి డ్రైవర్‌గా అటాచ్ అయ్యాడు. ఆదివారం రాత్రి అతను ఇందిరానగర్‌లోని అమృతాబార్ నుంచి బయటికి వచ్చాడు. అదే సమయంలో ఇద్దరు యువకులు గొడవపడుతుండటంతో అక్కడికి వెళ్లిన ప్రసాద్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో వారు నీవెవరు మాకు చెప్పేందుకు అంటూ అతడిపై దాడి చేయడమే కాకుండా తమ స్నేహితులు మరో ఐదుగురిని అక్కడికి పిలిపించారు. అకారణంగా ఏడుగురు కలిసి ప్రసాద్‌ను చితకబాదడమేగాక అతడి మెడలో ఉన్న బంగారు గొలుసు, రిస్ట్‌వాచ్ లాక్కున్నారు. అదే సమయంలో పోలీసు వాహనం వస్తుండటాన్ని గుర్తించిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే బాధితుడు స్కూటర్ నెంబర్ నోట్ చేసుకుని పోలీసులకు అందజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను శ్రీకృష్ణానగర్ ప్రాంతానికి చెందిన తనాల సాయికిరణ్, ప్రణీత్‌గౌడ్, నందిపాటి నవీన్, బండి సత్యకిరణ్, పందగడ శ్రీనివాస్‌గా గుర్తించి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సలీం అనే మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాధితుడు అధికార పార్టీకి చెందిన ప్రముఖురాలి వద్ద పని చేస్తుండటంతో కేసును మరింత సీరియస్‌గా తీసుకున్నారు.

ఉరేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య


రంగనాథ్‌రావు (ఫైల్)

రాంగోపాల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి లోనైన ఓ పోలీస్ కానిస్టేబుల్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిటీ పోలీస్ ఐటీసెల్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రంగనాథ్‌రావు (36) కళాసీగూడ కామాక్షి దేవాలయం ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య గాజుల దాక్షాయణి, కుమార్తె ఉన్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను అందు కు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అ యినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో డిప్రెషన్‌కు లోనయ్యాడు. ఆదివారం కుమార్తెతో కలిసి బోయిన్‌పల్లిలోని పుట్టింటికి వెళ్లిన అతడి భార్య దాక్షాయణి అక్కడి నుంచి భర్తకు వీడియో కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో రాత్రి ఇంటికి వచ్చి చూడగా రంగనాథ్ వెంటిలేటర్ గ్రిల్‌కు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి చూడ గా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీనిపై సమాచారం అందడంతో మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

పోలీస్ కస్టడీకి వీరరాఘవరెడ్డి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని మూడు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పోలీసులు అతడిని విచారించనున్నారు. ఈ నెల 7న రామరాజ్యం సైన్యం పేరుతో వీర రాఘవరెడ్డితో పాటు మరో 25 మంది చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్ ఇంట్లో ఆయనపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని ఈ నెల 8న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు అతడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు పంపారు. ఈ కేసులో కీలక విషయాలను రాబట్టేందుకు వీర రాఘవరెడ్డిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం వీరరాఘవరెడ్డి కస్టడీకి అనుమతి ఇచ్చింది. మంగళవారం పోలీసులు అతన్ని చర్లపల్లి జైలు నుంచి కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు 18 మందిని అరెస్టు చేసిన పోలీసులు మరో 8 మంది నిందితులకోసం ఏపీ, తెలంగాణలో గాలిస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు

- నిందితుడి రిమాండ్
- భారీగా సర్టిఫికెట్ల స్వాధీనం

ఫిలింనగర్: నకిలీ సర్టిఫికెట్ల విక్రయ ముఠా గుట్టును ఫిలింనగర్ పోలీసులు బట్టబయలు చేశారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన వజాహత్ అలీ (27) టోలిచౌకీలో నివాసం ఉంటున్నాడు. అతను అవసరమైన వారికి నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అతడిపై నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి షేక్‌పేట నాలా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వజాహత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు భారీగా నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

విదేశాలకు వెళ్లే వారే టార్గెట్..

దుబాయ్, కువైట్, మస్కట్, సౌదీ ఆరేబియా, బెహ్రైన్, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్లే యువకులు అందుకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం వజాహత్‌ను సంప్రదించేవారు. దీంతో అతను తనకు పరిచయస్తుడైన రఫీవుల్లాతో సంప్రదింపులు జరిపి సర్టిఫికెట్లు అవసరమైన వారి సమాచారం, యూనివర్సిటీ వివరాలు అందజేసేవాడు. వాటిని రఫీవుల్లా మలక్‌పేటలోని షైె అబ్రాడ్ కన్సల్టెన్సీలో పని చేసే హబీబ్‌కు అందజేసేవాడు. హబీబ్ వాటిని ఖాన్‌పూర్‌కు పంపడంతో అక్కడ ఉన్న నకిలీ సర్టిఫికెట్ల తయారీదారు సదరు వివరాలతో అవసరమైన యూనివర్సిటీ సర్టిఫికెట్లను ముద్రించి కొరియర్‌లో నగరానికి పంపేవాడు. ఇందుకు గాను ఒక్కో సర్టిఫికెట్‌కు వజాహత్ రూ.80 వేల వరకు వసూలు చేసేవాడు. అందులో రూ.10 వేలు కమీషన్ తీసుకుని మిగతా రూ.70 వేలు రఫీవుల్లాకు అందజేసేవాడు. రఫీవుల్లా రూ.10 వేలు కమీషన్ తీసుకుని రూ.60 వేలు హబీబ్‌కు ఇస్తే, అతను రూ.20 వేలు మినహాయించుకుని రూ.40 వేలు ఖాన్‌పూర్‌లో ఉంటున్న నకిలీ సర్టిఫికెట్ల తయారీదారుడికి ఇచ్చేవాడు. ఈ తరహాలో వీరు ఆంధ్రా యూనివర్సిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, సింబియాసిస్ యూనివర్సిటీ తదితర 20 ప్రఖ్యాత యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లను అచ్చుగుద్దినట్లు తయారుచేసి విక్రయిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది. నిందితుడు వజాహత్‌ను అరెస్టు చేసిన పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


ఎజాజ్ హలీమ్ ఖాన్ మృతదేహం

సుభాష్ నగర్ : కరెంటు తీగను కట్ చేస్తుంగా విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కైసర్ నగర్ చెందిన మహమ్మద్ అలీమ్ ఖాన్ కుమారుడు ఎజాజ్ హలీమ్ ఖాన్ (13) కరెంట్ పని చేసేవాడు. సోమవారం సాయంత్రం అతను నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో కరెంట్ తీగను కట్ చేస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి చేతిలో యువకుడి దారుణ హత్య


వెంకటరమణ మృతదేహం


వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: మద్యానికి బానిసైన ఓ యువకుడు తన కుటుంబ సభ్యులను వేధిస్తుండటంతో ఆగ్రహానికి లోనైన ఓ బాలుడు తన మేనత్త కొడుకు(బావ)ను దారుణంగా హత్య చేసిన సంఘటన సోమవారం మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం, రాఘవేంద్ర నగర్ కాలనీలో రాధ తన తండ్రి జంగయ్య, ఇద్దరు కుమారులు శ్రీనివాస్, వెంకటరమణ(30), తమ్ముడి కుమారుడు విష్ణు(16)తో కలిసి నివాసం ఉంటోంది. వెంకటరమణ కిష్టాపూర్, అర్చన కాలనీ శివాలయంలో పూజారిగా పని చేసేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై అర్చక వృత్తిని వదిలేసిన అతను కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఐదు రోజుల క్రితం రాధ, తండ్రి జంగయ్యతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లగా, ఇంట్లో వెంకటరమణ ,అతని బావమరిది అయిన మైనర్ బాలుడు ఉన్నారు. ఆదివారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అయితే అప్పటికే అతడి వైఖరితో విసిగిపోయిన బాలుడు వెంకటరమణను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి నిద్రిస్తున్న వెంకటరమణను కత్తితో గొంతు నరికి హత్య చేశాడు. సోమవారం ఉదయం మృతుడి సోదరుడికి ఫోన్ చేసి వెంకటరమణ మృతి చెందినట్లు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మైనర్ బాలుడే హత్యకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు పరారీలో ఉన్న అతడి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కుత్బుల్లాపూర్: డీసీఎం ఎక్కుతున్న ముగ్గురు వ్యక్తులను వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రామకృష్ణ మైటి(35), తపస్ గురియా, గురవస్ దాస్ ఏడాదిగా పేట్‌బషీరాబాద్‌లోని క్రియేషన్ డెకరేషన్‌లో పని చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ముగ్గురు కొంపల్లి బ్రిడ్జిపై డీసీఎం వాహనం ఎక్కుతున్నారు. అదే సమయంలో వెనకనుంచి వేగంగా వచ్చిన కారు వీరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యా విధానంపై బహిరంగ విచారణ

లక్డీకాపూల్: హైదరాబాద్ జిల్లాలో విద్యా విధానంపై తెలంగాణ విద్యా కమిషన్ బహిరంగ విచారణను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్‌పర్సన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో పబ్లిక్ హియరింగ్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా...

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పటిష్ట చర్యలు
- ఢిల్లీ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తం
- స్టేషన్ ముందు పార్కింగ్ తొలగించేందుకు చర్యలు
- సికింద్రాబాద్ బస్‌స్టాప్‌లు బదలాయింపుకు నిర్ణయం
- ట్రాఫిక్, రక్షణ చర్యలపై పోలీసుల సమీక్ష



సికింద్రాబాద్: ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ఘటన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు, నగర పోలీస్ ఉన్నతాధికారులు అధికారులు అప్రమత్తం అయ్యారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నిర్మాణం పనుల నేపథ్యంలో పాత భవనాల కూల్చివేతలు ఒకవైపు జరుగుతుండగా..మరోవైపు స్టేషన్ ప్రవేశ ద్వారాల మూసివేత, మళ్లింపులు, ప్రయాగ్‌రాజ్ ప్రయాణికుల సందడితో రైల్వేస్టేషన్‌లో గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రక్షణ చర్యలు కల్పించేందుకు ఉపక్రమించారు. సోమవారం దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తోపాటు వివిధ విభాగాల అధికారులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. రైల్వేస్ అదనపు డీజీపీ రమేశ్‌నాయుడు, ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాల్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తదితర అధికారులతో కలిసి రైల్వేస్టేషన్‌తోపాటు పరిసర ప్రాంతాల పరిస్థితులను అధ్యయనం చేశారు.

బస్టాప్‌ల తరలింపు

రైల్వేస్టేషన్ భవనాలు కూల్చివేయడం, స్టేషన్ ముందు బారికేడ్లు, అక్కడి ఇరుకైన స్థలంలో తాత్కాలిక జనరల్ టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు ఫలితంగా రైల్వేస్టేషన్ లోపల, బయట గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్ ముందుగల బస్‌స్టాప్‌లను మరో చోటికి బదలాయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు. సికింద్రాబాద్ పాత గాంధీ ఆసుపత్రి స్థలంలోని వెస్ట్ మెట్రో స్టేషన్ వద్ద బస్‌స్టాప్‌లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. స్టేషన్ ముందున్న 10వ నెంబర్ బస్‌స్టాప్‌ను మరో చోటికి బదలాయించడం ద్వారా కొంతమేర ట్రాఫిక్ సమస్యలను అధిగమించే అవకాశం ఉందన్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం: జీఎం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాగణంలో భారీ కూల్చివేతలు, నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు కొంతమేర అసౌకర్యానికి గురవక తప్పడం లేదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. రైల్వేస్టేషన్‌లో సోమవారం పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భవనాల కూల్చివేతల నేపథ్యంలో రైల్వేస్టేషన్ ప్రవేశ మార్గాలను మూసివేయడం, మళ్లించడం జరుగుతుందన్నారు. ఇక ముందు ప్రయాణికులు ఇబ్బందులపాలు కాకుండా సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రయాణికుల రక్షణ కోసం ప్రత్యేక బలగాలను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి వరకు స్టేషన్ పునర్నిర్మాణ పనులు పూర్తవుతాయని జీఎం ప్రకటించారు.

సాక్షి క్లాసిఫైడ్స్



- HMDA అప్రూవ్డ్ శ్రీశైలం హైవే ఫేసింగ్ కందుకూరు దగ్గర వెంచర్‌లో ప్లాట్లు అమ్మబడును. రెడీ టూ కన్‌స్ట్రక్ట్. Ph: 8309376230 [SCA25001752]

COMMERCIAL

- FOR LEASE: Office Space Available at Banjarahills Road No-03, 2000 Sft Plug and Play. Contact: 9849438140, 9292105575 [HA-15140]

HOUSE FOR SALE

- Karmanghat near main road House for Sale. G+1 = 2BHK + 3BHK 200 yards West Face 30 Feet road Ph: 9885202404 [HA-1053]



BUSINESS SERVICE



- మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]
- మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

PERSONAL CARE



CHANGE OF NAME

- I, MEENA BAI W/o. DHYANESHWAR, R/o H.No.4-7-156/3/83/1, Panduranga Nagar, Rambagh, Rajendra Nagar, Ranga Reddy Dist-500048, TS. I have Changed my name from MEENA BAI to MEENA BAI KHONDE for all the purposes [SCA25001758]
- I, Palwai Upender Reddy S/o Raghuma Reddy Palvai Resident of Flat No.203 Sri Sai Sudha Enclave, KNR Colony, Nizampet, Hyd, has changed my name as UPENDER REDDY PALVAI for all purposes [SCA25001753]
- I, Usha Vaidyanathan, D/o. Late. R.V. Nathan, Regimental No. 06855569. R/o. Plot No. 133, Flat No. FF-3, Hardev Chanikya Residency, Saptagiri Colony, Neredmet, Malkajgiri, Medhchal-Malkajgiri Dist - 500094, T.S., my Incorrect name: R.V.G. Usha Bai & Correct Name is Usha Vaidyanathan (for all future purposes) [SCA25001759]
- I, M Spandhana W/o, Vanga Yashwanth Reddy R/o 3-100/106, Sri Balaji Heights, Jayabheri Park, Kompally, Hyderabad, Telangana - 500014, have changed my name to Vanga Spandhana Reddy. [DA-41320]
- I, Pattabhi Ramaiah Sykam S/o, Pitchi Reddy Sykam R/o Flat No. 405, Pt No. 397, 398, Sri Dinesh Castle, Nizampet, Medchal -Malkajgiri - 500090 have changed my name to Pattabhi Ram Reddy Sykam for all purposes. [DA-13277]

OLD AGE HOME

- వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానసున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783368]



- ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీ॥ 15-25K హౌస్ కీపింగ్ బాయ్స్ కావలెను. 8019373131/040-45043410 [H-800524]
- శ్రీ సాయిరామ్ హోమ్‌కేర్, హైదరాబాద్‌లో బేబీ కేర్, పేషెంట్‌కేర్, ముసలివాళ్లకు ఆయాలు, నర్సులు & ఇంటిపని, వంటపనికి మనుషులు కావలెను. జీ: 18 వేలు ✆ 9949094607, 99084 54607 [B-8534]
- Wanted Exp Sales Executive for Textiles Wholesaler , Auto Drivers, Helpers @ Sec-Bad. Ph: 8801805758 [HA-6254]

FACULTY TEACHERS

- Wanted All Sub Teachers Nursery-X Maha Guru School Attractive Salary. Cont: Principal 9989020028 HF Nagar Rahmat Nagar [SCA25001663]
- Voxpop International School @ Miyapur is Hiring Qualified, Trained & Experienced Teachers for All Subjects from PP to X Grade with decent salary. Graduates & Post Graduates with PPTC, B.Ed & 5yrs Experience can Walkin: PP & Primary: 1/03/2025 & 2/03/2025: 9am-2pm Middle & Higher: 8/03/2025 & 9/03/2025: 9am-2pm. Ph:9701511567. [HA-15145]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-24/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని జెడ్పీ ఆఫీస్, ఏసీ గార్డ్స్ సబ్ స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జెడ్పీ ఆఫీస్ సబ్ స్టేషన్ పరిధిలో రేణుకా ఎన్‌క్లేవ్, రవీంద్ర నగర్, జెడ్పీ ఆఫీస్ లేన్, శ్రీధర్ ఫంక్షన్ హాల్, గాంధీ తాతానగర్, వెంకటరమణ కాలని కొంత భాగం, శాంతి నివాస్ అపార్ట్‌మెంట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునేట్ల తెలిపారు. జెడ్పి ఆఫీస్, ఏసీ గార్డ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖాన్ రెసిడెన్సి, రెడ్ క్రాస్ స్కూల్ ఏరియా, శ్యాంనగర్ ఏరియా, పరదేశి హోటల్ ఏరియా, స్కిల్ రెసిడెన్సి,పీతాంబర్ పిటి ఏరియా, ప్రేమ్‌నగర్ ఏరియా, కేర్ హాస్పిటల్, విరించి, సాక్షి దినపత్రిక కార్యాలయం, వాటర్ వర్క్స్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండని తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13లోని అంబేద్కర్ నాలా వద్ద ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తుండగా బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వి కొంతకాలంగా అంబేద్కర్ నాలా వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తాగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడ దాడులు చేయగా జి.మనోజ్‌సింగ్, పి.సందీప్, జే మహేష్ ముగ్గురూ కలిసి గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి మూడు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఖైరతాబాద్ చౌరస్తాలో ఆజం అనే వ్యక్తి నుంచి ఈ గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసినట్లు వీరు వెల్లడించారు. వీరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బంజారాహిల్స్: గుట్టుచప్పుడు కాకుండా పోలీసుల కళ్లు గప్పి కొనసాగుతున్న పేకాట శిబిరంపై బంజారాహిల్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లోని సయ్యద్‌నగర్‌లో జహంగీర్‌పాషా సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తూ ఈజీ మనీ కోసం అలవాటు పడ్డాడు. తన గదిని కొంతకాలంగా జూద గృహంగా మార్చాడు. ఆయనతో పాటు అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ ఆబిద్‌పాషా, మహ్మద్ జావీద్, ఖాజాపాషా, సయ్యద్ అలీ తదితరులు పేకాడుతుండగా పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.17 వేల నగదు సీజ్ చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్ బాల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ ఇంటర్నేషనల్ హైస్కూల్ విద్యార్థులు బాస్కెట్ బాల్ పోటీలో తమ ప్రతిభను చాటుకున్నారు. ఆదివారం బేగంపేటలో పోటీలను నిర్వహించారు. ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు అండర్-14 బాలుర విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారు. అండర్-10 బాల బాలికల విభాగాల్లో కన్సోలేషన్ బహుమతులు పొందారు. సోమవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ ఎం.ఎం. నాయుడు విద్యార్థులను అభినందించారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



ఉస్మానియా యూనివర్సిటీ: విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతి పత్రం అందచేశారు. బీసీల జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషను కల్పిస్తూ శాసన సభలో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేసి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు ఈడిగ శ్రీనివాస్, బూర శ్రీనివాస్, గోదా రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో లహుజి సాల్వే వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో లహుజి సాల్వే 144వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్ ముఖ్యఅతిథిగా హాజరై లహుజి సాల్వే చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త లహుజి సాల్వే జీవిత చరిత్రను నేటి తరం తెలుసుకునే విధంగా పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ మాంగ్ పాల్గొన్నారు.



ఫిలింనగర్‌లోని సాయిబాబా గుడిలో పూజలు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



ఎన్‌బీటీనగర్‌లో కేక్‌ను కట్ చేస్తున్న కార్యకర్తలు



ఛాతీ ఆసుపత్రిలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

గులాబీ శ్రేణుల్లో జోష్

వాడవాడలా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు



నందినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

బంజారాహిల్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, హిమాయత్‌నగర్ డివిజన్లలో ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఎక్కడికక్కడ భారీ ఎత్తును ఫ్లెక్సీలు, జెండాలు కట్టి కూడళ్లను గులాబీమయం చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని నందినగర్ ఆలయంలో కార్పొరేటర్ కవితారెడ్డి ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రగా తెలంగాణ భవన్ వరకు చేరుకోగా, జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీ నగర్‌లో కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు.

ఫిలింనగర్‌లోని సాయిబాబా గుడిలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవించాలని మొక్కుకున్నారు.

ఎన్‌బీటీనగర్‌లో..

మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు జేజోళ్ల రాజుముదిరాజ్, బస్వాగౌడ్, కొమ్ము విజయ్ కుమార్ పాల్గొన్నారు.

బంజారాహిల్స్: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా బంజారాహిల్స్‌రోడ్ నెం. 14లోని నందినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కార్పొరేట్ కవితారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ తెచ్చిన మహనీయుడు, రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకుపోయే విధంగా కృషి చేసిన కేసీఆర్ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, విప్లవ్ కుమార్ తదిదతరులు పాల్గొన్నారు.

3వెంగళరావునగర్ : వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిలో రోగులకు కార్పొరేటర్ దేదీప్య విజయ్ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. యూసుఫ్‌గూడ బస్తీ వద్ద కేక్‌ను కట్ చేసి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇదేం పద్ధతి?



అగ్రసేన్ చౌరస్తాలో చింపివేసిన కేసీఆర్ జన్మదిన ఫ్లెక్సీలు

బంజారాహిల్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. అయితే సోమవారం తెల్లవారుజామున ఈ ఫ్లెక్సీలన్నీ చింపివేశారు. సోమవారమే కేసీఆర్ జన్మదినం కాగా తెల్లవారకముందే వాటిని చింపివేయడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. ఎక్కడికక్కడ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తమ అభిమాన నేత తెలంగాణ సాధకుడు కేసీఆర్ ఫ్లెక్సీలను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే చింపివేయించిందని కార్యకర్తలు ఆరోపించారు. కనీసం సోమవారం సాయంత్రం వరకైనా ఉంచాల్సి ఉండేదని వారు అన్నారు. ఈ ప్రాంతాల్లో కనీసం 20కి పైగా ఫ్లెక్సీలు చించివేశారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఏర్పాటుచేసిన 25కి పైగా ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. దీంతో ఆయన అధికార పార్టీపై మండిపడ్డారు.

ఫ్లెక్సీలు తొలగించడం దారుణం

వెంకటేశ్వరకాలనీ: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా వేసిన ఫ్లెక్సీలను తొలగించడం సరికాదని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. సోమవారం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆమె నందినగర్ నుంచి తెలంగాణ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కవితారెడ్డి మాట్లాడుతూ రాత్రి పెట్టిన ఫ్లెక్సీలు తెల్లవారకముందే అధికారులు తొలగించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్ రెడ్డి, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నందనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కవితారెడ్డి...

25 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్: ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అత్యంత వైభవంగా తిరుపతిలో నిర్వహించే విధంగా ఇక్కడ కూడా స్వామివారి కైంకర్యాలు, వాహన సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ నెల 25వ తేదీన అంకురార్పణ పూజలు, 26న ధ్వజారోహణం, పెద్ద శేష వాహన సేవ, 27న చిన్న శేష వాహన సేవ, హంస వాహన సేవ, 28న సింహ వాహన సేవ, ముత్యపు పందిరి వాహన సేవ, మార్చి 1వ తేదీన కల్పవృక్ష వాహన సేవ, సర్వ భూపాల వాహన సేవ, 2న మోహిని అవతారం, గరుడ వాహన సేవ, 3న హనుమంత వాహన సేవ, రథ రంగ డోలోత్సవం, గజ వాహన సేవ, 4న సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, 5న రథోత్సవం, అశ్వ వాహన సేవ, 6న చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహిస్తారని తెలిపారు. 7వ తేదీన సాయంత్రం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ప్రతి రోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయం

మద్యం మత్తులో కారు నడిపి.. బైక్,కారును ఢీకొట్టి..

నలుగురు యువకుల రిమాండ్.
ఈ నలుగురూ ప్రముఖుల కుమారులు



ప్రమాదానికి కారణమైన కారు..

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ అక్కడే ఆగి ఉన్న ఓ కారుతో పాటు బైక్‌ను ఢీకొట్టి ఇద్దరిని గాయపర్చిన ఘటనలో నలుగురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. టోలిచౌకి రాఘవకాలనీకి చెందిన ఖాజారఫీయుద్దీన్ (26) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆదివారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 1/10లో నివసించే సూర్య, మురళీకృష్ణలతో కలిసి హైదరాబాద్ హౌస్ రెస్టారెంట్ ముందు కారును పక్కన ఆపుకుని మాట్లాడుతున్నారు. అదే సమయంలో సూర్య తన బైక్‌ను కూడా కారు పక్కనే ఆపాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో నలుగురు యువకులు జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యంతాగి మత్తులో కారు నడుపుతూ రోడ్డు పక్కన ఆగి ఉన్న కారుతో పాటు బైక్‌ను ఢీకొట్టి కారు అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ ఘటనలో కారుతో పాటు బైక్ పూర్తిగా దెబ్బతింది. కారు నెంబర్ ఆధారంగా ఖాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు రంగంలోకి దిగి మద్యం మత్తులో కారు నడుపుతూ ప్రమాదానికి కారకులైన క్రిష్ అగర్వాల్ (21), మితేష్ అగర్వాల్ (21), నామన్ అగర్వాల్ (19), సుభాషిస్ పాల్ (21)లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరంతా బోయిన్‌పల్లి, మలక్‌పేట, అబిడ్స్ చెందిన వారు కాగా రాత్రి విందు కోసం పబ్‌కు వచ్చి మద్యం సేవించి అర్ధరాత్రి మత్తులో కారు నడుపుతూ ఈ ప్రమాదానికి కారకులయ్యారు. వీరంతా నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారుల కుమారులని పోలీసులు గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ ఫుట్‌పాత్‌తో పాటు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే... కూకట్‌పల్లి ప్రగతినగర్‌కు చెందిన వల్లూరి సాత్విక్ శ్రీనివాస్(19), బాలానగర్ సాయినగర్ కాలనీకి చెందిన గాడుదుల మణిదీప్(18)లు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ కలిసి ఆదివారం అర్ధరాత్రి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి కేబీఆర్ పార్కు వైపు వచ్చే క్రమంలో మితిమీరిన వేగంతో మద్యం మత్తులో దూసుకొస్తూ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టారు. ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వీరిద్దరిపై కేసు నమోదు చేశారు. కారు నడుపుతున్న సాత్విక్ శ్రీనివాస్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేదని గుర్తించారు. అదుపులోకి తీసుకొని బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వర్గాలను బీఆర్ఎస్ మోసం చేసింది



కేసీఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తున్న పోరాట సమితి నేతలు ఆళ్ల రామకృష్ణ, తదితరులు

కాచిగూడ: ఉమ్మడి ఏపీలో బీసీలుగా ఉన్న 26 కులాలను తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి సీఎం కేసీఆర్ అన్యాయంగా తొలగించారని తొలగించిన 26 కులాల పోరాట సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ విమర్శించారు. గత పదేళ్లుగా అన్ని వర్గాల ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ అధినేత, మాజీసీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్లకార్డులతో ప్రదర్శించి తమ నిరసనను తెలియజేశారు. తొలగించబడిన 26 కులాలను బీసీలలో కలుపుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. తాము కూడా గత ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిట్లు వివరించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏడున్నర లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణ భవిష్యత్తును తాకట్టు పెట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో కండ్రింగుల కృష్ణ ప్రసాద్, చిత్తూరు వేణు, చొల్లంగి ప్రసాద్, మల్లుల చంద్రశేఖర్, బొందరి రమణమూర్తి, భాస్కర్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

కాచిగూడ: లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ అందజేశారు. అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, నేతలు ప్రియారాజ్, సంజీవరెడ్డి, అశ్విన్, ఓంప్రకాష్, మోసిన్, జైస్వాల్, సందీప్, శివ, శేఖర్, తాహిర్, జగదీష్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు 15 వీల్‌చైర్ల వితరణ



వీల్‌చైర్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

లక్డీకాపూల్ : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వీల్ చైర్లు వితరణ చేశారు. సోమవారం నిమ్స్ ఆవరణలో ఆయన తన సోదరుడు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి నిమ్స్ కు 15 వీల్ చైర్లను అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మి భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నిమ్స్ పరిసరాలను పరిశీలించిన ఆయన ఆస్పత్రి మెయిన్ గేటు వద్ద రూ.50లక్షల వ్యయంతో వెయిటింగ్ హాల్ నిర్మించనున్నట్లు భూపాల్ రెడ్డి తెలిపారు.



కర్పూరి ఠాగూర్‌కు ఘన నివాళి



బషీర్‌బాగ్‌లో కర్పూరి ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న వి.హనుమంతరావు, నారగోని తదితరులు

కాచిగూడ: కర్పూరి ఠాగూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఠాగూర్ వర్ధంతి సభను సోమవారం నిర్వహించారు. డాక్టర్ టీవీ రామనర్సయ్య అధ్యక్షతన బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, నారగోని, వినయ్ కుమార్ తదితరులు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్పూరి ఠాగూర్ భారతదేశంలోనే మొదటిసారిగా బీహార్ రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లను 25 శాతం అమలు చేశారన్నారు. బీహార్ రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో ముద్దపాటి సూర్యనారాయణ, పాశం యాదగిరి పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ అంటూ టోకరా

బంజారాహిల్స్: తాను బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నానని ఓ యువకుడిని నమ్మించి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కూకట్‌పల్లికి చెందిన జ్ఞానసాయి ప్రసాద్(28) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. గతేడాది మేలో స్నేహితుడితో బంజారాహిల్స్‌లోని నీలోఫర్ హోటల్‌లో వ్యాపారం గురించి చర్చిస్తున్నాడు. ఆ వెనుకనే కూర్చొని వీరి మాటలు వింటున్న ఓ వ్యక్తి సాయి ప్రసాద్ వద్దకు వచ్చి తాను ఐసీసీసీలో టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తుంటానని పరిచయం చేసుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత సాయిప్రసాద్‌కు ఫోన్ చేసి తన పేరు గోవర్ధన్‌గా చెప్పాడు. నీలోఫర్ హోటల్‌కు రావాలంటూ పిలిచాడు. ఓ హోటల్ బిజినెస్‌లో రూ. 5 లక్షలు పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించాడు. అప్పటికప్పుడే సాయి ప్రసాద్ రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇచ్చి మిగతా మొత్తాన్ని గూగుల్ పే చేశాడు. మొత్తం రూ. 2.80 లక్షలు చెల్లించాడు. పలుమార్లు హోటల్ వ్యాపారం గురించి గోవర్ధన్‌ను ప్రశ్నిస్తుండగా దాటవేస్తూ వచ్చాడు. దీంతో అనుమానం వచ్చిన సాయి ప్రసాద్ ఐసీసీసీలో వాకబు చేశాడు. అలాంటి వ్యక్తి ఇక్కడ ఎవరూ పనిచేయడం లేదని అధికారులు తెలపడంతో మోసపోయానని తెలుసుకొని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గోవర్ధన్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ప్రాథమిక దశలోనే కంటిసమస్యలు గుర్తించాలి

గాంధీఆస్పత్రి: ప్రాథమిక దశలోనే అంధత్వ సమస్యలు గుర్తించి సరైన వైద్యం అందిస్తే నివారణ, నియంత్రణ సులభమని గాంధీ అప్తమాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రవిశేఖరరావు అన్నారు. గాంధీఆస్పత్రి అప్తమాలజీ విభాగంలో సీతాఫల్‌మండి, లాలాపేట, అంబర్‌పేట ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు సోమవారం వివిధ రకాల కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవిశేఖరరావు మాట్లాడుతు కంటిచూపు, రెటీనా, కనుపాప, మెల్లకన్ను, కంటినరాలకు సంబంధించిన పలు వైద్యపరీక్షలు నిర్వహించి, తగిన మందులు, అద్దాలు అందించామన్నారు. శిబిరం మార్చి 7 వరకు కొనసాగుతుందని వివరించారు. గాంధీ అప్తమాలజీ వైద్యులు సుజనీ, ప్రావీణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రంగులు మార్చి...

బెంజ్ కారును సీజ్ చేసిన ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: మోటార్ వాహనాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా రంగులు మార్చి, మోడిఫై చేసిన బెంజ్ కారును జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నిబంధనలకు విరుద్ధంగా కారును ఆధునీకరించిన సంస్థతో పాటు, కారు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-36లో నివసించే సుజీత్ వసంత్ వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల అతను తెలుపు రంగు మెర్సిడెస్ బెంజ్ కారును కొనుగోలు చేశాడు. అయితే తన కారు ప్రత్యేకంగా ఉండాలనే ఉద్దేశంతో అతను కారును బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో ఆధునీకరించాడు. గ్రీన్, ఎల్లో షేడ్స్‌లో కారును ప్రత్యేకంగా తీర్చిదిద్ది నగర రహదారులపై తిరుగుతున్నాడు.



రంగు మార్చిన బెంజ్ కారును సీజ్ చేస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

ఈ నెల 11న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోపీ వాహనాలు తనిఖీలు చేస్తుండగా అదుపు తప్పిన వేగంతో నెంబర్ ప్లేట్ లేకుండా దూసుకెళ్తున్న కారును ఆపారు. కారు పత్రాలు తనిఖీ చేసిన పోలీసులు కలర్ మార్చినట్లుగా గుర్తించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సుజిత్ వసంత్‌తో పాటు కారును మోడిఫై చేసిన సంస్థపై ఎంవీ యాక్ట్ కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. నిబంధనల ప్రకారం షోరూం నుంచి రోడ్డెక్కిన ఏ వాహనమైనా మోడిఫై చేయాలంటే ఆర్టీఏ అధికారుల అనుమతి తప్పనిసరి. ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నెంబర్ ప్లేట్ లేకుండా ఇంద్రధనుస్సు రంగుల్లో కారును తయారుచేసుకుని తిరుగుతున్నట్లు తేల్చారు. అనధికారికంగా కారు రంగు మార్చిన డెకార్ షోరూంపై, కారు యజమాని సుజిత్‌పై రూ.లక్ష జరిమానాతో పాటు ఎంవీయాక్ట్ కింద కేసు నమోదు చేసి కారును సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

పదో తరగతే టర్నింగ్ పాయింట్

విద్యార్థులకు పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్



నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

రాంగోపాల్‌పేట్: జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు పదో తరగతే టర్నింగ్ పాయింట్ అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం సికింద్రాబాద్ నల్లగుట్ట(ఓల్డ్) ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. 'పరీక్షలంటే భయం వీడాలి, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలి, గత క్వశ్చన్ పేపర్లను తీసుకుని బాగా ప్రాక్టీస్ చేయాలి'అని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా మైదానాన్ని పరిశీలించి క్రీడల కోసం దానిని చదును చేయాలని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీధర్, డీఐవో గుండప్ప, స్వరూప, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చొప్పరి శంకర్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ రమేష్ తదితరులు

కాచిగూడ: రాష్ట్రంలోని గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన ఇందిరాపార్కు వద్ద గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు తెలిపారు. ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్ సోమవారం నారాయణగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక నేతలు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ చోలేటి బాల బ్రహ్మచారి, డాక్టర్ పులగం మోహన్ మాట్లాడుతూ సమాజ ఆరోగ్య పరిరక్షణ కోసం గ్రామీణ వైద్యులు నిత్యం సేవలందిస్తున్నారన్నారు. శిక్షణ పొందిన 13 వేల మంది కమ్యూనిటీ పారామెడిక్స్‌కు సర్టిఫికెట్లు జారీ చేయాలని, మిగిలిన వారికి ఆరు నెలల శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. సభకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, జనవిజ్ఞాన వేదిక నేత డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి హాజరవుతారని తెలిపారు.

వర్గీకరణ కమిషన్‌కు 10 రోజుల గడువు ఇవ్వాలి

ప్రభుత్వానికి మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించిన షమీమ్ అక్తర్ కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని, శాస్త్రీయంగా విచారణ జరపలేదని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కమిషన్‌కు మరో 10 రోజుల గడువు ఇచ్చి నివేదికలోని లోపాలు సరిచేయాలని డిమాండ్ చేశారు. శ్రీ వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ కులాన్ని ఏ గ్రూపులో చేర్చాలనే విషయంతోపాటు ఏ కులానికి ఎంత మేరకు రిజర్వేషన్లు కేటాయించాలనే అంశంపై కమిషన్ సిఫారస్సుల్లో శాస్త్రీయత లోపించిందని అన్నారు. మంత్రివర్గ ఉపసంఘం కూడా అధ్యయనం చేయకుండా కేబినెట్‌కు పంపిందని, అక్కడా చర్చించకుండా అసెంబ్లీలో సమర్పించారని, ఇదంతా మూడు రోజుల్లో జరిగిపోయిందని, 'లక్షల డప్పులు, వేల గొంతులు'కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఇదంతా హడావుడిగా చేశారని ఆరోపించారు. మాదిగలు, డోర్ కులాల పేర్లు వేరైనా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితి ఒక్కటేనని, చర్మకార వృత్తిపైనే ఆధారపడతాయని, అలాంటప్పుడు మాదిగలను గ్రూప్ 2, డోర్‌లను గ్రూప్ 3లో ఎలా పొందుపరుస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల 70 ఏళ్లు నష్టపోయామని, ఇప్పుడు వర్గీకరణ జరిగాక కూడా అన్యాయం చేస్తామంటే ఒప్పుకునేది లేదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దత్తు పోల్, వివిధ జిల్లాల అధ్యక్షులు నర్సింగ్, జి.రాజు, వినోద్ చొంగ్లే, పావన్, అంబిక డోరే, లక్ష్మీబాయి పోల్ తదితరులు పాల్గొన్నారు.

'డోలోత్సవ దర్శనంతో గృహదోషాలు తొలుగుతాయి'



సమతాకుంభ్ ఉత్సవాల్లో భాగంగా పెరుమాళ్లకు డోలోత్సవం చేస్తున్న చినజీయర్ స్వామి

శంషాబాద్ రూరల్: డోలోత్సవ దర్శనంతో భక్తులకు గృహదోషాలు తొలగిపోతాయని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో సమతాస్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతాకుంభ్ -2025 తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం డోలోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చతుర్వేద పారాయణం, సంకీర్తనలతో పెరుమాళ్లకు ఊయలలు ఊపారు. ఉత్సవాల్లో ఎనిమిదో రోజు ఉదయం శ్రీ భగవద్రామానుజులు, 108 దివ్యదేశ మూర్తులకు సుప్రభాత సేవ చేశారు. చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో అష్టాక్షరి మంత్రజపం, తర్వాత ధ్యానం చేశారు. ఆరాధన, తీర్థ ప్రసాద గోష్టిలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి, బలిహరణం చేశారు. సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. సాయంత్రం 18 గరుడ సేవలు చేశారు.

మెకానికల్ రంగంలో పెనుమార్పులు అవసరం



సదస్సులో డాక్టర్ రామ్మోహన్‌రావు తదితరులు

లంగర్‌హౌస్: నేటి పోటీ ప్రపంచానికి దీటుగా మెకానికల్ రంగంలో పెను మార్పులు తీసుకురావాలని అంతర్జాతీయ మెకానికల్ రంగ నిపుణులు డాక్టర్ పి.కె.జైన్, చెక్ రిపబ్లిక్ బోహిమియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మిలన్ బెలిక్ అన్నారు. ఇబ్రహీంబాగ్‌లోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం నిర్వహించిన 'రెండో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ కంప్యూటేషనల్ మెకానిక్ ఇంజినీరింగ్ మెథడ్స్'అనే అంశంపై జరిగిన సదస్సు ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. జైపూర్‌కు చెందిన పూర్ణిమ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో జపాన్, యూఎస్‌ఏ, సింగపూర్, నమీబియా, మస్కట్, గనా, సౌదీ అరేబియా, చెక్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో 109 ప్రతిపాదనలు స్వీకరించి,చర్చించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మెటీరియల్స్ తయారీ విభాగంలో థర్మల్ ఇంజినీరింగ్, కంప్యూటేషనల్ మెథడ్స్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో వాసవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ, పూర్ణిమ కళాశాల డైరెక్టర్ మహేష్ బుందేల్, ఆర్గనైజింగ్ చైర్ డాక్టర్ టి.రామ్మోహన్‌రావు, డాక్టర్ ఎస్. వెంకటయ్య, డాక్టర్ రాజ్‌కుమార్ సతాంకర్, డాక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్..

బిజినెస్ జోష్



సందర్శకుల సంఖ్య తగ్గినా పెరిగిన వ్యాపారం ● కుంభమేళా ప్రభావం పడిందంటున్న నిర్వాహకులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నుమాయిష్ జోష్ ముగిసింది. కొన్నిరోజులపాటు 84వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్(నుమాయిష్) సందడి చేసింది. గతంతో పోలిస్తే సందర్శకుల సంఖ్య కాస్త తగ్గినా అమ్మకాలు పెరిగాయని స్టాళ్ల నిర్వాహకులు అంటున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం నేపథ్యంలో ప్రకటించిన రాష్ట్ర సంతాప దినాల వల్ల ఈ ఏడాది నుమాయిష్ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో వ్యాపారుల విన్నపాల మేరకు దాని సాధారణ ముగింపును ఫిబ్రవరి 15 కంటే రెండు రోజులు అదనంగా అధికారులు పొడిగించారు. అనేక రకాల ఉత్పత్తులను అందించేందుకు దాదాపు రెండు వేల స్టాల్స్‌ను నిర్వాహకులు నుమాయిష్‌లో ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ ప్రతిరోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10.30 వరకు పనిచేశాయి. వారాంతాల్లో రాత్రి 11 గంటల వరకు కూడా కొనసాగించారు.

లక్ష వరకూ తగ్గుదల

'గత ఆదివారం వరకూ (చివరి రోజైన సోమవారం కాకుండా) 19.72 లక్షల మంది సందర్శకులు వచ్చారు. గత ఏడాది 20.62 లక్షల మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించగా, ఈసారి సుమారు లక్ష మంది వరకూ తగ్గారని ఎగ్జిబిషన్ సెక్రటరీ బి.సురేందర్ రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. సాధారణంగా ఏ యేటికాయేడు సందర్శకుల సంఖ్య అంతో ఇంతో పెరుగుతుంది. ఈసారి దానికి భిన్నంగా సందర్శకుల సంఖ్య తగ్గడానికి కుంభమేళా ప్రధాన కారణమని తెలుస్తోంది. పెద్ద సంఖ్యలో నగరవాసులు ప్రయాగ్‌రాజ్‌కి వెళ్లడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని నిర్వాహకులు భావిస్తున్నారు. ఏదేమైనా.. షెడ్యూల్డ్ ఈవెంట్‌లన్నీ బాగా జరిగాయి. సందర్శకులు సాంస్కృతిక ప్రదర్శనల పట్ల మరింత ఆసక్తి కనబరిచారు. ఏ చిన్న ఇబ్బందీ లేకుండా సజావుగా నుమాయిష్ సందర్శకుల్ని అలరించింది'అని ఎగ్జిబిషన్ సెక్రటరీ వివరించారు. అత్యధికంగా సందర్శకుల తాకిడిని చవిచూసిన గత ఆదివారం 89 వేలపైగా నమోదైంది. అయితే సందర్శకుల సంఖ్య ఎలా ఉన్నా, షాపింగ్ చాలా బాగా జరిగింది''అని ఎగ్జిబిషన్‌లో స్టాల్ ఏర్పాటు చేసిన దుస్తుల విక్రేత కుమార్ ప్రభు వంటివారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బతుకమ్మ కుంటపై స్టేటస్ కో

అంబర్‌పేట: బతుకమ్మ కుంట స్థలంపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. ఇటీవల హైడ్రా ఈ స్థలం ప్రభుత్వానిదని భావించి చర్యలు తీసుకుంది. హైకోర్టు సింగిల్ బెంచ్ బతుకమ్మ కుంట ప్రభుత్వానిదేనంటూ ఇటీవల తీర్పు ఇచ్చింది. అయితే దీనిపై నిజానిజాలు తెలుసుకోవాలంటూ సిటి సివిల్ కోర్టులో స్థానిక బీఆర్‌ఎస్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి పిటిషన్ వేశారు. సిటి సివిల్ కోర్టులో కేసు నడుస్తుండగా హైడ్రా బతుకమ్మ కుంట స్థలంలో బోర్డులు ఏర్పాటు చేసింది. దీనిపై సుధాకర్ రెడ్డి స్థానిక రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై సోమవారం లంచ్‌మోషన్‌లో విచారించి హైకోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అధికారులు న్యాయస్థానం ఉత్తర్వులను పాటించాలని సుధాకర్ రెడ్డి కోరారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకట్

లక్డీకాపూల్: ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైతే సమీప ఆరోగ్య కేంద్రాలకు తరలించి ప్రాథమిక వైద్య, చికిత్సలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు సూచించారు. సోమవారం పురానాపూల్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పానీపూర క్లస్టర్ పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం గృహాలను సందర్శిస్తూ అందరికీ ఆరోగ్య సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల గణాంకాలను 12 వారాలలోపే నమోదు చేయాలని, వారికి పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేవిధంగా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ, పానీపూర క్లస్టర్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఆధునిక ల్యాండింగ్ సదుపాయం

శంషాబాద్ రూరల్: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధునాతన ల్యాండింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు విమానాశ్రయ నిర్వాహకులు, జీఎంఆర్ సీఈఓ ప్రదీప్ ఫణికర్ తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన నావిగేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో కార్యకలాపాల సామర్థ్యాలు, భద్రతా ప్రమాణాలు మెరుగుపర్చినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన రన్ వేపై కేటగిరీ-2 ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్(ఐఎల్‌ఎస్), రన్‌వే లైటింగ్ వ్యవస్థను విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. 300 మీటర్ల మేర ఉన్న ప్రతికూల వాతావరణంలోనూ విమానాలు సురక్షితంగా ల్యాండ్ అవ్వడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని తెలిపారు. కేటగిరీ-1 కంటే ఈ వ్యవస్థ మెరుగైనదని, అధిక కచ్చితత్వం కలిగిన రేడియో సంకేతాలు, ఆధునిక లైటింగ్ వ్యవస్థల ద్వారా పైలట్లకు మార్గదర్శకతను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఆధునిక నావిగేషనల్ వ్యవస్థ ఈ విమానాశ్రయం సాంకేతిక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలకమైన మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. రెండో రన్ వేను కేటగిరీ-1 స్థాయికి పెంచేందుకు డీజీసీఏ అనుమతి పొందినట్లు తెలిపారు. దీంతో ప్రధాన రన్‌వే అత్యవసరంగా అందుబాటులో లేని సమయంలో 550 మీటర్ల ఆర్‌వీఆర్ కార్యకలాపాలను కొనసాగించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్ సొసైటీకి సర్కార్ చేయూత: పొన్నం



జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

అబిడ్స్: తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీకి ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన శాల (నుమాయిష్)లో సోమవారంరాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. 46 రోజులపాటు జరిగే ఈ ప్రదర్శన ద్వారా వచ్చే ఆదాయంతో 20 విద్యా సంస్థలను నిర్వహిస్తూ వేలాది మంది పేద విద్యార్థులకు అండగా నిలుస్తోందని అన్నారు. వృత్తి విద్యా కోర్సులపై ప్రత్యేక దృష్టి పెట్టి మరిన్ని సంస్థలను ఏర్పాటు చేయాలని, ఇందుకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యాసంస్థల సొసైటీ చైర్మన్ ఫయీమ్ ఖురేషీ, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 546 దరఖాస్తులు

● అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి

లక్డీకాపూల్: ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ జి. ముకుందరెడ్డి కిందిస్థాయి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 546 దరఖాస్తులు అందాయని చెప్పారు. అందులో గృహ నిర్మాణ శాఖకు 490, పెన్షన్ కోసం 38, ఇతర శాఖలకు సంబంధించి 18 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డి ఆర్‌ఓ ఈ వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు, ఆర్.రోహిణి, పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్‌వో వెంకటి, సుబ్రహ్మణ్యం, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



కేక్ తినిపిస్తున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్వీ నాయకులు సోమవారం పోటాపోటీగా నిర్వహించారు. ఓయూ పూర్వ విద్యార్థులు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్‌కుమార్‌ల అనుచరులు రెండు వర్గాలుగా విడిపోయి కేసీఆర్ జన్మదిన వేడుకలను వేర్వేరుగా చేపట్టారు. ఇరువర్గాల వేడుకలకు బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ హాజరుకావడం విశేషం. తొలుత బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు కిశోర్‌కుమార్ హాజరై కేక్ కట్ చేశారు. వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. కేసీఆర్ కప్-2025 క్రికెట్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.25 వేల చెక్‌ను అందజేశారు. ఆ తర్వాత బాల్క సుమన్ అనుచరులు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు చటారీ దశరథ్, కొంపెల్లి నరేష్, ఎం.రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలు హాజరై కేక్ కట్ చేశారు. కేసీఆర్ కప్-2025 విజేతలకు మొదటి బహుమతి రూ.30, రెండో బహుమతి రూ.10 వేల చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు పల్లా ప్రవీణ్‌రెడ్డి, తొట్ల స్వామియాదవ్, కిరణ్‌గౌడ్, పడాల సతీష్, వల్లమల్ల కృష్ణ, కోతి విజయ్, మంద సురేష్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణనష్టం జరిగితే బాధ్యత వహిస్తారా?

కోదండరాంను ప్రశ్నించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేతలు



కార్యక్రమంలో పాల్గొన్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకానాథరెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: ప్రజల ఆరోగ్యానికి నకిలీల ద్వారా హానీ జరిగితే ఎమ్మెల్సీ కోదండరాం బాధ్యత వహిస్తారా అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరి ద్వారకానాథరెడ్డి, కార్యదర్శి డాక్టర్ వి.అశోక్, యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం కోఠిలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ సదస్సులో వారు మాట్లాడారు. నకిలీ వైద్యుల ఉద్యమానికి కోదండరాం మద్దతు పలకడం శోచనీయమని ద్వారకానాథ్‌రెడ్డి అన్నారు. వైద్య విద్యార్హత, శిక్షణ లేకుండా ఆటవిక వైద్యం చేస్తున్నవారికి గుర్తింపు సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం అమానవీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంపట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రతి ఏడాది వైద్య విద్య పూర్తి చేసుకొని వచ్చే 10 వేల మంది డాక్టర్లకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించి నాలుగు, ఐదు గ్రామాలకు ఒక డాక్టర్‌ను ఏర్పాటు చేసేవిధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్, కార్యదర్శి ప్రసాద్, నీతా తదితరులు పాల్గొన్నారు.

ఔటర్‌పై కార్ల విన్యాసాలు.. ఇద్దరి అరెస్టు

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగ్ రోడ్డుపై కార్లతో విన్యాసాలు చేసిన ఘటనలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... శంషాబాద్ మండల పరిధిలోని తొండుపల్లి-పెద్దగోల్కొండ మధ్య ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై ఇద్దరు విద్యార్థులు ఈ నెల 9న తెల్లవారుజామున రెండు కార్లతో విన్యాసాలు చేస్తూ వాహనదారులను ఇబ్బందికి గురి చేశారు. సమాచారం అందుకున్న ఔటర్ పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకునేలోపు పారిపోయారు. ఆ కార్లకు నంబరు ప్లేట్లు కూడా లేవు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు విద్యార్థులు కార్లతో విన్యాసాలు చేసినట్లు గుర్తించారు. అత్తాపూర్‌కు చెందిన మొహమ్మద్ అబెదుల్లా అన్సారి(25), మలక్‌పేట్ వాసి జాహెర్ సిద్దిఖీ(25)ని నిందితులుగా గుర్తించి సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విన్యాసాలు చేసిన కార్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఎఫ్‌టీ ర్యాంకింగ్స్‌లో 'ఐఎస్‌బీ'కి 27వ స్థానం



రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మరింత మెరుగుదల కనిపించింది. భారతదేశంలోని ప్రధాన బిజినెస్ స్కూల్స్‌లో ఐఎస్‌బీ మరోసారి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ మేరకు ఫైనాన్షియల్ టైమ్స్(ఎఫ్‌టీ) సంస్థ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్-2025 జాబితాను సోమవారం విడుదల చేసింది. గత ఏడాది ఐఎస్‌బీకి 31వ స్థానం రాగా, ఇప్పుడు 27కు చేరుకుంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆసియాఖండంలో అయిదో స్థానాన్ని నిలుపుకుంది. గత ఏడాది పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌లో ప్రపంచంలో 8వ స్థానంలో ఉన్న ఐఎస్‌బీ ఈసారి నాలుగో స్థానానికి ఎగబాకింది. కెరీర్ సేవల అంశంలో 19వ ప్రపంచ ర్యాంకింగ్‌ను నిలుపుకుంది. జీతం శాతం పెరుగుదలలో ప్రపంచంలోనే రెండో స్థానం పొందింది. 65 దేశాల్లో 18 వేలకుపైగా ఐఎస్‌బీ పూర్వ విద్యార్థులను చూసి గర్విస్తున్నామని ఐఎస్‌బీ అకడమిక్ ప్రోగ్రామ్స్, డిజిటల్ లెర్నింగ్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ దీపామణి అన్నారు. ఎఫ్‌టీ ర్యాంకింగ్స్‌లో ఐఎస్‌బీ గత ఏడాది కంటే మెరుగుపడటం సంతోషాన్ని ఇస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వ్యాపార రంగాన్ని నిర్వహించగల నాయకులను అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా యంగ్ లీడర్స్ ప్రోగ్రామ్ కోసం కొత్త పీజీ కోర్సును ప్రారంభిస్తామన్నారు.

నగరంలో నేడు

- బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 గంటలకు నవ తెలంగాణ బుక్‌హౌస్ ఆధ్వర్యంలో జి.రఘుపాల్ అనువాదం చేసిన ఆరెస్సెస్, బీజేపీలు కోరుకునేది, ఎస్. వినయ కుమార్ అనువాదం చేసిన ఇంక్విలాబ్ పుస్తకాల ఆవిష్కరణ సభ జరుగుతుంది.
- శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ రామానుజాచార్య 108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాలు, సమతా కుంభ్ - 2025లో భాగంగా శంషాబాద్‌లోని శ్రీరామ నగరం ముచ్చింతల్‌లో ఉదయం 10.30 గంటలకు రథోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలు జరుగుతాయి.
- బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఉదయం 9 గంటలకు ఆస్పత్రి ఆడిటోరియంలో జరుగుతాయి.
- ఆనంద భైరవి సాంస్కృతిక, సాంఘిక సేవా సంస్థ 13వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో సాయంత్రం 5.30 గంటలకు సినీ సంగీత విభావరి జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

20, 21 తేదీల్లో 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమంపై సదస్సు




విద్యార్థి ఉద్యమ ప్రస్థానం పోస్టర్ ఆవిష్కరిస్తున్న హరగోపాల్, కోదండరాం తదితరులు

పంజగుట్ట: డెబ్బై, ఎనభైవ దశకాల్లో విప్లవించిన తొలి, మలితరం విద్యార్థులు ఈ నెల 20, 21వ తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఏభై ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం'పేరుతో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ పాత్రికేయులు వేణుగోపాల్, విష్ణువర్ధన్ రావు, న్యాయవాది సురేష్ కుమార్, భరద్వాజలతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అప్పటి ఉద్యమాల చారిత్రక పరిస్థితులను గుర్తుచేసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటి ఉద్యమాలు ఒక సామాజిక సంపద అని, దాన్ని సమాజానికి పంచేందుకు, నేటితరం వారికి ఆదర్శంగా ఉంచేందుకు సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ భారతదేశంలో ఉద్యమాలతోనే ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కవరే ఆ శిశువుకు పొత్తిళ్లు

అప్పుడే పుట్టిన బిడ్డ ఆలయం వద్ద అనాథలా..



అల్వాల్: తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన శిశువు ప్లాస్టిక్ కవర్‌లో పడి ఉంది. తల్లి చెంత ఉండాల్సిన పసికందు ఆలయం వద్ద అనాథలా మిగిలి ఉంది. కన్నతల్లికి ఏం కష్టం వచ్చిందో ఏమో కన్నపేగుకు దూరమైంది. ఈ సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటాపురంలోని పోచమ్మ దేవాలయం సమీపంలో స్థానికులకు ఓ పసిపాప ఏడుపు వినిపించింది. దీంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. చివరికి ఆలయం ముందు ఉన్న ఓ ప్లాస్టిక్ కవర్‌ను పరిశీలించగా అందులో పసికందు కనిపించింది. అప్పుడే తల్లి గర్భం నుంచి వేరుపడిన నవజాత మగ శిశువు రక్తపు మరకలతో ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని శిశు సంక్షేమ శాఖ సిబ్బందికి శిశువును అప్పగించారు. అనంతరం వారు నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి శిశువును తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నారు. శిశువును వదిలేసిన వారిని గుర్తించవచ్చని భావిస్తున్నారు.





30 నుంచి 85 శాతం తక్కువ ధరలకే లభ్యం

ఈ తరం ఫ్యాషన్‌కు అనుకూలంగా డిజైన్స్

సామాన్యులతో పాటు ఫ్యాషన్ ప్రియుల మొగ్గు

డిజైర్.. డిజైన్స్..

ల్యాబ్ గ్రోన్ డైమండ్స్‌కు పెరుగుతున్న ఆదరణ

సౌందర్య రంగంలో వజ్రాలకు ఆదరణ, విలువ, గుర్తింపు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. విలాసవంతమైన జీవనానికి వజ్రాలు ప్రతీకగా నిలుస్తున్నాయి. బంగారం, వెండి, ప్లాటినం వంటివి ఎన్ని ఉన్నా వజ్రాలకు ప్రత్యేక స్థానం ఉంది. అందుకే చాలామందికి డైమండ్ రింగ్ కొనుగోలు చేయాలనే ఆశ ఉంటుంది. ఈ నేపథ్యంలో మధ్య తరగతి కుటుంబాల్లో కూడా వజ్రాలపై ఆసక్తి పెరిగింది. వీటన్నింటి దృష్ట్యా ల్యాబ్‌లో తయారు చేస్తున్న కృత్రిమ వజ్రాలు (ల్యాబ్‌గ్రోన్ డైమండ్స్)కు డిమాండ్ పెరిగింది. సహజమైన వజ్రాలు.. ప్రత్యేకంగా ల్యాబ్‌లో తయారు చేసిన వజ్రాలు చూసేందుకు ఒకేలా ఉండటం వీటి ప్రత్యేకత. ధర కూడా తక్కువ ఉండటంతో వీటికి విపరీతమైన ఆదరణ పెరిగింది. - సాక్షి, సిటీబ్యూరో




ప్రకృతి ప్రసాదంగా లభించే వజ్రాలు చాలా అరుదైనవి, తక్కువగా దొరుకుతాయి. ఈ వజ్రాలు భూమి పొరల్లోని అంతర్భాగంలో తయారు కావడానికి సుమారు 1 నుంచి 3 బిలియన్ సంవత్సరాల సమయం పడుతుందని పరిశోధకులు చెబుతారు. ఇంతటి అరుదైనవి కాబట్టే వజ్రాలకు ధరలు ఎక్కువగా ఉంటాయి. అయితే ప్రస్తుత కాలంలో అచ్చం వజ్రాలను పోలినవి.. ప్రయోగశాలలో తయారు చేసిన వజ్రాలు అందుబాటులోకి రావడంతో వజ్రాల ప్రియులు అధికంగా వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ వజ్రాలు కేవలం వారాలు, నెలల వ్యవధితో తయారు చేస్తున్నారు. సాధారణంగా ఈ రెండు రకాల వజ్రాలు శాస్త్రీయ రసాయణాల పరంగా ఒకే లక్షణాన్ని కలిగి ఉన్నప్పటికీ నాణ్యత, పదార్థ విశిష్టత దృష్ట్యా చాలా వ్యత్యాసం ఉంటుంది.



అమాంతం పెరిగిన వ్యాపారం..

ఆర్థిక పరమైన అంశాలే కాకుండా సామాజికంగా సౌందర్య రంగంలోని వజ్రాల ప్రాధాన్యత వల్ల ఫ్యాషన్ రంగంలో కూడా ఈ డైమండ్స్‌కు మంచి ప్రచారం లభించింది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో ఈ వజ్రాల వ్యాపారం అమాంతంగా పెరిగిపోయింది. ఈ వజ్రాల ప్రస్థానం 2000 సంవత్సరం నుంచి పుంజుకోగా.. ఐదేళ్ల నుంచి మరింత ఎక్కువగా పెరిగిందని బంజారాహిల్స్‌లోని ఓ వ్యాపారి తెలిపారు. మొదట్లో ఉత్తరాది ప్రాంతాలకు చెందినవారే వజ్రాలు అధికంగా కొనుగోలు చేసేవారు. కొన్ని ఏళ్లుగా హైదరాబాద్, బెంగళూరులో వీటి వ్యాపారం పుంజుకుందని సోమాజిగూడలోని మరో వజ్రాల వ్యాపారి పేర్కొన్నారు. ఇలాంటి కారణాలతో ప్రస్తుతం నగరంలో ల్యాబ్ గ్రోన్ వజ్రాలకు ప్రత్యేక స్టోర్లు ప్రారంభిస్తున్నారు. అంతేకాకుండా ప్రముఖ డైమండ్ బ్రాండ్లు సైతం వారి స్టోర్లలో ల్యాబ్ గ్రోన్ వజ్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. సహజ వజ్రాలు, తయారు చేసిన వజ్రాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడానికి నిపుణుల పరిశోధక పత్రాలు, డైమండ్ వెరిఫికేషన్ ఇన్‌స్ట్రుమెంట్ విధానాలను వినియోగిస్తున్నారు. వజ్రాన్ని కత్తిరించి పాలిష్ చేసిన తర్వాత ప్రయోగశాలలో సర్టిఫికేట్‌కు అనుగుణంగా లేజర్‌తో టెక్నాలజీతో ధృవీకరిస్తారు.



- వజ్రాల నిపుణులు, ఆభరణాల తయారీదారులు మాత్రమే వీటి మధ్య తేడాను గుర్తించగలరు. వీటి కటింగ్, పాలిషింగ్, సెట్టింగ్‌లో చాలా వైవిధ్యంతో పాటు శాస్త్రీయత పాటించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సహజమైన వజ్రాలను కొనలేని వారు ఈ కృత్రిమ వజ్రాలపై మక్కువ చూపిస్తున్నారు. సహజ వజ్రాల్లో పరిమాణం పెరుగుతున్న కొద్దీ.. దాని క్యారెట్లను బట్టి ధర అంతకంతకూ పెరిగిపోతుంది. కానీ ప్రయోగశాలలో తయారు చేసిన వజ్రాలు తక్కువ ధరకే అదే పరిమాణంలో లభిస్తుండటం విశేషం. సహజ వజ్రాల కంటే ప్రయోగశాలలో తయారు చేసిన వజ్రాలు సుమారు 30 నుంచి 85 శాతం తక్కువ ధరల్లో లభిస్తుండటం విశేషం.



ల్యాబ్ గ్రోన్ డైమండ్స్‌కే క్రేజ్

ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ అమ్మకాలు ఈ మధ్య కాలంలో పెరుగుతున్నాయి. ముఖ్యంగా మా స్టోర్‌లో గతేడాదిలో మరింత ఎక్కువగా అమ్ముడయ్యాయి. హైదరాబాద్‌లో పెద్ద సైజుల్లో ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. పెద్ద సైజులో ఉండే సహజమైన వజ్రాలు కొనుగోలు చేయలేని వారు దాదాపు 50 నుంచి 90 శాతం తక్కువ ధరలకు లభించే ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ రెండు వజ్రాల మధ్య తేడాలను ప్రయోగశాలలోని ప్రత్యేక పరికరాలు ఉంటే తప్ప ఎవరూ గుర్తించలేరు. స్థానికంగా నిశ్చితార్థాలకు ఈ డైమండ్స్ ఎక్కువగా కొంటున్నారు. పార్టీలు, ఫ్యాషన్ వేర్, విభిన్న డిజైన్ల కోసం కూడా ఆసక్తి చూపిస్తున్నారు.

- స్వాతి షాగర్లమూడి, రీయా లైఫ్‌స్టైల్-మణికొండ









బొమ్మను గీస్తే..

మనసును కట్టిపడేస్తుంది



బొమ్మ గిరిజ

బౌద్ధనగర్: ఆమె కుంచె నుంచి జాలువారే చిత్రాలు మనసును కట్టిపడేస్తాయి.. ఎంతసేపైనా అలా చూస్తుండిపోవాలనిపిస్తుంది.. అది పోర్ట్రెట్ అయినా, ఆయిల్ పెయింటింగ్ అయినా, వాటర్ కల్సర్.. ఏదైనా సరే ఆమె చిత్రం అపురూపం.. తనకు ఇష్టమైన యానిమేషన్ రంగంలో జాబ్ చేస్తూనే.. ఖాళీ సమయంలో తన పెయింటింగ్స్‌తో అద్భుతాలను సృష్టిస్తోంది బౌద్ధనగర్‌కు చెందిన బొమ్మ గిరిజ.

చిన్ననాటి నుంచే చిన్నచిన్న చిత్రాలు గీస్తూ.. ఇంటర్‌కు వచ్చాక చిత్రాలపై మరింత ఇష్టం పెంచుకుంది. మొదట పెన్సిల్‌తో చిత్రాలు వేస్తూ అందరినీ ఆకట్టుకునేది. తన ప్రతిభకు మరింత మెరుగులు దిద్దుకునేందుకు చైతన్యపురిలోని పరికిబండ్ల జ్ఞానేశ్వర్ అనే చిత్రకారుడి దగ్గర ఎన్నో మెళకువలు నేర్చుకుంది. ఆమె చార్‌కోల్‌తో గీసే పోర్ట్రెట్ చిత్రాలు అచ్చుగుద్దినట్లు కెమెరాతో చిత్రాలను తలపిస్తాయి. ఆ చిత్రాలను చూసిన ఎంతో మంది ఆమెను మెచ్చుకున్నారు. ఒక వైపు బ్యాచిలర్స్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో యానిమేషన్ కోర్సు చేస్తూనే ఎన్నో చిత్రాలను గీసింది. సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతో మంది ఆమెను సంప్రదించి నచ్చిన చిత్రాలు వేయించుకుంటున్నారు.



చివరి రోజు.. 80,000

నుమాయిష్ మొదలవుతుందంటే.. నగరవాసుల్లో జోష్ పెరుగుతుంది.. ముగుస్తుందంటే సందడి డబుల్ అవుతుంది.. నుమాయిష్ పేరుతో నాంపల్లిలో నిర్వహించిన ఎగ్జిబిషన్ సోమవారం ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున సందర్శకులు తరలివచ్చారు. చివరి రోజు కేవలం ఒక్కరోజే దాదాపు 80 వేల మంది సందర్శించగా.. అన్ని రోజులు కలిపి 20.40 లక్షల మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. - అబిడ్స్

1న ఉత్తర దక్షిణ్ కన్సర్ట్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ జేఎన్ఏఎఫ్ఏయూ ఆడిటోరియం వేదికగా వచ్చేనెల 1వ తేదీన ప్రతిష్టాత్మకంగా 'ఉత్తర దక్షిణ్ కన్సర్ట్'ను నిర్వహించనున్నారు. ఇందులో ప్రముఖ సంగీత విద్వాంసులు పద్మశ్రీ పండిత్ రోను మజుందార్, విద్వాన్ ఆర్.కుమరేష్ అలరించనున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. రెండు విభిన్న శాస్త్రీయ సంప్రదాయాల నుంచి వచ్చిన ఈ కళాకారులు భారతీయ శాస్త్రీయ సంగీత గొప్పదనాన్ని నగరవాసులకు అందించనున్నారు. వివిడ్ ఆర్ట్స్, సుర్మండల్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జుగల్బందికి సంబంధించిన కన్సర్ట్ పాసులు బుక్ మై షోలో అందుబాటులో ఉన్నాయి.

వారంతా పేద విద్యార్థులే.. గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుకునేందుకు నగరానికి వచ్చారు. కేవలం చదువు మాత్రమే కాకుండా కాస్త సమయం దొరికితే చాలు ఆటల్లో మునిగి తేలుతున్నారు.. కాలక్షేపం కోసమే మాత్రం కాదు.. పోటీలో దిగితే చాలు ప్రత్యర్థుల్ని కొట్టి.. ట్రోఫీ పట్టాల్సిందే.. ఆట ఏదైనా.. మైదానం ఎక్కడైనా సత్తాచాటుతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో మూడు ట్రోఫీలు సాధించి ఔరా అనిపించారు. మెడల్స్, ట్రోఫీలు సాధించి కళాశాల కీర్తిని మరింత పెంచుతున్నారు. ప్రోత్సాహం అందిస్తే ఎందులోనూ తగ్గేదేలే అంటున్నారు మాసబ్‌ట్యాంక్ పాల్‌టెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు. ట్రోఫీతో కళాశాలకు వస్తే ఎంతో గర్వంగా ఫీల్ అవుతున్నామని అంటున్నారు. - నాంపల్లి



చెస్‌లో ట్రోఫీతో ప్రణధీవ్

ఆట ఏదైనా.. ట్రోఫీతోనే..

ప్రతి సంవత్సరం కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ ఏడాది రామంతపూర్‌లోని కళాశాలలో ఈనెల 11, 12వ తేదీల్లో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు జరిగాయి. మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి మూడు ట్రోఫీలు దక్కించుకున్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన ఆర్.సురేష్ కబడ్డీలో, హైజంప్‌లో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన ఎం.నిరీక్షణ టేబుల్ టెన్నిస్‌లో, నగరానికి చెందిన ప్రణధీర్ చెస్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరితో పాటు మరో మూడు ఈవెంట్స్‌లో కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.



టేబుల్ టెన్నిస్‌లో ట్రోఫీ అందుకుంటున్న నిరీక్షణ



కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న ఆర్.సురేష్ టీమ్



ట్రోఫీల పంట పండింది



ఇటీవల రామంతపూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో హైదరాబాద్ జిల్లా టాప్‌లో నిలిచింది. జిల్లాకు చెందిన మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల కబడ్డీ, హైజంప్, చెస్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. మూడు మొదటి ట్రోఫీలు పాలిటెక్నిక్ కళాశాలకు లభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు.

- డాక్టర్ చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్

- పాలిటెక్నిక్ కళాశాలలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ (హై జంప్, లాంగ్ జంప్, వంద మీటర్ల పరుగు పందెం) వంటి వాటిని నేర్పిస్తున్నారు. ఇక్కడ 48 మంది విద్యార్థులు అకాడమిక్‌తో పాటు క్రీడలను నేర్చుకుంటున్నారు. చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఇన్‌ఛార్జి ఫిజికల్ డైరెక్టర్ డి.సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఆర్.సురేష్ సివిల్ ఫైనల్ ఇయర్ చదువుతుండగా.. ఎం.నిరీక్షణ ఈసీఈ మొదటి సంవత్సరం.. చెస్ క్రీడాకారుడైన ప్రణధీర్ కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు.

చిన్నారుల కోసం సంవాద్

- గంగాస్ వ్యాలీ ఆధ్వర్యంలో ప్రత్యేక సెషన్
- న్యూరోసైన్స్, మనస్తత్వశాస్త్రంపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత హైపర్ కనెక్టెడ్ ప్రపంచంలో పిల్లల అభివృద్ధి, సంబంధాల అవగాహనను ప్రోత్సహించడమే లక్ష్యంగా గంగాస్ వ్యాలీ స్కూల్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 'సంవాద్' కార్యక్రమాన్ని నిర్వహించింది. హైటెక్ సిటీలోని అవసా హోటల్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లల అభివృద్ధి, న్యూరోసైన్స్, మనస్తత్వశాస్త్రంపై అవగాహన కల్పించడంతో పాటు తల్లిదండ్రులకు పిల్లల పెంపకంలో ఆచరణాత్మక వ్యూహాలపై ప్రత్యేక సెషన్స్ ఏర్పాటు చేశారు.



ఈ సందర్భంగా గంగాస్ వ్యాలీ స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాణి రాజు, ప్రఖ్యాత మనస్తత్వవేత్త - రచయిత ఆర్తి సి.రాజరత్నం పాల్గొని చర్చించారు. నేటి డిజిటల్ యుగంలో తల్లిదండ్రులు, విద్యావేత్తలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి 'హైపర్ కనెక్టెడ్ యెట్ డిస్‌కనెక్టెడ్' అనే ఆలోచనను రేకెత్తించే థీమ్‌ను అన్వేషించారు. ఇందులో భాగంగా సాంకేతికత మాధ్యమంగా తరచూ తెచ్చే అంతరాయాలు ఉన్నప్పటికీ.. తల్లిదండ్రులు-విద్యావేత్తలు పిల్లలతో అర్థవంతమైన సంబంధాలను పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని వెల్లడించారు.

క్లుప్తంగా...

కులగణన పక్కదారి పట్టించేందుకు రాహుల్‌ను టార్గెట్ చేస్తున్నారు

మంత్రి సీతక్క మండిపాటు



సాక్షి, హైదరాబాద్: కులగణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు రాహుల్‌గాంధీని బీజేపీ నేతలు టార్గెట్ చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. రాహుల్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసి న వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి కేంద్రమంత్రి అయిన సంజయ్ విద్వేష ప్రసంగాలు చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారన్నారు. సోమ వారం సచివాలయంలో సీతక్క మీడియాతో మాట్లాడుతూ విద్వేషం, విధ్వంసమే బీజేపీ విధానమని, ప్రేమ, శాంతి, సమానత్వం కోస ం రాహుల్ గాంధీ పనిచేస్తున్నారన్నారు. బీజేపీ విద్వేష విధ్వంసాలు కావాలో.. కాంగ్రెస్ శాంతి సమానత్వం, అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రాహుల్ గాంధీ మతం, అభిమతం కులగణన అని తెలిపారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని రాహుల్ కులగణన కోసం డిమాండ్ చేస్తున్నారని సీతక్క వెల్లడించారు.

బీసీ రాజ్య స్థాపన పక్కా ప్రణాళిక కావాలి

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్



సాక్షి, హైదరాబాద్: బీసీ రాజ్య స్థాపన ప్రకటనతోనే కాదని, దానికి పక్కా ప్రణాళిక కావాలని, ప్రస్తుతం ముఖ్యమంత్రి స్థానం ఖాళీగా లేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. రేవంత్ రెడ్డి సమర్థవంతంగా పని చేస్తున్నారని కితాబిచ్చారు. సమైక్య రాష్ట్రంలో బీసీల ఎదుగు దలకు అవకాశం లేదని, రాష్ట్రం ఏర్పడ్డాక కూడా దొరల పాలన ఏర్పడిందని ఆరోపించారు. సోమవారం మధుయాష్కీ గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. కులగణనపై తమ వైఖరి చెప్పకుండా తప్పించుకోవడానికి రాహుల్ కులం ఏంటి అనడం విడ్డూరమన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మంత్రి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మీది ఏ కులం అని అంటున్నారని, అలాంటి వారు మంత్రి పదవిలో ఉండటానికి అర్హులు కాదన్నారు. బండి సంజయ్ గాడి తప్పిన బండి మాదిరి మాట్లాడుతున్నారని, బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పోటీ నడుస్తోందని మధుయాష్కీ తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. ఎల్బీనగర్ డీసీపీ ఫుల్ టైం ల్యాండ్ సెటిల్మెంట్ చేస్తాడని, పార్ట్ టైం ఉద్యోగం చేస్తాడని విమర్శించారు. అధికారులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిజమన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం కులగణన చేశారని చెప్పారు.

అర్హత ఉన్నా 'ఈ-బస్ సేవా'లో చేరని తెలంగాణ

పథకంలో చేరని కారణంగా నిధులివ్వలేదన్న కేంద్రం



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రధాన నగరాల్లో కాలుష్యాన్ని నివారించే లక్ష్యంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడానికి ఉద్దేశించిన ప్రధాన మంత్రి ఈ-బస్ సేవా పథకంలో చేరేందుకు తెలంగాణ ఆసక్తి చూపట్లేదని కేంద్రం పేర్కొంది. నిజామాబాద్, వరంగల్ నగరాల్లో ప్రజా రవాణా కోసం వీటిని ప్రవేశపెట్టేందుకు అన్ని అర్హతలున్నా, తెలంగాణ ఈ పథకంలో చేరలేదని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహూ ఇటీవల వెల్లడించారు. జనాభా ప్రాతిపదికన వరంగల్ 100 బస్సులు, నిజామాబాద్ 50 బస్సులు పొందడానికి అర్హత కలిగి ఉన్నాయన్నారు. తెలంగాణ ఈ పథకంలో చేరని కారణంగా ఎలాంటి నిధులు ఇవ్వలేదని తెలిపింది.

'పీఎం-ఆశా' మరో ఏడాది పొడిగింపు

తెలంగాణ, ఏపీ సహా మరో రెండు రాష్ట్రాల్లో ప్రారంభమైన కంది సేకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ అభియాన్ (పీఎం-ఆశా)ను 2025–26 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఇంటిగ్రేటెడ్ పీఎం ఆశాలోని ధర మద్దతు పథకం (పీఎస్ఎస్) కింద 2024–25 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హరి యాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో కందిపప్పు సేకరణకు కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. అయితే తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలో ఇప్పటికే సేకరణ ప్రారంభమైంది. ఫిబ్రవరి 15 నాటికి మొత్తం 0.15 ఎల్ఎంటీ కంది కొనుగోళ్లు జరిగాయి. దీనివల్ల 12,006 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కాగా ఇతర రాష్ట్రాలలోనూ కంది సేకరణ త్వరలో ప్రారంభమవుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రైతులు ఉత్పత్తి చేసే కందిని కేంద్ర నోడల్ ఏజెన్సీలైన నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయనుంది.

తెలంగాణ జాతికి కేసీఆర్ హీరో

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఆయన కొడుకుగా పుట్టడం నా పూర్వజన్మ సుకృతం... గుండెబలం, జనబలంతో తెలంగాణను సాకారం చేశారు
- కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటున్నారు
- హ్యాపీ బర్త్‌డే డాడీ: ఎమ్మెల్సీ కవిత
- నాకు ఎనలేని మమకారం పంచిన మేనమామ : హరీశ్‌రావు
- తెలంగాణభవన్‌లో ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, హరీశ్, మహమూద్ అలీ, తలసాని

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ జాతిపిత కేసీఆర్. నా ఒక్కడికే కాదు అందరికీ ఆయన బాపు. తెలంగాణ జాతికి, నాలుగు కోట్ల ప్రజలకు హీరో. సమైక్య పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన మహానుభావుడు. కారణజన్ముడు ఆయన. కేసీఆర్ కొడుకుగా పుట్టడం నా పూర్వజన్మ సుకృతం'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు 71వ జన్మదినం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ధన, కుల, మీడియా బలం లేకున్నా.. 25 ఏళ్ల క్రితం జనబలం, గుండె బలంతో పార్టీని ఏర్పాటు చేసి అవమానాలు, ప్రతికూల ఫలితాలను ఎదుర్కొని తెలంగాణ కలను సాకారం చేశారు'అని అన్నారు. తెలంగాణలోని ఏ మూలకు వెళ్లి పలకరించినా అన్ని వర్గాలు.. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాయని పేర్కొన్నారు. 'తెలంగాణ అనే పసిగుడ్డును తిరిగి ఆయన చేతిలో పెట్టడమే కేసీఆర్‌కు మనం ఇచ్చే బహుమానం. కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా 60 లక్షల మంది గులాబీ సైనికులు పనిచేయాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

నాలుగు కోట్ల ప్రజల భావోద్వేగం: హరీశ్‌రావు

'కేసీఆర్ ఒక వ్యక్తి కాదు. నాలుగు కోట్ల ప్రజల భావోద్వేగం. ఆయనకు తెలంగాణతో ఉన్న బంధం, తల్లీబిడ్డల పేగుబంధం లాంటిది. గతంలో తెలుగుదేశంలో పనిచేసినా కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రశ్నించారు. కేసీఆర్ మొండి పట్టుదల వల్లే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది. తెచ్చిన తెలంగాణను కన్నబిడ్డలా చూసుకుని, పదేళ్లలో అన్ని రంగాల్లో తీర్చిదిద్ది దేశానికే రోల్‌మోడల్‌గా చేశారు. కేసీఆర్ తెచ్చిన తెలంగాణలో సీఎం రేవంత్ 20–20 మ్యాచ్‌లు అంటూ.. డబ్బుల కోసం తొండి మ్యాచ్ ఆడుతున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలని రేవంత్ తాపత్రయపడుతున్నారు. అన్ని వర్గాలూ.. రేవంత్ పాలన బాగోలేదంటూ, కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా కోరుకుంటున్నాయి. భవిష్యత్తులో మరో మూడు టర్ములు బీఆర్‌ఎస్ గెలుపొందడానికి కృషి జరుగుతోంది'అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. 'రేవంత్ ఒక పిల్ల కాకి. కేసీఆర్ కళ్లు తెరిస్తే ఆయన పని ఖతమవుతుంది'అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు.

తెలంగాణభవన్‌లో ఘనంగా వేడుకలు

తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర ముఖ్య నేతలు కలసి కేసీఆర్ 71వ పుట్టిన రోజు సందర్భంగా 71 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. కేసీఆర్ రాజకీయ నేపథ్యం, తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసేలా రూపొందించిన ఫొటోలు, వీడియోను ప్రదర్శించారు. పార్టీ నేతలు కవిత, బండ ప్రకాశ్, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్, రవిచంద్ర, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కాలేరు వెంకటేశ్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు సహా పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు వందల సంఖ్యలో కేసీఆర్‌ను కలసి శుభాకాంక్షలు చెప్పేందుకు ఎర్రవల్లికి బయలుదేరి వెళ్లారు. కార్యకర్తలు, అభిమానులతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది.

కేసీఆర్‌కు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జీవితానికి సరిపడే స్ఫూర్తిని ఇచ్చారు

'ప్రతీ కొడుకు నాన్నే తనకు హీరో అని చెప్తాడు. కానీ మా నాన్న నాకే కాదు తెలంగాణకే హీరో. మీ పోరాటంతో సాధించిన ఈ రాష్ట్ర పురోభివృద్ధిలో మీ వారసత్వాన్ని కొనసాగించేందుకు ప్రతీక్షణం పనిచేస్తానని హామీ ఇస్తున్నా. జీవితకాలానికి సరిపడా మీరు అందించిన స్ఫూర్తికి కృతజ్ఞతలు. నాన్నా.. పుట్టిన రోజు శుభాకాంక్షలు'.

-'ఎక్స్'లో కేటీఆర్

హ్యాపీ బర్త్‌డే డాడీ: కవిత

హ్యాపీ బర్త్‌డే డాడీ.. అంటూ కేసీఆర్ నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న ఫొటోను ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

కేసీఆర్ అంటేనే ఒక ఉద్వేగం, యుద్ధ నినాదం

'మీరు నా తలనిమిరే తల్లిప్రేమ. నాకు ఎనలేని మమకారం పంచిన మేనమామ. నాకు రాజకీయ చైతన్యాన్ని నేర్పించి, నాలో ప్రజాసేవా సంస్కారాన్ని రంగరించి ఉద్యమ కార్యాచరణలో నడిపించారు. కేసీఆర్ అంటేనే ఒక ఉద్వేగం, ఉద్రేకం, స్వాభిమానం, యుద్ధ నినాదం, ప్రజాగళం, ఆత్మగౌరవ రణం, తెలంగాణ జనం గుండెల్లో నిత్య సూర్యోదయం'.

-'ఎక్స్'లో హరీశ్‌రావు

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు మెరుగైన అవకాశాలు

మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణతో మాదిగలు, మాదిగ ఉపకులాలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు మరింత మెరుగు పడతాయని వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు చర్యలు తీసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికే ఈ ఘనత దక్కుతుందన్నారు. మాదిగల తరఫున సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై మాదిగ సామాజిక వర్గానికి చెందిన శాసనసభ్యులు, మాదిగ అనుబంధ కులాల సంఘాల ప్రతినిధులతో సోమవారం బేగంపేటలో మంత్రి దామోదర ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్గీకరణ ప్రక్రియకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన కులాల్లో అసమానతలు రూపుమాపడానికే ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరిస్తోందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటంలో అమరులైన మాదిగ సోదరుల కుటుంబ సభ్యులను దామోదర సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మంత్రులు మోత్కుపల్లి నరసింహులు, చంద్రశేఖర్, మాజీ పార్లమెంట్ సభ్యుడు పసునూరు దయాకర్, తోట లక్ష్మీకాంతారావు తదితరులు పాల్గొన్నారు.

'వందేళ్ల ముందుచూపు' పుస్తకాన్ని ఆవిష్కరించిన కేసీఆర్



'వందేళ్ల ముందుచూపు' పుస్తకావిష్కరణలో కేసీఆర్. దేశపతి, గౌరీశంకర్, వద్దిరాజు, మధుసూదనాచారి, వి.ప్రకాశ్, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పునర్నిర్మాణంలో నీళ్లు, నిధులు, నియామకాలకు సంబంధించి తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన కృషిని, ఆర్బీఐ నివేదిక గణాంకాల ఆధారంగా జూలూరి గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'వందేళ్ల ముందుచూపు'పుస్తకాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. సోమవారం ఎర్రవల్లి వ్యవసాయక్షేత్రంలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పుస్తకావిష్కరణ నిర్వహించారు. కేసీఆర్‌కు పుట్టినరోజు కానుకగా తాను ఈ పుస్తకాన్ని అందజేస్తున్నట్టు జూలూరి తెలిపారు. చితికి పోయిన తెలంగాణ పల్లెను తిరిగి చిగురించేటట్టు చేయటం, నీళ్లెక్కని ఎగువభూములకు నీళ్లందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఈ పుస్తకం తెలియజేస్తుందని జూలూరి వెల్లడించారు. పుస్తకావిష్కరణలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కెళ్లపల్లి రవీంద్రరావు, మహమూద్ అలీ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వైఎస్ జగన్ సోమవారం 'ఎక్స్'లో ఒక పోస్టు చేశారు. 'పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుకి శుభాకాంక్షలు. దేవుడు ఆయనకు ఆరోగ్యం, సంతోషకరమైన పరిపూర్ణ జీవితాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నా' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

'జన'గట్టు



భేరీ మోగిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- లింగమంతులస్వామి జాతరకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- దర్శించుకున్న మంత్రి ఉత్తమ్, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి

సూర్యాపేట: లింగమంతులస్వామి జాతరకు భక్తజనం పోటెత్తింది. జాతరలో రెండోరోజైన సోమవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తులు పెద్దసంఖ్యలో గట్టుకు చేరుకున్నారు. స్వామివారిని, చౌడమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు ప్రత్యేకంగా వండిన బోనాలపై ఉన్న మట్టి చిప్పల్లో ఒత్తులు వెలిగించి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి వారికి గండ దీపాలను వెలిగించారు. మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మంత్రి ఉత్తమ్ భక్తులతో కలిసి భేరీ మోగించారు.

తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక: ఉత్తమ్

తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు పెద్దగట్టు జాతర ప్రతీక అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సంప్రదాయాల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యమిచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ జాతరకు రూ.5 కోట్లు కేటాయించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి 30 లక్షల పైచిలుకు భక్తులు ఈ పూజల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. వాహనాల రద్దీతో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేశారన్నారు. అదనపు పోలీస్ సిబ్బందితోపాటు పర్యవేక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. అత్యవసర చికిత్సల నిమిత్తం ప్రత్యేక వైద్య బృందాలతోపాటు అత్యవసర వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. మంత్రి వెంట రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నరసయ్యయాదవ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లను కలిసేలా 'బీజేపీ మాస్ కాంటాక్ట్ ప్రోగ్రామ్'

25 మంది టీచర్లకు ఒక పార్టీ కార్యకర్త ఇన్‌చార్జ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడుచోట్ల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ ఓటర్లను కలిసేందుకు 'మహా అభియాన్'తో బీజేపీ సిద్ధమైంది. ఈ నెల 22, 23 తేదీల్లో 'మాస్ కాంటాక్ట్‌ప్రోగ్రామ్'కింద ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను కలిసేలా యావత్ పార్టీ యంత్రాంగం నిమగ్నం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశించింది. ఈ రెండు రోజులు ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా, కేవలం ఓటర్లను కాంటాక్ట్ చేయడంపైనే బూత్‌స్థాయి కార్యకర్త నుంచి ముఖ్యనేతలు దృష్టి పెట్టాలని సూచించింది. ఎన్నికల ప్రచార సమన్వయం, పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా 25 మంది టీచర్లకు ఒక పార్టీ కార్యకర్త (పచ్చీస్ ప్రభారీ)ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇందుకు అనుగుణంగా మ్యాపింగ్ చేయడంతో పాటు, ఓటర్లకు సంబంధించిన ఫోన్‌నంబర్లు, ఇతర వివరాలు అందజేశారు. ఈ ఇన్‌చార్జ్‌లు తమకు కేటాయించిన 25 టీచర్లను కలిసి వారి ఫోన్ నుంచి ఒక నంబరుకు మిస్డ్‌కాల్ ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్ర కార్యాలయంలోని కాల్‌సెంటర్ ద్వారా ఈ మిస్డ్‌కాల్స్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.

ఏపీపై ఫిర్యాదు చేయండి

- ఆ రాష్ట్రం ఏకపక్షంగా నీటిని తరలించడాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి
- నీటి పారుదల శాఖ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాల వినియోగం విషయంలో అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏపీ ఏకపక్షంగా నీటిని తరలించే అంశంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు. నదీ జలాల్లో వాటాల పంపిణీ, నీటి వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల సంఘంపైనే ఉందని.. ఏపీ నిర్ణీత వాటాకు మించి నీళ్లను తరలించుకోకుండా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, పంటలకు సాగునీటి విడుదలపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం సమీక్ష నిర్వహించారు. ఏపీ నిర్ణీత కోటాకు మించి ఎక్కువ నీటిని తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు టెలిమెట్రీ విధానమే పరిష్కారమని సీఎం పేర్కొన్నారు. అయితే టెలిమెట్రీ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో ఏపీ వాటా నిధులను చెల్లించేందుకు ముందుకు రావటం లేదని అధికారులు పేర్కొన్నారు. దీనితో అవసరమైన నిధులన్నీ ముందుగా తెలంగాణ ప్రభుత్వమే చెల్లిస్తుందని, వెంటనే టెలిమెట్రీ అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై కృష్ణా బోర్డుకు లేఖ రాయాలని నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు.

ప్రణాళిక ప్రకారం సాగునీటి విడుదల..

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎండలు పెరిగిన కొద్దీ తలెత్తే గడ్డు పరిస్థితులను ముందుగా అంచనా వేసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలించి, పరిష్కార మార్గాలను అనుసరించాలని ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా, పంటలు ఎండిపోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

వచ్చే మూడు నెలలు కీలకం..

శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీతో పాటు ప్రధాన ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగం వివరాలపై సీఎం ఆరా తీశారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సాగునీటికి, తాగునీటికి ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని, రాష్ట్రమంతటా సాగు, తాగునీటికి, విద్యుత్‌కు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని గుర్తు చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరు, సాగునీటిని అందించేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని చెప్పారు. నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ఆయకట్టు పంటలకు నీటి విడుదలపై నీటి పారుదల శాఖ ఇంజనీర్లతో తక్షణమే సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నీటి విషయంలో నిర్ణీత ఎజెండా ఖరారు చేసుకుని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించాలని, తగిన ఆదేశాలు జారీ చేయాలని సీఎస్ శాంతికుమారికి సీఎం సూచించారు.

నేడు ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంలో విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: కారు గుర్తుపై గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేల కేసుపై మంగళవారం దేశ సర్వోన్నత న్యాయస్థానం మరోసారి విచారించనుంది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జనవరి 15న బీఆర్‌ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్‌లు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ)ను దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై బీఆర్‌ఎస్ పార్టీ, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్ రావు తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై ఈనెల 10న సుప్రీం కోర్టు విచారించింది. విచారణ సమయంలో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం.. రాజకీయ పార్టీల హక్కులకు ఇబ్బంది కలుగుతుంటే చూస్తూ ఊరుకోం'అంటూ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. అనంతరం ఈనెల 18కి విచారణను వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

ఐదేళ్లూ రేవంత్‌రెడ్డే సీఎం: మహేశ్‌కుమార్‌గౌడ్

బీసీని సీఎంను చేసే సత్తా కాంగ్రెస్‌కే ఉంది



సాక్షి, హైదరాబాద్: బీసీ నాయకుడిని రాష్ట్ర ముఖ్యమంత్రిని చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ భవిష్యత్తు బీసీలదేనని పేర్కొన్నారు. సోమవారం ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహేశ్‌కుమార్ మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీ నాయకుడిని సీఎంను చేయగలవా? అని ప్రశ్నించారు. ఐదేళ్లపాటు రాష్ట్రానికి రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారని తెలిపారు. బీసీల్లో ఐక్యత లోపించిందని, బీసీలంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఆ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా ప్రధానిని ఒప్పించే దమ్ముందా? అని ప్రశ్నించారు. దేశంలో జనగణనతో పాటే కులగణన నిర్వహించాలని ప్రధాని మోదీని అడగాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం అన్ని పార్టీల నాయకులతో కలిసి ప్రధానిని కలుస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ అఖిల భారత ఓబీసీ సెల్ చైర్మన్ అజయ్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ డైవర్షన్ డ్రామా

- కులగణనపై చర్చను పక్కదారి పట్టించే కుట్ర
- అందుకే మోదీ, రాహుల్ కులాలపై రచ్చ: ఎమ్మెల్సీ కవిత



ఎర్రవల్లిలో జరిగిన యాగంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మర్కూక్ (గజ్వేల్): బీసీ కులగణనలో లోపాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే బీజేపీ, కాంగ్రెస్ కలిసి నాటకాలు ఆడుతున్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో సోమవారం గ్రామస్తులు ఆయుష్ హోమం, సుదర్శనయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై హోమంలో పాల్గొన్నారు. అంతకు ముందు వర్గరాజ్‌పూర్‌లోని వరదరాజులస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రవల్లిలో ఆమె మాట్లాడుతూ కుల గణన సర్వేలో తప్పుడు లెక్కలపై చర్చను పక్కదోవ పట్టించడానికి ప్రధాని మోదీ బీసీనా? కాదా? అన్న చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి తెర లేపారని మండిపడ్డారు. 'మోదీ బీసీ అయితే ఏంది? కాకపోతే ఏంది? రాహుల్‌గాంధీది ఏ మతం అయితే మాకేంది? మీరుమీరు తిట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండోసారి నిర్వహిస్తున్న సర్వేలో అయినా సరిగా లెక్కలు తీయాలని సూచించారు. బీసీ కులగణనను కాంగ్రెస్ అసెంబ్లీలో బిల్లు పెట్టాలని, వెంటనే కేంద్రం దానికి ఆమోదించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి 14 నెలల పాలనలో ప్రజల బతుకులు ఆగమయ్యాయని అన్నారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు పూజలు చేస్తున్నారని తెలిపారు.

రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇంటి స్థలాలను కబ్జా చేసిన రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలను రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యం కబ్జా చేసిందని ఆరోపించారు. నిరుపేదలైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వమే రూ.ఐదు లక్షల నిధులను కూడా ఇవ్వాలని కోరారు. కలెక్టర్ నారాయణరెడ్డి స్పందిస్తూ మంగళవారం రామోజీ ఫిల్మ్‌సిటీ యాజమాన్యాన్ని పిలిపించి ఆర్డీవో సమక్షంలో లబ్ధిదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు బి.సామేల్, సీహెచ్.బుగ్గరాములు, సీహెచ్.జంగయ్య, జగన్, సీహెచ్ నర్సింహ, నీరుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హామీలను పక్కనపెట్టి ప్రజల దృష్టి మళ్లిస్తున్నారు

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి పుణ్యమా అని తెలంగాణ రాజకీయాల్లో సబ్జెక్ట్ కంటే, సొల్లు రాజకీయాలు ఎక్కువయ్యాయని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా, హెచ్ఎండీఏ, ట్రిపుల్‌ఆర్, కులగణన, రాజకీయగణన వంటి అంశాలతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ప్రధాని మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ కుల అహంకారంతో రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీకి రేవంత్ అడ్డొచ్చినా, రేవంత్‌కు మోదీ అడ్డొచ్చినా, నష్టపోయేది రేవంతేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కులగణన పేరిట రాజకీయగణన చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీసీల సంఖ్య తగ్గించి, వారిని రాజకీయంగా దెబ్బ కొట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 'మున్నూరుకాపులు 12 లక్షల మంది మాత్రమే ఉన్నారా? గౌడ్ సామాజిక వర్గం సంఖ్య 23 లక్షల నుంచి 16 లక్షలకు తగ్గిందా? గొల్లకురుమల సంఖ్యను 18 లక్షలకు ఎలా కుదించారు?'అని నిలదీశారు. అలాగే రజకులు, వడ్డెర కులస్తుల సంఖ్యను తక్కువగా చూపించి, బీసీల సంఖ్యను తగ్గించడానికి కుట్ర చేస్తున్నారన్నారు.

వెంటనే కొత్త రేషన్‌కార్డులు

▶ మొదటి పేజీ తరువాయి

అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే కార్డుల కోసం దరఖాస్తు చేసిన కుటుంబాలు మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో వెంటనే షురూ..

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ అమల్లో ఉందని, ఆ కోడ్ అమల్లో లేని జిల్లాల్లో రేషన్ కార్డుల జారీ మొదలుపెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. కోడ్ ముగిసిన తర్వాత అన్ని జిల్లాల్లో కొత్త కార్డులు ఇవ్వాలని సూచించారు. కొత్త కార్డులకు సంబంధించి పౌర సరఫరాల విభాగం తయారు చేసిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 18-2-2025

నేమ్ ప్లేట్



మన దేశంలో ఇంటి పేరు, ఇంటి వాకిలి పేరు నాన్నదే ఉంటుంది.
అమ్మ పేరు దాదాపుగా ఉండదు.
కూతురి పేరు అసలే కనిపించదు.
కూతురూ ఇంటి సభ్యురాలే
అనే భావన ఆమెకు ఆత్మవిశ్వాసం ఇస్తుంది.
అబ్బాయిల వైఖరిలో మార్పు తెస్తుంది.
అందుకే నార్త్‌లో చాలాచోట్ల
కుమార్తె నేమ్‌ప్లేట్ పెట్టే ఆనవాయితీ మొదలైంది.
ఇటీవల నాగ్‌పూర్ చుట్టుపక్క పల్లెల్లో
2100 ఇళ్లకు అమ్మాయిల పేర్లు సగౌరవంగా అమర్చారు.
ఇంకా ఈ ఆనవాయితీ దక్షిణాదికి రాలేదు.
వివరాలు

ఇంటిపేరు ఆడపిల్ల

మన ఇళ్లల్లో ఆడపిల్లలు ఉన్నారో లేరో అన్నట్టుగా ఎందుకు ఉండాలి... వారు తమ అస్తిత్వంతో ఎందుకు ఉండకూడదు.. ఆత్మవిశ్వాసంతో ఎందుకు ఉండకూడదు... గుర్తింపుతో ఎందుకు ఉండకూడదు... ఈ ప్రశ్నలు 'మేజిక్ బస్ ఫౌండేషన్' బాధ్యురాలు ధనశ్రీ బ్రహ్మేకు వచ్చాయి. ఐక్యరాజ్య సమితిలో చాలా కాలం పని చేశాక భారతదేశంలో పారిశ్రామిక ప్రాంతాల్లోని బస్తీల్లో, వెనుకబడిన పల్లెల్లో లైంగిక వివక్షను రూపుమాపి టీనేజ్ ఆడపిల్లల వికాసానికి కృషి చేయాలని ధనశ్రీ 'మేజిక్ బస్ ఫౌండేషన్'ను స్థాపించారు. ఆడపిల్ల తను ఎదిగే వయసులో వెనుకబడితే జీవితాంతం వెనుకబడుతుందని ఆమెకు ఆత్మవిశ్వాసం అవసరమని భావించారు. అందుకే 'నేమ్స్ ఆన్ డోర్స్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఆడపిల్ల గురించి ఆలోచించరు

మన దేశంలో ఇంట్లో అమ్మాయి, అబ్బాయి ఉంటే ప్రాముఖ్యత అంతా అబ్బాయికే ఉంటుంది. అమ్మాయిని మామూలు బడిలో... అబ్బాయిని మంచి బడిలో వేయడం, సౌకర్యాలు, చదువు కొనసాగింపు... ఇవన్నీ అమ్మాయి పట్ల వివక్షను చూపుతాయి. బడి మాన్పించి పెళ్లి చేసే బెడద ఎలాగూ ఉంటుంది. ఆస్తిలో భాగం గురించిన ఆలోచన ఉండదు. వీటన్నింటి దృష్ట్యా పూర్తిగా ఆత్మవిశ్వాసం కోల్పోవడం తప్ప ఆడపిల్ల వికాసం సంపూర్ణం కాదు. 'నేనూ ఇంటిలో సమాజంలో భాగమే. నాకంటూ ఒక స్థానం ఉంది. నా బాధ్యతలు నాకున్నా నాకంటూ కొన్ని కలలు ఉంటాయి అని అమ్మాయిలకు అనిపించాలి' అంటారు ధనశ్రీ. 'ఇంటికి అమ్మాయి నేమ్‌ప్లేట్ పెడితే కొద్ది మార్పు సాధ్యమే' అనుకున్నారామె.

ఎందుకు పెట్టాలి?

మహారాష్ట్రలోని నాగపూర్ శివార్లలో ఉన్న కలమేశ్వర్ పారిశ్రామిక వాడను ఆనుకుని 108 గ్రామాలు ఉన్నాయి. వాటన్నింటిలో రోజు కూలీలు, కార్మికులే ఉంటారు. వీరికి ఆదాయం చాలా తక్కువ. అందువల్ల





తమ పేరుతో ఉన్న 'నేమ్ ప్లేట్' వద్ద అమ్మాయిలు



ఆర్థిక దృష్టికోణంలో అబ్బాయికి ఇచ్చే ప్రాధాన్యం అమ్మాయికి ఇవ్వరు. అందుకే అమ్మాయిలు తెర వెనుకే ఉండిపోతారు. వారికి ఆత్మవిశ్వాసం కల్పించేందుకు 12 నుంచి 16 ఏళ్ల వయసున్న అందరు అమ్మాయిల డేటా తీసుకుని వారి ఇళ్లకు వెళ్లి మీ అమ్మాయి నేమ్‌ప్లేట్ ఇంటికి పెట్టండి అని ఫౌండేషన్ కార్యకర్తలు అడిగితే అందరి నుంచి ఎదురైన ప్రశ్న 'ఎందుకు పెట్టాలి' అని. ఎందుకంటే ఇంటికి నేమ్‌ప్లేట్ తండ్రిదే ఉంటుంది. లేదంటే కొడుకుది. కూతురిది ఉండదు. 'అయితే ఇంటికి కూతురు కూడా హక్కుదారని... ఆమె పెరిగే ఇంటికి ఆమె పేరు పెట్టుకునే హక్కు ఉంటుందని కార్యకర్తలు గట్టిగా చెప్తారు' అని తెలిపారు ధనశ్రీ. అంతే కాదు ఊరి పెద్దలతో, పంచాయితీ పెద్దలతో, స్కూలు టీచర్లతో చెప్పించి ఒప్పించారు.

పెనుమార్పు

కలమేశ్వర్ చుట్టుపక్కల ఉన్న 18 గ్రామాల్లో 12 నుంచి 16 ఏళ్ల ఉన్న ప్రతి అమ్మాయి ఇంటికి ఆ అమ్మాయి పేరుతో నేమ్‌ప్లేట్ తయారు చేయించి వాటిని ఇంటి వాకిలికి అమర్చే ఏర్పాటు చేశాక ఆడపిల్లల్లో వచ్చిన ఉత్సాహం అంతా ఇంతా కాదు. ఇదో కొత్త గుర్తింపు గౌరవం అయ్యింది. 'మా అన్నయ్య నాతో నీ పేరు ఎందుకు పెట్టాలి అనడిగాడు... నీ పేరు నువ్వు పెద్దయ్యాక నీ ఇంటికి ఎలాగూ పెట్టుకుంటావు... ఇప్పుడు నా పేరు పెట్టకపోతే ఎక్కడా ఎప్పుడూ పెట్టరు అని సమాధానం ఇచ్చాను' అని 9వ తరగతి చదువుతున్న ఒక అమ్మాయి అంది. ఈ 18 పల్లెల్లో 2100 గడపలకు అమ్మాయిల నేమ్‌ప్లేట్లు ఇవాళ కళకళలాడుతూ కనపడుతున్నాయి. 'ఈ నేమ్‌ప్లేట్లు పెట్టాక తల్లిదండ్రులు మమ్మల్ని చదివించాలని, మా మాటకు విలువ ఇవ్వాలని, మాకూ గౌరవం ఇవ్వాలని భావిస్తున్నారు' అన్నారు అమ్మాయిలంతా. 'చుట్టుపక్కల పల్లెల వాళ్లు ఈ పల్లెలకు వచ్చి నేమ్‌ప్లేట్లు చూసి మేమూ పెట్టిస్తాం అని వెళుతున్నారు' అని వారు తెలిపారు.

అదే అమ్మాయి... కాని ఒక చిన్న గుర్తింపుతో అడుగున నిలబడే దశ నుంచి సమాన దశకు వచ్చి నిలబడేలా చేసింది ఈ నేమ్‌ప్లేట్.

దక్షిణాదిలో ఇవాళ్టికీ జరుగుతున్న కొన్ని వివక్షలను గమనిస్తే 'నేమ్స్ ఆన్ డోర్స్' ఎక్కువ అవసరం అని భావించడంలో తప్పు లేదు. •

సమ్‌థింగ్ స్పెషల్

గాలిలో ఎగిరొచ్చి పరీక్ష రాశాడు!



'ఎగ్జామ్ సెంటర్‌కు ఎలా వెళతారు?' అనే ప్రశ్నకు జవాబు తెలియనిదేమీ కాదు. అయితే ఈ స్టూడెంట్ మాత్రం తన రూటే సెపరేట్ అని నిరూపించుకున్నాడు.

'మనసు ఉంటే ఇలాంటి మార్గం కూడా ఉంటుంది' అని చెప్పకనే చెప్పాడు.

మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన బీకామ్ విద్యార్థి సమర్థ్ మహంగాడే పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఎవరూ ఊహించని మార్గాన్ని ఎంచుకున్నాడు. రోడ్డుమీద వెళ్లకుండా ట్రాఫిక్ జామ్ భయంతో సమర్థ్ ఎంచుకున్న మార్గం... పారాగ్లైడ్!

ప్రముఖ పర్యాటక కేంద్రం పంచగనిలో సమర్థ్ చిన్న జ్యూస్ స్టాల్ నడుపుతున్నాడు. పరీక్ష కేంద్రం అక్కడి నుంచి పదిహేను కిలోమీటర్ల దూరం ఉంటుంది, సమయం ఇంకా ఇరవై నిమిషాలు మాత్రమే ఉంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా అక్కడికి సకాలంలో చేరుకోవడం అసాధ్యం అనుకున్న సమర్థ్ అసాధారణ మార్గాన్ని ఎంచుకున్నాడు. పారాగ్లైడింగ్ గేర్ ధరించిన సమర్థ్ గాలిలో ఎగురుతూ పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకున్నాడు. ఇందు కోసం అడ్వెంచర్ స్పోర్ట్స్ ఎక్స్‌పర్ట్ గోవింద్ యెవాలే సహాయం తీసుకున్నాడు. తన బృందం సహాయంతో సమర్థ్‌కు అన్నిరకాల ఏర్పాట్లు చేసి తోడ్పాటు అందించాడు గోవింద్.

ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇది ఏనుగు... కానీ కాదు!

కేరళ త్రిసూర్‌లోని కొంబర శ్రీకృష్ణస్వామి ఆలయంలో ఒక ఏనుగు భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే ఇది సజీవమైన ఏనుగు కాదు. లైఫ్–సైజ్ మెకానికల్ ఎలిఫెంట్. ప్రముఖ సితారిస్ట్ అనౌష్క శంకర్, పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్(పెటా) కలిసి శ్రీకృష్ణస్వామి ఆలయానికి ఈ యాంత్రిక ఏనుగును విరాళంగా ఇచ్చారు. ఇది మూడు మీటర్‌ల ఎత్తు, 800 కిలోల బరువు ఉంటుంది.


'ఈ రోబోటిక్ ఏనుగు వల్ల సజీవమైన ఏనుగులను గొలుసులతో బంధించి, ఆయుధాలతో నియంత్రిస్తూ బాధ పెట్టడం అనేది ఉండదు. రోబోటిక్ ఏనుగులు సజీవ ఏనుగులకు మానవీయ ప్రత్యామ్నాయాన్ని అందిస్తాయి' అంటోంది పెటా.



రబ్బర్, ఫైబర్, మెటల్, ఫోమ్, స్టీల్‌తో రూపొందించిన ఈ యాంత్రిక ఏనుగు సజీవ ఏనుగులా భ్రమింపచేస్తుంది. తల, కళ్లు, చెవులు, తోక, తొండాలను కదిలిస్తుంది.

తొండాన్ని పైకి లేపి నీళ్లు చల్లుతుంది.

బైక్ + కారు = బైకార్



కొన్ని వారాల క్రితం పాకిస్థాన్‌కు సంబంధించి హోమ్‌మేడ్ టెస్లా సైబర్ ట్రక్ రెప్లికా వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఇక తాజా విషయానికి వస్తే...

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోలో ఒక పాకిస్థానీ వ్యక్తి విచిత్రమైన, ఆకర్షణీయమైన హైబ్రీడ్ వాహనంలో ప్రయాణిస్తున్నాడు. ఈ వాహనాన్ని కారు అనలేము. అలా అని బైక్ అనలేము. ఎందుకంటే సగం కారు, సగం బైక్ 'కళ'యిక ఈ వాహనం!

వాహనం ముందుభాగంలో మోటర్ సైకిల్ హ్యాండిల్ బార్, వీల్ కనిపిస్తాయి.

'వోన్లీ ఇన్ పాకిస్థాన్' ట్యాగ్‌లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ వీడియో క్లిప్‌ను చూసి 'అయ్ బాబోయ్' అంటున్నారు నెటిజనులు.

కొందరు ఈ విచిత్ర వాహనాన్ని సల్మాన్ ఖాన్ 'కిక్' సినిమాలో ఉపయోగించిన వాహనంతో పోల్చారు.

'కిక్ సినిమాతో ఇన్‌స్పైర్ అయ్యి ఈ బైక్ ప్లస్ కారును తయారు చేశారు' అని రాశారు. ఈ వీడియో మూడు మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకోవడం మాట ఎలా ఉన్నా.... 'సరదాలు, ప్రయోగాల సంగతి సరే... రోడ్డు సేఫ్టీ మాటేమిటి' అని ఘాటుగా ప్రశ్నించారు కొందరు.


నిజమే కదా!

సాగుబడి
శతభిష కార్తె: రేపటి నుంచి



వరి పొలంలోనే చేపలు, కూరగాయలు కూడా సాగు చేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రం

- వరి పొలంలోనే చుట్టూ కందకం తీసి చేపల పెంపకం
- కందకం తవ్విన మట్టితో వెడల్పుగా గట్లు.. ఆ గట్లపై కూరగాయలు, పండ్ల చెట్లు..
- సమీకృత ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎకరానికి రూ. లక్ష ఆదాయం
- ఆదర్శవంతంగా యువ రైతు వెంకటేష్ సేద్యం



వరి పొలం గట్టు మీద బీర పాదులు

వరి చేలోనే కూరగాయలు, చేపలు!

మాగాణి చేను అనగానే మనకు ఒక్క వరి పంట మాత్రమే మదిలో మెదులుతుంది. అయితే, మాగాణి పొలంలో వరి పంటతో పాటు కూరగాయ పంటలు, చేపల సాగు కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించుకునే సరికొత్త సమీకృత సేద్య నమూనా ఇది.

కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరం గ్రామానికి చెందిన యువ రైతు కరుపురెడ్డి వెంకటేష్ నమూనా క్షేత్రం ఇందుకు ఒక ఉదాహరణ. 1.20 ఎకరాల భూమిలో వరితో పాటు అనేక రకాల కూరగాయ పంటలు, కందకంలో చేపల సాగు దర్శనమిస్తాయి. ఏడాదికి ఎకరం వరి సాగులో సాధారణంగా రూ. 40 వేల ఆదాయం వస్తుంది. అయితే, సమీకృత ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వెంకటేష్ రూ. లక్షకు పైగా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈయన వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల రైతులకు సైతం ఆదర్శంగా నిలిచారు.

ఎకరానికి రూ. లక్ష ఆదాయం

వెంకటేష్ వ్యవసాయ క్షేత్రం విస్తీర్ణం ఎకరం 20 సెంట్లు. కాగా, చుట్టూతా విశాలమైన గట్టు 55 సెంట్లలో, గట్టు పక్కనే చుట్టూతా 20 సెంట్లలో తవ్విన కందకంలో చేపల పెంపకం, మధ్యలో మిగిలిన 45 సెంట్ల విస్తీర్ణంలో వరి పంట పండిస్తున్నారు. మాగాణిలో ఒకే పంటగా వరి సాగు చేస్తే ఎకరానికి మహా అయితే రూ.40 వేల ఆదాయం వస్తుంది. దీనికి భిన్నంగా తన పొలంలో గట్టు మీద పండ్ల చెట్లు, కూరగాయ పంటలు, ఆకుకూరలు.. గట్టు పక్కనే తవ్విన కందకం (లేదా కాలువ)లో చేపలు పెంచుతున్నారు. మధ్యలోని పొలంలో వరి సాగు చేస్తున్నారు. ఈ విధంగా సమీకృత ప్రకృతి సేద్యం ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.లక్ష ఆదాయం సంపాదిస్తున్నారు.

మాగాణి పొలాల్లో కూడా వరి తప్ప వేరే పండదు అనే అపోహను వదిలిపెట్టి పలు రకాల పంటలు పండించుకోవటం ద్వారా ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలో ఈ సమీకృత ప్రకృతి సేద్య నమూనా తెలియజెప్తోంది. వెంకటేష్ వ్యవసాయ క్షేత్రం రైతులకు, ఇతర సిబ్బందికి రాష్ట్ర స్థాయి శిక్షణ ఇవ్వటానికి కూడా ఉపయోగపడుతుండటం విశేషం.

– వివిఎస్‌విఎస్ వరప్రసాద్, సాక్షి, పిఠాపురం

ఇతర రైతులకు ఆదర్శం

యువ రైతు వెంకటేష్ సమీకృత ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరితో పాటు చేపలు, కూరగాయ పంటల సాగుపై ఆసక్తి చూపటంతో శిక్షణ ఇచ్చాం. ఆచరణలో పెట్టి, మంచి ఫలితాలు సాధించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన పొలాన్నే రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రదర్శన క్షేత్రంగా వినియోగిస్తున్నాం.

– ఎలియాజర్ (94416 56083), జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి, కాకినాడ





సమీకృత ప్రకృతి సేద్యంలో శిక్షణ పొందుతున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

రెండేళ్లలోనే మంచి ఫలితాలు

నాకున్న 1.2 ఎకరాల పొలంలో గతంలో వరి మాత్రమే సాగు చేసే వాడిని. ఏడాదికి పెట్టుబడి పోను అతి కష్టం మీద రూ. 40 వేల వరకు ఆదాయం వచ్చేది. ఆ దశలో 2020లో మా జిల్లాలో చేపట్టిన పకృతి వ్యవసాయం చేయాలనిపించి ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్‌ను సంప్రదించాను. ఆయన నా ఆసక్తిని గమనించి దుర్గాడ రైతు గుండ్ర శివ చక్రం ద్వారా నాకు సమీకృత సాగుపై శిక్షణ ఇప్పించారు. సార్వా వరి కోసిన తర్వాత, అదేవిధంగా దాళ్వా పంట కోసిన తర్వాత నేలను సారవంతం చేసే 20 రకాల పచ్చిరొట్ట పంటలను పెంచి, కలియదున్నేస్తున్నా. దీని వల్ల భూమి సారవంతమవుతోంది. ఎద్దులతోనే దుక్కి, దమ్ము చేస్తాం. జీవామృతం, ఘనజీవామృతం, కషాయాలు వాడుతున్నాం. రెండేళ్లలోనే మంచి ఫలితాలు వచ్చాయి. మా కుటుంబానికి వాడుకోగా మిగిలిన కూరగాయల ఇతరులకు ఇస్తున్నాం. బొచ్చె, కొర్ర మీను వంటి చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం వస్తోంది. రసాయనాలు వాడకుండా పెంచటం వల్ల మా పంటలకు మంచి డిమాండ్ ఉంటోంది. సంతృప్తికరంగా ఆదాయం పొందటంతో పాటు రైతుల శిక్షణ కేంద్రంగా మా పొలం మారినందుకు చాలా సంతోషంగా ఉంది.

– కరుపురెడ్డి వెంకటేష్ (63024 19274), పి.రాయవరం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా





రైతు సొంతంగా నిర్మించుకున్న సోలార్ డ్రయ్యర్. (పక్కన)ఆరబెట్టిన గులాబీ పూలు

ఆరబెడితే అధికాదాయం!

- భారీ సోలార్ డ్రయ్యర్‌ను తానే రూపొందించుకున్న రైతు
- గులాబీ పూలు, మునగ ఆకులను ఆరబెట్టి విక్రయిస్తూ అధికాదాయం పొందుతున్న వైనం

పూలను కష్టపడి పండించటంతోనే సరిపోదు. మార్కెట్‌లో గిరాకీ తగ్గినప్పుడు.. పండించిన పంటను రూపం మార్చి అమ్మగలిగితే మంచి ఆదాయం పొందవచ్చని నిరూపిస్తున్నారు అభ్యుదయ రైతు గాదె రాజశేఖర్. అందుకోసం 2.5 టన్నుల పంటను ఆరబెట్టగల పెద్ద సోలార్ డ్రయ్యర్‌ను తానే సొంతంగా రూపొందించుకున్నారు. అందులో గులాబీ తదితర రకాల పూల రేకులు, మునగ ఆకులను ఆరబెట్టి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని గండిగూడ వద్ద గల తన 8 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో మిశ్రమ పంటలు సాగు చేస్తున్నారు. సోలార్ డ్రయ్యర్‌ను వినియోగిస్తూ గులాబీ రేకులు, మునగ ఆకులను ఆరబెట్టి మార్కెట్ చేస్తున్నారు. ఆరబెట్టిన ఈ గులాబీ రేకులను పాన్ మసాలాలో, స్వీట్ల తయారీలో వాడుతున్నారు. ఆరబెట్టిన మునగ ఆకుల పొడిని అనేక ఉత్పత్తుల్లో వినియోగిస్తున్నందున మార్కెట్‌లో గిరాకీ ఉందని చెబుతున్నారు.

దేశవాళీ గులాబీ రేకులతో..

రెండు ఎకరాల్లో దేశవాళీ పింక్ సెంటెడ్ గులాబీ తోటను రాజశేఖర్ సాగు చేస్తున్నారు. ఈ పూల రేకులను సోలార డ్రయ్యర్‌లో ఆరబెడుతున్నారు. తాను పండించిన పూలే కాకుండా, మార్కెట్‌లో ఈ రకమైన పూల ధర కిలో రూ.20 లోపు ఉన్నప్పుడు ఇతర రైతుల నుంచి కొనుగోలు చేసి, వాటిని కూడా తన డ్రయ్యర్‌లో ఆరబెడుతున్నారు.

పది కిలోల గులాబీ రేకులను ఆరబెడితే కిలో ఎండు పూల రేకులు తయారవుతాయి. వీటిని కిలో రూ.600 చొప్పున విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. సోలార్ డ్రయ్యర్‌లో చామంతి, మందార, శంకపుష్పం, మల్లెపూలను కూడా ఆరబెట్టి మార్కెట్ చేసుకోవచ్చని ఆయన చెబుతున్నారు.

మునగ ఆకులతో..

వ్యవసాయ క్షేత్రంలో 8 ఎకరాల్లో ఇతర పంటల మధ్యన మిశ్రమ పంటగా సాగు చేసిన మునగ చెట్ల నుంచి సేకరించిన ఆకును ఆరబెట్టి, పొడి చేసి ఆయన అమ్ముతున్నారు. ఏపుగా పెరిగిన మునగ చెట్ల కొమ్మలను కత్తిరించినప్పుడు వాటి ఆకులను వృథాగా పారేయకుండా డ్రయర్‌లో ఆరబెట్టి పొడిగా మార్చుతున్నారు. ఇరవై కిలోల ఆకును ఆరబెడితే కిలో పౌడర్ తయారవుతుంది. దీన్ని కిలో రూ.800 వరకు అమ్ముకోవచ్చని చెబుతున్నారు.

– బూరుగు ప్రభాకర్‌రెడ్డి, శంషాబాద్ రూరల్, రంగారెడ్డి జిల్లా

సొంత ఆలోచన

ఏడాది కిందట రాజశేఖర్ ఓ కంపెనీ నుంచి చిన్న సైజు సోలార్ డ్రయ్యర్‌ను కొనుగోలు చేశారు. అందులో 350 కిలోల పూల రేకులను, ఆకులను ఆరబెట్టవచ్చు. అయితే, అది తన అవసరాలకు సరిపోలేదు. వ్యవసాయ క్షేత్రంలో వినియోగంలో లేని ఇనుప పైపులతో మూడు నెలల కిందట సొంత ఆలోచనతో పెద్ద సైజు సోలార్ డ్రయ్యర్‌ను తానే నిర్మించుకున్నారు.

60 అడుగుల పొడవు, 22 అడుగుల పొడవుతో 10 అడుగుల ఎత్తు ఉండేలా దీన్ని రూపొందించారు. ఇందుకు 2ఎంఎం మందం ఉన్న అక్రాలిక్ షీట్‌ను వాడారు. దీని లోపలి నుంచి తేమతో కూడిన గాలిని బయటకు పంపేందుకు చుట్టూ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఒకేసారి 2,500 కిలోల ఆకులు లేదా పూల రేకులను ఆరబెట్టవచ్చని ఆయన తెలిపారు. విద్యుత్తుతో నడిచే డ్రయ్యర్ కంటే సోలార్ డ్రయ్యర్ నిర్వహణ సులువుగా ఉందన్నారు.

సోలార్ డ్రయ్యర్ లోపలి ఉష్ణోగ్రత బయటికంటే 8 డిగ్రీలు ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలుంటే ఆకులు, పూల రేకులను ఆరబెట్టడానికి ఒక రోజు సమయం చాలు. ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే మరింత ఎక్కువ సమయం పడుతుంది. మునగాకు పొడిని అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించే ఆలోచన ఉందని రాజశేఖర్ (99123 33444) అన్నారు.



రాజశేఖర్

22 నుంచి రైతు శిక్షణా శిబిరం

రైతునేస్తం ఫౌండేషన్, కర్షక సేవా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సేంద్రియ సాగు, కషాయాలు మిశ్రమాల తయారీ, వివిధ ఆహార పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 22 నుంచి 24 వరకు రైతు శిక్షణా కార్యక్రమం జరగనుంది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలో కొర్నెపాడులోని రైతు శిక్షణా కేంద్రంలో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666కు ఫోన్ చేసి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత వై. వెంకటేశ్వరరావు తెలిపారు.

సీమాప్‌లో ఔషధ-సుగంధ మొక్కల సాగుపై శిక్షణ

హైదరాబాద్ బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ (సీమాప్) ఆవరణలో మార్చి 18–20 తేదీల్లో మార్కెట్లలో గిరాకీ ఉన్న నిమ్మగడ్డి, కాశగడ్డి, అశ్వగంధ తదితర ఔషధ–సుగంధ పంటల సాగు, ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ అంశాలపై ఆంగ్లంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చీఫ్ సైంటిస్ట్ జి.డి. కిరణ్ బాబు తెలిపారు. స్వయంగా శిక్షణకు హాజరు కావాలి. వసతి సదుపాయం లేదు. రుసుము: రూ. 3,500. మార్చి 14లోగా దరఖాస్తు చేసుకోవాలి.
ఇతర వివరాలకు: 94910 43252, 94934 08227

భళా బెంగళూరు...

డబ్ల్యూపీఎల్‌లో వరుసగా రెండో విజయం

- 8 వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలుపు
- రాణించిన రేణుక, స్మృతి మంధాన



స్మృతి మంధాన

వడోదర: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) దూసుకుపోతోంది. టోర్నీ తొలి పోరులో గుజరాత్ జెయింట్స్‌ను అలవోకగా ఓడించిన ఆర్‌సీబీ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఏకపక్షంగా సాగిన పోరులో గత ఏడాది రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. ముందుగా పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన ఆర్‌సీబీ... ఆ తర్వాత స్మృతి, వ్యాట్ దూకుడైన బ్యాటింగ్‌తో మరో 22 బంతులు మిగిలి ఉండగానే గెలుపు పూర్తి చేసుకుంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19.3 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (22 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, సారా బ్రైస్ (19 బంతుల్లో 23; 2 ఫోర్లు) కాస్త పోరాడింది. మిగతా బ్యాటర్లంతా విఫలం కావడంతో జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రేణుకా సింగ్ (3/23), జార్జియా వేర్‌హామ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... గార్త్, బిష్త్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం బెంగళూరు 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. స్మృతి మంధాన (47 బంతుల్లో 81; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), డానీ వ్యాట్ (33 బంతుల్లో 42; 7 ఫోర్లు) తొలి వికెట్‌కు 65 బంతుల్లోనే 107 పరుగులు జోడించి జట్టు విజయాన్ని సునాయాసం చేశారు.



రేణుక

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై ఇండియన్స్ x గుజరాత్ జెయింట్స్
రాత్రి గం. 7:30 స్టార్ స్పోర్ట్స్, జియోహాట్‌స్టార్‌లో

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (సి) పెరీ (బి) గార్త్ 17; షఫాలీ (సి) స్మృతి (బి) రేణుక 0; జెమీమా (స్టంప్డ్) రిచా (బి) వేర్‌హామ్ 34; సదర్లాండ్ (సి) స్మృతి (బి) రేణుక 19; కాప్ (సి) వ్యాట్ (బి) బిష్త్ 12; జొనాసెన్ (సి) కనిక (బి) బిష్త్ 1; బ్రైస్ (స్టంప్డ్) రిచా (బి) వేర్‌హామ్ 23; శిఖా (సి) బిష్త్ (బి) రేణుక 14; రాధ (సి అండ్ బి) వేర్‌హామ్ 0; అరుంధతి రెడ్డి (సి) పెరీ (బి) గార్త్ 4; మిన్ను మణి (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 141. వికెట్ల పతనం:** 1-1, 2-60, 3-62, 4-84, 5-87, 6-105, 7-130, 8-130, 9-132, 10-141. **బౌలింగ్:** రేణుక 4-0-23-3, కిమ్ గార్త్ 3.3-0-19-2, ఏక్తా బిష్త్ 4-0-35-2, జోషిత 2-0-21-0, వేర్‌హామ్ 4-0-25-3, కనిక 2-0-13-0. **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** స్మృతి (సి) అరుంధతి (బి) శిఖా 81; డానీ వ్యాట్ (సి) జెమీమా (బి) అరుంధతి 42; ఎలీస్ పెరీ (నాటౌట్) 7; రిచా (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (16.2 ఓవర్లలో 2 వికెట్లకు) 142. వికెట్ల పతనం:** 1-107, 2-133. **బౌలింగ్:** కాప్ 2-0-27-0, శిఖా 4-0- 27-1, మిన్ను 1-0-10-0, అరుంధతి 3.2-0-25-1, జొనాసెన్ 4-0-37-0, సదర్లాండ్ 2-0-18-0.

1996 వన్డే వరల్డ్ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 16న పాకిస్తాన్‌లో తొలి లీగ్ మ్యాచ్ జరిగింది. దాదాపు నెల రోజుల తర్వాత మార్చి 17న లాహోర్‌లో ఫైనల్‌తో టోర్నీ ముగిసింది. అనంతరం మరో నెల రోజులు ఆ దేశం క్రికెట్ సంబరాల్లో మునిగింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి సెమీస్‌కు కూడా చేరకపోయినా... ఆతిథ్య దేశంగా అభిమానులకు ఆనందం పంచింది. సరిగ్గా 29 ఏళ్ల తర్వాత ఫిబ్రవరి 19న తొలి మ్యాచ్‌తో ఆ దేశం మరో ఐసీసీ టోర్నీకి ఆతిథ్యం ఇస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల వ్యవధిలో పాకిస్తాన్ ఎన్నో సంక్షోభాలను దాటి ఒక మెగా టోర్నీ నిర్వహణకు సిద్ధమైంది. ఈసారీ డిఫెండింగ్ చాంపియన్‌గా పాక్ బరిలోకి దిగుతోంది. అయితే ఇప్పుడు అక్కడిఅభిమానుల దృష్టిలో టైటిల్ గెలవడంకంటే కూడా టోర్నీ జరగడమే పెద్ద విశేషం. **-సాక్షి క్రీడా విభాగం**



లాహోర్ వీధుల్లో ఎనిమిది జట్ల కెప్టెన్లతో కూడిన చాంపియన్స్ ట్రోఫీ హోర్డింగ్

పాకిస్తాన్‌కు పరీక్షా సమయం

29 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీ నిర్వహణ	దేశంలో చాంపియన్స్ ట్రోఫీ కళ	ఉత్సాహంగా అభిమానులు	భద్రతపై పీసీబీ ప్రధాన దృష్టి





ప్రారంభ వేడుకలకు వేదికైన లాహోర్ ఫోర్ట్

దాదాపు మూడు దశాబ్దాల ఈ సమయాన్ని పాకిస్తాన్ క్రికెట్‌లో 2009కి ముందు... దానికి తర్వాతగా విభజించవచ్చు. లాహోర్‌లో టెస్టు సిరీస్ సమయంలో శ్రీలంక జట్టు క్రికెటర్లపై జరిగిన ఉగ్రవాదుల దాడి ఆ దేశ క్రికెట్‌ను మసకబార్చింది. ఆరేళ్ల పాటు ఏ జట్టు కూడా ఆ దేశం వైపు కన్నెత్తి చూడలేదు. అంత సాహసం ఏ దేశం కూడా చేయలేకపోయింది. ఐసీసీ కూడా టోర్నీ నిర్వహణల విషయంలో పూర్తిగా వెనక్కి తగ్గింది. ఎట్టకేలకు ఆరేళ్ల తర్వాత 2015లో జింబాబ్వేను పిలిచి పరిస్థితులు చక్కబడ్డాయనే సందేశంతో పాక్ బోర్డు మళ్లీ అంతర్జాతీయ క్రికెట్‌ను మొదలు పెట్టింది. అయితే 2021లో ఒక ప్రధాన జట్టు ఆస్ట్రేలియా వచ్చిన తర్వాత గానీ అక్కడ అసలు క్రికెట్ రాలేదు. ఈ నాలుగేళ్లలో భారత్ మినహా మిగతా అన్ని జట్లూ అక్కడ పర్యటించడం ఊరటనిచ్చింది. ఎట్టకేలకు ఇప్పుడు ఐసీసీ టోర్నీ అవకాశం రాగా... దీన్ని సమర్థంగా నిర్వహించడం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు పెద్ద సవాల్. దీనిపైనే ఆ జట్టు, బోర్డు భవిష్యత్తు ఆధారపడి ఉందనడంలో సందేహం లేదు.

కళ వచ్చింది...

సుదీర్ఘ కాలం అంతర్జాతీయ క్రికెట్ లేక సహజంగానే అక్కడి మైదానాలు వెలవెలబోయాయి. నిర్వహణ సరిగా లేక పాడుబడినట్లు తయారయ్యాయి. ఆర్థికంగా బలమైన బోర్డు కాకపోవడం, రాజకీయ కారణాలతో కేవలం దేశవాళీ టోర్నీల కోసం స్టేడియాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దే ధైర్యం చేయలేకపోయింది. పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) జరుగుతున్నా... ఆ మ్యాచ్‌లను కూడా ఏదో మమ అన్నట్లుగా ముగించేస్తూ వచ్చారు. ఇలాంటి స్థితిలో చాంపియన్స్ ట్రోఫీ అవకాశం వచ్చింది. స్టేడియాల ఆధునీకరణ కోసం ఐసీసీ ఇచ్చిన సొమ్మును వాడుకుంది. మూడు వేదికలు లాహోర్, కరాచీ, రావల్పిండిలపైనే పూర్తిగా దృష్టి పెట్టి సౌకర్యాలను మెరుగుపర్చింది. ఇందులో లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో చాలా భాగాన్ని పడగొట్టి దాదాపు కొత్తదే అన్నట్లు తీర్చిదిద్దగా, మిగతా రెండింటిని ఆధునీకరించారు. సరిగ్గా చెప్పాలంటే పాక్‌లోని మైదానాలు ఎప్పుడో పాతకాలం కట్టడాల తరహాల్లో ఉన్నాయి. ఈతరం అవసరాలు, మారిన క్రికెట్‌కు అనుగుణంగా ఏవీ లేవు. ఇప్పుడు ఐసీసీ టోర్నీ పుణ్యమాని స్టేడియాలకు కొత్త కళ వచ్చింది. అభిమానులు కూడా అంతే ఉత్సాహంతో ఒక పెద్ద ఈవెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. అన్ని నగరాల్లో టోర్నీ పోస్టర్లు, బ్యానర్లు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి. సహజంగానే స్థానిక మార్కెట్‌లలో టీమ్ జెర్సీలు, ఇతర జ్ఞాపికలు వంటి 'క్రికెట్ వ్యాపారం' జోరుగా సాగుతోంది కూడా. 'క్రికెట్‌ను తాము ఎంతగా అభిమానిస్తామో చూపించేందుకు పాకిస్తానీయులకు ఇది చక్కటి అవకాశం. వచ్చే కొన్ని రోజులు అంతా పండగ వాతావరణమే' అని మాజీ కెప్టెన్ మియాందాద్ చెప్పిన మాటలో అతిశయోక్తి లేదు.

భారత జట్టు లేకపోయినా...

పాక్ బోర్డు 2026 టి20 వరల్డ్ కప్, 2031 వన్డే వరల్డ్ కప్ కోసం కూడా బిడ్‌లు వేసి భంగపడింది. ఈ నేపథ్యంలో గతంలోనే ఖరారైన చాంపియన్స్ ట్రోఫీ మాత్రమే వారికి మిగిలింది. దాంతో తమ నిర్వహణా సామర్థ్యం, ఆతిథ్యం గురించి ప్రపంచ క్రికెట్‌కు చూపించాలని ఆశించింది. ఇందులో భాగంగానే రాజకీయ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉండి, సాధ్యం కాదని తెలిసి కూడా ఎలాగైనా భారత్‌ను చాంపియన్స్ ట్రోఫీలో ఆడించేలా పీసీబీ చివరి వరకు అన్ని ప్రయత్నాలు, డిమాండ్లు చేసింది. కానీ చివరకు వెనక్కి తగ్గక తప్పలేదు. 2009 ఉగ్రవాదుల దాడి తర్వాత పాక్‌లో ద్వైపాక్షిక సిరీస్ కాకుండా ఒకేఒక్క చెప్పుకోదగ్గ టోర్నీ 2023లో (ఆసియా కప్) జరిగింది. భారత్ మాత్రం తమ మ్యాచ్‌లు శ్రీలంకలోనే ఆడింది. భారత్ ఫైనల్ చేరితే పేరుకే ఆతిథ్య జట్టు తప్ప ఫైనల్ నిర్వహించే అవకాశం కూడా లేదు. అయితే భారత్ లేకపోయినా ఇతర అన్ని పెద్ద జట్లు ఆడుతుండటం సానుకూలాంశం. అందుకే పీసీబీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఆదివారమే లాహోర్ ఫోర్ట్‌లో ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నింటికి మించి కట్టుదిట్టమైన భద్రత కీలకాంశంగా మారింది. ఒక్క చిన్న పొరపాటు జరిగినా పాక్‌లో క్రికెట్ ముగిసిపోయే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో పరుగులు, ఫలితాలతోపాటు టోర్నీ ఎలా సాగుతుందనేది ఆసక్తికరం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

మజాకాతో పెద్ద హిట్ కొడుతున్నాం

- సందీప్ కిషన్



రీతూ వర్మ, సందీప్ కిషన్

''మజాకా' సినిమా కోసం నెల రోజులుగా పగలు, రాత్రి చిత్రీకరణ చేస్తున్నాం. ఈ మూవీ కోసం మేము క్రియేటివ్‌గా ప్రమోషన్స్ చేయాలని భావించాం. అందులో భాగంగా ఔట్‌డోర్‌లో జరుగుతున్న మా సినిమా షూటింగ్‌కి మీడియా వారు వచ్చినందుకు థ్యాంక్స్. ఈ నెల 26న 'మజాకా' చిత్రంతో పెద్ద హిట్ కొడుతున్నామనే నమ్మకం ఉంది'' అని సందీప్ కిషన్ తెలిపారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'మజాకా'. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శివరాత్రి కానుకగా ఈ నెల 26న విడుదల కానుంది. కాగా ఈ మూవీలోని 'రావులమ్మ..' అంటూ సాగే పాట చిత్రీకరణ షూటింగ్ ప్రస్తుతం ఔట్‌డోర్‌లో జరుగుతోంది. ఈ షూటింగ్‌ని లైవ్ ద్వారా ప్రేక్షకులకు చూపించారు మేకర్స్. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ- ''రావులమ్మ' ఫుల్ మాస్ అండ్ ఫోక్ సాంగ్. సందీప్, రీతు అద్భుతమైన డ్యాన్స్‌తో ఇరగదీశారు'' అన్నారు. ''ఈ సినిమా కోసం చాలా కష్ట పడ్డాం'' అని చెప్పారు రీతూ వర్మ. ''మజాకా'తో ఈసారి మళ్లీ బ్లాక్ బస్టర్ కొడుతున్నాం'' అన్నారు నిర్మాత అనిల్ సుంకర. ''మా బ్యానర్‌లో ఇది బెస్ట్ సినిమా అని నమ్ముతున్నాను'' అని పేర్కొన్నారు రాజేష్ దండా. రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ మాట్లాడారు.

సూర్యతో జోడీ?



సూర్య



భాగ్యశ్రీ బోర్సే

హీరో సూర్య సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించనున్నారా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ మూవీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించనున్నారని తెలిసింది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం భాగ్యశ్రీ బోర్సేని ఎంపిక చేశారని తెలిసింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని, మే నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించేలా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. ఈ చిత్రంపై అధికారిక ప్రకటన అతి త్వరలోనే రానుందని సమాచారం. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ఓ మల్టీస్టారర్ అని, సూర్యతో పాటు మరో హీరో కూడా నటిస్తారనే ప్రచారం కూడా సాగుతోంది.

రామం రాఘవం బలమైన కథ

- సముద్రఖని



సముద్రఖని, పృథ్వీ, ధనరాజ్

''రామం రాఘవం' సినిమా కథను ధనరాజ్ రెండు లైన్స్‌లో చెప్పినప్పుడే ఇది బలమైన కథ అనిపించింది. ఈ కథ జెన్యూన్ అని నమ్మిన తర్వాతే ఈ సినిమా చేసేందుకు ఒప్పుకున్నాను'' అని నటుడు సముద్రఖని అన్నారు. ధనరాజ్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ద్విభాషా (తమిళ, తెలుగు) చిత్రం'రామం రాఘవం'. సముద్రఖని కీలక పాత్రలో నటించారు. అరిపాక ప్రభాకర్ సమర్పణలో స్లేట్ పెన్సిల్ స్టోరీస్ పతాకంపై పృథ్వీ పొలవరపు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకుడు విజయ్ కనకమేడల, నటుడు 'సుడిగాలి' సుధీర్ అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ధనరాజ్ మాట్లాడుతూ- ''సముద్రఖని లాంటి గొప్ప నటుడు ధనరాజ్‌కి తండ్రిగా నటించడం ఏంటి? అని చాలామంది కామెంట్స్ చేశారు. నాకు తండ్రి పాత్రలో నటించేందుకు ఆయనకి ఇబ్బంది లేదు. కానీ, మిగిలిన వాళ్లు ఎందుకు ఇబ్బంది పడుతున్నారో అర్థం కావడం లేదు. అరిపాక ప్రభాకర్‌గారు లేకపోతే ఈ మూవీ లేదు. రెండేళ్ల కష్టమైన మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అని తెలిపారు. ''ఓ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం'' అని పేర్కొన్నారు అరిపాక ప్రభాకర్. ''ఈ మూవీ నాకు భావోద్వేగంతో కూడిన ప్రయాణం'' అన్నారు పృథ్వీ పొలవరపు.

యాక్షన్ ప్యాక్డ్ మదరాసి



శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్ మూవీకి 'మదరాసి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీ లక్ష్మీ మూవీస్ పతాకంపై ఎన్. శ్రీలక్ష్మీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్. కాగా సోమవారం (ఫిబ్రవరి 17) శివ కార్తికేయన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మదరాసి' టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ గ్లింప్స్‌లో యాక్షన్ ప్యాక్డ్ విజువల్స్ కనిపిస్తున్నాయి. విద్యుత్ జమాల్, బిజూ మీనన్, షబ్బీర్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. కాగా 'మదరాసి'తో పాటు సుధా కొంగర దర్శకత్వంలో 'పరాశక్తి' అనే సినిమా కూడా చేస్తున్నారు శివ కార్తికేయన్.

మార్చిలో కాలగమనం



రాజా బిరుదుల, లావణ్య

రాజా బిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రల్లో సుధాకర్ బుర్రి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ మూవీ 'కాలగమనం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నిర్మాత ఏయం రత్నం విడుదల చేసి, మాట్లాడుతూ- ''ఇప్పటి పరిస్థితులకు తగ్గట్లుగా 'కాలగమనం' టైటిల్ ఉంది. ఈ సినిమా విజయం సాధించి, నిర్మాతలకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. మార్చి చివరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం'' అని తెలిపారు సుధాకర్ బుర్రి.

అలాంటి వారి మనసుల్లో నిలిచిపోతుంది

- ప్రదీప్ రంగనాథన్

''ఓ మామూలు కుర్రాడు జీవితంలో ముందుకు వెళ్లాలని చేసే ప్రయత్నమే మా 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మూవీ. జీవితంలో ఏదో ఒకటి సాధించాలని ప్రయత్నించే ప్రతి ఒక్కరి మనసుల్లో మా సినిమా నిలిచిపోతుంది. నన్ను ఆదరిస్తున్న తెలుగు ప్రజలకు థ్యాంక్స్'' అని హీరో ప్రదీప్ రంగనాథన్ చెప్పారు. 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, అనుపమా పరమేశ్వరన్, కయాదు లోహర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్‌పై కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 21న విడుదల అవుతోంది. తెలుగులో మైత్రీ మూవీస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ హరీష్ శంకర్, సాయి రాజేష్, కిషోర్ తిరుమల ముఖ్య అతిథులుగా హాజరై, 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ- ''మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. మా డ్రాగన్ కూడా అలాంటి ఓ మంచి సినిమా అవుతుంది'' అన్నారు. ''ఇది కేవలం యూత్ మూవీ కాదు. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది'' అని అర్చనా కల్పాతి చెప్పారు. ''ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత వై.రవి శంకర్. కయాదు లోహర్, నిర్మాత ఎస్‌కేఎన్, మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశి మాట్లాడారు.



కయాదు, ప్రదీప్

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓ పసి తల్లి కథ జే బేబీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం జే బేబీ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ సినిమా చూసేముందు ఎవరికి వారు రెండు ప్రశ్నలు వేసుకోవాలి. అదేమంటే మనకిష్టమైన వారిపై మనకెంతకాలం ఇష్టం ఉంటుంది? అలాగే, మనకు ఇష్టం లేని వారిపై కష్టం ఎంతవరకు ఉంటుంది... ఈ రెండు ప్రశ్నలు కాస్త విచిత్రమైనవే. కానీ వాటికి మనం ఇచ్చే సమాధానాన్ని బట్టే ఉంటుంది మనతో ఉన్న వారి జీవితం. మనకు తోడుగా ఇష్టంగా ఉండేవారు ఎందరో ఉంటారు. అలాగే వారంటే మనకెంత ఇష్టమో వారికి తెలియజేయాలి. ఈ జీవితం మీ తల్లి మీకు ప్రసాదించింది. ఆ జీవితాన్ని సరైన మార్గంలో నడిపించేది మీ తండ్రి. మరి ఆ తల్లిదండ్రుల వయస్సు పైబడిన తర్వాత వారికి అండగా ఉండాల్సింది మీరే. అలాంటి అండ కోరుకున్న ఓ అమ్మ కథే జే బేబి. కథ లైను వినడానికి సింపుల్‌గా ఉన్నా సినిమా చూసినంతసేపు వయస్సు పైబడ్డ మన తల్లిదండ్రులకు మన అవసరం ఏపాటిదో మనకు అర్థమవుతుంది. ఇది అల్లుకున్న కథ కాదు. వాస్తవ సంఘటన ఆధారంగా తీసిన సినిమా. ఈ కథ సహజత్వానికి చాలా దగ్గరగా ఉంటుంది. కథలోని పాత్రలు, కథా పాత్రల్లా కాక మన కళ్ల ముందే కదలాడుతున్న అనుభూతిని కలిగిస్తాయి. ఓ రకంగా చెప్పాలంటే ఈ సినిమా తల్లిదండ్రులున్న ప్రతి కొడుకు, కూతుళ్లు చూడవలసిన సినిమా. అంతలా ఏముంది ఈ సినిమాలో... ఓ సారి కథ చెప్పుకుందామా మరి.

జే బేబి ఓ తమిళ సినిమా. దీనికి సురేష్ మారి దర్శకుడు. జే బేబికి ముగ్గురు సంతానం. శంకర్, సెంథిల్, కవిత. జే బేబి తన భర్త చనిపోయిన తర్వాత కుటుంబాన్ని అతికష్టం మీద పైకి తీసుకువస్తుంది. కానీ జే బేబీ మానసికస్థితి కొంత దెబ్బతింటుంది. చికిత్సకోసం పిల్లలు ఆసుపత్రిలో చేర్పిస్తే అక్కడి నుంచి తప్పించుకుని తెలియకుండా చెన్నై నగరం నుండి కోల్‌కతా చేరుకుంటుంది. జే బేబీని వెతికే క్రమంలో శంకర్,సెంథిల్ బయలుదేరతారు. తల్లిని వెదికే క్రమంలో ఒకే ప్రయాణాన్ని ప్రారంభించిన ఇద్దరు కొడుకులు ఓ వివాదం వల్ల మాట్లాడుకోని స్థితిలో ఉంటారు. మాట్లాడుకోని వీళ్లు, మానసిక పరిపక్వత లోపించిన తమ తల్లిని తమకు భాష రాని నగరానికి వెళ్లి ఎలా వెదుకుతారు?, అసలు వాళ్లకి మళ్లీ జే బేబీ దొరుకుతుందా?. ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న జే బేబి చూడాల్సిందే. సినిమాలోని ప్రధానపాత్రలో నటించిన ప్రముఖ నటి ఊర్వశి జే బేబి పాత్రను పోషించలేదు, జీవించింది. సినిమా ఆద్యంతం ఉత్కంఠతో నడుస్తూ అప్పుడప్పుడూ చక్కటి హాస్యాన్ని జోడించి స్క్రీన్ ప్లే అద్భుతంగా రాసుకున్నాడు దర్శకుడు. ఈ సినిమా, రివ్యూ మమతానురాగాలకోసం వయస్సు పైబడిన పసి మనస్సులకు అక్షరాంకితం.

- ఇంటూరు హరికృష్ణ

సాక్షి బిజినెస్
మంగళవారం
18-2-2025

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 58	నిఫ్టీ ▲ 30
75,997	22,960

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11: 30 ముగింపు)			
నాస్‌డాక్	20,026	▲	81
డోజోన్స్	44,456	▽	165
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,768	▲	36
డాక్స్	22,798	▲	285
షాంఘై	3,356	▲	10
నికాయ్	39,174	▲	25

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	85,254
బంగారం (99.5 స్వచ్ఛత)	84,990
వెండి (కిలో)	95,946

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఇంపోర్ట్‌పై	84.99	88.67
£	బ్రిటన్ పౌండ్	ఇంపోర్ట్‌పై	107.01	111.94
€	యూరో	ఇంపోర్ట్‌పై	88.90	93.31
¥	జపాన్ ఎన్ (100)	ఇంపోర్ట్‌పై	46.00	67.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఇంపోర్ట్‌పై	52.77	57.57
S$	సింగపూర్ డాలర్	ఇంపోర్ట్‌పై	62.50	67.15
SAR	సౌదీ రియాల్	ఇంపోర్ట్‌పై	22.25	23.81
UAE D	యూఏఈ దిర్హామ్	ఇంపోర్ట్‌పై	22.75	24.53
¥	చైనా యువాన్	ఇంపోర్ట్‌పై	11.07	12.90

యాపిల్‌ను మించిన రిలయన్స్

- ప్రపంచంలోనే రెండో అత్యుత్తమ బ్రాండ్‌గా ఘనత
- అగ్రస్థానంలో శాంసంగ్..
- ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్ 2024లో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అంతర్జాతీయంగా అత్యుత్తమ బ్రాండ్స్ జాబితాలో రెండో స్థానం దక్కించుకుంది. ఈ విషయంలో యాపిల్, మైక్రోసాఫ్ట్ లాంటి దిగ్గజాలను కూడా వెనక్కి నెట్టి, లిస్టులో ఏకైక భారతీయ కంపెనీగా నిల్చింది. సోమవారం విడుదలైన ఫ్యూచర్ బ్రాండ్ ఇండెక్స్ 2024 జాబితాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2023లో 13వ స్థానంలో ఉన్న రిలయన్స్ తాజాగా రెండో స్థానానికి ఎగబాకింది. కొరియన్ బ్రాండ్ శాంసంగ్ ఈ లిస్టులో అగ్రస్థానంలో నిల్చింది. ఇందులో యాపిల్, నైకీ, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టయోటా మొదలైనవి ఉన్నాయి. ఎప్పటికప్పుడు మార్కెట్లో మార్పులను సమర్థంగా ఎదుర్కొంటూ, కస్టమర్లకు మెరుగైన అనుభూతిని అందించే వ్యూహాలతో ముందుకెళ్తున్న బ్రాండ్లకు జాబితాలో చోటు దక్కింది. మార్కెట్ క్యాపిటలైజేషన్‌పరంగా పీడబ్ల్యూసీ టాప్ 100 కంపెనీలను 18 అంశాల ప్రాతిపదికన ఫ్యూచర్ బ్రాండ్ ఇండెక్స్ మదింపు చేస్తుంది. భవిష్యత్తులో విజయం సాధించగలిగే సత్తా ఉన్న బ్రాండ్లకు లిస్టులో చోటు కల్పిస్తుంది. 'గత పదేళ్లుగా పరిణతి చెందిన గ్లోబల్ దిగ్గజాలు, సవాలు విసిరే కొత్త సంస్థలు, తమ లక్ష్యానికి కట్టుబడి ఉంటూ మెరుగైన అనుభూతిని అందిస్తున్న శక్తివంతమైన బ్రాండ్లు అనేకం కనిపించాయి' అని ఫ్యూచర్ బ్రాండ్ ఇండెక్స్ నివేదిక పేర్కొంది. గతంలో అమెరికా, యూరప్‌లో చూసినట్లుగా ఆసియా పసిఫిక్, మధ్యప్రాచ్య దేశాలు బ్రాండ్లపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలిపింది.

డిపాజిట్‌పై బీమా పెంపు!

- ప్రస్తుతం రూ.5 లక్షలకే బీమా
- ప్రభుత్వ పరిశీలనలో మరింత పెంచాలన్న ప్రతిపాదన



ముంబై: బ్యాంకు డిపాజిట్‌లను మరింత ఆకర్షణీయంగా మార్చే దిశగా త్వరలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఒక బ్యాంక్ పరిధిలో ఒక కస్టమర్‌కు గరిష్టంగా రూ.5 లక్షల డిపాజిట్‌పై బీమా సదుపాయం అమలవుతోంది. దీన్ని మరింత పెంచాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎం.నాగరాజ్ వెల్లడించారు. ఇటీవలే ముంబైలో న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్‌లో స్కామ్ వెలుగు చూడడం తెలిసిందే. ఈ తరహా స్కామ్‌లు, ఆర్థిక సంక్షోభాలతో బ్యాంక్ కుప్పకూలితే డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) డిపాజిట్‌దారులకు చెల్లింపులు చేస్తుంటుంది. ఇందుకుగాను బ్యాంక్‌లు డీఐసీజీసీకి ఏటా ప్రీమియం చెల్లిస్తుంటాయి. ''డిపాజిట్ ఇన్సూరెన్స్ పెంపును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పుడు దీన్ని నోటిఫై చేస్తాం''అని నాగరాజు వెల్లడించారు. 2020లో పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోఆపరేటివ్ (పీఎంసీ) బ్యాంక్‌లో సంక్షోభం తలెత్తిన తర్వాత.. డిపాజిట్‌పై ఇన్సూరెన్స్‌ను రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచడం గమనార్హం. దీని ఫలితంగా న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ డిపాజిట్ దారుల్లో 90 శాతం మందికి తమ డిపాజిట్ మొత్తం వెనక్కి రానుంది.

పడి పెరిగిన మార్కెట్లు


8 రోజుల తర్వాత స్వల్ప లాభాలు



ముంబై: కనిష్ట స్థాయిల నుంచి బలంగా పుంజుకున్న స్టాక్ సూచీలు ఎనిమిది రోజుల వరుస నష్టాల తర్వాత సోమవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 644 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరికి 58 పాయింట్ల లాభంతో 75,997 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి 22,960 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 644 పాయింట్లు క్షీణించి 75,295 వద్ద, నిఫ్టీ 209 పాయింట్లు కోల్పోయి 22,725 వద్ద కనిష్టాన్ని నమోదు చేశాయి. అయితే మిడ్‌సెషన్ నుంచి అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(1.31%), రిలయన్స్ ఇండస్ట్రీస్(0.65%)తో పాటు ఫైనాన్స్ రంగ షేర్లు రాణించడంతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి.

- అజాక్స్ ఇంజనీరింగ్ షేరు లిస్టింగ్ నిరాశ పరిచింది. ఇష్యూ ధర (రూ.629)తో పోలిస్తే 6% ప్రీమియంతో రూ.593 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 10% క్షీణించి రూ.565 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 5.50% శాతం నష్టపోయి రూ.596 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,814 కోట్లుగా నమోదైంది.

ఈఎంఐలు.. ఇప్పట్లో తగ్గేనా?



డిపాజిట్ల కోసం బ్యాంకుల మధ్య పోటీ

- ప్రస్తుతం లిక్విడిటీకి కొరత
- డిపాజిట్లపై రేట్లు ఇప్పట్లో తగ్గకపోవచ్చు
- రెపో ఆధారిత రుణాలపై వేగంగా అమలు
- ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణాలపై ఆలస్యంగా..

ఆర్‌బీఐ చాలా కాలం తర్వాత కీలకమైన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) తగ్గిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో హమ్మయ్య రుణ రేట్లు తగ్గుతాయని, నెలవారీ ఈఎంఐ చెల్లింపుల భారం దిగొస్తుందని ఆశపడే వారు.. కొంత కాలం పాటు వేచి చూడక తప్పేలా లేదు. రెపో రేటు కోత ప్రభావం రుణాలు, డిపాజిట్లపై పూర్తిగా ప్రతిఫలించేందుకు కొన్ని నెలల సమయం తీసుకోవచ్చని విశ్లేషకులు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనికి ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో ద్రవ్య లభ్యత కొరత (లిక్విడిటీ) ఉండడాన్ని, డిపాజిట్ల సమీకరణ కోసం బ్యాంక్‌ల మధ్య నెలకొన్న తీవ్ర పోటీని ప్రస్తావిస్తున్నారు. ముఖ్యంగా మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) ఆధారంగా మంజూరయ్యే రుణాలతో పాటు, డిపాజిట్లపై రేటు తగ్గింపు వెంటనే అమల్లోకి రాకపోవచ్చని.. అదే సమయంలో రెపో ఆధారిత రుణాలపై రేట్ల తగ్గింపు వేగంగా బదిలీ అవుతుందని చెబుతున్నారు.

కొంత సమయం తర్వాతే..

''తాజా రేటు తగ్గింపు ప్రయోజనం కొత్త రుణాలపై అమలయ్యేందుకు కొంత సమయం తీసుకోవచ్చు. ఎందుకంటే డిపాజిట్ల కోసం పోటీ కారణంగా నిధులపై బ్యాంకులు అధికంగా వ్యయం చేయాల్సి వస్తోంది''అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అజిత్ వెలోనీ తెలిపారు. ఫ్లోటింగ్ రేటు రుణాలపై ఆర్‌బీఐ రేటు తగ్గింపు వేగంగా అమల్లోకి వస్తుందన్నారు. బ్యాంకు రుణాల్లో 40 శాతం మేర రెపో ఆధారిత రుణాలు ఉన్నట్టు చెప్పారు. ఆర్‌బీఐ నిర్ణయంతో రెపో రేటు 6.5 శాతం నుంచి 6.25 శాతానికి దిగి రావడం తెలిసిందే. మరోవైపు సమీప భవిష్యత్‌లో లిక్విడిటీ పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లిక్విడిటీ పెంచే అదనపు చర్యలను ఆర్‌బీఐ తీసుకోకపోతే మార్చి నాటికి వ్యవస్థ వ్యాప్తంగా రూ.2.5 లక్షల కోట్ల లోటు ఏర్పడొచ్చని అంటున్నారు. అప్పుడు ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు బదిలీకి మరింత సమయం పట్టొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణాలపై రేట్ల తగ్గింపునకు రెండు త్రైమాసికాల సమయం తీసుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఈ రుణాల రేట్లను బ్యాంక్‌లు ఆర్నెళ్లకోసారి సమీక్షించడాన్ని ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. దీంతో బ్యాంక్‌లు జూలై లేదా వచ్చే డిసెంబర్‌లో ఈ రుణాల రేట్లను సవరించే అవకాశం ఉంటుంది.

డిపాజిట్లపై..

ఇప్పటికే ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన వారికి తాజా రేటు తగ్గింపుతో ఎలాంటి ప్రభావం పడదు. కొత్తగా డిపాజిట్ చేసే వారికి రేటు తగ్గే అవకాశాలున్నాయి. కాకపోతే వెంటనే కాకుండా క్రమంగా డిపాజిట్లపై ఈ మార్పు కనిపిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డిపాజిట్ల కోసం బ్యాంక్‌ల మధ్య పోటీ ఉన్నందున రేట్లను వెంటనే తగ్గించకుండా, ఆర్‌బీఐ చర్యలతో లిక్విడిటీ మెరుగయ్యాకే డిపాజిట్లపై రేట్లు తగ్గించొచ్చని భావిస్తున్నారు. ''ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్స్ అనుసంధానిత రుణాలపై రేట్ల మార్పు ప్రభావం వెంటనే అమల్లోకి రావచ్చు. ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణాలపై అమలు కావడానికి కొంత సమయం తీసుకోవచ్చు. మానిటరీ పాలసీ రేట్ల ప్రభావం డిపాజిట్లపై ప్రతిఫలించేందుకు కూడా రెండు త్రైమాసికాలు పట్టొచ్చు''అని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ పేర్కొనడం గమనార్హం.

– సాక్షి, బిజినెస్ డెస్క్

లాభాల స్వీకరణకే ఎఫ్ఐఐల అమ్మకాలు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: ఎడాపెడా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్‌ఐఐ) అమ్మకాలతో ఆందోళన చెందుతున్న మదుపరులకు కాస్త ఊరటనిచ్చే ప్రయత్నం చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. పెట్టుబడులపై మంచి రాబడులను అందించే పటిష్ఠ స్థితిలో భారత ఎకానమీ ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగుతున్నారని ఆమె చెప్పారు. 'ఎఫ్‌ఐఐలు తమకు అనువైనప్పుడు లేదా లాభాలను స్వీకరించే అవకాశం ఉన్నప్పుడు వైదొలుగుతూ ఉంటారు. భారత ఎకానమీలో నేడు పెట్టుబడులపై మంచి రాబడులు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. దానికి తగ్గట్లే లాభాల స్వీకరణ కూడా జరుగుతోంది' అని తెలిపారు. ఎఫ్‌ఐఐలు గతేడాది అక్టోబర్ నుంచి రూ. 1.56 లక్షల కోట్ల మేర స్టాక్స్ అమ్మగా.. ఇందులో ఏకంగా రూ. లక్ష కోట్ల స్టాక్స్ విక్రయాలు ఈ ఏడాది స్వల్ప కాలంలోనే నమోదవడం తెలిసిందే.

ఎంజీ సెలెక్ట్ డీలర్‌గా ఐకానిక్ ఆటోమొబైల్స్



ముంబై: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ లగ్జరీ బ్రాండ్ 'ఎంజీ సెలెక్ట్' డీలర్‌గా 'ఐకానిక్ ఆటోమొబైల్స్' ఎన్నికైంది. బెంగళూరు కేంద్రంగా కొత్త తరం కొనుగోలుదారులకు నాణ్యమైన సేవలు అందించనుంది. ఎంజీ సెలెక్ట్ బ్రాండ్‌లో భాగంగా వస్తున్న తొలి విద్యుత్ స్పోర్ట్స్ కారు 'సైబర్‌స్టర్', ఎంజీ ఎం9 మోడళ్లను కస్టమర్లకు మరింత చేరువ చేస్తుందని ఎంజీ సెలెక్ట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మిలింద్ అన్నారు. ఐకానిక్ ఆటోమొబైల్స్‌తో మొత్తం 12 డీలర్లను ఎంజీ సెలెక్ట్ ఎంపిక చేసుకుంది. ఈ డీలర్‌షిప్ భాగస్వాములు దేశవ్యాప్తంగా 13 నగరాల్లో నెలకొల్పిన 14 ఎంజీ సెలెక్ట్ టచ్ పాయింట్ల ద్వారా సేవలు అందించనున్నాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మూడో నెలా ఎగుమతులు డౌన్ | రూ.250కే జన్‌నివేష్ సిప్ – ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య


కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

ఆర్థిక, గణాంక నిపుణులకు స్వాగతం

డిగ్రీ, పీజీ స్థాయిలో ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ కోర్సుల ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. యూపీఎస్సీ తాజాగా ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ (ఐఈఎస్)/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్ఎస్) ఎగ్జామినేషన్ 2025కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు కీలక శాఖల్లో ఉన్నత స్థాయి కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఐఈఎస్/ఐఎస్ఎస్-2025 వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్, కెరీర్ తదితర వివరాలు..

» ఐఈఎస్, ఐఎస్ఎస్-2025 నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
» ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ, డిగ్రీ కోర్సుల ఉత్తీర్ణులకు అవకాశం
» జూనియర్ టైమ్ స్కేల్‌తో ఆల్ ఇండియా సర్వీస్ హోదా



కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల ఆధ్వర్యంలో జరిగే ఆర్థిక సంబంధ వ్యవహారాల సమర్థ నిర్వహణకు, కీలకమైన నివేదికలు రూపొందించేందుకు నిపుణుల అవసరం ఉంటుంది. ఇలాంటి నిపుణుల నియామకానికి నిర్వహించే ఎంపిక ప్రక్రియే.. ఇండియన్ ఎకనామిక్ సర్వీసెస్, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్. ఈ సర్వీసులకు ఎంపికైన వారు ఆర్థిక శాఖ, ప్లానింగ్ కమిషన్, నీతి అయోగ్ వంటి విభాగాల్లో కీలకమైన విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

మొత్తం పోస్టుల సంఖ్య 47

ప్రతి ఏటా నిర్దేశిత క్యాలెండర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్న యూపీఎస్సీ.. ఈ ఏడాది కూడా ఐఈఎస్/ఐఎస్ఎస్-2025 ద్వారా మొత్తం 47 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎంపిక ప్రక్రియ ద్వారా ఐఈఎస్‌లో 12 పోస్టులు, ఐఎస్ఎస్‌లో 35 పోస్టులు భర్తీ చేయనుంది.

అర్హతలు

- ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌కు దరఖాస్తు చేసుకునేందుకు స్టాటిస్టిక్స్/ మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. లేదా ఇదే స్పెషలైజేషన్లతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

2025, ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 21 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

యూపీఎస్సీ నిర్వహించే ఐఈఎస్, ఐఎస్ఎస్ ఎంపిక ప్రక్రియ రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో వేయి మార్కులకు రాత పరీక్ష జరుగుతుంది. ఐఈఎస్, ఐఎస్ఎస్‌కు వేర్వేరుగా పరీక్ష పేపర్లు ఉంటాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

ఐఈఎస్ రాత పరీక్ష

ఐఈఎస్ రాత పరీక్ష ఆరు పేపర్లలో మొత్తం 1,000 మార్కులకు జరుగుతుంది. అవి.. పేపర్-1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు, పేపర్-2 జనరల్ స్టడీస్ 100 మార్కులు, పేపర్-3 జనరల్ ఎకనామిక్స్-1, 200 మార్కులు; పేపర్-4 జనరల్ ఎకనామిక్స్-2, 200 మార్కులు; పేపర్-5 జనరల్ ఎకనామిక్స్-3, 200 మార్కులు; పేపర్-6 ఇండియన్ ఎకనామిక్స్ 200 మార్కులకు ఉంటాయి. ఐఈఎస్ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలోనే నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించే సమయం మూడు గంటలు.

ఐఎస్ఎస్ రాత పరీక్ష భిన్నంగా

- ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్ఎస్ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో ఆరు పేపర్లలో మొత్తం వెయ్యి మార్కులకు ఈ పరీక్ష జరుగుతుంది. పేపర్-1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు, పేపర్-2 జనరల్ స్టడీస్ 100 మార్కులు, పేపర్-3 స్టాటిస్టిక్స్-1, 200 మార్కులు; పేపర్-4 స్టాటిస్టిక్స్-2, 200 మార్కులు; పేపర్-5 స్టాటిస్టిక్స్-3, 200 మార్కులు; పేపర్-6 స్టాటిస్టిక్స్-4, 200 మార్కులకు ఉంటాయి. -పేపర్-3, 4లుగా నిర్దేశించిన స్టాటిస్టిక్స్-1, స్టాటిస్టిక్స్-2 పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. వీటికి కేటాయించిన సమయం రెండు గంటలు. మిగతా పేపర్లకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- స్టాటిస్టిక్స్-3, 4 పేపర్లు డిస్క్రిప్టివ్ విధానంలోనే నిర్వహిస్తున్నప్పటికీ.. వీటిలో షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్, స్మాల్ ప్రాబ్లమ్ కొశ్చన్స్ ఉంటాయి. మొత్తం ప్రశ్నల్లో ఈ తరహా ప్రశ్నలు 50 శాతం మేరకు ఉంటాయి. మరో 50 శాతం ప్రశ్నలు దీర్ఘ సమాధాన ప్రశ్నలు, కాంప్రహెన్షన్ ప్రాబ్లమ్ ప్రశ్నలుగా ఉంటాయి. స్టాటిస్టిక్స్ పేపర్-4లో మొత్తం ఏడు సెక్షన్లలో ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఛాయిస్ విధానంలో ఏవైనా రెండు సెక్షన్లు ఎంచుకుని ఆ రెండు సెక్షన్లలోనే పరీక్ష రాసే అవకాశం ఉంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇందులో చోటు సాధించిన వారికి మలిదశలో చివరగా 200 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ కనబరిస్తే.. రాత పరీక్షలో మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

కెరీర్ ఇలా

ఐఈఎస్, ఐఎస్ఎస్‌లకు ఎంపికైన వారికి జూనియర్ టైమ్ స్కేల్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతుంది. ఆర్థిక వ్యవహారాల సంబంధ శాఖల్లో అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ హోదాతో కొలువు లభిస్తుంది. నీతి ఆయోగ్, నేషనల్ శాంపుల్ సర్వే, లేబర్ బ్యూరో, ఆర్థిక సంఘం, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమ, విద్య, వ్యవసాయం, వాణిజ్యం తదితర విభాగాల్లో నియమిస్తారు. అనుభవం, పనితీరు ఆధారంగా డిప్యూటీ డైరెక్టర్/అసిస్టెంట్ అడ్వైజర్ (సీనియర్ టైం స్కేల్), జాయింట్ డైరెక్టర్/డిప్యూటీ అడ్వైజర్, సీనియర్ ఎకనమిక్ అడ్వైజర్ తదితర హోదాల నుంచి ప్రిన్సిపుల్ అడ్వైజర్ లేదా చీఫ్ అడ్వైజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

ఐఎస్ఎస్.. సబ్జెక్ట్ పేపర్ల సన్నద్ధత

- స్టాటిస్టిక్స్-1 పేపర్‌లో రాణించాలంటే.. స్టాటిస్టికల్ మెథడ్స్, న్యూమరికల్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- స్టాటిస్టిక్స్-2 పేపర్‌లో లీనియర్ మోడల్స్, ఎస్టిమేషన్, హైపోథిసిస్ టెస్టింగ్, మల్టీవెరైటీ అనాలిసిస్ అంశాలపై దృష్టిసారించాలి.
- స్టాటిస్టిక్స్-3 పేపర్‌లో శాంప్లింగ్ టెక్నిక్స్, ఎకనామిక్ సాటిస్టిక్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, ఎకనోమెట్రిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- స్టాటిస్టిక్స్-4 పేపర్‌లో స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్ ,డెమోగ్రఫీ అండ్ వైటల్ ఛార్ట్స్, కంప్యూటర్ సిస్టమ్-సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కంప్యూటర్ సంబంధ అంశాలపై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీ:** 2025, మార్చి 4
- **ఆన్‌లైన్ సవరణ అవకాశం:** 2025, మార్చి 5 నుంచి 11 వరకు
- **పరీక్ష తేదీ:** 2025, జూన్ 20 నుంచి
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https//www.upsc.gov.in

పరీక్షలో రాణించేలా

పీజీ స్థాయి నైపుణ్యాలు

ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షల్లో రాణించేందుకు అభ్యర్థులు అకడమిక్‌గా పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్లు, మోడల్ పేపర్ల సాధన కూడా కలిసొస్తుంది.

జనరల్ ఇంగ్లిష్

ఐఈఎస్, ఐఎస్ఎస్ రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. ఇందులో ఒక ఎస్సే రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో స్కోర్ కోసం వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్‌పై పట్టు సాధించాలి. ఎక్కువగా ప్యాసేజ్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ స్టడీస్

ఈ పేపర్ కూడా రెండు సర్వీసులకు కామన్‌గా ఉంటుంది. ఇందులో ఎక్కువగా కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. శాస్త్రసాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారతదేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి. సివిల్స్ జనరల్ స్టడీస్ పేపర్లు, ప్రిలిమ్స్ పేపర్లు అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది.

ఐఈఎస్ సబ్జెక్ట్ పేపర్లకు

- **జనరల్ ఎకనామిక్స్-1:** ఈ పేపర్‌లో రాణించడానికి సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ ఎకనోమెట్రిక్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. లారెంజ్ వక్రరేఖ, ఏంజెల్ సూత్రం, షాడో ప్రైస్, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్పకాల-దీర్ఘకాల వ్యయ రేఖలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- **జనరల్ ఎకనామిక్స్-2:** ఈ పేపర్ స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉంటుంది. దీనికోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్ నేషనల్ ఇన్‌కమ్, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు-కారణాలు, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి.
- **జనరల్ ఎకనామిక్స్-3:** ఇది ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాల సమ్మిళితంగా ఉండే పేపర్. దీనికోసం పన్ను సంస్కరణలు, గరిష్ఠ సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్ జీడీపీ, క్యోటో ప్రోటోకాల్, బాలి యాక్షన్ ప్లాన్, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాలపై అవగాహన పొందాలి.
- **ఇండియన్ ఎకనామిక్స్:** ఈ పేపర్‌కు సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ నోట్స్ రూపొందించుకుంటూ సన్నద్ధం అవడం ఉపయుక్తంగా ఉంటుంది. స్థిరీకరణ-నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్ సిఫార్సులు, టోకు ధరల సూచీ-రిటైల్ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

బీహెచ్ఈఎల్‌లో 400 ఇంజనీర్ ట్రైనీ, సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులు

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్).. ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్ ట్రైనీ, సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 400.
» పోస్టుల వివరాలు: ఇంజనీర్ ట్రైనీ-150, సూపర్‌వైజర్ ట్రైనీ-250.

విభాగాల వారీగా ఖాళీలు

» **ఇంజనీర్ ట్రైనీ:** మెకానికల్-70, ఎలక్ట్రికల్-25, సివిల్-25, ఎలక్ట్రానిక్స్-20, కెమికల్-05, మెటలర్జీ-05.
» **సూపర్‌వైజర్ ట్రైనీ:** మెకానికల్-140, ఎలక్ట్రికల్-55, సివిల్-35, ఎలక్ట్రానిక్స్-20.
» **అర్హత:** ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు ఇంజనీరింగ్/టెక్నాలజీలో ఫుల్‌టైం బ్యాచిలర్ డిగ్రీ లేదా సంబంధిత విభాగంలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్ డిగ్రీ, డ్యూయల్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులకు సంబంధిత విభాగంలో రెగ్యులర్ ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.02.2025 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **బేసిక్ పే:** ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు నెలకు రూ.50,000, సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులకు నెలకు రూ.32,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.02.2025
» **పరీక్ష తేదీలు:** 11.04.2025, 12.04.2025, 13.04.2025.
» **వెబ్‌సైట్:** https://www.bhel.com

క్షణాల్లో దరఖాస్తుల అప్‌లోడ్.. నిమిషాల్లో పరిశీలన

ఏఐ.. బిల్డ్ నౌ!

✔ శరవేగంగా భవన నిర్మాణ అనుమతుల జారీకి కొత్త విధానం
✔ మార్చిలో అందుబాటులోకి రానున్న కొత్త వెబ్‌సైట్

సాక్షి, హైదరాబాద్: ఏదైనా భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే... రోజులకు రోజులు పరిశీలనతోనే గడిచిపోతుంది. ఏది సరిగా ఉంది, ఏమేం లోపాలు ఉన్నాయన్నది తేల్చడానికి ఆలస్యం అవుతుంది. అనుమతులు రావడానికి నెల రోజులు దాటిపోతుంది.. ఇదంతా ఇప్పటిదాకా.. ఇక ముందు సెకన్లలోనే దరఖాస్తుల అప్‌లోడింగ్.. నిమిషాల్లోనే పరిశీలన పూర్తయి.. వారం, పది రోజుల్లోనే అనుమతులు రానున్నాయి. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) త్వరలో అందుబాటులోకి తేనున్న 'బిల్డ్ నౌ' ప్రత్యేకత ఇది. నిర్మాణ రంగంలో సరికొత్త విప్లవానికి ఇది తెరలేపనుంది. త్రీడీ విజువలైజేషన్ ఆధారంగా ప్రతిపాదిత భవనం నమూనాను రియల్‌టైమ్‌లో వీక్షిస్తారు. కృత్రిమ మేధ (ఏఐ) సహకారంతో దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేస్తారు. సకాలంలో అనుమతులు ఇచ్చేస్తారు. ప్రస్తుతం అమల్లో ఉన్న టీజీబీపాస్ స్థానంలో మార్చి నెల నుంచే 'బిల్డ్ నౌ'ను అమల్లోకి తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి తుది మెరుగులు దిద్ది అందుబాటులోకి తేనున్నామని అధికారులు వెల్లడించారు. వివిధ రకాల అనుమతుల కోసం ఆయా విభాగాలను సంప్రదించాల్సిన అవసరం లేకుండా సింగిల్ విండో తరహాలో దరఖాస్తు చేసుకుని, అనుమతులు పొందేందుకు 'బిల్డ్ నౌ' దోహదం చేస్తుందని తెలిపారు. 'బిల్డ్ నౌ' అమలు దిశగా హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం చర్యలు చేపడుతోందని వెల్లడించారు. ఇప్పటికే అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నట్టు చెప్పారు.

- కృత్రిమ మేధ సహకారంతో అమలుకు హెచ్‌ఎండీఏ ప్రణాళిక
- సింగిల్ విండో విధానంలో దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం
- అన్నీ సవ్యంగా ఉంటే కొన్ని రోజుల్లో అనుమతులు



ప్రస్తుతం, 'బిల్డ్ నౌ'తో పట్టే సమయం ఇదీ..

నిర్మాణం	టీజీబీపాస్‌లో పట్టే సమయం	బిల్డ్ నౌతో పట్టే సమయం
40 అంతస్తులు, 3 టవర్ల బహుళ అంతస్తులు	20–30 రోజులు	5 నిమిషాలు
150 విల్లాస్‌తో కూడిన లే అవుట్	10–15 రోజులు	5 నిమిషాలు
ఓపెన్ ప్లాట్స్ లేఅవుట్	7–8 గంటలు	1 నిమిషం
సాధారణ భవనాలు (బహుళ అంతస్తులు కానివి)	1 గంట	1 నిమిషం

త్రీడీ విజువల్స్‌తో పరిశీలన

'బిల్డ్ నౌ' అగ్‌మెంటెడ్ రియల్ టైమ్ టెక్నాలజీతో ప్రతిపాదిత భవన నిర్మాణ నమూనాను త్రీడీ విజువలైజేషన్‌లో ఉన్నది ఉన్నట్టుగా వీక్షించేందుకు అవకాశం ఉంటుంది. నిర్మించబోయే భవనం కళ్ల ముందు కనిపిస్తున్నట్టుగా ఉంటుంది. ఇందుకోసం కియోస్క్‌లను ఏర్పాటు చేస్తారు. త్రీడీ హెడ్‌సెట్‌లను వినియోగిస్తారు. భవన నిర్మాణం కోసం డ్రాయింగ్‌లో ప్రతిపాదించిన కొలతలు కచ్చితంగా ఉన్నదీ, లేనిదీ త్రీడీలోనే నిర్ధారించుకోవచ్చని హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. 'బిల్డ్ నౌ' అమల్లోకి వచ్చిన తర్వాత క్షేత్ర స్థాయి తనిఖీల ప్రాధాన్యత తగ్గుతుందని, ఆన్‌లైన్‌లోనే పూర్తి వివరాలు లభిస్తాయని వెల్లడించారు.



'కృత్రిమ మేధ' తేల్చేస్తుంది!

బిల్డర్లు, భవన యజమానులు 'బిల్డ్ నౌ'లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లను కృత్రిమ మేధ (ఏఐ) సహకారంతో క్షుణ్నంగా పరిశీలిస్తారు. ఏఐ ఆధారంగా ప్రధానమైన సెట్‌బ్యాక్‌లు, అదనపు సెట్‌బ్యాక్‌లు, ఇతర నిబంధనలను కచ్చితంగా అంచనా వేసేందుకు, ఎలాంటి లోపాలున్నా గుర్తించేందుకు అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు. సరిదిద్దుకొనేందుకు అవకాశమున్న లోపాలను వెంటనే సరిచేసుకోవచ్చని వెల్లడించారు. దీనితో ఎలాంటి ఉల్లంఘనలకు అవకాశం లేకుండా పారదర్శకంగా నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

వారం, పది రోజుల్లోనే అనుమతులు

బహుళ అంతస్తుల భవనాలు, భారీ లే అవుట్లు, విల్లాలు, ఇతర నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ అనుమతులు రావడానికి జాప్యం జరుగుతోంది. అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి నుంచి ప్లానింగ్ అధికారి, ప్లానింగ్ డైరెక్టర్, కమిషనర్ వరకు వివిధ దశల్లో దరఖాస్తులను, సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించి అనుమతులు ఇచ్చేందుకు 30 రోజులకుపైగా సమయం పడుతుంది. కొత్తగా అందుబాటులోకి రానున్న 'బిల్డ్ నౌ'తో 15 రోజుల్లో అనుమతులు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు. సాధారణ భవనాలు, లే అవుట్లు, అపార్ట్‌మెంట్లకు వారం, పది రోజుల్లోనే అనుమతులు అందుతాయని అంటున్నారు.

వివిధ విభాగాల మధ్య సమన్వయంతో..

ప్రస్తుతం భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతుల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయ లేమి నెలకొంది. దీనితో తీవ్ర జాప్యం జరుగుతోంది. నీటిపారుదల, అగ్నిమాపక, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఇతర విభాగాల నుంచి సకాలంలో అనుమతులు లభించడం లేదని.. ఆ విభాగాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని నిర్మాణ సంస్థలు, బిల్డర్లు, యజమానులు వాపోతున్నారు. 'బిల్డ్ నౌ' వల్ల హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, డీటీసీపీ, తదితర అన్ని విభాగాల మధ్య సమన్వయం సాధ్యమవుతుంది.



క్షణాల్లో దరఖాస్తుల అప్‌లోడ్.

ప్రస్తుతం టీజీబీపాస్ ద్వారా భవన నిర్మాణాలు, లే అవుట్లు, బహుళ అంతస్తుల భవనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం టీజీబీపాస్ నుంచి 'కీ'లభించడం మొదలు డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం, వాటిని జాగ్రత్తగా స్క్రూటినీ చేయడం వరకు ఎక్కువ సమయం పడుతుంది. బహుళ అంతస్తుల డాక్యుమెంట్లు, మ్యాప్‌లు, డ్రాయింగులు వంటివి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రస్తుతం 20 నుంచి 30 రోజుల వరకు సమయం పడుతుంది. బిల్డ్‌నౌ వల్ల క్షణాల్లో డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. పరిశీలన కూడా వేగంగా పూర్తవుతుందని పేర్కొంటున్నారు.



ఈ నెలాఖరు వరకు..

ఇప్పుడున్న టీజీబీపాస్ కంటే మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 'బిల్డ్ నౌ' రూపొందిస్తున్నాం. ఇది కృత్రిమ మేధ ఆధారంగా పనిచేస్తుంది. త్రీడీ విజువలైజేషన్‌తో 'రియల్ టైమ్'లో భవనాన్ని వీక్షించవచ్చు. కొద్దిపాటి ఉల్లంఘనలకు కూడా అవకాశం ఉండదు. కచ్చితమైన ప్రమాణాలను అమలు చేయవచ్చు. ఈ నెలాఖరు నాటికి 'బిల్డ్ నౌ'కు తుది మెరుగులు దిద్ది.. వచ్చే నెల నుంచి అమల్లోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

- దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్, డీటీసీపీ



కలెక్టర్.. లెక్కల మాస్టర్

కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం రాజంపేట ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. లెక్కల మాస్టారుగా మారి విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. వారితో బోర్డుపై సమాధానాలు రాయించారు. — కామారెడ్డి క్రైం



అలుగు పోస్తున్న పెద్ద చెరువు

వేసవి ప్రారంభం కావడంతో సాగునీరు, తాగునీరుకు రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతుండగా దానికి భిన్నంగా సూర్యాపేట జిల్లా కోదాడ పెద్దచెరువు నిండుకుండను తలపిస్తూ అలుగు పోస్తోంది. వారం రోజులుగా సమీపంలోని సాగర్ నీరు పొలాల మీదుగా కోదాడ పెద్దచెరువుకు చేరుతుండటంతో చెరువు పూర్తిస్థాయిలో నిండిపోయింది. మునగాల హెడ్ రెగ్యులేటర్ దాటిన తర్వాత పాలేరు వైపు వెళ్లే ప్రధాన కాలువకు ఉన్న పలు మేజర్లకు షట్టర్లు లేక పోవడం.. నీరు అధిక పరిమాణంలో పంటపొలాలకు చేరి అక్కడి నుంచి వృథాగా కోదాడ పెద్దచెరువుకు చేరుతోందని పలువురు రైతులు అంటున్నారు. ఈ చెరువు కింద ఉన్న పంట పొలాలతో పాటు అలుగునీరు కోదాడ మండల పరిధిలోని పలుగ్రామాల రైతులకు సాగునీరు అందిస్తోంది. ఎక్కువైన నీరు నల్లబండగూడెం సమీపంలో పాలేరు వాగులో కలుస్తోంది. — కోదాడ

ఒక్కరోజులో 94 వేల మంది ప్రయాణం

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుంభమేళా ప్రయాణికుల రద్దీ

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసింది. ఈనెల 16వ తేదీ ఆదివారం ఒక్క రోజే 94,641 మంది రాకపోకలు సాగించారు. మహాకుంభమేళా ఈనెల 26న ముగియనున్న దృష్ట్యా భక్తులు పోటెత్తారు. సాధారణ రోజుల్లో 55 వేల మంది డొమెస్టిక్ ప్రయాణికులు, మరో 10 వేల మందికి పైగా ఇంటర్నేషనల్ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. కానీ ఆదివారం 514 డొమెస్టిక్ ఫ్లైట్లలో ఏకంగా 79,227 మంది ప్రయాణం చేశారు. అలాగే 87 ఇంటర్నేషనల్ ఫ్లైట్‌లలో 15,414 మంది ప్రయాణించారు.

నేటి నుంచి షీల్డ్ 2025 కాన్‌క్లేవ్

- ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తు సైబర్ నేరాలు, వాటితో జరగనున్న ముప్పును అంచనా వేయడం, సైబర్‌నేరాల నుంచి ప్రజల్ని కాపాడే వినూత్న ఆవిష్కరణలకు ఊతమిచ్చే ఉద్దేశంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్త ఆధ్వర్యంలో షీల్డ్ 2025 పేరిట సైబర్ సెక్యూరిటీ కాన్‌క్లేవ్ నిర్వహిస్తున్నాయి. మంగళవారం నుంచి రెండు రోజులపాటు హెచ్‌ఐసీసీలో నిర్వహించనున్న ఈ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు. రెండు రోజులు నిర్వహించే ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సైబర్ భద్రత నిపుణులు, సైబర్ భద్రత అంశంలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, పలు స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు కూడా ఇందులో పాల్గొననున్నారు.

81 పందెం కోళ్లు.. రూ.16.65 లక్షలు

ఉప్పర్‌పల్లి కోర్టులో పందెం కోళ్ల వేలం



ప్రత్యేక ప్యాకింగ్‌లో కోర్టుకు తీసుకొచ్చిన పందెం కోళ్లు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లి 13 ఎంఎం కోర్టు పందెం కోళ్ల వేలానికి వేదికగా మారింది. ఇటీవల మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో కోళ్ల పందెం నిర్వహిస్తుండటంతో పోలీసులు పందెం రాయుళ్లతోపాటు నిర్వాహకులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి భారీ మొత్తంలో నగదు, వాహనాలు, 84 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. పట్టుబడిన 84 పందెం కోళ్లలో మూడు మృతి చెందగా... 81 కోళ్లను న్యాయమూర్తి ఆదేశాల మేరకు సోమవారం కోర్టు హాల్ వద్దకు తెచ్చి వేలం వేశారు. వీటిని 9 రౌండ్‌లలో 4–10 కోళ్ల చొప్పున వాటి తూకాన్ని బట్టి వేలం వేశారు. రూ.14 వేల నుంచి ఈ వేలం పాట మొదలైంది. రెండో రౌండ్‌లో 48 కిలోల బరువు ఉన్న 10 కోళ్లను అత్యధికంగా రూ.3.75 లక్షలకు రవికాంత్ రెడ్డి కొనుగోలు చేశారు. 9 రౌండ్‌లలో 81 కోళ్లు రూ.16.65 లక్షలకు అమ్ముడయ్యాయి. అనంతరం కోళ్లను కొనుగోలు చేసిన వారికి అప్పగించారు. వసూలైన డబ్బును ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నారు.

విశ్వవ్యాప్తంగా హిందూ ధర్మం

అంతర్జాతీయ దేవాలయాల సదస్సు, ఎక్స్‌పోలో ఏపీ, మహారాష్ట్ర, గోవా సీఎంలు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఏపీ, మహారాష్ట్ర, గోవా సీఎంలు చంద్రబాబు, ఫడ్నవీస్, ప్రమోద్ సావంత్ తదితరులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం. దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజందే ప్రధాన పాత్ర. సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణలో ఆలయాల పాత్ర కీలకం'అని ఏపీ, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, దేవేంద్ర ఫడ్నవీస్, డాక్టర్ ప్రమోద్ సావంత్ అన్నారు. టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో అంత్యోదయ ప్రతిష్టాన్ సహకారంతో మూడు రోజుల పాటు తిరుపతిలో నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ దేవాలయాల సదస్సు, ఎక్స్‌పో'సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల సీఎంలతో పాటు ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో 2025 – ఫౌండర్, అంత్యోదయ ప్రతిష్టాన్ ప్రవీణ్ దారేకర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు.

ఎక్స్‌పో ప్రధాన ఉద్దేశమిదీ..

అంతర్జాతీయ దేవాలయాల సదస్సులో 58 దేశాల నుంచి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన మతాల భక్తి సంస్థల ప్రతినిధులు పాల్గొని, 1581 దేవాలయాలను ఒకే వేదికపై అనుసంధానించడం లక్ష్యంగా ఈ ఎక్స్‌పో నిర్వహించారు. ప్రధానంగా స్థిరత్వ, పునరుత్పాదక ఇంధనం, దేవాలయ పాలన, దేవాలయ ఆర్థిక వ్యవస్థ, లక్ష్యాలు, స్మార్ట్ టెంపుల్ పరిష్కారాలు వంటి అంశాలపై మూడు రోజుల పాటు సెమినార్లు నిర్వహించనున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కులకర్ణి, ఐటీసీ పూర్వ చైర్మన్ ప్రసాద్ లాడ్ భవిష్యత్ కార్యక్రమాలను వివరించారు. కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద నాయక్, సాధు ప్రతినిధి ఆచార్య గోవింద్ దేవ్ మహారాజ్, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ముకుంద్ తదితరులు ప్రసంగించారు.

సరస్వతి పుష్కరాలకు స్పెషల్ ట్రైన్

సనత్‌నగర్ (హైదరాబాద్)

చార్‌ధామ్‌ను కలుపుతూ 16 రోజుల యాత్ర

- మే 8న పెరంబూర్ నుంచి ప్రారంభం
- ఏపీ, తెలంగాణ మీదుగా హరిద్వార్ వరకు రైలు ప్రయాణం
- అక్కడి నుంచి రోడ్డు మార్గంలో యాత్ర.. దేశంలో మొదటి ప్రైవేటు టూరిస్ట్ రైలు

చార్‌ధామ్ యాత్రతోపాటు సరస్వతి పుష్కరాల నేపథ్యంలో.. దేశంలో మొదటి భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడపనున్నారు. ఇండియన్ రైల్వే సహకారంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వ రంగ సంస్థ 'ఘర్‌వాల్ మండల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (జీఎంవీఎన్)', ప్రైవేటు టూరిస్ట్ ట్రైన్ ఆపరేటర్ 'టూర్ టైమ్స్' సంయుక్తంగా ఈ రైలును అందుబాటులోకి తెస్తున్నాయి. యాత్ర వివరాలను ఆ సంస్థల ప్రతినిధులు వీరేందర్‌సింగ్ రానా, రమేశ్ అయ్యంగార్ సోమవారం వెల్లడించారు. సరస్వతి పుష్కర్ స్పెషల్ చార్‌ధామ్ యాత్ర పేరుతో 16 రోజుల పాటు యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను కలుపుతూ ఈ యాత్ర సాగుతుంది. మే 8న చెన్నై పెరంబూర్‌లో ప్రారంభమై గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్లగొండ, సికింద్రాబాద్, కాజీపేట, కాగజ్‌నగర్, బల్లార్షా మీదుగా 10వ తేదీన హరిద్వార్‌కు చేరుతుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 12న యమునోత్రి, 13న ఉత్తరకాశీ, 14న గంగోత్రి పర్యటన ఉంటాయి. 19న సరస్వతి నదిలో పుణ్యస్నానాలు, అదేరోజు బద్రీనాథ్ దర్శనం, 20న హృషికేశ్, రామ్‌జూలా, లక్ష్మణ్ జూలా, స్వర్గాశ్రమం దర్శించుకుంటారు. తిరిగి 23న రైలు పెరంబూర్‌కు చేరుకుంటుంది. యాత్రలో అవసరమైన చోట్ల హెలికాప్టర్, డోలీ సౌకర్యాలు కల్పిస్తారు. ఒక్కొక్కరికి చార్జీలు ఫస్ట్ ఏసీ రూ.82,500, సెకండ్ ఏసీ రూ.75,500, థర్డ్ ఏసీ రూ.70,500, స్లీపర్ క్లాస్ రూ.58,500గా ధర నిర్ణయించారు. ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మార్చి 15లోపు పూర్తి సొమ్ము చెల్లించాలి. www. tourtimes.inలో టికెట్ బుక్ చేసుకోవచ్చు. 91600 21414, 91600 91414 నంబర్లలో సంప్రదించవచ్చు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం । 18-2-2025


మరమ్మతులకు ముందు మెట్ల మార్గంలో బావిలోకి వెళ్లే ప్రాంతం అధ్వానంగా ఉన్న పరిస్థితి (ఫైల్)


పురాతన బావి ప్రాంతంలో అధ్వానంగా నీరు పొలాలకు తరలించే కాలువ (ఫైల్)


నిండా చెట్లతో ఉన్న మెట్లబావి లోపలి భాగం (ఫైల్)

చారిత్రక దారి.. 300 ఏళ్ల మెట్లబావి

ఆ కాలంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో వెలుగులోకి..

తాగు, సాగు నీటికి వినియోగం. స్నానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాటు

విశ్రాంతితోపాటు దుస్తులు మార్చుకునేందుకు బావి మధ్యలో ప్రత్యేక గదులు

మూడేళ్ల కిందట ఈ మెట్లబావిపై 'సాక్షి'ప్రత్యేక కథనం

స్పందించి మరమ్మతులకు ఆదేశించిన అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

ఆకర్షణీయంగా మారిన బావి పరిసరాలు

కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్తాం



పురాతన మెట్లబావి అభివృద్ధి అంశాన్ని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తాం. పర్యాటక ప్రాంతంగా మారితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. పురాతన కట్టడాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మూడొందల ఏళ్ల కిందట నిర్మించిన మెట్లబావి మా గ్రామంలో ఉండటం మాకెంతో గర్వకారణం. ప్రభుత్వం, మున్సిపల్ శాఖ నిరంతరం పర్యవేక్షించాలి.

- రమనగోని శంకర్, మాజీ సర్పంచ్, లింగోజిగూడెం

నాటి చారిత్రక కట్టడాలు నేటి తరానికి గొప్ప సంపద. గతాన్ని చూడని ఇప్పటి జనానికి అలనాటి నిర్మాణాలే సజీవ సాక్ష్యాలు. దశాబ్దాల కాలం నాటి నిర్మాణాలు చెక్కుచెదరకుండా ఇప్పటికీ పటిష్టంగానే ఉండటం అప్పటి సాంకేతికతకు నిదర్శనం. యంత్రాలు, ఇతర నిర్మాణ పనిముట్ల గురించి తెలియని సమయంలో కేవలం మానవుల తెలివితో చేపట్టిన నిర్మాణాలు నేటి సాంకేతికత కంటే చాలా పటిష్టంగా ఉన్నాయి. అలాంటి వారసత్వ సంపద ఎక్కడ ఉన్నా గుర్తించి రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

చౌటుప్పల్


మరమ్మతుల తర్వాత అందంగా మారిన మెట్లబావి లోపలి భాగం

రాజధానికి 52 కి.మీ. దూరంలో..

హైదరాబాద్‌కు సరిగ్గా 52 కి.మీ. దూరంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై విజయవాడ మార్గంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామం ఉంది. ఈ గ్రామంలో జాతీయ రహదారి వెంట ప్రస్తుతం ఉన్న సాయిబాబా దేవాలయాన్ని గతంలో గోసాయిమఠంగా పిలిచేవారు. దశాబ్దాల కిందట ఈ మఠాన్ని అక్కడ ఏర్పాటు చేశారు. దేవాలయం వెనుక భాగాన దిగుడుబావి (మెట్లబావి) ఉంది. ఆ దిగుడు బావిని 300 ఏళ్ల కిందట అప్పటి రాజులు నిర్మించారు. ఎంతో గొప్ప సాంకేతికతతో నిర్మించిన ఈ బావి ఇప్పటికీ చెక్కు చెదరలేదు. దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉండటంతో కొంత మేరకు నిర్మాణాలు దెబ్బతిన్నాయే తప్పిస్తే మిగతా కట్టడాలన్నీ యథావిధిగా ఉన్నాయి.

రాజుల కాలంలో దిగుడుబావి నిర్మాణం

దిగుడుబావి (మెట్లబావి) గొప్ప చరిత్ర కలిగి ఉంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు ఇక్కడ విశ్రాంత మందిరాన్ని నిర్మించుకున్నారని, ఆ విశ్రాంత మందిరానికి అనుసంధానంగా అన్ని రకాల సౌకర్యాలతో ఈ దిగుడుబావిని నిర్మించి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. దిగుడు బావి పరిసరాల్లోని రాజు భూములు కాలక్రమేణా స్థానికులకు వచ్చాయి.

పూర్తిగా రాళ్లతోనే..

ఈ దిగుడుబావిని పూర్తిగా రాళ్లతోనే నిర్మించారు. తూర్పున 6 అడుగుల వెడల్పు, దిగువకు 20 అడుగులు, ఉత్తరంలో 10 అడుగుల వెడల్పు ప్రకారం మొత్తంగా దిగువకు 60 అడుగుల మేర మెట్లు ఏర్పాటు చేశారు. మెట్ల మార్గాన్ని గ్రానైట్ రాళ్లతో అందంగా తీర్చిదిద్దారు. 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 80 అడుగుల లోతుతో ఈ బావిని నిర్మించారు. భూమి నుంచి 25 అడుగుల దిగువన బావిలో ప్రత్యేకంగా ఆర్చీలతో మూడు గదులు ఏర్పాటు చేశారు. బావిలో స్నానాలు చేశాక దుస్తులు మార్చుకునేందుకు ఈ గదులను నిర్మించారు. ఆ గదులు ప్రత్యేకంగా మహిళలు (నాటి రాణులు) వినియోగించేవిగా తెలుస్తోంది. పొలాలకు సాగునీరు, స్థానిక ప్రజానీకానికి తాగు నీరు అందించడంతో పాటు ప్రజలు స్నానాలు చేసేందుకు అనువుగా బావిని నిర్మించారు.


మరమ్మతుల తర్వాత మెట్లబావి ప్రాంతం

గోసాయి మఠంగా ప్రత్యేక గుర్తింపు

చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి తూర్పున 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగోజిగూడెం గ్రామం ఒకప్పుడు గోసాయిమఠంగానే గుర్తింపు పొందింది. కొన్నేళ్ల కిందట గోసాయిదొర అనే వ్యక్తి హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకొని ప్రస్తుతం సాయిబాబా దేవాలయం ప్రాంతంలో మఠాన్ని ఏర్పాటు చేశాడు. పలు ప్రాంతాలకు ప్రయాణాలు చేసే బాటసారులు అలసిపోయిన సందర్భాల్లో విశ్రాంతి తీసుకోవడంతోపాటు అక్కడే విడిది చేసేందుకు అనువుగా అందులో వసతులు ఉండేవని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో ఆర్టీసీ బస్సులు కూడా గోసాయిమఠం స్టేజీ అంటేనే ఆగేవంటే ఎంత ప్రాముఖ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆలయానికి ప్రస్తుతం రెండు ఎకరాలకుపైగా స్థలం అందుబాటులో ఉంది.

మెట్లబావి పరిరక్షణకు ముందుకొచ్చిన హెచ్ఎండీఏ

శతాబ్దాల కాలంనాటి మెట్లబావి గురించి సాక్షి దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. అందుకు సంబంధించి 2022, ఫిబ్రవరి 14న ప్రత్యేకమైన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనానికి అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్ స్పందించారు. వెంటనే మెట్లబావి విషయాన్ని తెలుసుకుని మరమ్మతులు చేయాలని హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు. అందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అలా ఈ మెట్లబావిని సుందరీకరించారు. అనంతరం ఏప్రిల్ 14న దీన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ మెట్లబావి బాధ్యతలు హెచ్ఎండీఏ చూసుకుంటోంది. అయితే ఆ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక ప్రాంతంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఏపీపీల భర్తీపై ఏం చర్యలు తీసుకున్నారు?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని జిల్లా, తాలుకా కోర్టుల్లో అదనపు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) భర్తీపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 24కు వాయిదా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా దిగువ కోర్టుల్లో పనిచేయడానికి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పోస్టులను ఎప్పటిలోగా భర్తీ చేస్తారు? ప్రభుత్వ వైఖరేంటో తెలియజేయాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర కావొస్తున్నా దిగువ కోర్టుల్లో ప్రభుత్వ న్యాయవాదుల భర్తీ పెండింగ్‌లో ఉందని, కేసుల విచారణకు ఆటంకం ఏర్పడుతోందని పేర్కొంటూ హైదరాబాద్ రామంతాపూర్‌కు చెందిన బొద్దుపెల్లి శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వివరాలు తెలుసుకుని చెప్పడానికి వారం సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో విచారణ వాయిదా వేసింది.

'కిషన్‌రెడ్డి, బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి'



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కులంపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశాభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు తీసుకొచ్చిన గాంధీ కుటుంబంపై బీజేపీ నాయకులు చేస్తున్న కుల, మత నీచ రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని సూచించారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూ జైలుకు వెళ్లారని, దేశ సమగ్రత కోసం ఇందిరాగాంధీ ప్రాణ త్యాగం చేశారని, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించారని తెలిపారు. ప్రధాని పదవిని త్యాగం చేసిన చరిత్ర సోనియా, రాహుల్‌గాంధీలదని రామచంద్రనాయక్ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసమే నాటకం

అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఏ కులమని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అడగడం దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని, బీజేపీ బిల్లారంగాలు కొత్త డ్రామాకు తెరలేపారని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ మండిపడ్డారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ ఎప్పుడూ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసమే ఈ నాటకమని, దిగజారుడు రాజకీయాలు ఎవ్వరూ నమ్మరని తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం తప్పా?

మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం తప్పా? అని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నించారు. సోమవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీసీల రాజకీయ, విద్య, ఉద్యోగావకాశాలను పెంచడం కోసమే కులగణన చేపట్టారని తెలిపారు. ఏఐసీసీ అగ్రనేతపై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. బంజారాలను ఎస్టీల్లో కలిపింది ఇందిరాగాంధీ అని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ నాయకత్వమని, అలాంటి కుటుంబంపై విమర్శలు చేస్తే ప్రజలు సహించబోరని బలరాం అన్నారు.

కేసీఆర్ చర్యతోనే బీసీ జనాభా తగ్గింది

కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఇందిరా శోభన్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: బీసీ జాబితా నుంచి 29 కులాలను కేసీఆర్ నాడు తొలగించారని, దీంతో బీసీ జనాభా కాస్త తగ్గిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ ఆరోపించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీ కులగణనలో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసిన తర్వాత వారితో సంతకం తీసుకున్నారన్నారు. గ్రామ, పట్టణ, జిల్లాలవారీగా బీసీ జనాభా డేటా ఎంట్రీ చేసి భద్రంగా పెట్టారని, ఫలానా గ్రామంలో లేదా పట్టణంలో ఉన్న బీసీ జనాభాకు, ప్రభుత్వం దగ్గర ఉన్న లెక్కలకు ఏమైనా తేడా ఉంటే ఆధారాలతో రావాలని ఆమె సూచించారు. కేసీఆర్, కేటీఆర్‌తో పాటు 3.1 శాతం మంది సామాన్య జనం సర్వేలో పాల్గొనలేదని, వారు నమోదు చేసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరొక అవకాశం ఇచ్చిందన్నారు. బీజేపీ నేతలు రాహుల్ గాంధీ కులం గురించి మాట్లాడుతున్నారని ఆయన్ను ప్రశ్నించే నైతిక హక్కు బీజేపీ నేతలకు ఎక్కడిదని ఇందిరా శోభన్ ప్రశ్నించారు.

పశుసంవర్ధకశాఖలో ఐదుగురు డీడీలకు జేడీలుగా పదోన్నతి, బదిలీ

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్థక శాఖలో డిప్యూటీ డైరెక్టర్లు (డీడీ)గా ఉన్న ఐదుగురు అధికారులకు జాయింట్ డైరెక్టర్లు (జేడీ)గా పదోన్నతి కల్పిస్తూ, బదిలీ చేశారు. పదోన్నతి పొందిన వారిని జాయింట్ డైరెక్టర్ హోదాలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలకు బదిలీ అయిన వారిలో వి.కృష్ణ–మంచిర్యాల, కె.వెంకటనారాయణ–ఖమ్మం, టి.సుధాకర్–కరీంనగర్, వి.అశోక్ కుమార్–సిద్దిపేట, జి.వి.రమేశ్–నల్లగొండ ఉన్నారు.

వేణుగోపాలచారి కేసులో మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

- కేసు విచారణ ఏప్రిల్‌కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: హరీశ్‌చంద్ర అనే పోలీస్ కానిస్టేబుల్‌పై 2002లో జరిగిన దాడి కేసులో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారికి గతంలో సరెండర్ మినహాయింపు ఇస్తూ పాస్ చేసిన ఆర్డర్స్‌ను కొనసాగిస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. తునికాకు ఏరుకునేందుకు ఆదిలాబాద్ అడవిలోకి వెళ్లొద్దని స్థానికులను పోలీసులు హెచ్చరించారు. అయితే ఈ విషయాన్ని అప్పుడు ఎంపీగా ఉన్న వేణుగోపాలచారి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఈక్రమంలో రౌండ్స్‌కు వచ్చిన కానిస్టేబుల్ హరీశ్‌చంద్ర, స్థానికులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. వేణుగోపాలచారి భౌతిక దాడి చేశారంటూ కానిస్టేబుల్ హరీశ్‌చంద్ర పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో ట్రయల్ కోర్టు వేణుగోపాలచారికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ వేణుగోపాలచారి హైకోర్టును ఆశ్రయించారు. ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై ధర్మాసనం స్టే విధించింది. ఈ స్టే ముగియడంతో, గతేడాది జూన్‌లో వేణుగోపాలచారి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం అరెస్ట్ నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం మరోసారి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ విచారించారు. ఈ సందర్భంగా ఆధారాల విషయంలో ప్రభుత్వం పలు అంశాలను లేవనెత్తింది. ఈ విషయంలో ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఈ కేసు ఏప్రిల్ 8న బెంచ్ ముందుకు వచ్చే అవకాశం ఉంది.

సింగరేణి సిగలో మరో నగ

- 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయం
- పర్యావరణానికి అనుగుణంగా సూపర్ క్రిటికల్ ప్రాజెక్టు
- బీహెచ్ఈఎల్ సంస్థకు నిర్మాణ బాధ్యతలు


సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం

గోదావరిఖని: సింగరేణి సిగలో మరో నగ మెరిసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే 600 మెగావాట్ల రెండు విద్యుత్ కేంద్రాలుండగా, వీటికి అదనంగా 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఇటీవల నిర్వహించిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా ఈ సూపర్ క్రిటికల్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 2 వేల మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. సొంతంగా బొగ్గును వెలికితీస్తున్న సింగరేణి సంస్థ అదే బొగ్గుతో థర్మల్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఈ సూపర్ క్రిటికల్ కేంద్రం ద్వారా రోజూ 36 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనుంది.

జైపూర్‌లోనే విద్యుత్ కేంద్రం

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జైపూర్ విద్యుత్ కేంద్రం ఆవరణలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ కేంద్రాన్ని నిర్మించనుంది. దీనికోసం రూ.6,700 కోట్ల అంచనా వ్యయంతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న 1,200 మెగావాట్లకు అదనంగా దీన్ని నిర్మిస్తున్నారు.

టెండర్ పూర్తి..

నూతన పవర్‌ప్లాంట్ కోసం టెండర్ ప్రక్రియను యాజమాన్యం పూర్తిచేసింది. బీహెచ్ఈఎల్ సంస్థ టెండర్ దక్కించుకుంది. మరో నెలరోజుల్లోగా పనులు ప్రారంభం కానున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. జైపూర్ విద్యుత్ కేంద్రంలోనే బాయిలర్లు, చిమ్నీ, టర్బయిన్, జనరేటర్లను ఏర్పాటు చేయనుంది. సీహెచ్‌పీ, రైల్వే సైడింగ్ నిర్మాణం బీహెచ్ఈఎల్ సంస్థ నిర్మించనుంది. నాలుగేళ్లలోపు నిర్మాణం పూర్తిచేయాలని యాజమాన్యం నిర్ణయించింది. మరి కొద్దిరోజుల్లో టెండరు దక్కించుకున్న సంస్థతో అవగాహన ఒప్పందాన్ని ఖరారు చేయనున్నారు. మూడు నెలల్లో పనులు ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

500 మందికి ఉపాధి అవకాశం

కొత్త పవర్ ప్లాంట్ నిర్మాణంతో జైపూర్ సమీప ప్రాంతాల్లో సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్లాంట్ నిర్మాణ దశ, నిర్మాణం పూర్తయిన తర్వాత ఉత్పత్తి దశలో కూడా కాంట్రాక్టు కార్మికులను వినియోగించనున్నారు.

వేగంగా సూపర్ క్రిటికల్ కేంద్రం



జైపూర్ పవర్‌ప్లాంట్ ఆవరణలో సూపర్ క్రిటికల్ కేంద్రాన్ని వేగంగా నిర్మించాలని నిర్ణయించాం. వ్యయంతో సంబంధం లేకుండా పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రానికి సంస్థ ప్రస్తుతం 13 శాతం విద్యుత్ అందిస్తోంది. కొత్త ప్రాజెక్టు పూర్తయితే 20 శాతానికి చేరుకోనుంది.

- ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి


విద్యుత్ దీపాల వెలుగుల్లో యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రధాన రహదారి

యాదగిరిగుట్ట జిగేల్

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రధానాలయం, ఉప ఆలయాలు, వైకుంఠద్వారంతో పాటు ఆలయ పరిసరాలు, యాదగిరిగుట్ట పట్టణాన్ని, స్వాగత తోరణాలు, విద్యుత్ లైట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

- యాదగిరిగుట్ట


విద్యుత్ దీపాలంకరణలో యాదగిరి ఆలయ వైకుంఠద్వారం


సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిరుల చీపురు

గిరిజనులకు వరంలా మారిన కొండ చీపుర్ల సాగు

- ఏజెన్సీలో సుమారు 1,000 ఎకరాల్లో పంట
- ఎకరానికి 2 వేల చీపురు కట్టల వరకు తయారీ
- ఏటా రూ. లక్ష వరకు ఆదాయం



హుకుంపేట మండలం బీమవరం ప్రాంతంలోని కొండలపై సాగవుతున్న చీపురు పంట

సాక్షి, పాడేరు: మనం ఇళ్లలో వాడే చీపురు పంట గిరిబిడ్డలకు జీవనాధారం. ఏజెన్సీలోని హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, మంచంగిపుట్టు, అరకులోయ, జి.మాడుగుల, పాడేరు, సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో వేల కుటుంబాలు చీపురు పంటను సాగుచేస్తూ ఉపాధి పొందుతున్నాయి. పూర్వం దట్టమైన అడవుల్లో మాత్రమే కనిపించే కొండచీపురు మొక్కలు నేడు మన్యం అంతా విస్తరించాయి. కొండపోడు, మెట్ట భూముల్లో గిరిజనులు చీపురు పంటను సాగుచేస్తున్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో ఈ పంట చేతికి వస్తుంది. చీపురు గడ్డి శాస్త్రీయనామం ×థైసెలోలెనా మాక్సిమా॰ ఈ మొక్కలు హిమాలయాల్లోని ఎత్తయిన ప్రాంతాలు, దేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తాయి. మన ప్రాంతానికి దీన్ని వలస మొక్కగా చెప్పవచ్చు.



చీపురుపుల్లలను ఆరబెట్టిన దృశ్యాలు

చీపురుతో స్వయం సమృద్ధి

కొండచీపుర్లకు దేశవ్యాప్తంగా ఆదరణ ఉంది. ప్రస్తుతం చీపురు పంట దిగుబడికి రావడంతో పుల్లలను సేకరిస్తున్న గిరిజనులు వాటిని బాగా ఎండబెట్టి, కట్టలు కట్టి మండల కేంద్రాలు, వారపుసంతల్లో అమ్ముతున్నారు. చీపురు కట్టల తయారీలో గిరిజన కుటుంబాలు ఇంటిల్లిపాదీ కష్టపడతాయి. మహిళలు కూడా చీపురు సేకరణ, కట్టలు కట్టడం అలవాటు చేసుకున్నారు. చీపురు కట్టకు మార్కెట్‌లో రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతోంది. ఎకరానికి కనీసం 2వేల వరకు చీపురు కట్టలు తయారవుతాయి. దీంతో ప్రతి గిరిజన రైతు ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదిస్తున్నాడు. కొంత మంది గిరిజన రైతులు నేరుగా విశాఖపట్నం, గాజువాక, విజయనగరం, రాజమండ్రి వంటి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏటా ఏజెన్సీ అంతటా కొండచీపుర్ల అమ్మకాలు భారీగా జరుగుతాయి. ప్రస్తుతం మన్యం సంతల్లో వ్యాపారులంతా పోటాపోటీగా కొనుగోలు చేస్తుండటంతో చీపురు అమ్మకాల ద్వారా గిరిజన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.

గతంలో అడవిలోకి వెళ్లి పుల్ల, పుల్ల ఏరుకుని ఇంటికి తెచ్చి చీపురు కట్టలుకట్టి సంతల్లో అమ్ముకునేవారు. దట్టమైన అడవుల్లో చీపురు పుల్లల సేకరణ గిరిబిడ్డలకు నిరంతర సవాలే. నిత్యం క్రూర మృగాలు, విషసర్పాలతో పోరాటమే. సేకరణ మరీ కష్టంగా మారుతుండటం, రోజురోజుకూ గిరాకీ పెరుగుతుండటంతో ఆ చీపురు మొక్కల్ని తమ సమీపంలోని కొండవాలుల్లో పెంచడం మొదలు పెట్టారు. అలా ప్రారంభమైన చీపుర్ల సాగు ప్రస్తుతం ఏజెన్సీలో సుమారు వెయ్యి ఎకరాల వరకు విస్తరించింది.



సేకరించిన చీపురుపుల్లలను మోసుకువస్తున్న గిరిజన మహిళలు

చీపురు పంటతో మంచి ఆదాయం



కొండచీపురు పంట ద్వారా మా గ్రామంలోని అన్ని గిరిజన కుటుంబాలకు మంచి ఆదాయం లభిస్తోంది. మెట్ట,కొండ పోడులో చీపురు సాగు చేస్తున్నాం.ఎకరం పంట ద్వారా సుమారు 2వేల వరకు చీపురు కట్టలు తయారు చేస్తాం. పంట సేకరణ, కట్టలు కట్టడం కష్టం తప్ప చీపురు సాగుకు ఎలాంటి పెట్టుబడి లేదు.

– పాంగి అప్పన్న, మేభ గ్రామం సూకురు పంచాయతీ, హుకుంపేట

మహిళలకు స్వయం ఉపాధి



చీపురుపంట సాగుతో సీజన్‌లో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తోంది. సంక్రాంతి పండుగ దాటిన నాటి నుంచి మే నెల వరకు చీపురు కట్టలను సంతల్లో అమ్మకాలు జరుపుతాం, వీటి అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో సగం మహిళలమే తీసుకుని ఆసొమ్ముతో పలు వస్తువులు కొనుక్కుంటాం.గత పదేళ్ల నుంచి కొండచీపురు పంటను సాగుచేసుకుంటున్నాం.చీపురు పంట ఆర్థికంగా ఏటా మా కుటుంబాలను ఆదుకుంటోంది.

– జన్ని సన్యాసమ్మ, గిరిజన మహిళా రైతు

క్లుప్తంగా...

'ఎయిడెడ్' విద్యార్థులకు వసతులు కల్పించాలి

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో సమానంగా ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే 68,500 మంది పేద విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. టాయిలెట్ సౌకర్యం, మంచినీటి వసతి కల్పించాలని, విద్యార్థులకు ఆట వస్తువులు, డబుల్ డెస్క్ బెంచీలు అందజేయాలని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు ఎల్.కె.చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్‌గా కృష్ణమోహన్

సాక్షి, అమరావతి: పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్‌గా బీసీ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్‌ను నియమించారు. ఈమేరకు సోమవారం ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫారిన్ సర్వీస్ కింద డెప్యూటేషన్‌పై ఈ నియామకం చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పిఠాపురంలో 14న జనసేన ఆవిర్భావ సభ

సాక్షి, అమరావతి : జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను మార్చి 14న పిఠాపురంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వంలో పార్టీ భాగస్వామ్యం అయిన తర్వాత జరుగుతున్న ఈ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు పార్టీ తెలిపింది. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించారని పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

కేంద్ర బడ్జెట్‌పై నేటి నుంచి బీజేపీ సమావేశాలు

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ ఏపీ శాఖ మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించనుంది. 18న గుంటూరులో నిర్వహించే సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పాల్గొంటారు. 19న తిరుపతిలో జరిగే సమావేశానికి కేంద్ర మంత్రి పెమ్మసాని హాజరవుతారు. 21న విజయవాడలో జరిగే సమావేశానికి కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి, 22న విశాఖలో జరిగే సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరు కానున్నారని ఏపీ బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

కూటమి ప్రభుత్వంలో రాయలసీమ, ఉత్తరాంధ్రకు అన్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



కర్నూలు (సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో రాయలసీయ, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సోమవారం కర్నూలులోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిధులన్నీ అమరావతి, పోలవరంలకే కేటాయించి సీమ, ఉత్తరాంధ్రకు సీఎం చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రాంతాల్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి వచ్చే బడ్జెట్‌లోరూ.30 వేల కోట్లను కేటాయించాలన్నారు. కృష్ణానది బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు రామాంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డు పునర్వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి: కలెక్టర్ చైర్మన్‌గా ఎనిమిది మంది డైరెక్టర్లను నియమిస్తూ గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) బోర్డును ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈ ఎస్పీవీకి చైర్మన్‌తోపాటు 15 మంది డైరెక్టర్లతో బోర్డును ఏర్పాటుచేస్తూ 2016, ఫిబ్రవరి 17న జారీ చేసిన ఉత్తర్వులను సవరిస్తూ సోమవారం పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ ఎస్పీవీ బోర్డుకు జీవీఎంసీ కమిషనర్ ఎండీ, సీఈవోగానూ వ్యవహరిస్తారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, వీఎంఆర్‌డీఏ కమిషనర్, జీవీఎంసీ అదనపు కమిషనర్, జీవీఎంసీ సీఈ, ఇద్దరు స్వతంత్రులను డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది.

విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ

ఒకరికి గాయాలు

కూర్మన్నపాలెం: విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు రెచ్చిపోయారు. ఒకరినొకరు కొట్టుకొని బీభత్సం సృష్టించారు. ఈ కొట్లాట, ఘర్షణలో ఒక విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ కె.మల్లేశ్వరరావు అందించిన సమాచారం మేరకు కళాశాలలో ఏటా యువతరంగం పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహిస్తారు. దీనిలో భాగంగానే శనివారం రాత్రి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసి విద్యార్థులు డ్యాన్సులు చేశారు. ఈ సందర్భంలో ఒక విద్యార్థికి మరో విద్యార్థి కాలు తగిలింది. అ విద్యార్థి క్షమాపణ చెప్పినప్పటికీ శాంతించని కాలు తగిలిన విద్యార్థి ఘర్షణకు దిగాడు. దీంతో ఆ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి యుద్ధాన్ని తలపించేలా ఒకరి నొకరు పిడుగుద్దులు గుద్దుకున్నారు. దీనితో కళాశాల ఆవరణ అంతా గందరగోళంగా మారిపోయింది. ఈ ఘర్షణలో ఈశ్వర్ అనే థర్డ్ ఇయర్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనపై ఈశ్వర్ దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మల్లేశ్వరావు కేసు నమోదు చేశారు. ఇందుకు బాధ్యులైన బీటెక్ చదువుతున్న సూర్యకిరణ్, జయసూర్య, మరికొంతమంది విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పూర్తి వివరాలు సేకరించి బాధ్యులందరిపైనా వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టి అరెస్టు చేస్తామన్నారు. ప్రస్తుతం కాలేజీ వాతావరణం అదుపులో ఉందన్నారు. ఈ కేసును ఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.



కళాశాలలో కొట్టుకుంటున్న విద్యార్థులు

దొంగహామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రంపచోడవరం (అల్లూరి జిల్లా): కూటమి ప్రభుత్వం దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ జి.వి. హర్షకుమార్ ఆరోపించారు. ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా రంపచోడవరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో కొంత మంది గిరిజనులతో మాట్లాడినప్పుడు వారు జగన్ అంటే ఇష్టమే అని, కానీ కూటమి ప్రభుత్వానికి ఓటు వేశామని తెలిపారన్నారు. అమ్మ ఒడి పథకం ఇంటిలో ఒకరికే వస్తుందని, తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ వస్తుందని ఆశపడ్డారని తెలిపారు. ఇలాంటి ఎన్నో తప్పుడు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ఇలాంటి సమయంలో కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖర్చు చేయాల్సిన సబ్ ప్లాన్ నిధులు ఏమవుతున్నాయో తెలియడం లేదని చెప్పారు. రాజమహేంద్రవరం లాంటి ప్రాంతంలో కనీస వసతులు లేని హాస్టళ్లలో గిరిజన విద్యార్థులు మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం హాస్టళ్లను పెంచడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏ భూమిపై కన్నుపడిందో గాని 1/70 చట్టాన్ని సవరిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వాఖ్యానించారని ఆరోపించారు.గిరిజనులు ఏకతాటిపై అల్టిమేటం జారీ చేయడంతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు.

చేనేత రంగంలో ఉపాధి అవకాశాలు

- చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సరిత
- పెట్టుబడిదారుల సదస్సుకు హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: వ్యవసాయం తర్వాత చేనేత రంగంలోనే ఉపాధి అవకాశాలు ఎక్కువని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సరిత స్పష్టం చేశారు. ఏపీకి పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు ఫలించాయన్నారు. ఢిల్లీలో ప్రగతి మైదాన్‌లో జరుగుతున్న ×భారత్ టెక్స్॰ (అతిపెద్ద జౌళి ప్రదర్శన) సదస్సుకు ఆమె సోమవారం హాజరయ్యారు. ×రాష్ట్ర జౌళిరంగ పాలసీ॰ని ఆమె పెట్టుబడిదారులకు వివరించారు. అనంతరం ఏపీ భవన్‌లో మంత్రి మాట్లాడుతూ.. జౌళి రంగంలో హిందూపూర్‌లో రూ.500కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఓ ప్రతినిధి ముందుకొచ్చారని తెలిపారు. మరో ఐదుగురు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో తయారైన వస్త్రాలను నిల్వ చేసేందుకు వేర్‌హౌజ్ (గోదాం) ఏర్పాటు చేసేందుకు కూడా పెట్టుబడుదారులు ముందుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో తామంతా ముందుకెళ్తున్నట్లు మంత్రి సవిత వివరించారు.

ఐదు భాషల్లో అనర్గళంగా!

శెట్టేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ.. బహుభాషలు నేర్చుకోవడంపై ఆసక్తి

శాంతిపురం: ఒక దీపం అనంత దీపాలను వెలిగించినట్టు.. తపన ఉన్న ఓ ఉపాధ్యాయుడు తలిస్తే వందల, వేల మంది విద్యార్థులను ప్రతిభావంతులుగా ఎలా తీర్చిదిద్దవచ్చన్నది చిత్తూరు జిల్లా, శాంతిపురం, శెట్టేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల చాటుతోంది. మారుమూల గ్రామంలో ఉన్న ఈ స్కూలు విద్యార్థులు బహుభాషలపై తమ ప్రత్యేకతను చాటుకొంటున్నారు. పాఠ్యాంశాల్లోని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలతో పాటు కన్నడం, తమిళం, మలయాళీ భాషలు ఇక్కడి విద్యార్థులు సులువుగా రాయటం, చదవడం, మాట్లాడడం చేస్తున్నారు. ఒక భాషలోని పద్యాలు, రచనలను మరో భాషలోకి అనువాదం చేయగలుగుతున్నారు.



విద్యార్థి బహు భాషా ప్రావీణ్యాన్ని పరీక్షిస్తున్న పరిశీలకులు (ఫైల్)

ప్రత్యేక పరీక్షల్లో ఉత్తీర్ణత

అధికారుల అనుమతితో ఆయా భాషల్లో ప్రావీణ్యులైన ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి విద్యార్థుల భాషాపరిజ్ఞానంపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. గుడుపల్లి ఏపీ మోడల్ స్కూలు ఉపాధ్యాయుడు షిజో మైకెల్ మలయాళంపై, గుడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే.మణి తమిళంపై, కర్ణాటకలోని వేమన విద్యా సంస్థల ఉపాధ్యాయురాలు ఎస్‌వనజాక్షి కన్నడ భాషపై మొత్తం 94 మంది విద్యార్థుల స్థాయిలను ఇటీవల పరీక్షించారు. వీరిలో కన్నడంలో 93 మంది, మలయాళంలో 45 మంది, తమిళంలో 36 మంది సంతృప్తికర ప్రతిభను చాటుకున్నారు.

ప్రధానోపాధ్యాయుని సంకల్పం

ఇక్కడ ప్రధానోపాధ్యాయుడుగా ఉన్న తీగల వెంకటయ్య భాషల పట్ల ఆసక్తితో రూపకల్పన చేసిన కార్యక్రమం విద్యార్థులను బహుభాషా కోవిదులుగా తయారు చేస్తోంది. తీరిక వేళల్లో హెచ్‌ఎం ఇస్తున్న తర్ఫీదు, మిగతా ఉపాధ్యాయుల సహకారం అందిపుచ్చుకుని అన్ని బాషల్లోనూ తమ పట్టును పెంచుకొంటున్నారు. మాతృభాష వస్తే మరెన్ని భాషలైనా నేర్వవచ్చనే ఆలోచనతో హెచ్‌ఎం తీగల వెంకటయ్య ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి తన ప్రత్యేక బోధనా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 6, 7, 8, 9 తరగతుల వారికి భాషల గురించి చెప్పి, కేవలం 26 సరళమైన పదాలతో బోధన ప్రారంభించారు. ఎవరైనా ఉపాధ్యాయులు లేని సమయంలో వారి తరగతులను తీసుకుని విద్యార్థులకు దీనిపై పాఠాలు చెప్పారు. విద్యార్థులు కూడా ఇతర భాషలు నేర్చుకోవటంపై ఆసక్తి చూపడంతో సొంత ఖర్చులతో వారికి మలయాళం, తమిళం, కన్నడ పుస్తకాలను కొనిచ్చారు. ఈ ఆసరాను అందిపుచ్చుకున్న పిల్లలు ఆయా భాషలపై సులువుగా పట్టు సాధిస్తున్నారు.

నా విశ్వాసం పెరిగింది



ప్రైమరీ స్కూలు రోజుల నుంచి భాషలే నాకు ఇబ్బందిగా ఉండేవి. అక్కడ తెలుగు, ఇంగ్లీషు ఉంటే 6వ తరగతిలో చేరగానే వాటికి హిందీ కూడా తోడయ్యి అంతా అయోమయంగా ఉండేది. కానీ సులువుగా భాషలు నేర్చుకునే టెక్నిక్ తెలుసుకున్న తర్వాత తెలుగు, ఇంగ్లీషు, హిందీతో పాటు కన్నడ, తమిళం కూడా నేర్చుకొంటున్నాను. నాపై నాకు విశ్వాసం పెరిగింది.

– బీ.రామాచారి, 8వ తరగతి

ఎన్ని భాషలైనా నేర్వవచ్చు



నేను రూపొందించిన ప్రాజెక్టు నమూనాతో 20–25 రోజుల్లోపు ఏ బాషలైనా నేర్చుకోవచ్చు. అందరు విద్యార్థులకు దక్షిణ భారత భాషలను నేర్పితే వారి నిత్య జీవనంలో అది ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది

– తీగల వెంకటయ్య, హెచ్‌ఎం

5 భాషలు నేర్చుకొంటున్నా



కొత్త భాషలను సులువుగా నేర్చుకోవటం భలే సరదాగా ఉంది. ఏడాది క్రితం వరకూ తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లోని పాఠ్యాంశాలు నేర్చుకోవటానికే కష్ట పడేదాన్ని. కానీ మా హెడ్మాస్టర్ చెప్పిన విధానం పాటించటంతో ఆ భాషలతో పాటు మలయాళం, తమిళం, కన్నడ కూడా సులువుగా నేర్చుకున్నాను. ఇదే ప్రేరణతో భవిష్యత్తులో నేను భాషా పండిట్ అవుతాను.

– కె.ధరణి, 9వ తరగతి

విస్తరిస్తే బాగుంటుంది



వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుని, విద్యార్థుల మిగతా పాఠ్యాంశాలకు ఇబ్బంది కలగకుండా మా హెచ్ ఎం చేసిన ప్రయోగం సత్ఫలితాలను ఇచ్చింది. విద్యాశాఖ ఉన్నత అధికారులు ఈ నమూనాను పరిశీలించి మిగతా స్కూళ్లకు కూడా విస్తరిస్తే బాగుంటుంది. ఇంగ్లీష్, హిందీలకు అదనంగా పాఠశాలకు ఒక్క ఉపాధ్యాయుడిని కేటాయించినా కనీసం మరో మూడు భాషలు పిల్లలకు నేర్పవచ్చు. పోటీ ప్రపంచంలో కేవలం భాషలపై అవగాహన లేకపోవటం వల్లే చాలా మంది సరైన ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. – నాగభూషణం, ఇంగ్లీష్ టీచర్



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో రద్దీ సాధారణంగా ఉంది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామి వారి సర్వదర్శనం సుమారు 8 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. సోమవారం సాయంత్రానికి 3 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సోమవారం 79,705 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 24,836 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.67కోట్లుగా అధికారులు తెలిపారు.

రత్నగిరిపై భక్తుల సందడి


అన్నవరం: వివాహాల సీజన్ సందర్భంగా నవ దంపతులు, వారి బంధుమిత్రులు, ఇతర భక్తులతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం రద్దీ నెలకొంది. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. అదే ముహూర్తాలకు వివిధ ప్రాంతాలలో వివాహాలు చేసుకున్నవారు కూడా సత్యదేవుని సన్నిధికి తరలివచ్చారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో రద్దీ పెరిగింది. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు.

28 నుంచి రోజా దర్గా ఉరుసు

కర్నూలు (టౌన్) : తుంగభద్ర నది తీరంలో వెలసిన రోజా దర్గా ఉరుసు ఈనెల 28 నుంచి ప్రారంభమవుతుందని ఆ దర్గా పీఠాధి పతి సయ్యద్ దాదా బాషా ఖాద్రీ తెలిపారు. సోమవారం ఆ దర్గాలో ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ మాసంలో నెలవంక రోజు గంథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఫిబ్రవరి నెల 28 న గంథోత్సవం, మార్చి 1వ తేదీన ఉరుసు, 2 వ తేదీ జియారత్ ఫాతెహాలు ఉంటాయన్నారు.

రమణీయం..రథోత్సవం

కోసిగి: కర్నూలు జిల్లా కోసిగి గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవి మహా రథోత్సవం సోమవారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. వేకువ జామున అమ్మ వారికి విశేష పూజలు చేపట్టి మహామంగళ హారతులు గావించి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామున నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టారు. కోసిగితో పాటు జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



సమ్మె విరమించే ప్రసక్తేలేదు

తిరుపతి సిటీ: సమ్మె విరమించేది లేదని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాలు భీష్మించుకున్నారు. ఆదివారం మంత్రి లోకేష్‌కు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో కలసి వినతిపత్రం సమర్పించిన జూడాలు శాంతించలేదు. గౌరవ వేతనం పెంచేవరకు సమ్మె నుంచి తగ్గేదేలేదని హెచ్చరిస్తున్నారు. సోమవారం 15వ రోజు సమ్మెలో భాగంగా వర్సిటీలో వైఎస్సార్ పరిపాలనా భవనాన్ని మరోమారు ముట్టడించారు.

వేమన పద్యాలతో జీవితం సార్థకం

తిరుపతి సిటీ: వేమన పద్యాలు నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి ఆచరించదగినవని, వీటితో జీవితం సార్థకమవుతుందని వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వర్సిటీ సెనేట్ హాల్లో సోమవారం వేమన శూన్యవాదం అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన వక్త విశ్రాంత ఆచార్యులు శివారెడ్డి మాట్లాడుతూ వేమన సాహిత్యంలో శూన్యవాదం గురించి వివరిస్తూ ప్రస్తుత భౌతిక శాస్త్రంలో ఆచరిస్తున్న క్వాంటం ఫిజిక్స్‌కి ప్రతిరూపమన్నారు. వేమన పద్యాలు జాతి, కుల, మత భేదాలు లేకుండా దక్షిణ భారతంలో తెలుగు, తమిళంశ కన్నడ, కేరళ, సింహాలం భాషల్లోనూ, సంప్రదాయాల్లోనూ ఇప్పటికీ కొనసాగుతున్నాయని చెప్పారు.

ఎల్‌ఎల్‌ఎమ్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన ఎల్‌ఎల్‌ఎమ్ వైవా, డెమోకు సంబంధించిన ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం దామ్లా నాయక్ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పరిశోధనలో పరస్పర సహకారం

తిరుపతి సిటీ: పరిశోధనలో ఎస్వీయూ, అమెరికాలోని పార్డు యూనివర్సిటీ పరస్పర సహకారం అందించుకోనున్నట్లు యూఎస్‌ఏ ప్రతినిధి జూలియానా కస్తవస్ తెలిపారు. ఆమె సోమవారం ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించారు. ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు, ఇతర ప్రొఫెసర్లతో ఆమె సమావేశమయ్యారు. గతంలో వర్సిటీతో తమ యూనివర్సిటీ ఎంఓయూ చేసుకుందనీ, ఈ ప్రకారం బోధన, పరిశోధన విషయాల్లో పరస్పరం సహకారం ఉంటుందని తెలిపారు.

కొందరికి మల విసర్జన ద్వారం వద్ద సన్నటి పగులు ఏర్పడుతుంది. ఈ పగులునే 'యానల్ ఫిషర్ లేదా ఫిషర్ ఇన్ ఏనో' అంటారు. ప్రతి 350 మందిలో ఒకరికి వచ్చే ఈ వ్యాధి సాధారణంగా 15 నుంచి 40 ఏళ్ల స్త్రీ, పురుషుల్లో కనిపిస్తుంది. ఇది చెప్పలేనంత నొప్పితో తీవ్రంగా బాధిస్తుంది. తమ బాధను ఎవరితోనైనా చెప్పుకోడానికీ, ఆ పగులును ఎవరికైనా చూపించడానికీ, బిడియం అడ్డువస్తుంది. తొలిదశలో చికిత్స తీసుకోకపోతే మరింత లోపలికి చీరుకుపోయి వేధిస్తూ ఉండే 'యానల్ ఫిషర్' గురించి తెలుసుకుందాం...



● ఫిషర్ ప్రెషర్ వద్దు

తప్ప లేదు చెప్పకుందాం...

కారణాలు

● నిజానికి మలద్వారమిలా చీరుకుపోయి ఫిషర్ ఏర్పడటానికి కారణాలేమిటన్నది ఇంకా పెద్దగా ఎవరికీ తెలియదు. అయితే మలవిసర్జన సమయంలో ఈ చీలిక మరింతగా ఒరుసుకుపోయేలా మలం బయటికి వస్తుండటం వల్ల తీవ్రమైన నొప్పి కలగడం వల్ల దీని ఉనికి తెలుస్తుంది.

● తాము తీసుకునే ఆహారంలో ముదురాకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలు, తాజాపండ్ల వంటి పీచు (ఫైబర్)ను పుష్కలంగా కలిగి ఉంటే ఆహార పదార్థాలు తక్కువగా తీసుకుంటూ ఉండటం వల్ల కూడా ఫిషర్ ఏర్పడుతుందని అనేక అధ్యయనాల్లో నిర్ధారణ అయ్యింది.

● మలద్వారం వద్ద ఉండే కండరాలు కొన్ని సందర్భాల్లో మందంగా, గట్టిగా మారడం వల్ల మలవిసర్జన సాఫీగా జరగదు. ఈ క్రమంలో మలం మందంగా, గట్టిగా మారిన కండరాలను బలంగా ఒరుసుకుంటూ బయటకు వస్తుంది. అలా ఒత్తిడితో బలంగా బయటకు వచ్చే క్రమంలో మొదట చిన్న చిరుగు, ఆ తర్వాత చీలిక ఏర్పడటం, ఆ తర్వాత అది మరింత విస్తరించడం వల్ల యానల్ ఫిషర్ రావచ్చు.

● మలబద్ధకం కారణంగా కొందరు ముక్కుతూ ముక్కుతూ మల విసర్జన చేస్తుంటారు. మలబద్ధకం కారణంగా మలాశయం దగ్గర మలం చాలా గట్టిగా (ఫీకోలిథ్‌గా) మారడం వల్ల ఇలా ముక్కాల్సి వస్తుంటుంది. ఇలా మలం గట్టిగా రాయిలా మారడం వల్ల కూడా మల విసర్జన సమయంలో ఆ ప్రాంతం చీరుకుపోవచ్చు.

● మరికొందరిలో దీర్ఘకాలం పాటు నీళ్లవిరేచనాలు అవుతుండటం వల్ల... చాలా కాలం పాటు ఆ ప్రాంతం తడిగానూ, తేమగానూ ఉండటంతో ఆ ప్రాంతానికి రక్తసరఫరా తగ్గడం వల్ల కూడా ఫిషర్ ఏర్పడవచ్చు.

● మల విసర్జన జరిగిన తర్వాత... ఇక అక్కడి నుంచి మలం మళ్లీ లీక్ కాకుండా ఉండేందుకు మలద్వారాన్ని చాలా గట్టిగా మూసుకుపోయేలా చేసే స్పింక్టర్ కండరాలు మలద్వారం చుట్టూతా ఉంటాయి. ఈ స్పింక్టర్ కండరాల వల్లనే... మల విసర్జన తర్వాత మళ్లీ ఇంకోసారి మల విసర్జనకు వెళ్లే వరకు ఎలాంటి మలమూ లీక్ కాదు. అయితే ఏదైనా కారణం వల్ల కొందరిలో మలద్వార ప్రాంతంలో శస్త్రచికిత్స జరిగిన తర్వాత స్పింక్టర్‌కు గాయం కావచ్చు లేదా మలద్వారం ఉండాల్సిన రీతిలో కాకుండా సన్నబడిపోవచ్చు. ఇలా సన్నబడిపోవడాన్ని స్టెనోసిస్ అంటారు. ఇలా జరిగినప్పుడు ఆ సన్నబడ్డ ద్వారం నుంచి మలం బయటకు రావాలంటే చాలా బలంగా ఒత్తిడి కలిగించాల్సి వస్తుంది. ఈ కారణంగా మలద్వారం చీరుకుపోయి ఫిషర్‌కు దారితీసే ప్రమాదం ఉంది.

● కొన్ని సందర్భాల్లో దీర్ఘకాలిక టీబీ, ల్యూకేమియా, క్యాన్సర్లు, ఎయిడ్స్ వంటి జబ్బుల కారణంగా దీర్ఘకాలంలో మలవిసర్జన ప్రాంతంలో ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడటం, అది క్రమంగా ఫిషర్‌కు దారితీయడం కూడా జరగవచ్చు.

● సెక్స్ ద్వారా సంక్రమించే వ్యాధులు (ఎస్‌టీడీలు) సోకినప్పుడు అవి క్రమంగా ముదిరి కొంతకాలం తర్వాత ఫిషర్‌కు దారితీయవచ్చు. ఉదాహరణకు సిఫిలిస్, హెర్పిస్ సింప్లెక్స్ వైరస్, క్లమీడియా వంటి వ్యాధులు మలవిసర్జన ద్వారానికీ విస్తరించడం వల్ల అక్కడ పగుళ్లు రావడం, చీరుకుపోవడంతో ఫిషర్ ఏర్పడవచ్చు.

● గర్భవతులైన మహిళల్లో ప్రసవం సమయంలో మలద్వారం చీరుకుపోయి ఫిషర్ రావచ్చు.

● కొందరిలో క్రోన్స్ డిసీజ్, మాటిమాటికీ మలవిసర్జనకు వెళ్లాల్సి వచ్చే అల్సరేటివ్ కొలైటిస్, మలవిసర్జన తర్వాత మలద్వార ప్రాంతాన్ని శుభ్రంగానూ, పొడిగానూ ఉంచుకోకపోవడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత విధానాలు పాటించకపోవడంతో (పూర్ టాయిలెటింగ్ హ్యాబిట్స్) కూడా ఫిషర్ ఏర్పడవచ్చు.

యానల్ ఫిషర్ అంటే...

మలద్వారం వద్ద చిన్న పగులులా కనిపించే యానల్ ఫిషర్...తన తొలి దశలో మలద్వారం అంచున చిన్న చిరుగులా కనిపిస్తుంది. అంటే తొలి దశలో ఇది కేవలం చర్మం తాలూకు పైపొరకు (ఎపిథీలియమ్‌కు) మాత్రమే పరిమితమై ఉంటుంది. ఆ దశలో ఎలాంటి చికిత్సా తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే క్రమంగా అది అక్కడి మృదువైన లోపలి పొరల్లోకి (మ్యూకస్ మెంబ్రేన్‌లలోకి) పగుళ్లు ఏర్పడేలా చీరుకుపోయే ప్రమాదం ఉంది.

ఫిషర్‌లలో రకాలు...

ఫిషర్ ఏర్పడిన వ్యవధిని బట్టి దీన్ని రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటిది అప్పటికప్పుడు కనిపించే అక్యూట్ ఫిషర్.
రెండోది దీర్ఘకాలం పాటు కొనసాగుతూ బాధించే క్రానిక్ ఫిషర్.

అక్యూట్ ఫిషర్

ఇందులో తొలుత మలద్వారం బయటి చర్మం చీరుకుపోయినట్లుగా అవుతుంది. ఆ తర్వాత అక్కడి మెత్తటి కణజాలం పొరల (మ్యూకోజా)లో కూడా పగుళ్లు ఏర్పడినట్లు అవుతుంది. ఒకవేళ ఈ ఫిషర్‌కు తగిన చికిత్స తీసుకోకుండా అలాగే వదిలేసి, అలా చాలా కాలం పాటు ఉంటే అదే దీర్ఘకాలం కొనసాగే ఫిషర్ (క్రానిక్ ఫిషర్)గా రూపొందవచ్చు.

క్రానిక్ ఫిషర్

ఇది దీర్ఘకాలం పాటు కొనసాగే ఫిషర్. ఇలా చాలాకాలం పాటు కొనసాగే క్రానిక్ ఫిషర్‌లో కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు కనిపిస్తుంటాయి. ఉదాహరణకు మలద్వారాన్ని గట్టిగా, బలంగా మూసుకుపోయేలా చేసే స్పింక్టర్ కండరాలు చీరుకుపోయినట్లుగా కనిపిస్తుంటాయి. ఫిషర్ చివరల్లో మలద్వారం వద్ద చీరుకుపోయిన చోట కండ పెరిగినట్లుగా ఉండి, దాని చివరభాగం బయటకు తోసుకొచ్చినట్లుగా కనిపిస్తుంది.



నిర్ధారణ

క్లినికల్‌గా తెలుసుకునే ప్రక్రియలో... బాధితుల వ్యాధి చరిత్రను (డిసీజ్ హిస్టరీని) అడిగి తెలుసుకోవడం, విసర్జన ద్వారం ఉన్న ప్రాంతాన్ని జాగ్రత్తగా పరిశీలించడం ద్వారా ఫిషర్‌ను నిర్ధారణ చేయవచ్చు. ఒక్కోసారి ఆ ప్రాంతంలో నిశితంగా చూసినా కూడా ఫిషర్ కనిపించకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో ఆ ప్రాంతంలో పూతమందు రూపంలో లభ్యమయ్యే నొప్పి, స్పర్శ తెలియనివ్వని మత్తు మందును (లోకల్‌గా ఇచ్చే టాపికల్ అనస్థీషియా) అక్కడ పూసి పరిశీలించాల్సిన అవసరం ఏర్పడవచ్చు.

ఇక మలద్వారం నుంచి రక్తస్రావం అయ్యేవారిలో... ఆ ప్రాంతంలో సిగ్మాయిడోస్కోపీతో పరీక్షించాల్సిన అవసరం ఏర్పడవచ్చు. సాధారణంగా బాధితులు 50 ఏళ్లలోపు వారైతే ఈ పరీక్ష అవసరమవుతుంది. యాభై ఏళ్లు దాటిన కొందరిలో ఒకవేళ వాళ్ల కుటుంబాల్లో మలద్వార క్యాన్సర్ ఉన్న కుటుంబ చరిత్ర ఉన్నవారైతే వారి పెద్దపేగునంతా పరిశీలించడానికి డాక్టర్లు కొలనోస్కోపీ అనే పరీక్షను చేసే అవకాశం ఉంది.

అయితే ఇవన్నీ వెంటనే కాకుండా కొంతకాలం మందులు ఇచ్చి చూసి, మెరుగుదల కనిపించడాన్ని బట్టి అవసరమైతే పైన పేర్కొన్న పరీక్షలను చేయాల్సి రావచ్చు. ఇక కొందరిలో మలద్వారం స్పింక్టర్ మూసుకుపోయేందుకు కలిగే ఒత్తిడి ఎంత ఉందో పరిశీలించేందుకు 'యానోరెక్టల్ మ్యానోమెట్రీ' అనే పరీక్షనూ చేయాల్సి రావచ్చు.

ఫిషర్‌ను నివారించడం ఇలా...

ఫిషర్ కేవలం నొప్పిని కలిగించేదే కాదు... అది సామాజికంగానూ చాలా ఇబ్బందిని కలిగించే సమస్య. ఎవరికైనా చూపించుకోవాలన్నా, నలుగురితో బాధ పంచుకోవాలన్నా చాలా కష్టం. అందుకే వచ్చాక దీనికి చికిత్స చేయించుకోవడం కంటే అసలు రాకుండానే నివారించుకోవడం చాలా మంచిది. ఫిషర్‌ను నివారించుకోవడం చాలా సులువు కూడా. నివారణ మార్గాలివి...

● ఆహారంలో తేలిగ్గా జీర్ణమయ్యే పీచు (సొల్యుబుల్ ఫైబర్) ఎక్కువగా ఉండే ఆకుకూరలు, తాజా పండ్లు వంటివి ఎక్కువగా తీసుకోవడం, రోజులో ఎక్కువ సార్లు మంచినీళ్లు తాగుతూ ఉండటం.

● మలం గట్టిగా మారడానికి తోడ్పడే ఆహారపదార్థాలైన మసాలాలూ, మాంసాహారం, పచ్చళ్లను బాగా తగ్గించుకోవడం.

● మాటిమాటికీ నీళ్ల విరేచనాలు అవుతున్నవారు, ఇలా తరచూ ఎందుకు జరుగుతుందన్న విషయాన్ని డాక్టర్‌ను సంప్రదించి తెలుసుకుని తగిన చికిత్స తీసుకోవడం.

● మలవిసర్జన తర్వాత ఆ ప్రాంతాన్ని చక్కగా శుభ్రం చేసుకోవడం, పొడిగా ఉంచుకోవడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్) విధానాలను పాటించడం.

● మలవిసర్జన తర్వాత టాయిలెట్ పేపర్‌తో శుభ్రపరచుకునే వారు చాలా మృదువైన వాటినే ఉపయోగించడం.

● ఒకవేళ అప్పటికే చిన్నపాటి ఫిషర్ ఉన్నవారు మలవిసర్జన సాఫీగా జరిగేలా అక్కడ ఒరిపిడిని తగ్గించే ల్యూబ్రికేటింగ్ ఆయింట్‌మెంట్స్ వాడటం... లాంటి నివారణ చర్యలు తీసుకోవడం అవసరం.



డాక్టర్ ముస్తఫా హుస్సేన్ రజ్వీ
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్

* * *

లక్షణాలు

● మలవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి వస్తుంది. ఇలా వచ్చిన నొప్పి మల విసర్జన తర్వాత కూడా కొద్ది గంటల సేపు బాధిస్తూనే ఉంటుంది. ఈ నొప్పి మలవిసర్జనకు వెళ్లిన ప్రతిసారీ తిరగబెడుతుంటుంది. దీంతో మలవిసర్జనకు వెళ్లాలంటేనే బాధితులు తీవ్రమైన ఆందోళనకు గురై, మలవిసర్జనకు వెళ్లడానికి విముఖత చూపుతారు. దాంతో మలబద్ధకం ఏర్పడి, మలవిసర్జన క్రమం (సైకిల్) దెబ్బతినవచ్చు. పైగా మలవిసర్జనకు వెళ్లడానికి విముఖత చూపుతూ... మాటిమాటికీ ఆపుకోవడం వల్ల మలం మరింత గట్టిగా మారి, మలవిసర్జన ప్రక్రియ మరింత బాధాకరంగా మారుతుంది.

● చాలా మంది బాధితుల్లో మల విసర్జన జరిగినప్పుడు రక్తస్రావం కావడం లేదా ప్రక్షాళన సమయంలో చేతికి లేదా టాయిలెట్ పేపర్‌కు రక్తం అంటుకుంటుంది. అయితే ఫిషర్ విషయంలో చాలా ఎక్కువ రక్తస్రావం జరగదు. కాస్తంత రక్తం మాత్రమే కనిపించి, మలద్వార ప్రాంతంలో దురదగా (ప్రూరిటస్ యానీ) అనిపించవచ్చు. ఇక మరికొందరిలో మలద్వారం వద్ద దుర్వాసనతో కూడా స్రావాలూ కనిపించవచ్చు.

● కొంతమందిలో మూత్ర విసర్జన కూడా నొప్పిగా ఉంటుంది. కొందరిలోనైతే ఒక్కోసారి అసలు మూత్ర విసర్జన జరగడమే కష్టంగా అనిపించవచ్చు.

చికిత్స

అక్యూట్ ఫిషర్‌ను కనుగొన్నప్పుడు... నేరుగా ఫిషర్‌కే చికిత్స అందించడం కాకుండా... దాదాపు 80 శాతం సందర్భాల్లో... అసలు ఫిషర్ ఏర్పడటానికి కారణమైన అంశాలను నివారించడానికే చికిత్స చేస్తుంటారు. ఇందుకోసం తొలుత మలబద్ధకాన్ని నివారించే మందుల్ని సూచించడం, మలాన్ని మృదువుగా మార్చే మందులు వాడటం, మలవిసర్జన సమయంలో కలిగే నొప్పిని తగ్గించే మందులు ఇవ్వడం లాంటి చికిత్సలు అందిస్తారు. అలాగే మలవిసర్జన సాఫీగా జరిగేలా పేగు కదలికలు (బవెల్ మూవ్‌మెంట్స్) క్రమబద్ధంగా జరిగేలా చూసే మందులిస్తారు.

● ఇక మొదటిదశ చికిత్స (ఫస్ట్ లైన్ ట్రీట్‌మెంట్)గా మలం మృదువుగా మారేలా స్టూల్ సాఫ్టెనర్స్ ఇస్తారు. మలవిసర్జన తర్వాత తగినంత గోరువెచ్చని నీటితో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసుకోవాలని సూచించి, అక్కడ నొప్పిని తగ్గించడం, స్పింక్టర్ గట్టిగా బిగుసుకుపోవడాన్ని (స్పింక్టర్ స్పాజమ్) నిరోధించడానికి అవసరమైన జాగ్రత్తల్ని సూచిస్తారు.

ఇలా ఫిషర్‌కు అందించే మొదటి దశ చికిత్స (ఫస్ట్ లైన్)ను నిర్లక్ష్యం చేసేవాళ్లలో 30% నుంచి 70 % మందిలో అది మళ్లీ తిరగబెట్టే అవకాశాలే ఎక్కువ. ఒక ప్రధాన సూచన ఏమిటంటే... కేవలం పీచు పదార్థాలు పుష్కలంగా ఉన్న ఆహారాలు తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడమనే చిన్న సూచనల ద్వారానే ఈ వ్యాధి తిరగబెట్టడాన్ని 15% నుంచి 20% కి తగ్గించవచ్చు.

● ఇక రెండోదశ చికిత్సగా (సెకండ్ లైన్ ఆఫ్ ట్రీట్‌మెంట్) మలద్వారం లోపలికి 0.4% నైట్రోగ్లిజరిన్ వంటి మందులతో పాటు గ్లిజెరాల్ ట్రినైట్రేట్ ఆయింట్‌మెంట్ వంటివి స్పింక్టర్ లోపల పూతమందుగా వాడాల్సి ఉంటుంది. నిఫెడిపైన్ ఆయింట్‌మెంట్, డిల్టియాజెమ్ ఆయింట్‌మెంట్ వంటి పూతమందులు కూడా బాగానే పని చేస్తాయి.

ఇతర చికిత్సా ప్రక్రియలు

ఇప్పుడు దీర్ఘకాలిక ఫిషర్ వ్యాధికి కొత్తగా బొటాక్స్ చికిత్స కూడా చేస్తున్నారు. ఇందులో బోట్యులినమ్ టాక్సిన్ అనే ఇంజెక్షన్‌ను స్పింక్టర్‌లోకి ఇస్తారు. దీని ప్రభావం దాదాపు మూడు నెలల వరకు ఉంటుంది.

శస్త్ర చికిత్స ప్రక్రియలు

అక్యూట్ ఫిషర్‌కు మందులను 3 నుంచి 4 వారాల పాటు వాడినా పెద్దగా గుణం కనిపించని సందర్భాల్లోనూ లేదా యానల్ ఫిషర్ దీర్ఘకాలిక ఫిషర్ (క్రానిక్)గా మారినప్పుడు శస్త్రచికిత్స (సర్జరీ) అవసరం పడవచ్చు. ఆ సర్జరీ విధానాలివి...

● **స్పింక్టర్ డయలేషన్ :** ఈ సమస్యకు చేసే శస్త్రచికిత్సలో దేహానికంతటికీ మత్తు (జనరల్ అనస్థీషియా) ఇచ్చి సర్జరీ నిర్వహిస్తారు. ఇందులో మలద్వారాన్ని గట్టిగా మూసుకుపోయేలా చేసే స్పింక్టర్‌ను వెడల్పు చేస్తారు. నిజానికి ఈ ప్రక్రియను చాలామంది డాక్టర్లు అంతగా సిఫార్సు చేయరు. ఎందుకంటే ఈ తరహా శస్త్రచికిత్స తర్వాత చాలామంది మలనియంత్రణపై అదుపు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే ఈ తరహా శస్త్రచికిత్స నిర్వహించాలంటే సర్జన్‌కు చాలా మంచి నైపుణ్యం ఉండాలి.

● **ల్యాటరల్ ఇంటర్నల్ స్పింక్టరెక్టమీ :** ఈ శస్త్రచికిత్సను కూడా దేహమంతటికీ పూర్తి మత్తు (జనరల్ అనస్థీషియా) ఇవ్వడం ద్వారా... లేదా వెన్నెముకకు మత్తుమందు (స్పైనల్ అనస్థీషియా) ఇవ్వడం ద్వారా చేస్తారు. ఇందులో స్పింక్టర్‌లో గట్టిబారిన కండర ప్రాంతాన్ని (హైపర్‌ట్రొఫాయిడ్ ఇంటర్నల్ స్పింక్టర్‌ను) జాగ్రత్తగా ఒలిచినట్లుగా తొలగిస్తారు. దాంతో స్పింక్టర్ కండరం తన బిగుతును కోల్పోయి మునుపటిలా మృదువుగా మారుతుంది. ఫలితంగా మల విసర్జన సమయంలో ఒరిపిడి తగ్గి, మలద్వారం వద్ద ఉన్న పగులు/చిరుగు క్రమంగా తగ్గిపోతుంది.

శస్త్రచికిత్స వల్ల కలిగే దుష్పరిణామాలు (సైడ్ ఎఫెక్ట్స్) : ఫిషర్‌కు శస్త్రచికిత్స వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు కొన్ని దుష్పరిణామాలను కూడా తెలుసుకోవడం మంచిది. సాధారణంగా ఫిషర్‌కు శస్త్రచికిత్స చేశాక, ఆ ప్రాంతమంతా గాలిసోకని విధంగా, అవయవాల ముడుతల్లో ఉంటుంది కాబట్టి అక్కడ ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఎక్కువ. ఒక్కోసారి శస్త్రచికిత్స తర్వాత రక్తస్రావమూ కావచ్చు. ఫిషర్ క్రమంగా లోపలివైపునకు సాగుతూ పేగుల్లో పొడుగాటి పైపులా పాకుతూ... 'ఫిస్టులా' అనే కండిషన్‌కూ దారితీయవచ్చు.

ఇక అన్నింటికంటే ప్రమాదకరమైన పరిస్థితి ఏమిటంటే...

శస్త్రచికిత్స తర్వాత కొందరిలో మలాన్ని లోపలే పట్టిఉంచేలా చేసే నియంత్రణ శక్తి కోల్పోయి... అక్కడి నుంచి కొద్దికొద్దిగా మలం బయటకు వస్తూ ఉండవచ్చు. దీన్నే 'ఫీకల్ ఇన్‌కాంటినెన్స్' అంటారు. శస్త్రచికిత్స తర్వాత ఈ ఇన్‌కాంటినెన్స్ వస్తే అది మరింత ఇబ్బందికరం. కాబట్టి ఇలాంటి శస్త్ర చికిత్సలు అవసరమైనప్పుడు అత్యంత నిపుణులైన సర్జన్‌ల ఆధ్వర్యంలోనే ఈ శస్త్రచికిత్సలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఫిషర్ సర్జరీ విషయంలో మరో ముప్పు...

ఫిషర్ సమస్యను తగ్గించడానికి చేసే సర్జరీ విజయవంతమైతే ఎలాంటి ఇబ్బందీ ఉండదుగానీ... ఆరు శాతం కేసుల్లో మాత్రం శస్త్రచికిత్స తర్వాత కూడా ఫిషర్ మళ్లీ తిరగబెట్టే అవకాశముంటుంది. ఈ ముప్పను గుర్తుంచుకోవడం మంచిది. ఫిషర్ అనేది ఇటు వ్యక్తిగతంగానూ, అటు సామాజికంగా నలుగురితో కలుస్తుండాన్ని నిరోధిస్తూ... ఇలా అన్ని విధాలా ఇబ్బంది కలిగించే సమస్య. శస్త్రచికిత్స తో నయం చేసుకోవాలనుకున్నా అప్రయత్నంగా, శస్త్రచికిత్సకుల ప్రమేయం లేకుండా కూడా మళ్లీ మళ్లీ తిరగబెట్టేందుకు ఎక్కువ అవకాశమున్న ఇబ్బంది ఇది. చికిత్స కంటే నివారణ మేలు అన్న సూక్తి అన్నిటికంటే ఈ సమస్యకే ఎక్కువగా వర్తిస్తుంది. పైగా చికిత్స కంటే నివారణ చాలా సులువు కూడా. కాబట్టి తేలిగ్గా నివారించే మార్గాలైన... వేళకు భోజనం చేయడం, పీచు (ఫైబర్) పుష్కలంగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం, నీళ్లు ఎక్కువగా తాగడం వంటి మంచి ఆహారపు అలవాట్లతోనూ, మలద్వారం వద్ద వ్యక్తిగత పరిశుభ్రత (పర్సనల్ హైజీన్) పాటించడం వంటి మంచి టాయిలెట్ అలవాట్లతోనే ఈ సమస్య నివారణ చాలా తేలిగ్గా జరుగుతుంది. కాబట్టి ఈ మార్గాలను అనుసరిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలితో (ఆహారపు అలవాట్లు, కొద్దిగా తేలికపాటి వ్యాయామాలతో) అసలు ఫిషర్ అనే సమస్యే దరిచేరకుండా నివారించవచ్చని తెలుసుకోవడం మేలు. ఈ ఆరోగ్యకరమైన జీవనశైలి కేవలం ఫిషర్‌నే కాదు... అనేక ఇతర ఆరోగ్యసమస్యలనూ నివారిస్తుందని గుర్తుంచుకోవడం మరీ మంచిది.

సాక్షి ప్లస్
మంగళవారం । 18-2-2025

బిజినెస్ రీల్

రూ.1,200 తగ్గిన బంగారం ధర

- 10 గ్రాములకు రూ.88,200
- గరిష్టాల వద్ద అమ్మకాలు



న్యూఢిల్లీ: గరిష్ట స్థాయిల వద్ద అమ్మకాలతో బంగారం ధర దిగొచ్చింది. గత శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.1,300 ర్యాలీ చేసి రూ.89,400 వద్ద స్థిర పడగా.. సోమవారం రూ.1,200 పడిపోయి రూ.88,200కు పరిమితమైంది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం ఇంతే నష్టంతో రూ.87,800 వద్ద ఉంది. జ్యుయలర్ల నుంచి డిమాండ్ తగ్గిందని.. స్టాకిస్టులు, రిటైలర్ల నుంచి అమ్మకాలు ఎదురైనట్టు ఆల్ ఇండియా సఫారా అసోసియేషన్ ప్రకటించింది. వెండి ధర కిలోకి రూ.1,800 నష్టంతో రూ.98,200కు దిగొచ్చింది. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌లో భిన్నమైన పరిస్థితి కనిపించింది. బంగారం ఏప్రిల్ డెలివరీ కాంట్రాక్టు రూ.431 లాభపడి రూ.85,118కు చేరుకుంది. వెండి కాంట్రాక్ట్ రూ.234 నష్టంతో రూ.95,800 వద్ద ఉంది. మరోవైపు అంతర్జాతీయంగా కామెక్స్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ బంగారం అర డాలర్ పెరిగి 2,896.68 డాలర్ల వద్ద ఉంది.

పెనాల్టీలు వేయాల్సింది టెల్కోలపై కాదు: సీఓఏఐ



న్యూఢిల్లీ: స్పామ్ కాల్స్, మెసేజ్‌లను కట్టడి చేయడానికి టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ కొత్త నిబంధనలతో టెల్కోలకు పెనాల్టీలు గణనీయంగా పెరిగాయని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఓటీటీ కమ్యూనికేషన్ సర్వీసెస్‌కు ఎటువంటి నియంత్రణ లేకపోవడం వల్ల స్పామ్ సంఖ్య పెరుగుతోందని వెల్లడించింది. 'టెలికం ఆపరేటర్లు స్పామ్ కాల్స్, మెసేజ్‌లను అరికట్టడానికి పుష్కలంగా చర్యలు తీసుకున్నాయి. అయాచిత కమ్యూనికేషన్ల పరిమాణంలో గణనీయ పెరుగుదల, అలాగే న్యాయబద్ధ వాణిజ్య కమ్యూనికేషన్ అంతా ఓటీటీ కమ్యూనికేషన్ యాప్‌లకు మారింది. ఇది దేశంలో ఆర్థిక నేరాల పెరుగుదలకు దారితీసింది. టెలికం సర్వీస్ ప్రొవైడర్లపై పెనాల్టీలు ఏ ప్రయోజనాన్ని అందించవు. అవసరమైతే టెలిమార్కెటర్ డెలివరీ కంపెనీలు లేదా వాణిజ్య సమాచార ప్రసారాల వాస్తవ రూపకర్తలు, లబ్ధిదారులైన ప్రధాన సంస్థలపై ఈ పెనాల్టీలు వేయాలి' అని సీఓఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్.పి.కొచ్చర్ అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-2-2025

విశాఖ	435-00
చిత్తూరు	468-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,237.30	3.93
BAJAJFINSV	1,890.05	2.65
INDUSINDBK	1,050.30	2.53
POWERGRID	263.1	2.23
ADANIPORTS	1,085.10	2.11

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,841.00	-3.45
BHARTIARTL	1,676.50	-2.36
INFY	1,843.05	-0.72
TCS	3,908.00	-0.68
ICICIBANK	1,251.65	-0.67

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,727
ఎన్ఎస్ఈ	82,681
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,60,082
ఎఫ్ఐఐ	- 3,938
డీఐఐ	+ 4,760

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.30 (రాత్రి 11.30కు)	$ 70.71 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.28 (రాత్రి 11.30కు)	$ 74.80 (క్రితం ముగింపు)

మూడో నెలా ఎగుమతులు డౌన్

- జనవరిలో 2.38 శాతం క్షీణత; 36.43 బిలియన్ డాలర్లకు పరిమితం
- 23 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్య లోటు
- పెట్రోలియం ధరల్లో హెచ్చుతగ్గులు, గ్లోబల్ అనిశ్చితులు కారణం



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితి, పెట్రోలియం ధరల్లో తీవ్ర ఒడిదుడుకులతో వరుసగా మూడో నెలా భారత ఎగుమతులు క్షీణించాయి. జనవరిలో 2.38 శాతం తగ్గి 36.43 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. మరోవైపు, దిగుమతులు 10 శాతం పెరిగి 59.42 బిలియన్ డాలర్లకు చేరడంతో వాణిజ్య లోటు సుమారు 23 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో ఎగుమతులు 1.39 శాతం పెరిగి 358.91 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 7.43 శాతం పెరిగి 601.9 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 242.99 కోట్లుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ ఇటు ఉత్పత్తులు, అటు సర్వీసుల ఎగుమతుల్లో భారత్ మెరుగ్గానే ఉంటోందని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాల్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఫార్మా, బియ్యం, రత్నాభరణాల్లాంటి రంగాలు జనవరిలో మెరుగైన వృద్ధి రేటు సాధించినట్లు వివరించారు. 2024-25లో భారత్ ఎగుమతులు 800 బిలియన్ డాలర్ల స్థాయిని దాటగలవని ధీమా వ్యక్తం చేశారు. 2023-24లో ఇవి 778 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

అమెరికాకు ఎగుమతులు 39 శాతం అప్..

వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం జనవరిలో కీలక వాణిజ్య భాగస్వామి అమెరికాకు ఎగుమతులు 39 శాతం పెరిగి 8.44 బిలియన్ డాలర్లకు చేరగా, దిగుమతులు 33 శాతం పెరిగి 3.57 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో ఎగుమతులు సుమారు 9 శాతం వృద్ధి చెంది 68.46 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. 2023-24లో భారత్‌కి అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలిచింది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 119.71 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో 77.51 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు ఉండగా, 42.19 బిలియన్ డాలర్ల దిగుమతులు నమోదయ్యాయి. అమెరికాతో భారత్‌కి 35.31 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు నమోదైంది. ఇరు దేశాలు 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న సంగతి తెలిసిందే.

పసిడి దిగుమతులు 41 శాతం అప్..

- దేశీయంగా డిమాండ్ నెలకొనడంతో జనవరిలో బంగారం దిగుమతులు 41% పెరిగి 2.68 బిలియన్ డాలర్లకు చేరాయి. గత జనవరిలో వీటి విలువ 1.9 బిలియన్ డాలర్లు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో పసిడి దిగుమతులు 32 శాతం పెరిగి 37.85 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 50 బిలియన్ డాలర్లకు చేరాయి. సురక్షిత సాధనంగా బంగారంపై నమ్మకం, అంతర్జాతీయంగా అనిశ్చితుల వల్ల ఇన్వెస్టర్లు డైవర్సిఫికేషన్‌కి ప్రాధాన్యం ఇస్తుండటం, బ్యాంకుల నుంచి డిమాండ్ పెరగడం, కస్టమ్స్ సుంకాల తగ్గింపు మొదలైన అంశాలు పసిడి దిగుమతులు పెరగడానికి కారణమయ్యాయి.
- జనవరిలో క్రూడాయిల్ దిగుమతులు 16.56 బిలియన్ డాలర్ల నుంచి 13.43 బిలియన్ డాలర్లకు తగ్గాయి.
- రత్నాభరణాల ఎగుమతులు 16 శాతం పెరిగి 3 బిలియన్ డాలర్లకు చేరగా, వెండి దిగుమతులు 83% పెరిగి 883 మిలియన్ డాలర్లకు చేరాయి.
- జనవరిలో సర్వీసుల ఎగుమతుల విలువ 31.01 బిలియన్ డాలర్ల నుంచి 38.55 బిలియన్ డాలర్లకు పెరిగాయి. సర్వీసుల దిగుమతులు 14.84 బిలియన్ డాలర్ల నుంచి 18.22 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 59 శాతం క్షీణించి 3.56 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.
- కమోడిటీలు, మెటల్ ధరల్లో హెచ్చుతగ్గులతో పాటు టారిఫ్ యుద్ధాలు తదితర అంశాల కారణంగా ఎగుమతులపై ప్రభావం పడినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈఓ) ప్రెసిడెంట్ అశ్వని కుమార్ తెలిపారు. అయితే, వాణిజ్య లోటు, దిగుమతులు పెరగడమనేది దేశీ పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపవచ్చనే ఆందోళన నెలకొందని వివరించారు.

చర్చల తర్వాతే అమెరికాతో ఒప్పందంపై స్పష్టత

- ఇందుకు కొన్ని వారాల సమయం పడుతుంది
- వాణిజ్య శాఖ అదనపు సెక్రటరీ అగర్వాల్



న్యూఢిల్లీ: ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం విషయమై భారత్, అమెరికా రానున్న వారాల్లో విస్తృత సంప్రదింపులు నిర్వహించాల్సి ఉందని, ఆ తర్వాతే తుది రూపుపై స్పష్టత వస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి రాజేష్ అగర్వాల్ తెలిపారు. ప్రధాని మోదీ ఇటీవలి అమెరికా పర్యటన సందర్భంగా.. రెండు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేసుకోవాలని (500 బిలియన్ డాలర్లు), పరస్పర ప్రయోజనాలతో మొదటి దశ వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత ముందుగా ఈ ఏడాది కుదుర్చుకోవాలని నిర్ణయించడం తెలిసిందే. ప్రస్తుతం రెండు దేశాల మధ్య వాణిజ్యం 200 బిలియన్ డాలర్లుగా ఉంది. దీనిపై మీడియా ప్రతినిధుల నుంచి వచ్చిన ప్రశ్నలకు అగర్వాల్ బదులిచ్చారు. ''ఒప్పందం ఎలా ఉండాలన్నది నిర్ణయించేందుకు కొన్ని వారాల సమయం ఇవ్వండి. రెండు వైపులా ప్రతినిధులు కూర్చుని, విస్తృత అంగీకారానికి రావాల్సి ఉంటుంది. వచ్చే 8-9 నెలల్లో ఈ పని పూర్తి చేయాలని అంగీకారం కుదిరింది''అని వివరించారు. ఎఫ్‌టీఏ అయితే రెండు దేశాలూ మరో దేశం నుంచి వచ్చే దిగుమతులకు సుంకాల మినహాయింపు, గణనీయంగా తగ్గింపు వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

కంపెనీల వేటలో మాజిల్లానిక్ క్లౌడ్

- రూ.400 కోట్లతో పెట్టుబడి ప్రణాళికలు
- సంస్థ ఎండీ జోసెఫ్ సుధీర్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సేవలందించే లిస్టెడ్ సంస్థ మాజిల్లానిక్ క్లౌడ్ తమ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కంపెనీల కొనుగోళ్లపై దృష్టి పెడుతోంది. దీనితో పాటు ఇతరత్రా పెట్టుబడుల కోసం సుమారు రూ. 400 కోట్లు వెచ్చించనున్నట్లు సంస్థ ఎండీ జోసెఫ్ సుధీర్ తుమ్మ తెలిపారు. మే నాటికల్లా రూ. 200 కోట్లతో అమెరికాకు చెందిన ఓ ఐటీ, ఐటీఈఎస్ సంస్థను కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. మరో నాలుగైదు సంస్థలను కూడా దక్కించుకునే యోచనలో ఉన్నట్లు జోసెఫ్ సుధీర్ చెప్పారు. ఇందుకోసం కంపెనీ అంతర్గతంగా దాదాపు రూ. 100 కోట్ల నిధులను ఉపయోగించుకోనున్నట్లు, మిగతా మొత్తాన్ని ప్రిఫరెన్షియల్ ఇష్యూ లేదా క్విప్ రూపంలో సమకూర్చుకోనున్నట్లు తెలిపారు. ఇక, ప్రస్తుతం 1,600 పైచిలుకు ఉన్న ఉద్యోగుల సంఖ్యను వచ్చే రెండేళ్లలో 5,000కు పెంచుకోనున్నట్లు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం స్వల్పంగా వృద్ధి చెంది సుమారు రూ. 600 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఆదాయ వృద్ధి 50 శాతం స్థాయిలో ఉండగలదని పేర్కొన్నారు. మరోవైపు, డ్రోన్ల తయారీకి సంబంధించిన అనుబంధ సంస్థ స్కాన్‌డ్రోన్ .. రక్షణ రంగ కాంట్రాక్టులను దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు చెప్పారు. ఐటీ, ఈ-సర్వైలెన్స్, డ్రోన్స్ వ్యాపార విభాగాల్లో అయిదు అనుబంధ సంస్థలతో మ్యాజిల్లానిక్ క్లౌడ్ కార్యకలాపాలు సాగిస్తోంది.

రూ.250కే జన్‌నివేష్ సిప్

- ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఆవిష్కరణ
- యోనోతోపాటు ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లపై లభ్యం



ముంబై: తక్కువ మొత్తంతో మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడికి ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పరిష్కారం కొనుగొన్నది. జన్‌నివేష్ సిప్ పేరుతో రూ.250 నుంచి పెట్టుబడికి వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. సెబీ చైర్ పర్సన్ మాధవి పురి బుచ్ దీన్ని ప్రారంభించారు. రూ.250 సిప్ తనకు అత్యంత ఇష్టమైన స్వప్నాల్లో ఒకటని బుచ్ పేర్కొన్నారు. ఈ తరహా అతి స్వల్ప పెట్టుబడుల ఉత్పత్తులు లక్షలాది మందికి సంపద సృష్టిలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ''భారత్ వృద్ధి చెందే క్రమంలో సంపద సృష్టి జరుగుతుంది. చిన్న మొత్తాల రూపంలో అయినా ప్రతి ఒక్కరికీ అందాలి. జన్‌నివేష్ అంటే నా దృష్టిలో అర్థం ఇదే''అని పేర్కొన్నారు. గతంలో బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు రూ.100, రూ.500 సిప్‌లు ప్రవేశపెట్టినప్పటికీ అధిక నిర్వహణ వ్యయాల కారణంగా వాటికి కొనసాగించలేకపోయినట్టు చెప్పారు. సూక్ష్మ సిప్‌లు ఆర్థికంగా లాభసాటి కావాలంటే, రెండేళ్లలోపే వాటికి సంబంధించి లాభం-నష్టంలేని స్థితిని సాధించేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ''డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల సాయంతో రూ.250 సిప్ ద్వారా మొదటిసారి ఇన్వెస్టర్లు, అసంఘటిత రంగంలోని చిన్న మొత్తాల పొదుపరులను ఆకర్షించగలం''అని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో నందకిషోర్ ప్రకటించారు. అందరికీ ఆర్థిక సేవలను మరింత సమర్థవంతంగా చేరువ చేసే దిశగా తాము ఉత్పత్తుల అభివృద్ధి, ప్రక్రియలు, టెక్నాలజీలపై దృష్టి సారిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. యోనో యాప్‌తోపాటు పేటీఎం, జెరోదా, గ్రోవ్ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రతీ యూజర్ జన్‌నివేష్ సిప్‌ను పొందొచ్చని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది.

థేల్స్ నుంచి సైయంట్ డీఎల్ఎంకు కాంట్రాక్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థ థేల్స్ నుంచి దీర్ఘకాలిక ఏవియోనిక్స్ తయారీ ప్రోగ్రాంను దక్కించుకున్నట్లు సైయంట్ డీఎల్ఎం తెలిపింది. దీని కింద కొత్త తరం ఫ్లయిట్ ఏవియోనిక్స్ సిస్టమ్‌ల కోసం ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లీలను తయారు చేయనుంది. వీటిని కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్లాట్‌ఫాంలలో వీటిని వినియోగిస్తారని పేర్కొంది.

సియెల్ హెచ్ఆర్ సర్వీసెస్ ఐపీవోకి గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: టెక్నాలజీ ఆధారిత మానవ వనరుల సేవల సంస్థ సియెల్ హెచ్ఆర్ సర్వీసెస్ ఐపీవోకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి ఆమోద ముద్ర లభించింది. ఐపీవో కింద రూ. 335 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు., ఇతర షేర్‌హోల్డర్లు 47.4 లక్షల షేర్లను విక్రయనించనున్నారు. తాజాగా జారీ చేసే షేర్ల ద్వారా సమీకరించే నిధులను ఇతర అనుబంధ సంస్థల్లో అదనంగా వాటాలను కొనుగోలు చేయనుంది. ఫిబ్రవరి 10న సాత్విక్ గ్రీన్ ఎనర్జీ ఆఫర్ డాక్యుమెంట్‌ను సెబీ తిప్పి పంపింది. అటు ఫ్యుజియామా పవర్‌సిస్టమ్స్ ఫిబ్రవరి 12న తన ఆఫర్ డాక్యుమెంట్‌ను వెనక్కి తీసుకుంది.

హైదరాబాద్‌లో సొనొకో పర్ఫార్మెన్స్ హబ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ సొల్యూషన్స్ సంస్థ సొనొకో ప్రోడక్ట్స్ హైదరాబాద్‌లో పర్ఫార్మెన్స్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. తొలి దశలో 10 మిలియన్ డాలర్లు దీనిపై ఇన్వెస్ట్ చేస్తున్నట్లు వివరించింది. ఆటోమేషన్, కొత్త టెక్నాలజీలను ఉపయోగించుకుని ప్యాకేజింగ్ డిజైన్, తయారీలో కొత్త ఆవిష్కరణలు చేయడంపై ఈ హబ్ దృష్టి పెడుతుందని సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ అంకిరెడ్డిపల్లి తెలిపారు. వచ్చే 12-18 నెలల్లో 300 మంది టెక్నాలజిస్టులను నియమించుకోనున్నట్లు, మూడేళ్లలో ఈ సంఖ్యను 500కు పెంచుకోనున్నట్లు వివరించారు.

అడ్వైజర్లు, అనలిస్టులు అన్ని వివరాలు ఇవ్వాల్సిందే

సేవల విషయంలో సెబీ ఆదేశాలు

న్యూఢిల్లీ: పెట్టుబడి సలహాదారులు (ఐఏలు), పరిశోధన విశ్లేషకులు (ఆర్ఏలు) తమ సేవలకు సంబంధించి అన్ని నియమాలు, షరతులను ముందుగానే క్లయింట్లకు వెల్లడించాలని సెబీ ఆదేశించింది. సెబీతో సంప్రదింపుల అనంతరం పరిశ్రమకు చెందిన రీసెర్చ్ అనలిస్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఆర్ఏఏఎస్‌బీ) లేదా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఐఏఏఎస్‌బీ) 'అత్యంత ముఖ్యమైన నిబంధనలు, షరతులను (ఎంఐటీసీ) ఖరారు చేయాల్సి ఉంటుందని సెబీ తన సర్క్యులర్‌లో పేర్కొంది. ఆర్ఏలు జూన్ 30 నాటికి ఎంఐటీసీని ప్రస్తుత క్లయింట్లకు ఈ మెయిల్ లేదా మరో విధానంలో వెల్లడించాలని ఆదేశించింది. కొత్త క్లయింట్లతో ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. బ్యాంక్ బదిలీ లేదా యూపీఐ ద్వారా స్వీకరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ''స్థిర విధానంలో ప్రస్తుతం ఒక క్లయింట్ కుటుంబానికి వార్షిక ఫీజు పరిమితి రూ.1,51,000. ఆస్తుల విలువలో అయితే ఏటా 2.5 శాతం మించకూడదు''అని సెబీ పేర్కొంది.



ఆడి నుంచి ఆర్ఎస్ క్యూ8 ఎస్‌యూవీ

ఢిల్లీ షోరూం ధర రూ. 2.49 కోట్లు

ముంబై: లగ్జరీ కార్ల దిగ్గజం ఆడి ఇండియా తాజాగా తమ ఆర్ఎస్ క్యూ8 ఎస్‌యూవీ రిఫ్రెష్డ్ వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 2.49 కోట్లు. సరఫరాపరమైన సమస్యల కారణంగా గతేడాది తమ కార్ల విక్రయాలు తగ్గినప్పటికీ ఈ ఏడాది మెరుగ్గా ఉండగలవని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ ధిల్లాన్ ధీమా వ్యక్తం చేశారు. దేశీయంగా మొత్తం కార్ల అమ్మకాల్లో లగ్జరీ కార్ల విభాగం ఒక్క శాతం లోపే ఉందని, ఇది చెప్పుకోతగిన స్థాయికి చేరాలంటే కనీసం అయిదు శాతం వాటానైనా సాధించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే, ఇందుకు ఎన్నాళ్లు పడుతుందనేది ఇప్పుడే చెప్పలేమని ధిల్లాన్ పేర్కొన్నారు.

కో-వర్కింగ్ సెంటర్ల జోరు

- గత ఏడాది లీజుకు 2.24 లక్షల సీట్లు
- 2023తో పోలిస్తే 43.6 శాతం వృద్ధి
- కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక



న్యూఢిల్లీ: కో-వర్కింగ్ సెంటర్ ఆపరేటర్లు ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఏడాది రికార్డు స్థాయిలో 2.24 లక్షల సీట్లను అద్దెకు తీసుకున్నారు. 2023తో పోలిస్తే 43.6 శాతం వృద్ధి నమోదైంది. కార్పొరేట్ సంస్థల నుండి మేనేజ్డ్ ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమని రియల్టీ కన్సల్టెంట్ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం.. 2023లో బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణే, కోల్‌కత, ముంబై, హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్‌లలో మొత్తం 1.56 లక్షల డెస్క్‌లను కో-వర్కింగ్ లేదా ఫ్లెక్సిబుల్ ఆఫీస్ స్పేస్ ఆపరేటర్లు కార్పొరేట్ సంస్థలకు అందించాయి. గత ఏడాది ఆపరేటర్లు బెంగళూరులో 64,000, పుణే 38,000, ఢిల్లీ ఎన్‌సీఆర్ 38,000, ముంబై 28,000, హైదరాబాద్ 26,000, చెన్నైలో 25,000 సీట్లను అద్దెకు ఇచ్చాయి. కోల్‌కత, అహ్మదాబాద్ కేవలం చెరి 1,900 సీట్లకే పరిమితం అయ్యాయి.

బలమైన వృద్ధి నమోదు..

ఆఫీస్ స్పేస్ ఆపరేటర్లు తమ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రాపర్టీ యజమానుల నుండి అద్దెకు ఆఫీసు స్థలాన్ని తీసుకుని.. మౌలిక సదుపాయాలతో కార్పొరేట్స్, నిపుణులు, వ్యక్తులకు వర్క్‌స్పేస్‌ను అందిస్తాయి. 'సంప్రదాయ కార్యాలయాల ఏర్పాటుతోపాటు మేనేజ్డ్ వర్క్‌స్పేస్‌ను అంతర్జాతీయ సంస్థలు లీజుకు తీసుకుంటున్నాయి. దీంతో ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌కు డిమాండ్ ప్రస్తుత సంవత్సరంతోపాటు రాబోయే కాలంలో బలమైన వృద్ధి నమోదు చేయనుంది. దీంతో మేనేజ్డ్ స్పేస్ ఆపరేటర్ల ద్వారా ప్రధాన నగరాల్లోని గ్రేడ్ ఏ/ఏ+ ఆస్తులను మరింతగా పెంచుతుంది' అని కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఫ్లెక్స్ విభాగం హెడ్ రమిత అరోరా తెలిపారు.

కిమ్స్‌కు యూఏఐఎంఎస్ నిర్వహణ పగ్గాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల రంగంలో ఉన్న కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) తాజాగా మహారాష్ట్ర సాంగ్లిలో ఉన్న యూఏఐఎంఎస్ ఆసుపత్రి కార్యకలాపాలు, నిర్వహణ పగ్గాలు చేపట్టింది. ఇక నుంచి కిమ్స్-యూఏఐఎంఎస్ హాస్పిటల్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం రాబోయే కాలంలో యూఏఐఎంఎస్ హాస్పిటల్‌లో మెజారిటీ వాటాను పొందేందుకు కాల్ ఆప్షన్ కింద కిమ్స్‌కు వీలు కల్పిస్తుంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన కింగ్స్‌వే హాస్పిటల్‌ను 2022లో కిమ్స్ స్వాధీనం చేసుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో థానేలో 300 పడకల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అందుబాటులోకి రానున్నట్టు సంస్థ ఇప్పటికే ప్రకటించింది.

బజాజ్ కంజ్యూమర్ చేతికి విశాల్ పర్సనల్ కేర్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీ బజాజ్ కంజ్యూమర్ కేర్ తాజాగా విశాల్ పర్సనల్ కేర్‌ను కొనుగోలు చేస్తోంది. విశాల్ పర్సనల్ కేర్‌ను రూ.108.3 కోట్లుగా విలువ కట్టారు. కేశ, చర్మ సంరక్షణ ఉత్పత్తుల బ్రాండ్ బంజారాను విశాల్ పర్సనల్ కేర్ ప్రమోట్ చేస్తోంది. తొలుత 49 శాతం, ఆ తర్వాత 51 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్టు బజాజ్ తెలిపింది. ఈ డీల్ లావాదేవీ విలువ రూ.120 కోట్లు అని వెల్లడించింది. సహజ, ఆయుర్వేద వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను అందుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. 1991లో హైదరాబాద్ కేంద్రంగా బంజారా బ్రాండ్ శ్రీకారం చుట్టింది.

లంచ్‌కు ముందు ఐదుగురు... తర్వాత ఒక్కడే!

ప్రపంచంలోనే అతి పెద్ద క్రికెట్ మైదానమైన నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతున్న సుప్రసిద్ధ దేశవాళీ టోర్నీ సెమీఫైనల్‌కు సరైన ప్రచారం లేక ప్రేక్షకులు అటువైపే కన్నెత్తి చూడలేదు. దాదాపు లక్షా 30 వేల సామర్థ్యమున్న ప్రేక్షకుల గ్యాలరీలో తొలిరోజు తొలి సెషన్‌లో కేవలం ఐదుగురే మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చారు. భోజన విరామం తర్వాత ఇందులో ఒకే ఒక్కడు మిగిలాడు. దీనికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్స్ స్పందించారు. కొందరేమో ప్రేక్షకులను అనుమతించరేమోనని వెళ్లలేదని పేర్కొనగా, మరికొందరు అసలిక్కడ సెమీస్ జరుగుతున్న సంగతే తమకు తెలియదని పోస్టులు పెట్టారు. మరికొందరు క్రికెట్ ఔత్సాహికులు అనుమతిస్తున్నారనే బదులు రావడంతో రెండో రోజు నుంచి వెళ్తామని ఆసక్తి చూపారు.



ప్రేక్షకులు లేక ఖాళీగా ఉన్న నరేంద్ర మోదీ స్టేడియం

కదంతొక్కిన ధ్రువ్, దానిష్

- విదర్భ తొలి ఇన్నింగ్స్ 308/5
- ముంబైతో రంజీ రెండో సెమీస్ పోరు

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ చరిత్రలోనే ఘనాపాఠి జట్టయిన ముంబైకి రెండో సెమీఫైనల్లో తొలిరోజే విదర్భ బ్యాటర్లు గట్టి సవాల్ విసిరారు. ముంబై బౌలర్లు సగం (5) వికెట్లు పడగొట్టినప్పటికీ ఒకే రోజు విదర్భ 300 పైచిలుకు స్కోరు చేసింది. టాపార్డర్‌లో ధ్రువ్ షోరే (109 బంతుల్లో 74; 9 ఫోర్లు), మిడిలార్డర్‌లో దానిశ్ మాలేవర్ (157 బంతుల్లో 79; 7 ఫోర్లు, 1 సిక్స్), కరుణ్ నాయర్ (70 బంతుల్లో 45; 6 ఫోర్లు), యశ్ రాథోడ్ (86 బంతుల్లో 47 బ్యాటింగ్; 6 ఫోర్లు) సమష్టిగా కదంతొక్కారు. టాస్ గెలవగానే బ్యాటింగ్ ఎంచుకొని బరిలోకి దిగిన విదర్భకు మంచి ఆరంభమైతే దక్కలేదు. అథర్వ (4) వికెట్ పారేసుకున్నాడు. మరో ఓపెనర్ ధ్రువ్ షోరే, పార్థ్ రేఖడే (23; 2 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను కుదుటపరిచాడు. వన్డేలాగే ఆడిన ధ్రువ్ 67 బంతుల్లోనే ఫిఫ్టీ సాధించాడు. రెండో వికెట్‌కు వీరిద్దరు 54 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు వందకు సమీపించింది. ఈ దశలో 93 పరుగుల వద్ద పార్థ్‌ను శివమ్ దూబే అవుట్ చేశాడు. దానిష్ క్రీజులోకి రాగా... తొలి సెషన్‌లోనే జట్టు స్కోరు వంద దాటింది. ధ్రువ్, దానిష్‌ల జోడీ విదర్భ ఇన్నింగ్స్‌లో మరో 50 పైచిలుకు భాగస్వామ్యాన్ని జోడించింది. జట్టు స్కోరు 144 పరుగుల వద్ద ధ్రువ్ షోరేను షమ్స్ ములానీ పెవిలియన్ చేర్చడంతో మూడో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత వచ్చిన కరుణ్ నాయర్, యశ్ రాథోడ్‌లు కూడా ముంబై బౌలర్లను చక్కగా ఎదుర్కోవడంతో భారీస్కోరుకు బాట పడింది. ఆట నిలిచే సమయానికి యశ్, కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. వీళ్లిద్దరు కలిసి అబేధ్యమైన ఆరో వికెట్‌కు 47 పరుగులు జోడించారు. ముంబై బౌలర్లలో శివమ్ దూబే, షమ్స్ ములానీ చెరో 2 వికెట్లు తీశారు.


ధ్రువ్ షోరే

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: అథర్వ (సి) ఆనంద్ (బి) రాయ్‌స్టన్ డయస్ 4; ధ్రువ్ షోరే (సి) రహానే (బి) ములానీ 74; పార్థ్ రేఖడే (సి) సూర్యకుమార్ (బి) దూబే 23; దానిశ్ (సి) ఆనంద్ (బి) ములానీ 79; కరుణ్ నాయర్ (సి) ఆనంద్ (బి) దూబే 45; యశ్ రాథోడ్ (బ్యాటింగ్) 47; అక్షయ్ వాడ్కర్ (బ్యాటింగ్) 13; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (88 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి) 308. వికెట్ల పతనం:** 1-39, 2-93, 3-144, 4-222, 5-261. **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 14-0-57-0, మోహిత్ 14-2-61-0, రాయ్‌స్టన్ డయస్ 11-2-26-1, తనుశ్ కొటియాన్ 22-0-78-0, శివమ్ దూబే 9-1-35-2, షమ్స్ ములానీ 18-3-44-2.

నిలబెట్టిన నాయకుడు

- సచిన్ బేబీ కెప్టెన్ ఇన్నింగ్స్
- తొలిరోజు కేరళ 206/4
- గుజరాత్‌తో రంజీ సెమీస్

అహ్మదాబాద్: కేరళ, గుజరాత్ జట్ల మధ్య రంజీ ట్రోఫీ తొలి సెమీఫైనల్ మ్యాచ్ చప్పగా మొదలైంది. తొలిరోజు ఆటలో మొదట బ్యాటింగ్‌కు దిగిన కేరళ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ సచిన్ బేబీ (193 బంతుల్లో 69 బ్యాటింగ్, 8 ఫోర్లు) జిడ్డుగా బ్యాటింగ్ చేశాడు. దీంతో సోమవారం ఆట ముగిసే సమయానికి కేరళ జట్టు 89 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. మొదట ఓపెనర్లు అక్షయ్ చంద్రన్ (30; 5 ఫోర్లు), రోహన్ (30; 5 ఫోర్లు) 20 ఓవర్ల వరకు వికెట్ పడిపోకుండా 60 పరుగులు జతచేశారు. 3 పరుగుల వ్యవధిలో వీరిద్దరూ అవుటయ్యారు. కాసేపయ్యాక వరుణ్ నాయనార్ (10) నిష్క్రమించగా... కెప్టెన్ సచిన్, జలజ్ సక్సేనా (30; 4 ఫోర్లు) గుజరాత్ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టేలా బ్యాటింగ్ చేశారు. గుజరాత్ జట్టు ఏకంగా ఏడుగురు బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా... ప్రయోజనం లేకపోయింది. వీళ్లిద్దరు 27.5 ఓవర్ల పాటు క్రీజులో పాతుకుపోవడంతో ప్రత్యర్థి బౌలర్లు, ఫీల్డర్లు అలసిపోయారు. ఎట్టకేలకు మూడో సెషన్ మొదలయ్యాక సక్సేనాను అర్జాన్ నగ్వాస్‌వాలా బౌల్డ్ చేయడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. నాలుగో వికెట్‌కు ఈ జోడీ 71 పరుగులు జోడించింది. తర్వాత మొహమ్మద్ అజహరుద్దీన్ (30 బ్యాటింగ్; 3 ఫోర్లు) కూడా నాయకుడికి అండగా నిలవడంతో గుజరాత్ జట్టుకు కష్టాలు కొనసాగాయి. 132 బంతుల్లో సచిన్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అబేధ్యమైన ఐదో వికెట్‌కు అజహరుద్దీన్, సచిన్ 49 పరుగులు జతచేశారు. టెస్టులు, దేశవాళీ టోర్నీలో సెషన్‌కు 30 ఓవర్లు వేస్తారు. అయితే సచిన్ 25వ ఓవర్లో క్రీజులోకి వచ్చి ఓ సెషన్ ఓవర్లను మించే క్రీజులో నిలిచాడు. 193 బంతులంటే 32 ఓవర్ల పైచిలుకు బంతుల్ని అతను ఎదుర్కొన్నాడు. అర్జాన్, ప్రియజీత్, రవి బిష్ణోయ్ తలా ఒక వికెట్ తీశారు.

స్కోరు వివరాలు

కేరళ తొలి ఇన్నింగ్స్: అక్షయ్ (రనౌట్) 30; రోహన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రవి బిష్ణోయ్ 30; వరుణ్ (సి) ఉర్విల్ (బి) ప్రియజీత్‌సింగ్ 10; సచిన్ బేబీ (బ్యాటింగ్) 69; జలజ్ సక్సేనా (బి) అర్జాన్ 30; అజహరుద్దీన్ (బ్యాటింగ్) 30; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (89 ఓవర్లలో 4 వికెట్లకు) 206. వికెట్ల పతనం:** 1-60, 2-63, 3-86, 4-157. **బౌలింగ్:** చింతన్ గజా 18-536-0, అర్జాన్ 16-4-39-1, ప్రియజీత్ సింగ్ 12-0-33-1, జైమీత్ 9-1-26-0, రవి బిష్ణోయ్ 15-2-33-1, సిద్ధార్థ్ దేశాయ్ 16-8-22-0, విశాల్ జైస్వాల్ 3-1-13-0.



సచిన్ బేబీ

పింక్ లేడీస్ కప్ టోర్నీకి గుగులోత్ సౌమ్య

భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో తెలంగాణ ప్లేయర్

ఈనెల 20 నుంచి యూఏఈలో టోర్నీ ● బరిలో భారత్, జోర్డాన్, కొరియా, రష్యా

న్యూఢిల్లీ: నాలుగు దేశాలు పాల్గొనే పింక్ లేడీస్ కప్ అంతర్జాతీయ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాలో ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ఈ టోర్నీ జరుగుతుంది. 23 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ అమ్మాయి, నిజామాబాద్ జిల్లాకు చెందిన గుగులోత్ సౌమ్య చోటు సంపాదించింది. ఈనెల 7 నుంచి అనంతపురంలో శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న భారత జట్టు నేడు యూఏఈకి బయలుదేరి వెళుతుంది. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఈనెల 20న జోర్డాన్‌తో... రెండో మ్యాచ్‌ను 23న రష్యాతో... మూడో మ్యాచ్ 26న దక్షిణ కొరియా జట్టుతో ఆడుతుంది. ఈ ఏడాది మే-జూన్‌లలో జరిగే ఆసియా కప్-2027 క్వాలిఫయర్స్ టోర్నీకి సన్నాహాల్లో భాగంగా పింక్ లేడీస్ కప్‌లో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 'పింక్ లేడీస్ కప్ టోర్నీ ద్వారా భారత క్రీడాకారిణులకు తమ సామర్థ్యమేంటో తెలుస్తుంది. రష్యాతో పోలిస్తే దక్షిణ కొరియా జట్టు పూర్తి భిన్నంగా ఉంటుంది. రెండు జట్ల వీడియోలు పరిశీలించాను. రష్యా శైలితో పోలిస్తే కొరియా ఆటలో చాలా వేగం ఉంది. ఫలితంగా భారత జట్టు రెండు రకాలుగా వ్యూహాలు రచించి ఆడాల్సి ఉంటుంది' అని భారత జట్టు హెడ్ కోచ్ క్రిస్పిన్ ఛెత్రి తెలిపాడు.

భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు: ఎలాంగ్‌బమ్ పంథోయ్ చాను, పాయల్ బసుదె, శ్రేయా హుడా (గోల్ కీపర్లు), అరుణ బాగ్, కిరన్ పిస్డా, మార్టినా థోక్‌చోమ్, నిర్మలా దేవి ఫాన్‌జుబమ్, పూర్ణిమ కుమారి, సంజు, సిల్కీ దేవి హెమమ్, స్వీటీ దేవి ఎన్‌గాంగ్‌బమ్ (డిఫెండర్లు), బబీనా దేవి లిషామ్, గ్రేస్ డాంగ్‌మె, మౌసుమి ముర్ము, ప్రియదర్శిని సెల్లాదురై, ప్రియాంక దేవి నోరెమ్, రత్నబాల దేవి నోంగ్‌మైథెమ్ (మిడ్‌ఫీల్డర్లు), కరిష్మా పురుషోత్తమ్, లిండా కోమ్ సెర్టో, మనీషా, రేణు, సంధ్య రంగనాథన్, సౌమ్య గుగులోత్ (ఫార్వర్డ్స్).



గుగులోత్ సౌమ్య



2024 ఐసీసీ 'టి20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుతో భారత బౌలర్ అర్ష్‌దీప్ సింగ్. చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడేందుకు భారత జట్టు దుబాయ్ వచ్చిన సందర్భంగా సోమవారం ఐసీసీ అర్ష్‌దీప్‌కు ఈ అవార్డు అందజేసింది

పాక్‌లో అడుగుపెట్టిన ఆస్ట్రేలియా

22న ఇంగ్లండ్‌తో స్మిత్ బృందం తొలి పోరు

లాహోర్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు సోమవారం పాకిస్తాన్ చేరుకుంది. 'ఆసీస్ జట్టు లాహోర్‌లో అడుగుపెట్టింది. మెగా ఈవెంట్లో స్మిత్ బృందం తమ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో తలపడుతుంది. ఈ నెల 22న గడాఫీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది' అని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) 'ఎక్స్'లో ట్వీట్ చేసింది. ఆస్ట్రేలియా జట్టు రెండు బృందాలుగా వచ్చింది. తొలి బృందంలో కెప్టెన్ స్టీవ్ స్మిత్, కోచింగ్, సహాయ బృందం సభ్యులు ఉన్నారు. వీరంతా కొలంబో నుంచి దుబాయ్ మీదుగా పాక్‌కు చేరుకున్నారు. ఇదే దారిలో రెండో బృందం వచ్చింది. ఇందులో 15 మంది క్రికెటర్లతో పాటు మరో ఇద్దరు కోచింగ్ సభ్యులు ఉన్నారు.

ఆస్ట్రేలియా జట్టు: స్మిత్ (కెప్టెన్), హెడ్, కేరీ, ఇంగ్లిస్, లబుషేన్, మ్యాక్స్‌వెల్, జేక్ ఫ్రేజర్, హార్డీ, అబాట్, నాథన్ ఎలీస్, డ్వార్షుస్, స్పెన్సర్ జాన్సన్, తన్వీర్ సంఘా, మాథ్యూ షార్ట్, జంపా.


ట్రావిస్ హెడ్

ఒలింపిక్స్‌కు ముందు 'కామన్వెల్త్' నిర్వహించండి

భారత్‌కు సీజీఎఫ్ చీఫ్ సూచన

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం ఇటీవల తరచూ ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం తహతహలాడుతోంది. 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ఆసక్తి కనబరుస్తోంది. అయితే భారత్ లక్ష్యం విశ్వక్రీడలైతే ముందుగా కామన్వెల్త్ క్రీడలు నిర్వహిస్తే ఇది మెగా ఈవెంట్‌కు ముందు మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని కామన్వెల్త్ క్రీడల సమాఖ్య (సీజీఎఫ్) సీఈఓ కేటీ సాడ్లియెర్ సూచించారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన 'గ్లోబల్ బిజినెస్ సమ్మిట్'లో పాల్గొన్న ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఏ దేశానికైనా ఒలింపిక్స్ ఆతిథ్యమనేది గొప్ప కీర్తిని తెస్తుంది. అయితే అలాంటి ప్రతిష్టాత్మక క్రీడలకు ముందు కామన్వెల్త్ క్రీడలు (2030) నిర్వహిస్తే మేటి అంతర్జాతీయ ఈవెంట్‌కు సరైన సన్నాహకంగా, చక్కని ముందడుగుగా ఉపయోగపడుతుంది' అని అన్నారు. భవిష్యత్తులో ఒలింపిక్స్ పతకాల పట్టికలో భారత్ టాప్-10లో నిలుస్తుందని ఆమె చెప్పారు. 'భారత్ దశ, దిశ ఇప్పుడు మారుతోంది. సరైన నాయకత్వం, మౌలిక వసతుల కల్పన, ప్రామాణిక శిక్షణతో క్రీడల భవిష్యత్ మారబోతోంది. అంతర్జాతీయ క్రీడా వేదికలపై ప్రదర్శన, పతకాలనేవి ఆ దేశ ప్రతిష్టను కచ్చితంగా పెంచుతాయి. తప్పకుండా భారత్ క్రీడాశక్తిగా ఎదుగుతుంది' అని కేటీ సాడ్లియెర్ తెలిపారు. సరిగ్గా పదిహేనేళ్ల క్రితం భారత్ ఒకే ఒక్కసారి 2010లో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చింది.


కేటీ సాడ్లియెర్



కరణ్ సింగ్ ఓటమి

పుణే: మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్-100 టోర్నీలో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో కరణ్ సింగ్... క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో రామ్‌కుమార్ రామనాథన్ ఓడిపోయారు. కరణ్ సింగ్ 4-6, 1-6తో అలెక్సిస్ గలార్నెయు (కెనడా) చేతిలో... రామ్‌కుమార్ 4-6, 7-6 (7/5), 0-6తో కిమెర్ కాప్‌జాన్స్ (బెల్జియం) చేతిలో పరాజయం పాలయ్యారు.

భారత్ X స్పెయిన్

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) రెండో రౌండ్ మ్యాచ్‌లకు భారత జట్టు సిద్ధమైంది. మంగళవారం జరిగే మ్యాచ్‌లో స్పెయిన్ జట్టుతో భారత మహిళల బృందం ఆడుతుంది. సాయంత్రం గం. 5:15 నుంచి ఈ మ్యాచ్ జరుగుతుంది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 3-2 గోల్స్ తేడాతో గెలిచి, రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 'షూటౌట్'లో 1-2తో ఓడిపోయింది. మరోవైపు భారత పురుషుల జట్టు జర్మనీ జట్టుతో తలపడుతుంది. ఈ మ్యాచ్ రాత్రి గం. 7:30 నుంచి జరుగుతుంది. స్పెయిన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 1-3తో ఓడిన టీమిండియా... రెండో మ్యాచ్‌లో స్పెయిన్‌పైనే 2-0తో గెలిచింది.

20 ఏళ్ల తర్వాత...

ఆల్ స్టార్ ఎన్‌బీఏ మ్యాచ్‌కు దూరమైన దిగ్గజం లెబ్రాన్ జేమ్స్

శాన్‌ఫ్రాన్సిస్కో: విఖ్యాత నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ ఆల్ స్టార్ మ్యాచ్‌కు అమెరికా దిగ్గజం లెబ్రాన్ జేమ్స్ తొలిసారి దూరమయ్యాడు. 20 ఏళ్ల తర్వాత లెబ్రాన్ జేమ్స్ లేకుండా ఆల్ స్టార్ మ్యాచ్ జరగడం గమనార్హం. 2005 నుంచి ప్రతి సీజన్‌లో ఆల్ స్టార్ మ్యాచ్‌లలో ఆడిన 40 ఏళ్ల లెబ్రాన్ ఈసారి చీలమండ గాయంతో ఆడలేకపోయాడు. రెగ్యులర్ సీజన్‌లో లాస్‌ఏంజెలిస్ లేకర్స్ జట్టుకు ఆడే లెబ్రాన్ ఆల్ స్టార్ మ్యాచ్‌లలో ఈసారి షకిల్లా ఓనీల్ జట్టుకు జట్టుకు ప్రాతినిధ్యం వహించాల్సింది. 2005లో తొలిసారి ఆల్ స్టార్ మ్యాచ్‌లో ఆడిన లెబ్రాన్ వరుసగా 20 ఏళ్లపాటు ఈ మేటి మ్యాచ్‌లలో భాగస్వామిగా ఉన్నాడు. 6 అడుగుల 9 అంగుళాల ఎత్తు, 113 కేజీల బరువున్న లెబ్రాన్ ఇప్పటి వరకు ఎన్‌బీఏ లీగ్‌లో 1,540 మ్యాచ్‌లు ఆడి అత్యధికంగా 41,641 పాయింట్లు స్కోరు చేశాడు.



కౌంటీల్లో విలియమ్సన్

లండన్: న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ కౌంటీ జట్టు మిడిలెసెక్స్‌తో జతకట్టాడు. ఇంగ్లండ్ దేశవాళీ టి20 కౌంటీ చాంపియన్‌షిప్ ఆడేందుకు రెండేళ్ల పాటు మిడిలెసెక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇప్పటికే ఇంగ్లండ్‌లో జరిగే ఫ్రాంచైజీ లీగ్ 'ది హండ్రెడ్ టోర్నీ'లో లండన్ స్పిరిట్‌కు కివీస్ దిగ్గజం సారథ్యం వహిస్తున్నాడు. గతంలో టి20 కౌంటీ చాంపియన్‌షిప్‌లో గ్లూసెస్టర్‌షైర్ (2011-12), యార్క్‌షైర్ (2013-2018)కు ప్రాతినిధ్యం వహించాడు. తాజా సీజన్‌లో బ్లాస్ట్ గ్రూప్‌లో మిడిలెసెక్స్ తరఫున కనీసం పది మ్యాచ్‌లు ఆడనున్నాడు. అనంతరం మరో ఐదు కౌంటీ చాంపియన్‌షిప్ మ్యాచ్‌ల్లోనూ విలియమ్సన్ బరిలోకి దిగుతాడు. 'గతంలో అడపాదడపా కౌంటీలు ఆడాను. ఇప్పుడు మాత్రం పూర్తిస్థాయిలో సీజన్‌కు అందుబాటులో ఉంటాను' అని అన్నాడు. ఈ వెటరన్ బ్యాటర్ అంతర్జాతీయ క్రికెట్లో మూడు ఫార్మాట్లలో కలిపి 18,000 పైచిలుకు పరుగులు చేశాడు. 47 సెంచరీలు సాధించాడు. టెస్టుల్లో 54.88, వన్డేల్లో 49.65, టి20ల్లో 33.44 సగటు నమోదు చేశాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్, గుజరాత్ టైటాన్స్ ప్రాతినిధ్యం వహించిన విలియమ్సన్ కరీబియన్ లీగ్‌లో బార్బడోస్ ట్రిడెంట్స్, ఎస్ఏ-20 (సఫారీ లీగ్)లో డర్బన్ సూపర్‌జెయింట్స్ తరఫున బరిలోకి దిగాడు. ఈ సీజన్‌లో కరాచీ కింగ్స్ జట్టుతో జతకట్టిన కేన్ పాకిస్తాన్ సూపర్ లీగ్‌లోనూ ఆడనున్నాడు.



ద.కొరియాలో డీప్‌సీక్ డౌన్‌లోడ్ నిలిపివేత

సియోల్: చైనాకు చెందిన కృత్రిమ మేథ అంకుర సంస్థ డీప్‌సీక్‌కు చెందిన చాట్‌బాట్ యాప్‌ల డౌన్‌లోడ్‌ను తమ దేశంలో తాత్కాలికంగా నిలిపేసినట్టు దక్షిణ కొరియా అధికారులు సోమవారం ప్రకటించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్‌ల నుంచి స్థానిక వెర్షన్ల డీప్‌సీక్ యాప్‌లను శనివారం సాయంత్రం తొలగించామని వెల్లడించారు. యాప్‌ను తిరిగి ప్రారంభించే ముందు వినియోగదారుల భద్రతను పెంచడానికి తమతో కలిసి పనిచేయడానికి సిద్ధమని తాజాగా డీప్‌సీక్ అంగీకారం తెలిపిందని దక్షిణ కొరియా వ్యక్తిగత సమాచార పరిరక్షణ కమిషన్ ప్రకటించింది. ఇప్పటికే తమ ఫోన్లలో డీప్‌సీక్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న లేదా వ్యక్తిగత కంప్యూటర్లలో ఉపయోగించే వినియోగదారులు యథాతథంగా తమ యాప్‌ను వినియోగించుకోవచ్చు. ఏఐ మోడల్ చాలా సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తోందన్న ఆందోళనల నడుమ అనేక దక్షిణ కొరియా ప్రభుత్వ సంస్థలు, కంపెనీలు డీప్‌సీక్‌ను తమ నెట్‌వర్క్‌ల నుంచి తొలగించాయి. ఉద్యోగులు తమ రోజువారీ కార్యకలాపాల్లో భాగంగా ఈ చాట్‌బాట్ సేవలను పొందకూడదని ప్రభుత్వ అధికారులు ఇప్పటికే నిషేధాజ్ఞలు జారీచేశారు. అయితే జనవరి నాలుగోవారం నాటికే దక్షిణ కొరియాలో 12 లక్షల మంది మొబైల్ వినియోగదారులు డీప్‌సీక్‌ను వినియోగిస్తున్నారు.

టిక్కెట్ లేకున్నా వెళ్లొచ్చని మోదీయే చెప్పారు!

- మహాకుంభ్‌కు వెళ్లే బిహార్ మహిళల సమాధానం
- షాకైన రైల్వే అధికారులు

పట్నా: ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు జన జాతర కొనసాగుతోంది. ఈ నెల 26వ తేదీ వరకు ఈ మేళా సాగనుంది. ఇక ముఖ్యమైన దినాలేవీ లేనప్పటికీ జనం లక్షలు, కోట్ల సంఖ్యలో ప్రయాగ్‌రాజ్‌కు తరలి వెళ్తూనే ఉన్నారు. ముఖ్యంగా రైళ్లలో రద్దీ తీవ్రంగా ఉంటోంది. ఇదే అదనుగా జనం టిక్కెట్ లేకుండానే రైలు ప్రయాణం కానిచ్చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణ ఈ ఘటనే..! బిహార్‌లోని దానాపూర్ డివిజన్ రైల్వే మేనేజర్ జయంత్ కుమార్ ప్రయాణికుల రద్దీతో నెలకొన్న పరిస్థితిపై రెండు రోజుల క్రితం బక్సార్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. అదే సమయంలో గ్రామీణ మహిళల బృందం ఒకటి ఆయనకు తారసపడింది. వారిని వివరాలడగ్గా కుంభమేళాకు వెళ్తున్నట్లు చెప్పారు. టిక్కెట్లు కొన్నారా అని ప్రశ్నించగా ముక్తసరిగా లేదని బదులిచ్చారు. టిక్కెట్లు కొనకుండానే రైలు ప్రయాణం చేయవచ్చని ఎవరు చెప్పారని జయంత్ కుమార్ ప్రశ్నించారు. ప్రధాని మోదీయే అలా తమకు చెప్పారంటూ ఆ మహిళలు ఠకీమని ఇచ్చిన సమాధానంతో ఆయన షాక్‌కు గురయ్యారు. కొద్దిసేపు ఏమీ మాట్లాడలేకపోయారు. చివరికి, 'అలాంటిదేమీ లేదు. ప్రధాని మోదీయే కాదు, ఏ అధికారి కూడా టిక్కెట్ లేకుండా ప్రయాణం చేయనివ్వరు. ప్రయాణం చేయాలంటే టిక్కెట్ కొనాల్సిందే. లేకుంటే చట్టాన్ని ఉల్లంఘించినందుకు చర్యలు తీసుకుంటాం 'అంటూ వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. అనంతరం డీఆర్‌ఎం జయంత్ కుమార్ మీడియాతో మాట్లాడారు. పండగ సీజన్లప్పుడు చేసినట్లుగానే కుంభ్ మేళాకు కూడా ఏర్పాట్లు చేశామన్నారు. అయితే, జనం రద్దీ తగ్గాల్సిన వేళ పెరుగుతుండటాన్ని తాము స్సలు ఊహించలేదన్నారు. లేకుంటే, మరింతగా ఏర్పాట్లు సిద్ధం చేసి ఉండేవారమని వివరించారు.

ఢిల్లీలో బీజేపీకి సీఎం స్థాయి నేత లేడు

తాత్కాలిక సీఎం ఆతిశీ ఎద్దేవా

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్రాన్ని సమర్థవంతంగా పాలించగల సత్తా ఉన్న ముఖ్యమంత్రి స్థాయి నాయకుడు బీజేపీలో లేడని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ తాత్కాలిక ముఖ్యమంత్రి ఆతిశీ ఎద్దేవా చేశారు. ఢిల్లీకి కాబోయే ముఖ్యమంత్రిని, మంత్రివర్గ సభ్యులను ప్రకటించడంలో జాప్యం చేస్తున్న బీజేపీపై ఆమె విమర్శల వర్షం కురిపించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ''ఎన్నికల ఫలితాలు వెలువడి పది రోజులైనా ముఖ్యమంత్రి పదవికోసం విశ్వసనీయమైన నాయకుడు లేకుండా పోయారు. ఢిల్లీలో ఎన్నికైన 48 మంది బీజేపీ ఎమ్మెల్యేల్లో ఏ ఒక్కరినీ ప్రధాని నరేంద్ర మోదీ విశ్వసించడం లేదు. ఆ పార్టీకి పాలనపై విజన్, ప్రణాళిక లేదు. ఫిబ్రవరి 9న బీజేపీ తన ముఖ్యమంత్రిని, మంత్రివర్గాన్ని ప్రకటిస్తుందని, వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తుందని ప్రజలు భావించారు. కానీ ఢిల్లీని నడపడానికి వారికి ముఖం లేదని ఇప్పుడు స్పష్టమైంది''అని ఆమె అన్నారు. తాము చేయాల్సిందల్లా ఢిల్లీ ప్రజలను దోచుకోవడమేనని బీజేపీకి తెలుసని, ప్రభుత్వాన్ని నడిపే సత్తా ఉన్నవారు లేకపోతే ప్రజల కోసం ఎలా పని చేస్తారని ఆతిశి ప్రశ్నించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత కాషాయ పార్టీ నాయకత్వాన్ని ఎంపిక చేయడంలో జాప్యం చేస్తుండటంతో ఆప్, బీజేపీల మధ్య రాజకీయ యుద్ధం కొనసాగుతున్న విషయం తెల్సిందే.

పార్లమెంటరీ కమిటీకి అబద్ధం చెప్పినందుకు..

భారత సంతతి సింగపూర్ నేతకు జరిమానా

సింగపూర్: పార్లమెంటరీ కమిటీ ఎదుట అబద్ధం చెప్పారనే ఆరోపణలపై సింగపూర్ కోర్టు భారత సంతతికి చెందిన ప్రతిపక్ష నేత ప్రీతమ్ సింగ్(48)కు 14 వేల సింగపూర్ డాలర్ల(సుమారు రూ.9 లక్షల) జరిమానా విధించింది. ఈయన ప్రతిపక్ష వర్కర్స్ పార్టీ సెక్రటరీ జనరల్‌గా ఉన్నారు.

పార్టీకే చెందిన ఎంపీ రయీసా ఖాన్ అబద్ధమాడారన్న 2021నాటి కేసులో విచారణ సమయంలో ప్రీతమ్ సింగ్‌పై అబద్ధం చెప్పారంటూ ఆరోపణలొచ్చాయి. దర్యాప్తులో నిజమేనని తేలింది. కేసు విచారించిన డిప్యూటీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లూక్ టాన్ రెండు అబద్ధాలు చెప్పినందుకు గాను 7 వేల డాలర్ల చొప్పున 14 వేల డాలర్ల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. వచ్చే నవంబర్‌లో జరిగే సాధారణ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రీతమ్ చెప్పారు. సింగపూర్‌లో నిబంధనల ప్రకారం కనీసం ఏడాది జైలు శిక్ష పడినా, 10వేల సింగపూర్ డాలర్ల జరిమానా విధించినా ఆ వ్యక్తులు ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారు. అయితే, ఈ జరిమానా మొత్తం ఒక్క ఆరోపణకే అని ప్రీతమ్ లాయర్లు చెప్పారు. ఒక్క ఆరోపణకు 7 వేల డాలర్ల చొప్పున జరిమాన పడినందున ప్రీతమ్ ఎన్నికల్లో పోటీకి అడ్డంకి కాదని అన్నారు.

విడుదల చేయకుంటే నరకమే

- బందీల విషయంలో హమాస్‌కు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరిక
- అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో నెతన్యాహు భేటీ
- గాజా, ఇరాన్ సహా పలు అంశాలపై చర్చలు



జెరూసలేంలో మీడియాతో మాట్లాడుతున్న మార్కో రుబియో, బెంజమిన్ నెతన్యాహూ

జెరూసలెం: గాజాలో బందీలుగా ఉన్న వారందరినీ హమాస్ విడుదల చేయకపోతే నరక ద్వారాలు తెరుస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. ''గాజా విషయంలో ఇజ్రాయెల్, అమెరికాలకు ఉమ్మడి వ్యూహం ఉంది. ఈ వ్యూహం వివరాలను ప్రజలతో పంచుకోలేం. హమాస్ సైనిక, రాజకీయ ఉనికిని నిర్మూలించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. నరకం గేట్లు ఎప్పుడు తెరుచుకుంటాయో వివరాలను తాము చెప్పలేం. బందీలందరినీ విడుదల చేయకపోతే మాత్రం అవి ఖచ్చితంగా తెరుచుకుంటాయి. గాజాలో హమాస్ సైనిక సామర్థ్యాన్ని, దాని రాజకీయ పాలనను అంతమొందిస్తాం. బందీలందరినీ స్వదేశానికి తీసుకొస్తాం. గాజా నుంచి మరోసారి ఇజ్రాయెల్‌కు ముప్పు వాటిల్లకుండా చూస్తాం''అని నెతన్యాహూ వ్యాఖ్యానించారు. పశ్చిమాసియా పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆదివారం జెరూసలెం నగరానికి చేరుకుని అక్కడ నెతన్యాహుతో సమావేశమయ్యారు. అధ్యక్షుడు ట్రంప్ గాజా స్వాధీన ప్రతిపాదనపై అరబ్ నేతల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు కొనసాగుతుందని రూబియో పునరుద్ఘాటించారు. ''హమాస్ సైనిక లేదా ప్రభుత్వ శక్తిగా కొనసాగదు. హమాస్ అధికారంలో ఉన్నంత కాలం శాంతి అసాధ్యం. దానిని నిర్మూలించలేదు'' అని ఆయన ఉద్ఘాటించారు. రూబియో గానీ, నెతన్యాహు గానీ గాజా కాల్పుల విరమణ నిబంధనలను ప్రస్తావించలేదు.

ఇరాన్‌పై ప్రత్యేక దృష్టి..

గాజా పరిస్థితితోపాటు ఇరాన్ గురించి నెతన్యాహు, రూబియో ప్రత్యేకంగా చర్చించారు. పశ్చిమాసియా మొత్తం సంక్షోభానికి ఇరాన్ కారణమని రూబియో, నెతన్యాహు ఆరోపించారు. టెహ్రాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా ఆపాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. పశ్చిమాసియాలోని ప్రతి ఉగ్రవాద సంస్థ వెనుక, ప్రతి హింసాత్మక చర్య వెనుక, ఈ ప్రాంతంలో లక్షలాదిమంది ప్రజల శాంతి, సుస్థిరతకు ముప్పు కలిగించే ప్రతి ఘటన వెనుక ఇరాన్ ఉంది''అని రూబియో వ్యాఖ్యానించారు. ''ఇప్పటికే ఇరాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ మద్దతుతో మిగిలిన పనిని పూర్తి చేస్తాం''అని నెతన్యాహు అన్నారు.

ఇజ్రాయెల్ దాడి

బందీల మార్పిడి కొనసాగుతుండగా ఆదివారం ఈజిప్టు సరిహద్దులోని రఫా సమీపంలో ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిపింది. దాడిలో ముగ్గురు హమాస్ సాయుధులు మరణించారు. ఈ దాడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఒప్పందాన్ని విచ్ఛిన్నం చేసేందుకు నెతన్యాహు ప్రయత్నిస్తున్నారని హమాస్ ఆరోపించింది. కాల్పుల విరమణ మొదటి దశ మరో రెండు వారాల్లో ముగియనుంది. రెండవ దశ కోసం చర్చలు ప్రారంభం కావాల్సి ఉంది.

త్వరలో పాలస్తీనియన్ల తరలింపు: ఇజ్రాయెల్

ట్రంప్ ప్రతిపాదించిన గాజా నుంచి పాలస్తీనియన్ల సామూహిక తరలింపు త్వరలో ప్రారంభమవుతుందని తాను ఆశిస్తున్నట్లు ఇజ్రాయెల్ అతివాద ఆర్థిక మంత్రి బెజాలెల్ స్మోట్రిచ్ శనివారం రాత్రి చెప్పారు. రాబోయే వారాల్లో ఇది ప్రారంభమవుతుందని ఆశిస్తున్నానన్నారు. ''వచ్చే 10 నుంచి 15 ఏళ్ల వరకు గాజాలో పాలస్తీనియన్లకు ఏమీ ఉండదు. హమాస్ తిరిగి యుద్ధానికి ప్రయత్నిస్తే గాజా అంతా జబాలియా లాగా మరుభూమిగా మారడం ఖాయం''అని మంత్రి బజాలెల వ్యాఖ్యానించారు. గాజా నుంచి పాలస్తీనియన్లను ఉద్దేశపూర్వకంగా తరలించడం మానవాళికి వ్యతిరేకంగా జరిగే నేరమని పలు అంతర్జాతీయ సంస్థలు పేర్కొన్నాయి. ఇజ్రాయెల్‌పై మారణహోమం ఆరోపణలను అంతర్జాతీయ న్యాయస్థానం ఇప్పటికే పరిశీలిస్తోంది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు గాజాలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి యోవ్ గాలెంట్‌పై అరెస్టు వారెంట్లు జారీ చేసింది. కాగా, రెండు అంతర్జాతీయ ట్రిబ్యునళ్లను నెతన్యాహు తప్పుబట్టారు. అంతర్జాతీయ న్యాయస్థానంపై ఆంక్షలు విధించినందుకు ట్రంప్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన అంతర్జాతీయ న్యాయ సంస్థలపై మరిన్ని సంయుక్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

మీపై కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దు

ఉత్తరప్రదేశ్ అధికారులను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అధికారుల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. మీపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది. కుషీనగర్‌లోని మసీదులో కొంత భాగాన్ని అధికారులు కూల్చివేయడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది. కూల్చివేయొద్దని తాము ఆదేశాలిచ్చినా లెక్కచేకపోవడం పట్ల మండిపడింది. అధికారులు కోర్టు ఆదేశాలను ధిక్కరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసీతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా మసీదులో ఎలాంటి కూల్చివేతలు చేపట్టకూడదని ఆదేశించింది.

ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఆస్తులను కూల్చివేయకూడదని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు 2024 నవంబర్ 13న తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. కనీసం 15 రోజులు సమయం ఇవ్వాలని వెల్లడించింది. అయితే, ఈ ఏడాది ఈ నెల 9న కుషీనగర్ మసీదులో కొంత భాగాన్ని అధికారులు కూల్చివేశారు.

20న ఢిల్లీ కొత్త సీఎం ప్రమాణం?

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై పది రోజులుగా ఉత్కంఠ కొనసాగుతోంది. దీనికి అతిత్వరలో తెరపడనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీన సాయంత్రం 4.30 నిమిషాలకు కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకు గాను బీజేపీ 48 స్థానాలను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. కొత్త సీఎంను బీజేపీ పెద్దలు ఇంకా ఎంపిక చేయలేదు. బీజేపీ శాసనసభాపక్ష భేటీ నిర్వహించలేదు. మార్చి 8న ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు వెళ్లివచ్చారు. సోమవారం బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరగాల్సి ఉండగా.. ఢిల్లీలో కొత్తగా నిర్మించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం, ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట నేపథ్యంలో ఈ భేటీ వాయిదా పడింది. బుధవారం శాసనసభాపక్షం సమావేశం కానున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి ఎంపికతోపాటు మంత్రివర్గ కూర్పుపై ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు తెలియజేశాయి.

ఈజిప్టులో భవనం కూలి 10 మంది మృతి

కైరో: ఈజిప్టు రాజధాని కైరోలో సోమవారం మూడంతస్తుల భవనం కూలిన ఘటనలో కనీసం 10 మంది చనిపోయారు. ఘటనలో 8 మంది గాయాలపాలవ్వగా మరికొందరు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. కెర్దాసా ప్రాంతంలో కూలిన ఈ భవనం శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు సహాయక సిబ్బందిని, అంబులెన్సులను పంపించామన్నారు. గ్యాస్ సిలిండర్ పేలుడు వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. దర్యాప్తు చేపట్టినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

అమెరికాలో వరదలతో 9 మంది మృతి

వాషింగ్టన్: అమెరికా ఆగ్నేయ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు, ఇళ్లు నీట మునిగాయి. దీంతో వర్ష సంబంధ దుర్ఘటనల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. కెంటకీ, జార్జియా, అలబామా, మిసిసిపీ, టెనిస్సీ, వర్జీనియా, వెస్ట్ వర్జీనియా, నార్త్ కరోలినా రాష్ట్రాల్లో అధికారులు తుపాను హెచ్చరికలు జారీ చేశారు. హెలెన్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాలకు ఇది మరో ఎదురుదెబ్బ. ఎనిమిది రాష్ట్రాల్లో ఆదివారం రాత్రి దాదాపు 50లక్షలకు పైగా ఇళ్లకు విద్యుత్ లేదు.

పళ్లతో 125 కిలోల బరువెత్తి యోగా సాధకుడి ప్రపంచ రికార్డు

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన వికాస్ స్వామి అనే యోగా సాధకుడు దంతాలతో పట్టుకుని ఏకంగా 125 కిలోల బరువెత్తారు. ఈయన 35.57 సెకన్ల పాటు ఈ బరువును నిలిపి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఇటలీలోని మిలాన్‌లో ఈ నెల 14న జరిగిన గిన్నిస్ ప్రపంచ రికార్డు పోటీలో ఆయన ఈ ఘనత సాధించారు. ఈ విజయంలో కుమారులు అన్‌మోల్ స్వామి(16), ఆదిత్య స్వామి(10) సాయంగా నిలిచారు. ఇది కేవలం నా ఒక్కడిదే కాదు, ఈ ప్రాంతానికి, యావద్దేశానికి గర్వించదగ్గ క్షణం అని మీరట్‌లోని కర్నావల్‌కు చెందిన వికాస్ స్వామి చెప్పారు. 2023లో ఇండియా గాట్ టాలెంట్ రియాలిటీ షోలో పాల్గొన్న వికాస్ స్వామి పళ్లతో 80 కిలోల బరువును పైకి లేపారు. తాజాగా విజయం సాధించిన వికాస్ స్వామికి ఆదివారం సొంతూరులో ఘన స్వాగతం లభించింది.

నిషేధిత డ్రోన్‌ను ప్రదర్శించిన రాహుల్‌పై విమర్శలు

న్యూఢిల్లీ: భారత్‌లో నిషేధాన్ని ఎదుర్కొంటున్న చైనాలోని డీజేఐ సంస్థకు చెందిన ఒక డ్రోన్‌ను ఎగరేసి, దానిని పొగుడుతూ సామాజిక మాధ్యమ ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై విమర్శలు వెల్లువెత్తాయి. బ్యాటరీలు, ప్రొపెల్లర్లు ఇలా డ్రోన్ విడిభాగాలను భారత్ తయారుచేయలేకపోతోందన్న రాహుల్ వ్యాఖ్యలను డ్రోన్ ఫెడరేషన్ ఇండియా(డీఎఫ్ఐ) అధ్యక్షుడు స్మిత్ షా తప్పుబట్టారు. ''భారత్‌లో డ్రోన్లే తయారుకావు అన్న రాహుల్ మాటల్లో నిజం లేదు. భారత్‌లో 400కుపైగా డ్రోన్ తయారీ సంస్థలున్నాయి. ఇక దేశీయంగా డ్రోన్ విడిభాగాలు తయారుకావు అన్న రాహుల్ మాటల్లో వాస్తవం లేదు. 50కిపైగా కంపెనీలు భారత్‌లోనే డ్రోన్ కంపోనెంట్స్, బ్యాటరీలు, ప్రొపెల్లర్, ఫ్లైట్ కంట్రోలర్, మోటార్‌లను తయారుచేస్తున్నాయి. డ్రోన్‌ల రంగంలో భారత్ ముందడుగు వేస్తోంది. అలాంటిది ఏమీ తెలీకుండా ఇలా వ్యాఖ్యలు చేయొద్దు''అని రాహుల్‌కు షా చురకలంటించారు.

అక్రమ వలసదార్లలో కన్నీటి వరదే

చండీగఢ్: ఏజెంట్ల మాటలు నమ్మి, రూ.లక్షలు సమర్పించుకొని, అందమైన జీవితాన్ని ఊహించుకుంటూ కోటి కలలతో అమెరికా దారిపట్టిన యువతకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ఉత్త చేతులతో, అవమానకర రీతితో స్వదేశానికి చేరుకోవాల్సి వచ్చింది. చట్టబద్ధంగా అమెరికాకు తీసుకెళ్తామంటూ ఏజెంట్లు, సబ్ ఏజెంట్లు చెప్పిన కల్లబొల్లి కబుర్లు నమ్మినందుకు అష్టకష్టాలు ఎదుర్కొన్నామని, ప్రత్యక్ష నరకం చూశామని అమెరికా నుంచి తిరిగివచ్చిన భారతీయ అక్రమవలసదార్లు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. తొలి విడతలో భాగంగా 104 మంది అమెరికా సైనిక విమానంలో ఈ నెల 5వ తేదీన, రెండో విడతలో భాగంగా 116 మంది శనివారం రాత్రి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. మూడో విడతలో భాగంగా మరో 112 మంది ఆదివారం రాత్రి అమృత్‌సర్‌లో అడుగుపెట్టారు. ఇప్పటిదాకా మూడు విడతల్లో 332 మంది ఇండియాకు చేరుకున్నారు. పలువురు యువకులు తమ కన్నీటి గాథను మీడియాతో పంచుకున్నారు.

అమెరికా నుంచి మూడు విడతల్లో 332 మంది భారతీయుల రాక

- ఏజెంట్లను నమ్మి నిలువునా మోసపోయామని ఆవేదన
- దట్టమైన అడవుల్లో రోజుల తరబడి నడిచాం
- పాములు, క్రూరమృగాలను తప్పించుకుంటూ ముందుకెళ్లామని వెల్లడి



సరైన తిండి లేదు, నిద్ర లేదు

మన్‌దీప్ సింగ్(38) కుటుంబం అమృత్‌సర్‌లో నివసిస్తోంది. తన కుటుంబానికి చక్కటి జీవితం అందించడానికి అమెరికా వెళ్లి, ఏదైనా ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇతర యువకుల తరహాలోనే ఏజెంట్ వలలో చిక్కాడు. ఏజెంట్‌కు రెండు విడతల్లో మొత్తం రూ.40 లక్షలు చెల్లించాడు. ఇంకేముంది అమెరికాకు పయనం కావడమే అని ఏజెంట్ ఊరించాడు. అధికారికంగా కాకుండా అడ్డదారిలో(డంకీ రూట్) తీసుకెళ్లాడు. సబ్ ఏజెంట్లకు మణిదీప్‌ను అప్పగించాడు. మన్‌దీప్‌ను మొదట అమృత్‌సర్ నుంచి విమానంలో ఢిల్లీకి, అక్కడి నుంచి ముంబైకి, తర్వాత ఆఫ్రికాలోని నైరోబీకి, అనంతరం ఆమ్‌స్టర్‌డ్యామ్, సురినామ్‌కు చేర్చారు. అక్కడ సబ్ ఏజెంట్లు రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యుల ద్వారా ఆ డబ్బు చెల్లించక తప్పలేదు. సిక్కు మతస్తుడైన మన్‌దీప్ గడ్డాన్ని తొలగించారు. మన్‌దీప్‌తోపాటు మరికొందరు వలసదార్లను ఒక వాహనంలో గయనాకు తీసుకెళ్లారు. తర్వాత బొలీవియా, ఈక్వెడార్‌కు చేర్చారు. తర్వాత పనామా అడవుల్లో అడుగుపెట్టారు. విష సర్పాలు, మొసళ్లతో సావాసం చేస్తూ రోజుల తరబడి దట్టమైన అడవిలో నడిపించారు. 13 రోజుల పాటు అడవిలోనే నడక సాగించారు. కాలువలు దాటుకుంటూ ముందుకెళ్లారు. సరైన తిండి కూడా లేదు. సగం కాల్చిన రొట్టెలు, నూడుల్స్‌తో కడుపు నింపుకున్నారు. కంటి నిండా నిద్రలేదు. రోజుకు 12 గంటలు నడిచారు. పనామా దాటిన తర్వాత కోస్టారికా, తర్వాత హోండూరస్‌కు చేరుకున్నారు. అక్కడ వారికి వరి అన్నం లభించింది. చివరకు నికరాగ్వా, గ్వాటిమాలా నుంచి మెక్సికో చేరారు. జనవరి 27వ తేదీన మెక్సికోలోని తిజువానా నుంచి అమెరికా భూభాగంలోకి ప్రవేశిస్తుండగా, యూఎస్ సరిహద్దు పెట్రోలింగ్ దళం అదుపులోకి తీసుకుంది. మణిదీప్‌ను అరెస్టు చేసి, డిటెన్షన్ క్యాంప్‌లో నిర్బంధించి, విచారణ ప్రారంభించారు. అక్రమ మార్గంలో అమెరికాలో అడుగుపెట్టేందుకు ప్రయత్నించినట్లు అభియోగాలు మోపారు. అక్రమ వలసదార్లను వారి స్వదేశాలకు బలవంతంగా తిప్పి పంపిస్తూ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో మన్‌దీప్ స్వదేశానికి చేరుకున్నాడు. ప్రాణాలతో బయటపడతానని అనుకోలేదని మణిదీప్ చెప్పాడు.

ఆహారం, నీరు అడిగితే దాడులే

పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాకు చెందిన లవ్‌ప్రీత్ సింగ్‌ది మరో దీనగాథ. ఏడాది క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అమెరికా కలతో ఏజెంట్ల చేతికి చిక్కాడు. పనామా అడవుల గుండా ప్రయాణించి, మెక్సికో నుంచి అమెరికా సరిహద్దు దాటేందుకు ప్రయత్నిస్తుండగా, అక్కడి అధికారులు అరెస్టు చేశారు. పనామా అడవులు చాలా ప్రమాదకరంగా ఉంటాయని, అడుగడుగునా పాములు, క్రూరమృగాలు, మొసళ్లు తారసపడుతుంటాయని చెప్పాడు. వాటి నుంచి తప్పించుకొని ముందుకెళ్లడం నిజంగా సాహసం చేయడమేనని అన్నాడు. ఆహారం, మంచినీరు అడిగితే ఏజెంట్లు దారుణంగా కొట్టారని, దూషించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అయినప్పటికీ అన్నీ భరించామని పేర్కొన్నాడు.

ఆస్తులు అమ్మేయాల్సి వచ్చింది

అమృత్‌సర్ జిల్లాకు చెందిన జస్నూర్ సింగ్‌కు అమెరికాలో ఉద్యోగం సంపాదించుకోవాలన్నది ఒక కల. అందుకోసం ఏజెంట్‌కు రూ.55 లక్షలు చెల్లించాడు. అందుకోసం కొన్ని ఆస్తులు, వాహనాలు, ఇంటి స్థలం అమ్మేయాల్సి వచ్చింది. డంకీ రూట్‌లో అమెరికాకు చేరుకోగానే అక్కడి అధికారులు అరెస్టు చేసి, వెనక్కి పంపించారు. కపుర్తలా జిల్లాకు చెందిన 20 ఏళ్ల నిశాంత్ సింగ్‌కు సైతం ఇలాంటి అనుభవమే ఎదురైంది. దట్టమైన అడవిలో 16 రోజులు నడిచానని అన్నాడు. కేవలం నీరు తాగుతూ ప్రాణాలు నిలబెట్టుకున్నానని పేర్కొన్నాడు. తనను అమెరికా పంపించడానికి తన కుటుంబం రూ.40 లక్షలు ఖర్చు చేసిందని వెల్లడించాడు.

తలపాగాను చెత్తబుట్టలో పడేశారు

అమృత్‌సర్‌కు తిరిగొచ్చిన 23 ఏళ్ల జతీందర్ సింగ్‌ది మరో గాథ. ''స్నేహితులు చెప్పడంతో గత నవంబర్‌లో ఏజెంట్ కలిశా. రూ.50 లక్షలిస్తే అమెరికా పంపిస్తానన్నాడు. మాకున్న 1.3 ఎకరాల భూమి అమ్మి ఏజెంట్‌కు అడ్వాన్స్‌గా రూ.22 లక్షలు కట్టా. పెళ్లయిన నా అక్కచెల్లెళ్లు తమ బంగారు నగలమ్మి మరీ చేతికిచ్చిన డబ్బును ఏజెంట్‌కు ఇచ్చేశా. మూడ్రోజులు పనామా అడవులను దాటాకా మెక్సికోకు విమానంలో తీసుకెళ్తానన్నాడు. మెక్సికో సరిహద్దు నగరం తిజువానా నుంచి అమెరికాలోకి తీసుకెళ్తానన్నాడు. కానీ మధ్యలోనే వదిలేశాడు. పనామా అడవుల్ని దాటడం చాలా కష్టం. మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయిన తోటివారిని చూస్తూనే అతికష్టంమ్మీద అడవుల్ని దాటా. ఎలాగోలా అమెరికా సరిహద్దు దాటితే వెంటనే బోర్డర్ పోలీసులు బంధించి నిర్బంధ కేంద్రంలో పడేశారు. సంప్రదాయ తలపాగాను తీయొద్దని బతిమాలినా వినలేదు. తీసి చెత్తబుట్టలో పడేశారు. సరైన తిండి పెట్టలేదు. ఉదయం, రాత్రి ఒక లేస్ చిప్స్ ప్యాకెట్, ఫ్రూటీ జ్యూస్ చిన్న బాటిల్ ఇచ్చారు. అదే ఆహారం. గదిలో ఎయిర్ కండీషనర్ ఉష్ణోగ్రత బాగా పెంచి వేడికి చర్మం ఎండిపోయేలాగా చేశారు. భారత్‌కు తిరిగొచ్చేటప్పుడు సైనిక విమానంలో కాళ్లు కట్టేశారు. తినడానికి, బాత్రూమ్‌కు పోవడానికి కూడా చాలా కష్టమైంది. ఏకధాటిగా 36 గంటలు చేతులకు బేడీలు వేశారు. అమృత్‌సర్‌లో దిగడానికి 10 నిమిషాల ముందు మాత్రమే చేతులకు బేడీలు తీశారు''అని జతీందర్ సింగ్ చెప్పారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

సాక్షి ప్లస్
మంగళవారం। 18-2-2025

ప్రధాని రాజీనామా చేస్తే మంత్రి మండలి రద్దవుతుందా?

ప్రధాన మంత్రి-మంత్రి మండలి

రాజ్యాంగ రీత్యా దేశాధిపతి రాష్ట్రపతి అయితే ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రి మండలి వాస్తవమైన కార్యనిర్వాహక అధికారాలను కలిగి ఉంటుంది. భారతదేశంలో బ్రిటిష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థ ఉంది. దీన్నే 'వెస్ట్ మినిస్టర్' పద్ధతి అంటారు. (వెస్ట్ మినిస్టర్ అనేది ఇంగ్లండ్‌లో ఒక ప్రాంతం. అక్కడే పార్లమెంటు భవనం ఉంది. అందువల్ల దీనికి ఆ పేరు వచ్చింది.)

రాజ్యాంగ స్థానం

భారత రాజ్యాంగంలోని 5వ భాగంలో ప్రకరణలు 74, 75, 78లో ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలికి సంబంధించిన వివరాలను పొందుపరిచారు.

ప్రకరణ 74(1): రాష్ట్రపతికి తన విధి నిర్వహణలో సహాయం, సలహాలను అందించడానికి ప్రధాన మంత్రి అధ్యక్షతన మంత్రి మండలి ఉంటుంది. వీరి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలి.

ప్రత్యేక వివరణ: మౌలిక రాజ్యాంగంలో మంత్రి మండలి సలహాను రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలి అని అర్థం వచ్చేలా ఎలాంటి పదబంధం లేదు. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణకు 'షల్' (Shall) అనే పదం చేర్చారు. దీని ప్రకారం మంత్రి మండలి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 74లో మరో అంశాన్ని చేర్చారు. మంత్రి మండలి నిర్ణయాన్ని రాష్ట్రపతి పునర్ పరిశీలనకు పంపవచ్చు. పునర్ పరిశీలనకు పంపిన అంశాలను మంత్రి మండలి మార్పు చేయవచ్చు, చేయకపోవచ్చు. రెండో పర్యాయం రాష్ట్రపతి ఆమోదానికి పంపితే ఆ అంశాలను ఆయన తప్పకుండా ఆమోదించాలి.

ప్రకరణ 74(2) ప్రకారం మంత్రిమండలి రాష్ట్రపతికి ఏ సలహా ఇచ్చారో, ఆ సలహా ఎందుకు ఇచ్చారో న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలు లేదు.

నియామకం

- ప్రకరణ 75(1) ప్రకారం ప్రధాన మంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు. అదేవిధంగా ప్రధాని సలహా మేరకు ఇతర మంత్రులను కూడా నియమిస్తారు.
- ప్రకరణ 75(1ఎ) ప్రకారం కేంద్రంలో మంత్రిమండలి సంఖ్య, ప్రధాన మంత్రితో కలిపి లోక్‌సభ సభ్యుల మొత్తం సంఖ్యలో 15 శాతానికి మించరాదు.
- ప్రకరణ 75(1బి) ప్రకారం ఏదైనా గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం అనర్హుడైతే, అతడిని మంత్రిగా నియమించరాదు. ఈ అనర్హత అతడు మంత్రిగా ఉన్న కాలంలో జరిగితే, అది అతడి సభ్యత్వ కాలం ముగిసేంత వరకు కొనసాగుతుంది. ఒకవేళ తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిస్తే, అంతటితో అనర్హత ముగుస్తుంది.

భారత రాజ్యాంగం పార్లమెంటరీ లేదా మంత్రివర్గ పాలిత ప్రభుత్వాన్ని నిర్దేశించింది. పార్లమెంటరీ వ్యవస్థ ముఖ్య లక్షణం రెండు రకాలైన అధిపతులు ఉండటం. రాజ్యాంగ పరంగా ఉండే రాష్ట్రపతికి నామమాత్ర అధికారాలు ఉంటే, ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రిమండలి అన్ని అధికారాలను చెలాయిస్తుంది.

గమనిక: 75(1ఎ), (1బి) క్లాజులను 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

- ప్రకరణ 75(2) ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు ప్రధాన మంత్రి, మంత్రి మండలి పదవుల్లో కొనసాగుతారు.
- ప్రకరణ 75(3) ప్రకారం మంత్రులు సంయుక్తంగా లోక్‌సభకు బాధ్యత వహిస్తారు.
- ప్రకరణ 75(4) ప్రకారం, మంత్రులందరూ తమ పదవిలోకి ప్రవేశించే ముందు మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న నమూనా ప్రకారం రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేయాలి.
- ప్రకరణ 75(5) ప్రకారం ఎవరైనా వ్యక్తి మంత్రి పదవి చేపట్టాక ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక కాకుంటే ఆయన మంత్రి పదవిని కోల్పోతారు.
- ప్రకరణ 75(6) ప్రకారం మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది. వీటి ప్రస్తావన రెండో షెడ్యూల్‌లో ఉంది.

ప్రధాని నియామకానికి సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేకమైన ప్రక్రియ గురించి పేర్కొనలేదు. పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం, లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడిని రాష్ట్రపతి ఆహ్వానించి, ప్రధాన మంత్రిగా నియమించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరతారు. లోక్‌సభలో ఏ రాజకీయ పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ సీట్లు లభించనప్పుడు రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పరిచే క్రమంలో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీ లేదా పార్టీల కూటమి నాయకుడిని ప్రధానిగా నియమించి, మెజారిటీ నిరూపించుకోమని కోరతారు.

ఉదాహరణకు 1979లో నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు చరణ్‌సింగ్‌ను ప్రధానిగా నియమించడం కొంత వివాదానికి దారితీసింది. నాటి ప్రతిపక్ష నాయకుడైన వై.బి.చవాన్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సంజీవరెడ్డి ఆహ్వానించారు. కానీ, చవాన్ తన అశక్తతను వ్యక్తపరిచారు. ఈ పరిస్థితిలో జగ్జీవన్‌రామ్‌ను విస్మరించి చరణ్‌సింగ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని ఆహ్వానించడం వివాదానికి కారణమైంది. అయితే చరణ్‌సింగ్ లోక్‌సభ సమావేశాలకు హాజరు కాకుండానే ప్రధాని పదవికి రాజీనామా చేశారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ఈ విధంగా లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ లేకుండా 1989లో వి.పి.సింగ్, 1990లో చంద్రశేఖర్, 1991లో పి.వి. నరసింహారావు, 1996లో ఎ.బి.వాజ్‌పేయి, 1996లో దేవెగౌడ, 1997లో ఐ.కె. గుజ్రాల్, 1998లో ఎ.బి. వాజ్‌పేయి, 2004, 2009లో మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రులుగా నియమితులయ్యారు.

సుప్రీం కోర్టు తీర్పులు: మెజారిటీ కోల్పోయిన ప్రధాన మంత్రి రాజీనామా చేసి, తదనంతరం లోక్‌సభ రద్దయితే, ఆ వ్యక్తిని ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగించి పరిపాలన చేయవచ్చు. అయితే విధాన నిర్ణయాలు చేయరాదని 1971లో యు.ఎన్.రావు Vs ఇందిరా గాంధీ కేసు సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

ప్రధాన మంత్రి అర్హతలు: రాజ్యాంగంలో ప్రధాన మంత్రి పదవికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక అర్హతలు గురించి పేర్కొనలేదు. అయితే పార్లమెంట్‌లో సభ్యుడిగా ఉండాలి. నియమితులయ్యే సమయానికి పార్లమెంటులో సభ్యత్వం లేకపోతే నియామకం పొందిన రోజు నుంచి ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికవ్వాలి.

ప్రత్యేక వివరణ: రాజ్యాంగపరంగా ప్రధాన మంత్రిగా నియమితులవడానికి పార్లమెంటు సభ్యుడైతే చాలు. సాధారణంగా ప్రధానమంత్రి లోక్ సభలో సభ్యుడై ఉండాలి. రాజ్య సభలో సభ్యులుగా ఉండి ప్రధాన మంత్రులైనవారు ఇందిరా గాంధీ (1966), దేవెగౌడ (1996), ఇందర్ కుమార్ గుజ్రాల్ (1997), మన్మోహన్ సింగ్ (2004, 2009).

ప్రధాని ప్రమాణ స్వీకారం - జీతభత్యాలు

- ప్రధాన మంత్రితో రాష్ట్రపతి పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాజ్యాంగ పరంగా భారత ఐక్యతను, సమగ్రతను పరిరక్షిస్తామని, నమ్మకంతో, నిర్భయంగా, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తామని ప్రధాన మంత్రి ప్రమాణం చేయాలి.
- ప్రధాన మంత్రి, ఇతర మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. పార్లమెంటు సభ్యులకు వచ్చే జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను కలిగి ఉంటారు.
- ప్రకరణ 78 ప్రకారం రాష్ట్రపతికి ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయడం ప్రధాన మంత్రి బాధ్యత.
- ప్రకరణ 78(ఎ) ప్రకారం కేంద్ర మంత్రి మండలి నిర్ణయాన్ని ప్రధాన మంత్రి రాష్ట్రపతికి తెలియజేస్తారు.
- ప్రకరణ 78 (బి) ప్రకారం, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర సమాచారాన్ని రాష్ట్రపతి ప్రధాన మంత్రి ద్వారా తెలుసుకోవచ్చు.
- ప్రకరణ 78 (సి) ప్రకారం.. సమర్పించిన సమాచారంలో ఏదైనా అంశం మంత్రి చేసిన నిర్ణయమా లేదా మంత్రి మండలి చేసిన నిర్ణయమా అనే సంశయం ఉన్నప్పుడు, దాన్ని మంత్రి మండలి పరిశీలనకు పంపమని రాష్ట్రపతి ప్రధాన మంత్రిని కోరవచ్చు.

ప్రత్యేక వివరణ: మంత్రి మండలి ఏర్పాటు పూర్తిగా ప్రధాన మంత్రి విశిష్టాధికారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి, ఎలా పునర్ వ్యవస్థీకరించాలి అనేది ప్రధాన మంత్రి అభీష్టం. అయితే రాజకీయ పరమైన అంశాలు, వివిధ వర్గాలకు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అధికార పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాన మంత్రికి ఇష్టం లేకపోయినా కొందరు ప్రముఖులను మంత్రి మండలిలోకి తీసుకోవాల్సి వస్తుంది.

ప్రధాన మంత్రి పదవీ కాలం, తొలగింపు

సాధారణంగా ప్రధాన మంత్రి పదవీ కాలం లోక్‌సభతో పాటుగా అయిదేళ్లు ఉంటుంది. అయితే ఇది లోక్‌సభలోని మెజారిటీ సభ్యుల విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. పదవిలో కొనసాగడానికి ఇష్టపడనప్పుడు రాష్ట్రపతికి రాజీనామా పత్రాన్ని సమర్పిస్తారు. ప్రధాన మంత్రి రాజీనామా చేస్తే మంత్రి మండలి స్వతహాగా రద్దవుతుంది. పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ప్రధాన మంత్రి కింద పేర్కొన్న పరిస్థితుల్లో పదవి కోల్పోతారు.

- లోక్ సభలో మంత్రి మండలిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు.
- లోక్ సభలో విశ్వాసం కోరిన తీర్మానానికి మెజారిటీ లభించనప్పుడు.
- లోక్ సభ ద్రవ్య బిల్లును తిరస్కరించినప్పుడు.
- బడ్జెట్‌పై కోత తీర్మానం నెగ్గినప్పుడు.
- రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానం వీగిపోవడం లేదా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణ తీర్మానం నెగ్గడం.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీలో వివిధ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్)-01, మేనేజర్(ఫైనాన్స్)-02, డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్)-02.
» **అర్హత:** సీఏ/సీఎంఏ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 41 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 37 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 33 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.70,000 నుంచి రూ.2,00,000. మేనేజర్ పోస్టుకు రూ.60,000 నుంచి రూ.1,80,000, డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జీజీఎం/హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సకేత్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.ircon.org

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో జూనియర్ ఇంజనీర్ పోస్టులు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్)లో ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్(సివిల్)-02, జూనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.70,290.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.02.2025.
» **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.nic.in

టారిసెల్లీ కనుగొన్న భారమితి దేన్ని కొలుస్తుంది?

ద్రవ పదార్థాలు

పీడనం (PRESSURE)

ప్రమాణ వైశాల్యంపై ప్రయోగించే బలాన్ని పీడనం అంటారు.

పీడనం $P = \frac{F}{A}$

ప్రమాణాలు:

1. డైన్ / సెం.మీ.^{2}
2. న్యూటన్ / మీ^{2}
3. 1 పాస్కల్
4. BAR
5. TORR

- ఒక ప్రవాహిని వల్ల (ద్రవాలు, వాయువులు) కలిగే పీడనం P = hdg
  - h → ప్రవాహి ఎత్తు
  - d → ప్రవాహి సాంద్రత
  - g → భూమి గురుత్వ త్వరణం
- ఒక వస్తువుతో కలిగించే పీడనం, దాని వైశాల్యాని(అడ్డుకోత వైశాల్యం)కి విలోమానుపాతంలో ఉంటుంది.

$$P \propto \frac{1}{A}$$

కాబట్టి వస్తువుల అడ్డుకోత వైశాల్యం తగ్గితే వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.

ఉదాహరణ:

- కత్తి, కత్తెరల అంచులను నునుపుగా తయారు చేయడం వల్ల వాటి వల్ల కలిగే పీడనం పెరుగుతుంది.
- సూది, దబ్బనం, గడ్డపార, మేకు, మొదలైన వాటి అడ్డుకోత వైశాల్యాలను తగ్గించడం వల్ల వీటి వలన కలిగే పీడనం ఎక్కువగా ఉంటుంది.
- మానవుడు నేల మీద నిలుచున్నప్పుడు అధిక పీడనాన్ని కలుగజేస్తాడు.
- వెడల్పైన పాత్రలో ఉండే ద్రవాన్ని పొడవైన, తక్కువ వ్యాసం ఉన్న పాత్రలో పోసినప్పుడు ద్రవస్తంభ పొడవు పెరగడంతో ఆ ద్రవం వల్ల కలిగే పీడనం కూడా పెరుగుతుంది.
- సమాన ఘనపరిమాణం ఉన్న మూడు భిన్న పాత్రల్లో వరసగా పాదరసం (Hg), నీరు (H_2O), ఆల్కహాల్ నింపారు. వీటిలో పాదరస సాంద్రత, నీటిసాంద్రత కంటే ఎక్కువగా ఉంటుంది. ఈ రెండింటి సాంద్రతలు ఆల్కహాల్ సాంద్రత కంటే ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పాదరసం వల్ల కలిగే పీడనం ఎక్కువగా, నీటి పీడనం తక్కువగా, ఆల్కహాల్ పీడనం కనిష్ఠంగా ఉంటాయి.

భారమితి


ఒక ప్రదేశంలో ఉండే వాతావరణ పీడనాన్ని కొలవడానికి భారమితిని ఉపయోగిస్తారు. దీన్ని టారిసెల్లీ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

పనిచేసే విధానం:

భారమితి ఎత్తు 100 సెం.మీ., వ్యాసం 1 సెం.మీ. దీనిలో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

- సాధారణ వాతావరణ పీడనం పాదరస మట్టం 76 సెం.మీ. లేదా 760 మి.మీ.

ఫలితాలు:



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం
భౌతిక శాస్త్రం

- ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే రాబోయే తుపాన్‌ను, క్రమక్రమంగా తగ్గితే రాబోయే వర్షాన్ని సూచిస్తుంది.
- భారమితిలో తగ్గిన పాదరస మట్టం క్రమక్రమంగా పెరిగితే అక్కడ మారిన వాతావరణ పరిస్థితులు తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయని అర్థం.
- భారమితి ఎత్తు, దానిలో ఉపయోగించే ద్రవ సాంద్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.

$P = hdg$

$\frac{P}{d} = hg \quad \therefore h \propto \frac{1}{d}$

- ద్రవ సాంద్రత తగ్గితే భారమితిలోని ద్రవ మట్టం పెరుగుతుంది.

నోట్: ఇంక్ ఫిల్లర్స్, గాలిపంపులు, స్ట్రాలు వాతావరణ పీడనాన్ని అనుసరించి పనిచేస్తాయి.

1. పర్వతాలు ఎక్కినప్పుడు ముక్కు నుంచి రక్తం కారడం, వాంతులు కావడానికి ప్రధాన కారణం.. వాతావరణ పీడనం కంటే రక్తపీడనం ఎక్కువగా ఉండటం.
2. విమానాల్లో ప్రయాణించేటప్పుడు బాల్‌పెన్ లోని ఇంక్ బయటకి రావడానికి కారణం- వాతావరణ పీడనం కంటే పెన్నులోని పీడనం ఎక్కువగా ఉండటం.

నోట్:

1. పాదరసం సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల దానితో పనిచేసే భారమితి ఎత్తు 1 మీ. ఉంటుంది.
2. నీటితో పనిచేసే భారమితి ఎత్తు నీటి సాంద్రతను బట్టి 10 మీ. నుంచి 11 మీ. ఉంటుంది. ఆల్కహాల్‌తో పనిచేసే భారమితి ఎత్తు 13.6 మీటర్లు.
3. ప్రయోగశాలలో ఉపయోగించే ఫోర్టీన్ (FORTINE) భారమితి ఎత్తు 80 సెం.మీ., దీనిలో పాదరసం వాడతారు.
4. అనార్ద్ర భారమితిలో ఉండే వివిధ పరికరాలన్నీ ఘన స్థితిలో మాత్రమే ఉంటాయి.

స్నిగ్ధత వివరణ

- సమాన ద్రవ్యరాశులు ఉన్న పక్షి ఈక, ఒక రాయిని ఒకే ఎత్తు నుంచి జారవిడిచినప్పుడు, ఆ రాయి వాతావరణంలోని స్నిగ్ధతా బలాలను తొందరగా అధిగమించడం వల్ల ఈక కంటే ముందుగా భూమిని చేరుతుంది. ఒకవేళ ఈ రెండు వస్తువులను ఒకే ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు అవి రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి. కారణం.. శూన్యంలో ఎలాంటి స్నిగ్ధతా బలాలు ఉండవు.
- అన్ని ద్రవ పదార్థాల కంటే గ్రీజు స్నిగ్ధత స్థానం ఎక్కువగా ఉంటుంది. తేనె స్నిగ్ధత కూడా ఎక్కువగా ఉంటుంది.

నోట్ :

1. స్నిగ్ధత.. పీడనంపై ఆధారపడుతుంది.
2. ఉష్ణోగ్రత పెరిగితే వాయువుల స్నిగ్ధత పెరుగుతుంది.
3. ఉష్ణోగ్రత పెరిగితే ద్రవాల స్నిగ్ధత తగ్గుతుంది.
4. గాలిలో ఉన్న స్నిగ్ధతా బలాల కంటే నీటిలోని స్నిగ్ధతా బలాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఒక వస్తువు భారం గాలిలో కంటే నీటిలో తక్కువగా ఉంటుంది.

స్నిగ్ధత మారడానికి కారణాలు

- ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు ద్రవాణువుల మధ్య ఉండే సంసంజన బలాలు బలహీనపడి స్నిగ్ధత తగ్గిపోతుంది.
- వాయువులను వేడిచేసినప్పుడు వాటి అనుచలనం పెరిగి అవి పరస్పరం ఒకదానికి మరొకటి దగ్గరగా రావడంతో స్నిగ్ధత బలం పెరుగుతుంది.

బాయిల్ నియమం

స్థిరమైన ఉష్ణోగ్రత వద్ద నియమిత ద్రవ్యరాశి ఉన్న వాయువు ఘనపరిమాణం, దానిపై ప్రయోగించిన పీడనానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$$V \propto \frac{1}{P}$$

ఉదాహరణ:

1. నీటి అడుగు భాగంలో ఉండే గాలి బుడగ ఉపరితలం పైకి చేరినప్పుడు గాలిపై నీటి వల్ల కలిగే పీడనం ఉండదు. కాబట్టి గాలి బుడగపై పనిచేస్తున్న పీడనం తగ్గడం వల్ల దాని ఘనపరిమాణం పెరుగుతుంది.
2. భూమి ఉపరితలం నుంచి పైకి వెళ్లే బెలూన్‌పై ఉండే వాతావరణ పీడనం తగ్గడం వల్ల ఆ బెలూన్ పరిమాణం పెరుగుతుంది.
3. చంద్రుడిపై ఎలాంటి వాతావరణం లేదు. కాబట్టి అక్కడ బెలూన్ పైకి ఎగరదు.

పాస్కల్ నియమం

ఒక ప్రవాహినిపై కలిగించే పీడనం అన్ని వైపులా సమానంగా విభజితమవుతుంది.

అనువర్తనాలు:

1. బట్టలు, కాగితాలను అదిమి పట్టడానికి ఉపయోగించే 'బ్రామాప్రెస్' సాధనం పాస్కల్ నియమం ఆధారంగా పనిచేస్తుంది.
2. వ్యవసాయ రంగంలో ఉపయోగించే స్ప్రేయర్ ఈ నియమం ఆధారంగా పనిచేస్తుంది. ఈ సాధనాన్ని ఉపయోగించి క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తారు.
3. హైడ్రాలిక్ బ్రేకులు, హైడ్రాలిక్ పంపులు, హైడ్రాలిక్ క్రేన్లు, టిప్పర్లు, సాధనాలు, ఎయిర్ బ్రేక్‌లు పాస్కల్ నియమం ఆధారంగానే పనిచేస్తాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జతపరచండి.

i. బలం	1. పాయిజ్
ii. ప్రచోదనం	2. పాస్కల్
iii. స్నిగ్ధత	3. న్యూటన్
iv. పీడనం	4. న్యూటన్ - సెకన్

	i	ii	iii	iv
ఎ)	1	2	3	4
బి)	3	4	1	2
సి)	2	1	4	3
డి)	4	3	2	1

2. తలతన్యత అనువర్తనం.
1. వేడి ఆహారం చల్లని ఆహారం కంటే రుచిగా ఉండడం
2. వర్షం చినుకులు, సబ్బు బుడగ, పాదరస బిందువులు గోళాకారంలో ఉండడం
3. రంగులు, ల్యూబ్రికెంట్ సులభంగా విస్తరించడానికి అవసరం
4. నిలకడగా ఉన్న నీటిపై దోమలు స్వేచ్ఛగా చలించడం

ఎ) 2, 4 బి) 2 మాత్రమే
సి) 2, 3, 4 డి) అన్నీ

3. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈక, 100 గ్రాముల రాయిని భూమికి 200 మీటర్ల ఎత్తు నుంచి ఒకేసారి జారవిడిచినప్పుడు వాతావరణ పొరలోని స్నిగ్ధతా బలాల వల్ల అవి....
ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
బి) రాయి ముందుగా భూమి చేరుతుంది
సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు

4. సమాన ద్రవ్యరాశి ఉన్న ఒక ఆస్ట్రిచ్ పక్షి ఈకను 100 గ్రా. రాయిని 200 మీ. ఎత్తునుంచి ఒకేసారి శూన్యంలో జారవిడిచినప్పుడు...
ఎ) రెండూ ఒకేసారి భూమిని చేరుతాయి
బి) రాయి ముందుగా చేరుతుంది
సి) పక్షి ఈక ముందుగా చేరుతుంది
డి) రెండూ స్నిగ్ధతా బలాల వల్ల భూమిని చేరవు

5. కింది వాటిలో సరైనది.
1. ద్రవాల తలతన్యత ఉష్ణోగ్రతకు విలోమానుపాతంలో ఉంటుంది.
2. సందిగ్ధ ఉష్ణోగ్రత వద్ద ప్రతి ద్రవం తలతలన్యత శూన్యం.

ఎ) 1 సరైనది, 2 తప్పు
బి) 1 తప్పు, 2 సరైనది
సి) రెండూ సరికావు డి) రెండూ సరైనవే

6. నిలకడగా ఉన్న నీటిపై కిరోసిన్‌ను వెదజల్లినప్పుడు దేనిలో మార్పు జరిగి దోమల గుడ్లు, లార్వాలు మునుగుతాయి.
ఎ) నీటి తలతన్యత తగ్గడం
బి) నీటి తలతన్యత పెరగడం
సి) నీటి స్నిగ్ధత పెరగడం
డి) నీటి స్నిగ్ధత తగ్గడం

7. కేశనాళికీయత అనువర్తనం కానిది
ఎ) కిరోసిన్ స్టవ్, దీపం, మైనం క్యాండిల్ పనిచేయడం
బి) ఇసుక నేలలు తేమగా ఉండడం
సి) ఎడారుల్లో ఒయాసిస్‌లు ఏర్పడటం
డి) మొక్కలు దారువు ద్వారా పీల్చుకున్న నీరు పైకి ఎగబాకడం

8. జతపరచండి. (పదార్థాలు- స్పర్శకోణం)

i. పాదరసం	1. 0°
ii. స్వచ్ఛమైన నీరు	2. 8°- 9°
iii. వెండితో నీరు	3. 90°
iv. సాధారణ నీరు	4. 135° - 140°

	i	ii	iii	iv
ఎ)	2	3	4	1
బి)	4	1	3	2
సి)	1	4	2	3
డి)	3	2	1	4

9. 1. ఒక ప్రదేశంలో భారమితిలోని పాదరస స్తంభం పొడవు అకస్మాత్తుగా తగ్గితే అది తుపాను రాకను సూచిస్తుంది.
2. పాదరస మట్టం క్రమంగా తగ్గితే రాబోయే వర్షసూచనను తెలుపుతుంది.

ఎ) 1, 2 సరైనవి బి) రెండూ తప్పు
సి) 1 సరైనది, 2 తప్పు
డి) 1తప్పు, 2 సరైనది

10. జలాంతర్గామి పనిచేయడంలో ఉపయోగించే సూత్రం?
ఎ) బాయిల్ నియమం
బి) పాస్కల్ నియమం
సి) బెర్నౌలీ నియమం
డి) ఆర్కిమిడిస్ ప్లవన సూత్రం

11. నదిలో ప్రయాణిస్తున్న ఓడ సముద్రజలాల్లోకి ప్రవేశించినప్పుడు ఓడ మట్టం పెరుగుతుంది. కారణం?
ఎ) సముద్ర నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
బి) నది నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం
సి) నది నీటి సాంద్రత తక్కువగా ఉండటం
డి) సముద్ర నీటి సాంద్రత తక్కువగా ఉండటం

12. టారిసెల్లీ కనుగొన్న భారమితి దేన్ని కొలుస్తుంది?
ఎ) సాంద్రత బి) వాతావరణ పీడనం
సి) స్నిగ్ధత డి) నీటి అసంగత వ్యాకోచం

13. నీటిలో తేలే మంచు కరిగితే, నీటిమట్టం?
ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
సి) పెరిగి తగ్గుతుంది డి) మారదు

14. ప్రెషర్ కుక్కర్‌లో పదార్థాలు త్వరగా ఉడుకుతాయి. ఎందుకు?
ఎ) ఉష్ణం తగ్గడం వల్ల
బి) ఉష్ణోగ్రత పెరగడం వల్ల
సి) నీటి బాష్పీభవన స్థానం పెరగడం వల్ల
డి) నీటి బాష్పీభవన స్థానం తగ్గడం వల్ల

సమాధానాలు

1) బి 2) డి 3) బి 4) ఎ 5) డి
6) ఎ 7) బి 8) బి 9) ఎ 10) డి
11) డి 12) బి 13) డి 14) సి

ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ వైవిధ్యం

భూమిపై ఉన్న విభిన్న జీవ జాతుల సముదాయాన్నే 'జీవ వైవిధ్యం'గా పేర్కొనవచ్చు. ఇది మానవుడికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ భూమిపై మనుగడ సాగించడానికి తోడ్పడుతోంది. ఆహార, శక్తి వనరులు, ఔషధాలు, కలప, నార, పీచు రూపంలో మొక్కలు మానవుడికి ఉపయోగపడుతున్నాయి. జంతువులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయి.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న జీవ వైవిధ్యానికి ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న చర్యల వల్ల నష్టం వాటిల్లుతోంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా దీనికి తీవ్ర స్థాయిలో ముప్పు పొంచి ఉన్నట్లు యూఎన్ఈపీ (United Nations Environment Programme) ఇటీవల ప్రకటించింది. గత శతాబ్దకాలంలో అనేక వన్య జీవులు కనుమరుగైన నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో పర్యావరణ అంశాల ప్రాధాన్యం పెంచారు. అందువల్ల అభ్యర్థులు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలి.

జీవ వైవిధ్యం - నేపథ్యం

జీవ సంబంధ వైవిధ్యం (Biological Diversity) అనే పదాన్ని మొదట రేమండ్ ఎఫ్. డాస్‌మన్ అనే పరిరక్షణవేత్త 1968లో "A Different Kind of Country" పుస్తకంలో ఉపయోగించాడు. 1985లో వాల్టర్ జి. రోజెన్ అనే శాస్త్రవేత్త 'జీవ వైవిధ్యం'(Bio diversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించాడు.

జీవులతో ముడిపడి ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను జీవ సంబంధ వైవిధ్యంగా పేర్కొంటారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (IUCN) ప్రకారం.. ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జన్యువులు, జాతులు, జీవావరణ వ్యవస్థల సముదాయమే జీవ వైవిధ్యం. ప్రకృతిలో ఇది సహజంగా ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణ భావన 1980 నుంచి బలపడింది. అడవులను సంరక్షించడంలో భాగంగా.. అక్కడ ఉండే అన్ని రకాల జీవులు, వాటి తెగలు, వాటిలోని విభిన్న జన్యువులు, జీవులు మధ్య ఉన్న సంబంధాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచించారు.

జీవ వైవిధ్యం - వివిధ స్థాయిలు

1. జన్యు వైవిధ్యం (Genetic Diversity): ఒక జాతి జీవుల్లో ఉండే విభిన్న జన్యువుల సముదాయమే జన్యు వైవిధ్యం.
   ఉదా: మనుషుల్లో వివిధ తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, నిగ్రాయిడ్); మానవుడిలో విభిన్న రక్త గ్రూపులు.
2. జాతి వైవిధ్యం (Species Diversity): ఒక నిర్దిష్ట ప్రాంతంలోని విభిన్న జాతులకు చెందిన జీవుల సముదాయాన్ని 'జాతి వైవిధ్యం'గా పేర్కొంటారు. దీని ఆధారంగా ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న 17 మెగా బయోడైవర్సిటీ దేశాలను గుర్తించారు. ఈ రకమైన వైవిధ్యం జీవుల వర్గీకరణలో ఉపయోగపడుతుంది.
3. ఆవరణ వ్యవస్థ వైవిధ్యం (Ecosystem Diversity): విభిన్న రకాల భూచర, జలచర ఆవరణ వ్యవస్థల సముదాయాన్ని 'ఆవరణ వ్యవస్థ వైవిధ్యం' అంటారు.

పైన పేర్కొన్నవాటితో పాటు మైక్రోబియల్ డైవర్సిటీ, అగ్రి బయోడైవర్సిటీ లాంటి విభిన్న స్థాయి జీవ వైవిధ్యం కూడా ఉంటుంది. రాబర్ట్ విట్టేకర్ అనే శాస్త్రవేత్త జీవ వైవిధ్యాన్ని 3 రకాలుగా విభజించాడు.

1. α - జీవ వైవిధ్యం: దీన్ని Species Richness అంటారు. ఒక ఆవరణ వ్యవస్థలోని జాతి వైవిధ్యాన్ని ఇది తెలుపుతుంది.
2. β - వైవిధ్యం: రెండు భిన్న ఆవరణ వ్యవస్థల్లో జాతి వైవిధ్యంలోని భేదాన్ని ఇది తులనాత్మకంగా తెలుపుతుంది.
3. γ - వైవిధ్యం: ఒక విశాల భౌగోళిక ప్రాంతంలోని విభిన్న జీవ సమాజాల్లో మొత్తం వైవిధ్యాన్ని 'గామా వైవిధ్యం'గా పేర్కొంటారు.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

మెక్సికో 2002లో ప్రపంచవ్యాప్తంగా అధిక జీవ వైవిధ్యం, సంప్రదాయ విజ్ఞానానికి నిలయంగా ఉన్న దేశాలను (Like-minded Mega Diverse Countries) గుర్తించింది. Conservation International గుర్తించిన 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితా..

1. ఆస్ట్రేలియా 2. బ్రెజిల్
3. చైనా 4. కొలంబియా
5. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో
6. ఇక్వెడార్ 7. ఇండియా
8. ఇండోనేషియా 9. మడగాస్కర్
10. మలేషియా 11. మెక్సికో
12. పపువ న్యూగినియా
13. పెరూ
14. ఫిలిప్పీన్స్
15. దక్షిణాఫ్రికా
16. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
17. వెనిజులా

ఈ జాబితాలో పేర్కొన్న మొదటి దేశంలో అత్యధిక జీవ వైవిధ్యం, చివరి దేశంలో తక్కువ జీవ వైవిధ్యం ఉంటుంది.

జీవ వైవిధ్య హాట్ స్పాట్స్

అధిక జీవ వైవిధ్యానికి నిలయంగా ఉండి ముప్పు పొంచి ఉన్న జీవ భౌగోళిక ప్రాంతాలను 'బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్'గా పేర్కొంటారు. నార్మన్ మేయర్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త ఈ భావనను మొదటిసారిగా ప్రతిపాదించాడు. 1985-90లో ఈయన ప్రచురించిన "The Environment" అనే ఆర్టికల్‌లో దీని గురించి ప్రస్తావించాడు. 1996లో Conservation International ఈ భావనపై పరిశోధన చేసి మేయర్స్‌తో ఏకీభవించింది.

ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతాన్ని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా గుర్తించడంలో రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

1. కనీసం 1500 జాతుల నాళిక కణజాలయుత మొక్కలు (Vascular Plants) ఎండమిక్ (స్థానియ) జాతులుగా ఆ ప్రాంతానికే పరిమితమై ఉండాలి.
2. కనీసం 70 శాతం తమ సహజ ఆవాసాన్ని లేదా వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి.

1999లో ఇలాంటి 25 ప్రాంతాలను గుర్తించారు. ఆ తర్వాత మరో 10 ప్రదేశాలను గుర్తించారు. నార్మన్ మెయిర్స్ 1999లో "Hotspots: Earth's Biologically Richest and Most Endangered Terrestrial Eco-region" పుస్తకాన్ని ప్రచురించారు. 2000లో దీన్ని 'నేచర్' అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురించారు. 2007లో రస్సెల్ మిట్టర్ మియర్ అనే శాస్త్రవేత్త "Hotspots Revisited" అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రపంచంలో ప్రస్తుతం 35 బయోడైవర్సిటీ హాట్‌స్పాట్లు ఉన్నాయి. అవి:

ఉత్తర, మధ్య అమెరికా

1. కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2. మ్యాడ్రియన్ పైన్ ఓక్ ఉడ్‌లాండ్స్
3. మిసో అమెరికా 4. కరేబియన్ దీవులు

దక్షిణ అమెరికా

1. టంబెస్ చోకో మ్యాగ్డెలిన
2. ట్రాపికల్ ఆండీస్
3. చిలీయన్ వింటర్ రెయిన్‌ఫాల్ వాల్డీవియన్ ఫారెస్ట్
4. బ్రెజిల్ సిర్రాడో
5. బ్రెజిల్ అట్లాంటిక్ ఫారెస్ట్

యూరప్, మధ్య ఆసియా

1. కాకాసస్
2. మధ్య ఆసియా అడవులు
3. మధ్యధరా ప్రాంతం
4. ఇరాన్ అనతోలియన్

ఆఫ్రికా

1. పశ్చిమ ఆఫ్రికా - గినియా అడవులు
2. సక్యులెంట్ కరూ
3. కేప్ ఫ్లోరోస్టిక్ ప్రాంతం
4. మపుటలాండ్ - పాండో లాండ్ ఆల్బని
5. తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6. ఈస్టర్న్ అఫ్రోమోంటేన్
7. హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8. మడగాస్కర్ - హిందూ మహాసముద్ర దీవులు

ఆసియా పసిఫిక్

1. పశ్చిమ కనుమలు - శ్రీలంక
2. హిమాలయాలు 3. ఇండో బర్మా
4. నైరుతి చైనా 5. ఫిలిప్పీన్స్
6. సుందా లాండ్ 7. వాలేసియా
8. న్యూ కాలిడోనియా
9. ఈస్ట్ మెలనేసియా అడవులు
10. పాలినేసియా మైక్రోనేసియా
11. న్యూజిలాండ్ 12. జపాన్
13. నైరుతి ఆస్ట్రేలియా 14. తూర్పు ఆస్ట్రేలియా

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్యసమితి 'జీవ వైవిధ్య దశాబ్దం'గా దేన్ని ప్రకటించింది?
   ఎ) 2001-10 బి) 2011- 20
   సి) 2021-30 డి) 1991-2000
2. 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం' ఏ రోజు నిర్వహిస్తారు?
   ఎ) ఏప్రిల్ 22 బి) మే 22
   సి) జూన్ 20 డి) డిసెంబర్ 21
3. "Convention on Biological Diversity" అంతర్జాతీయ ఒప్పందాన్ని రూపొందించింది?
   ఎ) యునెస్కో బి) యూఎన్ఈపీ
   సి) ఎ, బి డి) ఏదీకాదు
4. భారత్‌లోని ఏ ప్రాంతంలో 'లయన్ టెయిల్డ్ మకాక్' అనే కోతి కనిపిస్తుంది?
   ఎ) పశ్చిమ కనుమలు
   బి) ఈశాన్య హిమాలయాలు
   సి) తూర్పు కనుమలు
   డి) అండమాన్ నికోబార్ దీవులు
5. "Conservation International" అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ ఎక్కడ ఉంది?
   ఎ) మెక్సికో బి) నైరోబి
   సి) లండన్ డి) వాషింగ్టన్
6. ప్రపంచంలోని 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో లేనిది?
   ఎ) శ్రీలంక బి) వెనిజులా
   సి) కొలంబియా డి) ఇండోనేసియా
7. ప్రపంచంలోని మెగా బయోడైవర్సిటీ కేంద్రాల్లో భారత్ స్థానం?
   ఎ) 3 బి) 5 సి) 7 డి) 9
8. జీవవైవిధ్య సంరక్షణ కోసం కుదుర్చుకున్న "Convention on Biological Diversity" (BD) అంతర్జాతీయ ఒప్పందం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   ఎ) 1993 బి) 1994
   సి) 1995 డి) 1996
9. 'నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ' ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై బి) బెంగళూరు
   సి) తిరువనంతపురం డి) గాంగ్‌టక్
10. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   ఎ) జెనీవా బి) న్యూఢిల్లీ
   సి) వాషింగ్టన్ డి) నైరోబి
11. 'వరల్డ్ ఎర్త్ డే'ను ఎప్పుడు నిర్వహిస్తారు?
   ఎ) మార్చి 22 బి) ఏప్రిల్ 22
   సి) సెప్టెంబర్ 16 డి) అక్టోబర్ 12
12. భారత్‌లో ఉభయచర వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతం ఏది?
   ఎ) వింధ్య పర్వతాలు
   బి) పశ్చిమ కనుమలు
   సి) పశ్చిమ హిమాలయాలు
   డి) తూర్పు కనుమలు
13. బట్టమేక పక్షులు (Great Indian Bustard) ఎక్కువగా ఏ రాష్ట్రంలో కనిపిస్తాయి?
   ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
   సి) మధ్యప్రదేశ్ డి) రాజస్థాన్
14. కర్ణాటకలో ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
   ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
15. ఏ జీవి నుంచి లభించే ప్రత్యేక నూనెను ఔషధాలు, పర్‌ఫ్యూమ్‌ల తయారీలో ఉపయోగిస్తారు?
   ఎ) చింకారా బి) కృష్ణజింక
   సి) కస్తూరి జింక డి) సాంబారు దుప్పి
16. 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' చిహ్నం ఏది?
   ఎ) ధ్రువ ఎలుగుబంటి
   బి) పాండా
   సి) నీలి తిమింగలం
   డి) ఏదీకాదు
17. 'వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' ఎక్కడ ఉంది?
   ఎ) బెంగళూరు బి) గౌహతి
   సి) డెహ్రాడూన్ డి) తిరువనంతపురం
18. దేశంలో ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?
   ఎ) గిర్ అడవులు
   బి) వేనాడ్ అభయారణ్యం
   సి) పెంచ్ జాతీయ పార్కు
   డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) బి; 3) బి; 4) ఎ; 5) డి; 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి; 11) బి; 12) బి; 13) డి; 14) సి; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ.

Capital punishment was regarded as



BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The two colleges (1)/ have a reciprocal arrangement (2)/ whereby students from one college (3)/ can attend classes for the other. (4)/ No error (5)
2. You may (1)/ need to reconfigure (2)/ the firewall if you added (3)/ a new machine to your network. (4)/ No error (5)
3. The leading banks (1)/ are expected to redouble (2)/ their efforts to keep (3)/ the value of the dollar down. (4)/ No error (5)
4. The number (1)/ of employees was (2)/ reduced (3)/ to forty from twenty five. (4)/ No error (5)
5. The study program (1)/ concentrates more (2)/ on group work and placed less reliance (3)/ on lectures. (4)/ No error (5)

Directions (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The project is to go ahead following renewed promises of aid from the United Nations.
   1) Going head fast
   2) Going steadfast
   3) Go head 4) Go faster
   5) No correction required
7. A friend of mine has called her birthday party.
   1) Called of 2) Called off
   3) Called with 4) Called us
   5) No correction required
8. IT is being blamed by some for being the cause for the digital division between the people and the states.
   1) Division among
   2) Divide between
   3) Divide among
   4) Devise among
   5) No correction required
9. We talked to the concerned person about the payment of fees.
   1) Responsible person
   2) Respondent person
   3) Concerned people
   4) Person concerned
   5) No correction required
10. When I have gone to his house, he was having lunch.
   1) Has gone 2) Was going
   3) Gone 4) Went
   5) No correction required

Directions (Q.No. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) This light energy through a photochemical process is transformed into nerve energy
B) This interpretation is based on past experience
C) Hence to a considerable extent seeing is a learned skill
D) Seeing is a complex act wherein the optical system of the eye takes light emanating from the object and forms an image on a light-sensitive layer, the retina.
E) And passes through the visual pathways to the brain.
F) In the broadest sense seeing is not complete until what is seen is interpreted by the observer

11. What is the SECOND sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F
12. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) E
13. What is the FIFTH sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) A 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 16-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Make sure you get your mail____ to your new address.
   1) send 2) posted
   3) reached 4) delivered
   5) redirected
17. Capital punishment was regarded as____ and ____.
   1) criminal, moral
   2) legal, binding
   3) constitutional, convenient
   4) inhuman, immoral
   5) prosecution, witness
18. Under the new regulations____ on office equipment will be ____ controlled.
   1) spending, strictly
   2) selling, lightly
   3) buying, regularly
   4) taking, severely
   5) costing, vigorously
19. The calm of the countryside came as a welcome relief from the____ and ____ of city life.
   1) rush, josh
   2) tension, worries
   3) quick, vibrant
   4) hustle, bustle
   5) rustle, ruthless
20. Heavy reliance on one client is_____when you are building up a business.
   1) advantage 2) profitable
   3) relief 4) relentless
   5) risky
21. There is_____ some reluctance on the part of all the employees to become _____in this project.
   1) of course, part
   2) after all, interested
   3) overall, associate
   4) still, involved
   5) in turn, attached
22. The incident _____as a timely reminder of just how _____ mountaineering can be.
   1) saved, fright
   2) termed, depressing
   3) posted, treacherous
   4) remains, responsible
   5) served, dangerous
23. Three students were removed from the school for ____ bad behavior.
   1) percolate 2) perceptive
   3) permissive 4) persistent
   5) personified
24. Troops ____ an attempt to ____ the south of the island.
   1) refused, diffuse
   2) attacked, slaughter
   3) resist, attack
   4) charged, protest
   5) repelled, infiltrate
25. To the surprise of many, employees reported that, graduates are__ in writing and problem__skills.
   1) deficient, solving
   2) proficient, probing
   3) well versed, poking
   4) suitable, posing
   5) many, posting

Directions (Q.No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Psychiatrists have observed that no other inadequacy creates as great a sense of frustration and failure as a reading difficulty. This is partly due to the fact that everyone is expected to be able to read adequately in order to advance in his schooling. Reading is also considered a criterion, in the cultural sense, of an individual's mental ability. If a person is deficient in some academic subject such as arithmetic or geography, he can **avoid** facing his inadequacy by avoiding those subjects. A reading defect cannot, however, be easily circumvented. His disability is brought to his attention, not only when he attends school, but in almost every other situation. He finds himself culturally in an inferior position because he cannot read books as ably as others, nor in some cases can he even read the newspapers with a **semblance** of competence. In one sense, therefore, the person with a serious reading defect finds himself in the same cultural position as the illiterate. He is reputationally classified by his fellow-men either as an inferior individual or as a queer person. As he grows older he is less able to rationalize the defect or to avoid the conflict associated with his deficiency and therefore accumulates further and further **frustration**.

26. Which of the following best expresses the central meaning of the passage?
   1) The ability to read is a yardstick of a person's mental ability.
   2) A reading difficulty creates a greater conflict and sense of frustration than any other inadequacy.
   3) All people are expected to be able to read competently.
   4) Anyone who has difficulty in reading is considered either inferior or peculiar.
   5) As he grows younger he is less able to rationalize the defect.
27. The defect which cannot be thwarted is
   1) disability to attend school
   2) disability to comprehend thoughts
   3) disability to compute mathematics
   4) disability to recollect geography
   5) disability to read
28. The antonym of **frustration** is
   1) contentment 2) irritation
   3) nuisance 4) disturbance
   5) annoyance
29. The synonym of **semblance** is
   1) airs 2) reschedule
   3) appearance 4) register
   5) summon
30. The synonym of **avoid** is
   1) evade 2) aversion
   3) avid 4) keen
   5) fervent

KEY

1) 4	2) 3	3) 3	4) 4
5) 3	6) 5	7) 2	8) 3
9) 4	10) 4	11) 1	12) 5
13) 2	14) 4	15) 3	16) 5
17) 4	18) 1	19) 4	20) 5
21) 4	22) 5	23) 4	24) 5
25) 1	26) 2	27) 5	28) 1
29) 3	30) 1		